ఈనాడు

విజయవాడ 15-12-2025 సోమవారం సిటీ సంపుటి 52 . సంచిక 125
THE LARGEST CIRCULATED TELUGU DAILY
రూ. 6-50 పేజీలు 12
www.eenadu.net
Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru

ఫ్రీహోల్డ్ సమస్యా.. సాకా?

భూముల క్రయ విక్రయాలకు చిన్నరైతుల ఇక్కట్లు

- సీఎం ఆదేశించినా కొలిక్కిరాని సమస్యలు

ఈనాడు – అమరావతి

అసలే రెవెన్యూ శాఖలో సమస్యలు కోకొల్లలు. వీటికితోడు ఎసైన్డ్ భూముల ఫ్రీహోల్డ్ వివాదం కొలిక్కి రావడం లేదు. ఫ్రీహోల్డ్ పేరిట వైకాపా ప్రభుత్వంలో ఆ పార్టీ నేతలు భారీగా లబ్ధి పొందారు. కూటమి ప్రభుత్వం వచ్చాక దీన్ని సరిదిద్దేందుకు చర్యలు చేపట్టినా.. పరిస్థితిలో పురోగతి పెద్దగా కానరావటం లేదు. ప్రైవేటు భూముల పట్టాదారులు సహా ఎందరో ఇబ్బంది పడుతున్నారు. దీనిపై అధ్యయనం చేసేందుకు ఏర్పాటు చేసిన మంత్రివర్గ ఉపసంఘం కూడా పరిష్కారాల దిశగా కృషి చేయాల్సి ఉంది. ఏడాదిలోగా రెవెన్యూ శాఖను ప్రక్షాళించాలని, ముఖ్యంగా ఫ్రీహోల్డ్ వివాదాన్ని త్వరగా తేల్చాలని సీఎం చంద్రబాబు తాజాగా నిర్దేశించారు. రెవెన్యూ యంత్రాంగం నిర్లిప్తతను వీడి... అంశాల వారీగా విభజించి, ఒక్కో దానికి పరిష్కార మార్గాన్ని వెతికితేనే రైతులకు ఉపశమనం లభిస్తుంది.



అలా మొదలైంది!

పేదలకు కేటాయించిన వ్యవసాయ భూములను 20 ఏళ్లు నిండిన తర్వాత అమ్ముకోవచ్చని 2023లో వైకాపా ప్రభుత్వం ఫ్రీహోల్డ్ ఆదేశాలిచ్చింది. అప్పుడే నాటి అధికార పార్టీ నేతలు అక్రమాలకు తెరదీశారు. రూ.కోట్ల విలువైన ఎసైన్డ్ భూముల్ని ముందుగానే పేదల నుంచి తక్కువ ధరకు కొనుగోలు చేసి, ప్రభుత్వ ఉత్తర్వులు వెలువడ్డాక.. కొన్నట్లు చూపారు. దీనిపై కూటమి ప్రభుత్వం విచారణ చేపట్టి, 5.75 లక్షల ఎకరాలకు సంబంధించి అక్రమాలు జరిగినట్లు గుర్తించింది. దీనిపై అధ్యయనానికి మంత్రివర్గ ఉపసంఘాన్ని నియమించింది. 2024 ఆగస్టు నుంచి రిజిస్ట్రేషన్లు నిలిపేసింది. దీంతో చిన్న, సన్నకారు రైతులు ఇబ్బంది పడుతున్నారు. కొన్నిచోట్ల ప్రైవేటు భూములను కూడా నిషేధ జాబితాలో చేర్చారు. రీసర్వే పూర్తైన గ్రామాల్లోని

(మిగతా 2లో)

కోడి.. పందెనికి రె'ఢీ'
సాగర గర్భంలో.. మీనాలకు కాంక్రీటు గూళ్లు! 8లో

యూదులపై ఉగ్ర దాడి

ఆస్ట్రేలియాలోని సిడ్నీ బీచ్‌లో దుండగుల కాల్పులు

16 మంది దుర్మరణం • 38 మందికి గాయాలు

- పోలీసు కాల్పుల్లో ఒక దుండగుడి మృతి
- మరొకడి అరెస్టు
- ఉగ్రవాద దాడిగా ప్రకటించిన ప్రభుత్వం
- ప్రధాని నరేంద్ర మోదీ సహా ప్రపంచ దేశాల నేతల ఖండన



సిడ్నీలోని బోండీ బీచ్‌లో కాల్పులు జరుపుతున్న దుండగులు

సిడ్నీ: ఆస్ట్రేలియాలోని సిడ్నీలో యూదులపై ఉగ్ర రక్కసి విరుచుకుపడింది. బోండీ బీచ్‌లో ఉత్సవం జరుపుకొంటున్న వారిపై ఇద్దరు ఉగ్రవాదులు కాల్పులకు తెగబడ్డారు. ఈ దుర్ఘటనలో 16 మంది మరణించారు. 38 మంది గాయపడ్డారు. గాయపడిన వారిలో ఇద్దరు పోలీసు అధికారులున్నారు. పోలీసులు జరిపిన కాల్పుల్లో ఒక ఉగ్రవాది మృతి చెందాడు. మరొకడిని అదుపులోకి తీసుకున్నారు. దీనిని ఉగ్ర దాడిగా ఆస్ట్రేలియా ప్రభుత్వం ప్రకటించింది. బోండీకి 4 కిలోమీటర్ల దూరంలో ఉన్న సెయింట్ విన్సెంట్ ఆసుపత్రికి గాయపడిన వారిని తరలించారు. యూదుల పండగ హనూకా ప్రారంభానికి సూచికగా ఆదివారం బోండీ బీచ్‌లో 'చానుకా బై ద సీ' కార్యక్రమాన్ని నిర్వహించారు. దీనికి వందల మంది యూదులు హాజరయ్యారు. వారు ఉల్లాసంగా గడుపుతున్న సమయంలో నల్లటి ముసుగులు ధరించిన ఇద్దరు దుండగులు బోండీ పెవిలియన్ పక్కన ఉన్న పాదచారుల వంతెనపైకి చేరుకుని కాల్పులు జరిపారు. దీంతో వందల మంది ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని

(మిగతా 2లో)

భాజపా కార్యనిర్వాహక అధ్యక్షుడిగా నబీన్ సిన్హా

- 45 ఏళ్ల నేతకు అనూహ్యంగా పెద్ద పదవి
- జనవరి 14 తర్వాత అధ్యక్ష పగ్గాలు!
- బిహార్ నుంచి తొలిసారి ఆ స్థాయికి

ఈనాడు, దిల్లీ: భాజపా నాయకత్వం బిహార్‌కు చెందిన 45 ఏళ్ల నాయకుడు నితిన్ నబీన్ సిన్హాను పార్టీ జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడిగా నియమించింది. ఐదోసారి ఎమ్మెల్యేగా గెలిచి నీతీశ్‌కుమార్ క్యాబినెట్‌లో మంత్రిగా బాధ్యతలు చేపట్టిన ఆయన్ను భాజపా జాతీయ అధ్యక్షుడు జె.పి.నడ్డాకు లెఫ్టినెంట్‌గా చేర్చింది. ఈ మేరకు పార్లమెంటరీ బోర్డు నిర్ణయించినట్లు పార్టీ ప్రధాన కార్యదర్శి అరుణ్‌సింగ్ ప్రకటించారు. రాష్ట్రాల్లో తప్పిస్తే జాతీయస్థాయిలో ఇలాంటి నియామకం ఇది రెండోసారి. గతంలో నడ్డా కూడా ఇలాంటి పదవిలోకి మొదట వచ్చారు. ఆయన పదవీ కాలం ఇప్పటికే ముగియగా ప్రస్తుతం పొడిగింపులో ఉన్నారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికలను



(మిగతా 2లో)

లోపలి పేజీల్లో

భాజపా కార్యనిర్వాహక అధ్యక్షుడిగా నబీన్ సిన్హా

(మొదటి పేజీ తరువాయి)

దృష్టిలో ఉంచుకొని బిహార్ సరిహద్దుల్లోని పశ్చిమ బెంగాల్ ప్రాంతంలో ప్రభావం చూపే ఉద్దేశంతో ఇప్పుడు సిన్హాను అనూహ్యంగా తెరమీదికి తెచ్చినట్లు భావిస్తున్నారు. వచ్చే జనవరి 14 తర్వాత సిన్హాను లాంఛనంగా పార్టీ అధ్యక్షుడిగా ఎన్నుకుంటారు. చిన్నవయసులోనే పార్టీ పగ్గాలు చేపట్టిన వారిలో ఒకరిగా, బిహార్ నుంచి పార్టీలో ఆ స్థాయికి చేరిన తొలినేతగా ఆయన నిలుస్తారు. ఏప్రిల్‌లో జరగబోయే పార్టీ జాతీయ మండలి సమావేశం ఆయన ఎన్నికను ధ్రువీకరిస్తుంది.

రాజకీయ కుటుంబం.. ఓటమి ఎరగడు: కాయస్థ సామాజికవర్గానికి చెందిన నబీన్ సిన్హాకు ఆరెస్సెస్ నేపథ్యం ఉంది. ఇటీవలి ఎన్నికల్లో బిహార్‌లోని బాంకీపుర్ నుంచి నాలుగోసారి ఎమ్మెల్యేగా ఆయన ఎన్నికయ్యారు. ప్రముఖ సినీనటుడు శత్రుఘ్నసిన్హా కుమారుడు లవ్‌సిన్హాపై 84వేల ఓట్ల భారీ ఆధిక్యంతో గెలుపొందారు. ఇదివరకు పార్టీ యువమోర్చా ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు. 2023 అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఛత్తీస్‌గఢ్ వ్యవహారాల ఇన్‌ఛార్జిగా పనిచేసి అక్కడ భాజపాను అధికారంలోకి తేవడంలో కీలకపాత్ర పోషించారు. ఆయన తండ్రి నబీన్‌కిశోర్ ప్రసాద్ సిన్హా బిహార్ భాజపాలో పెద్దనేతగా గుర్తింపు పొందారు. 2005లో తండ్రి ఆకస్మిక మరణంతో నితిన్ 26 ఏళ్ల వయసులో ఎన్నికల రంగంలో అడుగుపెట్టారు. 2006లో జరిగిన ఉప ఎన్నికలో తొలిసారి గెలిచిన ఆయన ఆ తర్వాత ఎన్నడూ ఓటమి చవిచూడలేదు. భాజపాకు ఇటీవల గొప్ప విజయాన్ని సాధించిపెట్టిన బిహార్‌ను గౌరవించడంతోపాటు, తొలినుంచి విధేయులుగా, వివాదరహితులుగా ఉంటూ బాధ్యతలు విజయవంతంగా నిర్వర్తించేవారిని పార్టీ గుర్తిస్తుందనే సందేశాన్ని చాటడానికే నాయకత్వం ఆయన్ని ఉన్నత పదవికి ఎంపికచేసినట్లు విశ్లేషకులు చెబుతున్నారు. దీంతోపాటు యువనాయకత్వాన్ని తయారు చేసుకోవడానికి ప్రాధాన్యం ఇచ్చారని పేర్కొంటున్నారు. 1980 మే 23న రాంచీలో జన్మించిన నబీన్‌సిన్హా విద్యాభ్యాసం దిల్లీలో పూర్తయింది.

శుభాకాంక్షలు తెలిపిన మోదీ: నబీన్‌కు ప్రధాని నరేంద్ర మోదీ శుభాకాంక్షలు తెలిపారు. 'కష్టపడి పనిచేసే కార్యకర్తగా నబీన్ మంచి గుర్తింపు పొందారు. ఆయనకు సంస్థాగతంగా మంచి అనుభవం ఉంది. అద్భుతమైన రికార్డు ఉంది. ఆయన పనితీరు రానున్న కాలంలో పార్టీని మరింత బలోపేతం చేస్తుందని విశ్వసిస్తున్నాను' అని ఎక్స్‌లో పేర్కొన్నారు. నడ్డా కూడా అభినందిస్తూ ఆయన నేతృత్వంలో పార్టీ సరికొత్త ఎత్తులకు చేరుకుంటుందని ఆశాభావం వ్యక్తంచేశారు.

- నబీన్‌కు ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ శుభాకాంక్షలు తెలిపారు. ఆయన పదవీకాలం విజయవంతం కావాలని ఆకాంక్షించారు.
- సమర్థమైన నాయకత్వానికి భాజపా ఎంత ప్రాధాన్యతనిస్తుందో నబీన్ నియామకం ద్వారా మరోసారి రుజువైందని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ పేర్కొన్నారు.

మోదీ సర్కారును గద్దె దించుతాం

- మేం వచ్చాక ఎన్నికల కమిషనర్లపైనా చర్యలు
- 'ఓట్ చోర్... గద్దీ ఛోడ్' సభలో రాహుల్‌గాంధీ
- ఒకసారి ఓడిపోతే మోదీ పేరు ఇక కనిపించదు: ఖర్గే



సభలో అభివాదం చేస్తున్న రాహుల్‌గాంధీ, మల్లికార్జున ఖర్గే. చిత్రంలో ప్రియాంకాగాంధీ, సోనియాగాంధీ, కేసీ వేణుగోపాల్. వేదిక ముందు ఓట్ల చోరీ ఆరోపణలకు సంబంధించిన పత్రాల మూటలు, పెట్టెలు

ఈనాడు, దిల్లీ: కేంద్రంలోని నరేంద్ర మోదీ-ఆరెస్సెస్ సర్కారును గద్దె దించేందుకు కాంగ్రెస్ కంకణం కట్టుకుందని, సత్యం.. అహింసామార్గంలోనే దానిని సాధిస్తామని లోక్‌సభలో ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ అగ్రనాయకుడు రాహుల్‌గాంధీ పేర్కొన్నారు. ఆదివారం ఇక్కడి రామ్‌లీలా మైదానంలో కాంగ్రెస్‌పార్టీ భారీస్థాయిలో నిర్వహించిన 'ఓట్‌చోర్... గద్దీ ఛోడ్' బహిరంగ సభనుద్దేశించి ఆయన ప్రసంగించారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్‌కుమార్, ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి భాజపా కోసం పనిచేస్తున్నారని ఆరోపించారు. అలాంటి సర్కారును తప్పించే శక్తి- సత్యం, అహింసలకు ఉన్నాయని చెప్పారు. బిహార్ ఎన్నికల సమయంలో మహిళల ఖాతాల్లోకి రూ.10,000 బదిలీచేసినా అధికార పార్టీపై ఈసీ ఎలాంటి చర్య తీసుకోలేదని, సత్యాసత్యాల మధ్య పోరులో పూర్తిగా భాజపాకు కొమ్ముకాస్తోందని ఆరోపించారు. ఎన్నికల కమిషనర్లపై ఎలాంటి చర్యలు తీసుకునే వీల్లేకుండా మోదీ సర్కారు చట్టం చేసినా.. వెనకటి తేదీతో అమల్లోకి వచ్చేలా తాము దీనిని మార్చుచేసి, వారిపై చర్యలు తీసుకుంటామని స్పష్టంచేశారు. ఎప్పటికైనా సత్యమే గెలుస్తుందని చెప్పారు.

ఓటుచోరీ అని పిల్లలకూ తెలుసు

'ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్‌షా ఓటు చోరీకి పాల్పడుతున్నారని దేశంలోని ప్రతి ఒక్కరికీ తెలుసు. ఓటరు జాబితాలోని అక్రమాలపై ఈసీని ప్రశ్నిస్తే జవాబు లేదు. ఓటుచోరీ అంటే రాజ్యాంగ దురాక్రమణ. భాజపా డీఎన్‌ఏలోనే అది ఉంది. కాంగ్రెస్ కార్యకర్తల డీఎన్‌ఏలో మాత్రం సత్యం ఉంది. భయపడాల్సిన అవసరం లేదు' అని రాహుల్ తెలిపారు. 'ప్రస్తుతం దేశంలో సత్యం.. సత్తా (అధికారం) మధ్య యుద్ధం జరుగుతోంది. అధికారం ఈరోజు ఉంటుంది.. రేపు పోతుంది. కానీ సత్యం శాశ్వతం. ఒకసారి అధికారం చేజారితే.. వారు ఎంత ధైర్యవంతులన్నది బయటపడుతుంది. మోదీ, అమిత్‌షా ఓటుచోరీతో ఎన్నికల్లో గెలుస్తున్నారని ఆరేళ్ల పిల్లలనుంచి 90ఏళ్ల వృద్ధులవరకు అందరికీ తెలుసు. నేను పార్లమెంటులో అమిత్‌షా గురించి మాట్లాడుతున్నప్పుడు మోదీ ముఖంలో విశ్వాసం కనిపించలేదు. త్వరలో నిజరూపం ప్రజలకు తెలిసిపోతుందన్న విషయం ఆయన గ్రహించారు. వీళ్లు ఓటుచోరీ చేయకపోయి ఉంటే ప్రజలు అయిదు నిమిషాల్లో అధికారం నుంచి తరిమేస్తారు' అని రాహుల్ పేర్కొన్నారు.



సభకు హాజరైన కాంగ్రెస్ శ్రేణులు

మోసగాళ్లను గద్దె దింపాలి: ఖర్గే

కాంగ్రెస్ అధ్యక్షుడు, రాజ్యసభ విపక్షనేత మల్లికార్జున ఖర్గే మాట్లాడుతూ- రాహుల్ పోరాటానికి ప్రజలు అండగా నిలవాలని కోరారు. బెంగళూరులో తన కుమారుడికి పెద్ద శస్త్రచికిత్స జరిగినా తాను వెళ్లకుండా ఈ పోరు కోసం దిల్లీలోనే ఉన్నానని చెప్పారు. "ఈ దేశాన్ని రక్షించాలంటే ప్రజలు తమ ఓట్లను జాగ్రత్తగా ఉంచుకోవాలి. కాంగ్రెస్ భావజాలం తప్పిస్తే ఆర్‌ఎస్‌ఎస్ ఆలోచనలు దేశాన్ని రక్షించలేవు. మోదీ నెమ్మదిగా రాజ్యాంగాన్ని అంతం చేయాలని ప్రయత్నిస్తున్నారు. ఓటుచోరీచేసి అధికారంలో కూర్చున్న మోసగాళ్లను గద్దె దించాలి. రాజ్యాంగం ప్రసాదించిన ఓటుహక్కును కోల్పోతే పేదలు అన్యాయమైపోతారు. కాంగ్రెస్ ఎన్నిసార్లు ఓడిపోయినా దాని ఆలోచనా విధానం బతికే ఉంది. కానీ మోదీ ఒకసారి ఓడిపోతే ఆయన పేరు, ఆనవాళ్లు ఎక్కడా కనిపించవు" అని చెప్పారు. వ్యవస్థలను మోదీ, అమిత్‌షాలు ధ్వంసం చేస్తున్నారని ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి ప్రియాంకాగాంధీ ఆరోపించారు. "బ్యాలెట్ ద్వారా ఎన్నికలు నిర్వహిస్తే ఎన్నటికీ గెలవలేమన్న విషయం మోదీ, అమిత్‌షాలకు తెలుసు. అందుకే పార్లమెంటులో ప్రశ్నిస్తే వణికిపోతున్నారు. వారిలో ఆత్మవిశ్వాసం పూర్తిగా సన్నగిల్లింది. పార్లమెంటులో మా ముందునుంచి వెళ్లేటప్పుడు కళ్లలో కళ్లుపెట్టి చూడలేకపోతున్నారు. చరిత్రలో ఎన్నడూలేని విధంగా ప్రజాస్వామ్యంపై దాడిచేస్తున్న ఈసీ ఉన్నతాధికారులు జ్ఞానేష్‌కుమార్, సుఖ్‌బీర్‌సింగ్‌సంధు, వివేక్‌జోషిల పేర్లను అందరూ గుర్తుపెట్టుకోవాలి. వారు దేశానికి సంజాయిషీ చెప్పాల్సి వస్తుంది. మేం పోరాడుతూనే ఉంటాం. ఎన్నటికీ తలవంచం" అని చెప్పారు. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల సీఎంలు, ముఖ్యనేతలు హాజరయ్యారు. దేశం నలుమూలల నుంచి కాంగ్రెస్ పార్టీ శ్రేణులు తరలివచ్చాయి. చొరబాటుదారులను రక్షించడానికే కాంగ్రెస్ ఈ ర్యాలీ నిర్వహించిందని భాజపా కొట్టిపారేసింది.

తెలంగాణ పంచాయతీ ఎన్నికల్లో రెండో విడతలోనూ కాంగ్రెస్ జోరు

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్రంలో రెండో విడత గ్రామ పంచాయతీ సర్పంచి, వార్డు సభ్యుల ఎన్నికల్లోనూ కాంగ్రెస్ మద్దతుదారులు విజయదుందుభి మోగించారు. మొత్తం 4,333 స్థానాల్లో సగానికి కంటే ఎక్కువ స్థానాల్లో గెలిచి ఆధిక్యాన్ని చాటారు. సిద్దిపేట, కరీంనగర్, కుమురం భీం, జనగామ, నిర్మల్ మినహా మిగిలిన 27 జిల్లాల్లో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన వారే మెజారిటీ స్థానాలను కైవసం చేసుకున్నారు. ప్రతిపక్ష భారాస రెండో విడతలోనూ గట్టి పోటీ ఇచ్చింది. వేయికి పైగా స్థానాల్లో ఆ పార్టీ బలపరిచిన వారు విజయం సాధించారు. స్వతంత్ర అభ్యర్థులు మూడో స్థానంలో నిలిచారు. భాజపా మద్దతుదారులు రెండువందలకు పైగా స్థానాల్లో గెలిచారు. నిర్మల్ జిల్లాలో ఆ పార్టీ వారికి మెజారిటీ స్థానాలు వచ్చాయి. రాత్రి తొమ్మిది గంటల వరకు కాంగ్రెస్ పార్టీ మద్దతుదారులు ఏకగ్రీవాలతో కలిపి 2146 (51.8%). భారాస 1131 (27.3%). భాజపా 251 (6.1%), ఇతరులు 611 (14.8%) సర్పంచి స్థానాలు పొందారు. వణికించే చలిలోనూ ఓటర్లలో ఉత్సాహం వెల్లువెత్తింది. ఉదయం నుంచే బారులు తీరారు. 85.86 శాతం పల్లె ప్రజలు ఓటు వేశారు. ఈ నెల 11న జరిగిన మొదటి విడతలో నమోదైన(84.28) పోలింగ్ కన్నా ఇది 1.58 శాతం ఎక్కువ. ఆదివారం సెలవురోజు కావడంతో పోలింగ్ శాతం పెరిగింది.

రాముడితోపాటే వారికీ పూజలు

- భద్రాచలంలో జనవరి 16న విశ్వరూప సేవ



భద్రాచలం రామాలయంలో నిర్వహించే పెద్ద ఉత్సవాల్లో ప్రధానమైనది విశ్వరూప సేవ. అఖిలాండ కోటి బ్రహ్మాండ నాయకుడైన రాములవారితో పాటు ఉపాలయాలలోని దేవతామూర్తులు ఒకే మండపంలో వేంచేసి.. దీపారాధనలు అందుకోవడమే ఈసేవ ప్రత్యేకత. వైకుంఠ ఏకాదశికి పదిహేను రోజుల తర్వాత వచ్చే బహుళ ద్వాదశి నాడు ఇది జరుగుతుంది. ఏడాదికోసారి నిర్వహించే ఈ ఉత్సవం 2026 జనవరి 16న ఉంటుంది. ఆ రోజు.. దేవతలంతా ఒకే దగ్గర కొలువుదీరుతున్నందున ఆ వేడుకను సర్వదేవత అలంకార దర్శనం అని కూడా పిలుస్తారు. పారాయణలు, సంకీర్తనలు, వేద మంత్రోచ్చారణలతో పాటు మహా ప్రభుత్సోత్సవం (దర్బారు సేవ) నిర్వహిస్తారు.

– న్యూస్‌టుడే, భద్రాచలం



సిడ్నీలోని బోండీ బీచ్‌లో కాల్పులు చోటుచేసుకున్న ప్రదేశంలో సహాయక చర్యలు

యూదులపై ఉగ్ర దాడి

(మొదటి పేజీ తరువాయి)

పరుగులు తీశారు. సాయంత్రం 6.45 గంటల సమయంలో పోలీసులకు కాల్పుల సమాచారం అందింది. వెంటనే అక్కడికి చేరుకున్న వారు దుండగుల్లో ఒకడిపై కాల్పులు జరిపారు. మరొకడిని అదుపులోకి తీసుకున్నారు. ఒక నిందితుడి కారులో ఐఈడీ దొరికింది.

- చనిపోయిన వారిలో బోండీలోని మత గురువు ఎలి ష్లాంగర్ ఉన్నారు. ఆయనే ఈ ఉత్సవాన్ని నిర్వహించిన వారిలో కీలక వ్యక్తి.
- 5 నిమిషాలపాటు కాల్పులు జరిగాయని ప్రత్యక్ష సాక్షి అయిన లాక్లాన్ మోరన్ తెలిపారు. కాల్పుల శబ్దం వినపడగానే పరుగులు తీశానని వివరించారు. అందరూ తమ వస్తువులను అక్కడే వదిలేసి పరుగులు తీశారని తెలిపారు. కొంత మంది రోదించడం కనిపించిందని వెల్లడించారు.
- ఉద్దేశపూర్వకంగా యూదులను లక్ష్యంగా చేసుకుని చేసిన దాడి ఇదని న్యూ సౌత్ వేల్స్ ప్రధాని క్రిస్ మిన్ తెలిపారు. దానిని ఉగ్ర దాడిగా ప్రకటిస్తున్నామని పోలీసు కమిషనర్ మాల్ లాన్యోన్ వెల్లడించారు.
- బోండీలోని దృశ్యాలు.. తనను షాక్‌కు గురిచేశాయని, దిగ్భ్రాంతి కలిగించాయని ఆస్ట్రేలియా ప్రధాని ఆంథోని అల్బనీస్ పేర్కొన్నారు.
- సిడ్నీలో జరిగిన ఉగ్ర దాడిని ప్రధాని మోదీ సహా ప్రపంచ దేశాల నేతలు ఖండించారు. భారత ప్రజల తరఫున మరణించిన వారికి సంతాపం తెలుపుతున్నానని మోదీ పేర్కొన్నారు. ఆస్ట్రేలియా ప్రజలకు ఈ కష్టకాలం మద్దతుగా నిలుస్తామని ప్రకటించారు. ఐక్యరాజ్య సమితి ప్రధాన కార్యదర్శి గుటెరస్ ఉగ్ర దాడిని ఖండించారు. బ్రిటన్ ప్రధాని మృతులకు సంతాపం తెలిపారు. బ్రిటన్‌లో యూదులున్న ప్రాంతాల్లో భద్రతను కట్టుదిట్టం చేస్తున్నామని ప్రకటించారు.
- చాబాద్ అనే సంస్థ మత విశ్వాసాలను నమ్మని వారిని మతంలోకి తీసుకొచ్చేందుకు పని చేసే సంస్థ. అది ప్రపంచ వ్యాప్తంగా వందల కేంద్రాలను నడుపుతోంది. యూదుల సెలవుల్లో ఈ సంస్థ భారీ కార్యక్రమాలను నిర్వహిస్తుంటుంది.

నిందితుడి గుర్తింపు

బోండీ బీచ్‌లో కాల్పులకు తెగబడిన ఇద్దరు దుండగుల్లో ఒకడిని భద్రతా బలగాలు గుర్తించాయి. సిడ్నీ నైరుతి ప్రాంతంలోని బోనీరిగ్‌కు చెందిన 24 ఏళ్ల నవీద్ అక్రమ్‌ను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. అక్రమ్ ఇంట్లోనూ పోలీసులు సోదాలు నిర్వహించారు.



సిడ్నీలోని బోండీ బీచ్ కాల్పుల్లో గాయపడిన వ్యక్తిని ఆసుపత్రికి తరలిస్తున్న సిబ్బంది



దుండగుడిని అడ్డుకున్న సాహసి

కాల్పులు జరుపుతున్న దుండగుల్లో ఒకడిని అక్కడే ఉన్న అహ్మద్ అనే వ్యక్తి అడ్డుకున్నాడు. వెనుక నుంచి వచ్చి తుపాకీని లాక్కున్నాడు. దీంతో దుండగుడు అక్కడి నుంచి పారిపోయాడు. దీన్ని ఓ వ్యక్తి ఫోన్‌లో చిత్రీకరించారు. ఆ వీడియో ఆస్ట్రేలియా మీడియాలో ప్రసారమైంది.

మరింత తగ్గనున్న ఉష్ణోగ్రతలు

అరకులో కనిష్ఠంగా 4.4 డిగ్రీలు

ఈనాడు, విశాఖపట్నం, చింతపల్లి, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రజలను చలి గజగజలాడిస్తోంది. రాత్రి ఉష్ణోగ్రతలు గణనీయంగా పడిపోతున్నాయి. కోస్తాంధ్ర, యానాంలలోని పలు ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 1.6 నుంచి 3 డిగ్రీలు తక్కువగా నమోదవుతున్నాయి. ఏజెన్సీ ప్రాంతాల్లో తీవ్రత ఎక్కువగా ఉంది. చిన్నారులు, వృద్ధులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్థులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. రానున్న మూడు రోజుల్లో రాష్ట్రవ్యాప్తంగా కనిష్ఠ ఉష్ణోగ్రతలు 2 నుంచి 4 డిగ్రీలు తగ్గే అవకాశముందని అమరావతి వాతావరణ కేంద్రం పేర్కొంది. శనివారం రాత్రి రాష్ట్రంలోనే అత్యల్పంగా అల్లూరి సీతారామరాజు జిల్లా అరకులో కనిష్ఠ ఉష్ణోగ్రత 4.4 డిగ్రీలుగా నమోదైంది. డుంబ్రిగుడలో 5.1, జి.మాడుగులలో 5.5, ముంచంగిపుట్టులో 6, హుకుంపేటలో 7.3, చింతపల్లిలో 7.5, పాడేరులో 8.6 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. అల్లూరి సీతారామరాజు, శ్రీసత్యసాయి, అన్నమయ్య, అనంతపురం, చిత్తూరు, పార్వతీపురం మన్యం, నంద్యాల, కర్నూలు జిల్లాల్లో కనిష్ఠ ఉష్ణోగ్రతలు 12 డిగ్రీలలోపే ఉంటున్నాయి. ఏజెన్సీ ప్రాంతాల్లో దట్టమైన పొగమంచు కురుస్తుండటంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

అనకాపల్లి 'బార్క్' విస్తరణ!

- 5 మెగావాట్ల అణు రియాక్టర్ ఏర్పాటు!

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో కేంద్ర ప్రభుత్వ రంగ ప్రతిష్ఠాత్మక సంస్థ భాభా అణు పరిశోధన కేంద్రం (భాభా ఆటమిక్ రీసెర్చ్ సెంటర్- బార్క్) విస్తరణ కోసం ఆ ప్రాజెక్టు భూముల సరిహద్దు ప్రాంతం, సముద్ర తీరానికి మధ్యనున్న 366 ఎకరాల అటవీ భూముల బదిలీకి కేంద్ర అటవీ, పర్యావరణ మంత్రిత్వ శాఖ సూత్రప్రాయంగా అంగీకరించినట్లు ఓ వార్తా సంస్థ పేర్కొంది. ఇప్పటికే బార్క్ ఏర్పాటుకు అనకాపల్లి జిల్లాలో 3 వేల ఎకరాల రెవెన్యూ భూములను ప్రభుత్వం కేటాయించింది. భూములు ఇచ్చిన రైతులకు పునరావాసం, పరిహారం ప్యాకేజీ చెల్లిస్తోంది. ప్రస్తుతం క్యాన్సర్ చికిత్స కోసం పరిశోధనలు చేస్తున్న ఈ కేంద్రంలో వైద్య ఐసోటోప్‌ల తయారీ కోసం రియాక్టర్‌ను పీపీపీ విధానంలో తేవాలని కేంద్ర ప్రభుత్వం భావిస్తోంది. ఇదే కేంద్రంలో 5 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి రియాక్టర్‌ను కూడా ఏర్పాటు చేయనుంది. దాని పనితీరు ఆధారంగా దేశంలో 200 మెగావాట్ల అణు విద్యుత్ ఉత్పత్తి రియాక్టర్లు ఏర్పాటు చేయాలన్నది కేంద్రం ఆలోచనగా ఓ అధికారి తెలిపారు.

ఫ్రీహోల్డ్ సమస్యా.. సాకా?

(మొదటి పేజీ తరువాయి)

పట్టాభూములను సర్వీసు ఈనాం కింద చేర్చి, నిషేధ జాబితాలో పేర్కొనడం కూడా క్రయవిక్రయాలకు అడ్డంకిగా మారింది.

రాష్ట్రంలో ఎసైన్డ్ చేసిన ఫ్రీహోల్డ్ భూముల విస్తీర్ణం: 13,59,806 ఎకరాలు

అక్రమాలు జరిగాయని గుర్తించినవి 5,74,908 ఎకరాలు

ప్రైవేటు భూములూ చేర్చారు

విస్తీర్ణం: **5,433** ఎకరాలు

సమస్య: రాష్ట్రవ్యాప్తంగా కొన్నిచోట్ల ప్రైవేటు భూములను ఎసైన్డ్ భూములుగా గుర్తించి, నిషేధ జాబితాలో చేర్చారు.

పరిష్కారం: వాటిని పట్టా భూములుగా మార్చి, రిజిస్ట్రేషన్‌కు అనుమతించాలి.

కలెక్టర్ ఆదేశాలతో కిరికిరి

విస్తీర్ణం: **64,151** ఎకరాలు

సమస్య: నిబంధనల ప్రకారం 20 ఏళ్లు పూర్తయినా, కలెక్టర్లు ప్రొసీడింగ్స్ ఇవ్వలేదు.

పరిష్కారం: కలెక్టర్లు ప్రొసీడింగ్స్ ఇచ్చి, రిజిస్ట్రేషన్‌కు అనుమతించాలి.

చుక్కల జాబితా నుంచి తొలగించినా

విస్తీర్ణం: **17,901** ఎకరాలు

సమస్య: చుక్కల భూముల జాబితా నుంచి భూములను తొలగించి ఫ్రీహోల్డ్‌కు అవకాశమిచ్చారు. అయినా రిజిస్ట్రేషన్, ఇతర లావాదేవీలు జరగడం లేదు.

పరిష్కారం: వాటి లావాదేవీలకు అవకాశమివ్వాలి.

ఆర్‌ఎస్‌ఆర్ కంటే అదనంగా..

విస్తీర్ణం: **11,739** ఎకరాలు

సమస్య: ఆర్‌ఎస్‌ఆర్ పుస్తకాల్లో పేర్కొన్న విస్తీర్ణానికి మించి ఫ్రీహోల్డ్ కింద మార్చారు.

పరిష్కారం: రీసర్వే పూర్తికాని గ్రామాల్లో.. వెబ్‌ల్యాండ్‌లో ఉన్న విస్తీర్ణాన్ని మాత్రమే ఫ్రీహోల్డ్ చేస్తారు. రీసర్వే పూర్తయ్యాక వాస్తవంగా అనుభవంలో ఉన్న విస్తీర్ణం మాత్రమే ఫ్రీహోల్డ్ అవుతుంది. ఇవి 22ఎ జాబితాలో ఉంటాయి. వెబ్‌లాండ్ 22ఎ కింద అమలులో ఉంటుంది.

ఎసైనీ కాని వారికీ..

విస్తీర్ణం: **38,727** ఎకరాలు

సమస్య: భూబదిలీ చట్టాన్ని ఉల్లంఘించి వేల ఎకరాల్ని ఫ్రీహోల్డ్‌గా మార్చేశారు.

పరిష్కారం: భూమిపై వాస్తవ ఎసైనీ ఉండి, అడంగల్‌లో వారి పేరు ఉంటే ఫ్రీహోల్డ్ చేయొచ్చు. లేదంటే పీవోటీ చట్టప్రకారం చర్యలు తీసుకోవాలి.

భూమి ఆధీనంలో లేకున్నా..

విస్తీర్ణం: **25,491** ఎకరాలు

సమస్య: రికార్డుల్లో భూమి ఫ్రీహోల్డ్‌గా మారింది. కానీ భూమి అతని ఆధీనంలో లేదు.

పరిష్కారం: వాస్తవ ఎసైనీ పట్టాదారుగా నమోదైతే, ఫ్రీహోల్డ్ చేయాలి.

ఎసైన్‌మెంట్ రికార్డుల్లేక..

విస్తీర్ణం: **2,86,951** ఎకరాలు

సమస్య: రాష్ట్రవ్యాప్తంగా చాలాచోట్ల ఎసైన్డ్ భూముల పేరుతో ఫ్రీహోల్డ్‌గా మార్చేసుకున్నారు. కొన్నిచోట్ల అధికారాన్ని అడ్డుపెట్టుకుని వాటిని పేదల పేరిట ఇచ్చినట్లు చూపించి, ఫ్రీహోల్డ్ చేసుకున్నారు. వాస్తవానికి వీటిని వైకాపా నేతలు ముందే ఆక్రమించారు. పేదలకు పంచినట్లు చూపించి ఫ్రీహోల్డ్ ముసుగులో అధికారిక ముద్ర వేయించుకున్నారు.

పరిష్కారం: ఆర్‌ఓఆర్ చట్టంలోని 6ఎ సెక్షన్ ప్రకారం ఆన్‌లైన్ వెబ్‌లాండ్ అడంగల్ సరైందిగా భావించాలి. ప్రస్తుత పట్టాదారు ఎసైన్‌మెంట్‌కు అర్హులైతే ఫ్రీహోల్డ్‌కు పరిగణించాలి. అర్హులు కాకపోతే చట్టప్రకారం చర్యలు తీసుకోవాలి.

ఎసైన్ చేసి, 20 ఏళ్లు నిండితే

విస్తీర్ణం: **28,318** ఎకరాలు

సమస్య: ఎసైన్‌మెంట్ భూములు ఇచ్చి 20 ఏళ్లు అయింది. ఇంకా ఫ్రీహోల్డ్‌లోకి మార్చలేదు.

పరిష్కారం: 20 ఏళ్లు గడిస్తే ఫ్రీహోల్డ్‌గా మార్చవచ్చు. లేకుంటే ఎప్పటి నుంచి ఫ్రీహోల్డ్ అవుతుందో ఆ సంవత్సరాన్ని నమోదు చేయాలి.

చెరువులు, కుంట పోరంబోకుల్లో..

విస్తీర్ణం: **3,516** ఎకరాలు

సమస్య: చెరువులు, కుంట పోరంబోకుల్ని కూడా కొందరు ఫ్రీహోల్డ్‌గా మార్చేశారు.

పరిష్కారం: జలవనరులు ప్రభావితమవుతున్నాయి నీటిపారుదల శాఖ ధ్రువీకరిస్తే వాటిని 22ఎ జాబితాలోనే ఉంచాలి. లేదంటే ఫ్రీహోల్డ్ చేయొచ్చు. అయాన్ మార్చకుండా ఎసైన్‌మెంట్ జరగదు కాబట్టి, ఎసైన్‌మెంట్ సరైందేనని భావించి ఫ్రీహోల్డ్‌గా ఉంచాలి.

పోరంబోకు భూములపై..

విస్తీర్ణం: **24,254** ఎకరాలు

సమస్య: చాలాచోట్ల పోరంబోకు భూముల్ని ఫ్రీహోల్డ్‌గా మార్చారు.

పరిష్కారం: అయాన్ మార్పిడి తర్వాతే ఎసైన్‌మెంట్ జరుగుతుంది. ఈ సూత్రం ప్రకారం సరైందిగా భావించి ఫ్రీహోల్డ్‌గా కొనసాగించాలి.

గ్రహం అనుగ్రహం

15-12-2025 సోమవారం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం; దక్షిణాయనం; హేమంత రుతువు, మార్గశిర మాసం, బహుళపక్షం
ఏకాదశి: రా. 10-08 తదుపరి ద్వాదశి
చిత్త: మ. 12-54 తదుపరి స్వాతి
వర్జ్యం: రా. 7-02 నుంచి 8-47 వరకు
అమృత ఘడియలు: ఉ. 7-42 వరకు తిరిగి తె. 5-33 నుంచి
దుర్ముహూర్తం: మ. 12-16 నుంచి 1-00 వరకు తిరిగి 2-28 నుంచి 3-12 వరకు
రాహుకాలం: ఉ. 7-30 నుంచి 9-00 వరకు
సూర్యోదయం: ఉ.6.26; సూర్యాస్తమయం: సా.5.24

చలి - పులి

ప్రాంతం	కనిష్ఠ	గరిష్ఠ
విజయనగరం	16.0	28.0
అనంతపురం	16.2	30.4
కర్నూలు	16.4	31.4
కడప	17.0	28.0
శ్రీకాకుళం	17.0	28.0
రాజమహేంద్రవరం	17.0	33.0
విశాఖపట్నం	18.0	29.0
నరసాపురం	18.0	31.5
విజయవాడ	18.2	29.4
గుంటూరు	19.0	30.0
సూర్యాపేట	19.0	30.0
ఒంగోలు	19.4	30.1
నెల్లూరు	20.8	29.6
తాడేపల్లిగూడెం	24.0	30.0

ఏఎన్నార్ కళాశాలకు వజ్రోత్సవ శోభ



అక్కినేని నాగేశ్వరరావు కళాశాల

- ప్రపంచం గుర్తించేలా పల్లెబిడ్డలకు విద్యాబుద్ధులు
- 16 నుంచి మూడు రోజుల పాటు 75 ఏళ్ల వేడుకలు

ఈనాడు డిజిటల్, మచిలీపట్నం- గుడివాడ, న్యూస్‌టుడే: స్వాతంత్ర్యం వచ్చిన తొలినాళ్లలో కృష్ణా డెల్టాలోని రైతుబిడ్డలు స్థానికంగా ప్రాథమిక విద్యనభ్యసించినా, ఉన్నత చదువుల కోసం దూరప్రాంతాలకు వెళ్లాల్సి వచ్చేది. వారికి డిగ్రీ కోర్సులనూ అందుబాటులోకి తేవాలన్న సంకల్పంతో 1950లో గుడివాడలో పురుడు పోసుకున్న కళాశాల.. పల్లెటూరి పిల్లలనెందరినో ప్రపంచం గుర్తించే స్థాయిలో తీర్చిదిద్దింది. 1959లో ప్రసిద్ధ నటుడు అక్కినేని నాగేశ్వరరావు రూ.లక్ష విరాళం ఇవ్వడంతో ఏఎన్నార్ పేరుతో నామకరణం చేశారు. తొలుత 15 ఎకరాల్లో ఉన్న కళాశాల ప్రాంగణం తర్వాత మరో 10 ఎకరాలకు విస్తరించింది. ఈ చదువుల కోవెల 75 ఏళ్లుగా వేల మందికి ఉన్నత విద్యనందించి వారి భవితకు బంగారు బాటలు వేసింది. ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు, పారిశ్రామికవేత్తలు, రాజకీయ నేతలు, సినీ కళాకారులనెందరినో అందించింది. డిసెంబరు 16 నుంచి 18 వరకు వజ్రోత్సవాలకు సిద్ధమైన ఏఎన్ఆర్ కళాశాల ప్రస్థానం.. స్ఫూర్తిదాయకం.

ఒక్కో కోర్సు ప్రారంభిస్తూ..

ఈ కళాశాలలో తొలుత ఆర్ట్స్ కోర్సులు మాత్రమే ఉండగా 1974లో ఎంకామ్, 1991-92లో పలు సైన్స్ కోర్సులను ప్రారంభించారు. ఆ తర్వాత దశల వారీగా సాంకేతిక, ఉపాధ్యాయ విద్యా కోర్సులను ప్రవేశపెట్టారు. 2018-19లో అటానమస్ కళాశాలగా న్యాక్ ఏ గ్రేడ్ సాధించింది. గత వైకాపా ప్రభుత్వం ఎయిడెడ్ కళాశాల గుర్తింపును రద్దుచేసి, ప్రభుత్వానికి అప్పగించాలని ఒత్తిడి చేసినా యాజమాన్యం నిరాకరించింది. ఇక్కడి సిబ్బందిని ప్రభుత్వం తీసుకోవడంతో ఇబ్బందులొచ్చినా.. దాతలు, పూర్వ విద్యార్థుల అండతో నిలబడింది.

మహనీయులనెందరినో తీర్చిదిద్ది..

ఈ కళాశాలలో చదివిన ఎందరో ఉన్నత స్థానాలకు ఎదిగారు. రామోజీరావు, కావూరి సాంబశివరావు, కైకాల సత్యనారాయణ, యార్లగడ్డ లక్ష్మీప్రసాద్, వడ్డే శోభనాద్రీశ్వరరావు, యలమంచిలి శివాజీ, కఠారి ఈశ్వర్‌కుమార్, తంగిరాల ప్రభాకరరావు, పేర్ని కృష్ణమూర్తి, వెనిగండ్ల రాము తదితరులంతా ఇక్కడి విద్యార్థులే. పద్మ విభూషణ్, పద్మభూషణ్, పద్మశ్రీ అవార్డులు అందుకున్న వాళ్లూ ఉన్నారు. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బట్టు దేవానంద్ ఇక్కడ చదివిన వారే. కళాశాల ఉన్నతికి దాతల సహకారానికి గుర్తుగా వివిధ బ్లాక్‌లకు వారి పేర్లే పెట్టారు.

వజ్రోత్సవాలకు ప్రముఖుల హాజరు

డిసెంబరు 16 నుంచి మూడు రోజుల పాటు వజ్రోత్సవాలు నిర్వహించనున్నారు. తొలిరోజు 16న ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో రైతు సదస్సు నిర్వహించనున్నారు. 17న పూర్వవిద్యార్థుల సమ్మేళనం సందర్భంగా హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బట్టు దేవానంద్, మాజీ ఎంపీ కావూరి సాంబశివరావు, విశ్రాంత ఐఏఎస్ కంటిపూడి పద్మనాభయ్య తదితరులను సత్కరించనున్నారు. ప్రముఖ సినీ నటుడు అక్కినేని నాగార్జున ఆధ్వర్యంలో నూతన భవనం ప్రారంభించనున్నారు. 18న ముగింపు ఉత్సవాలకు మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, మంత్రి నారా లోకేశ్, 'ఈనాడు' సీఎండీ సీహెచ్ కిరణ్, మాజీ సెంట్రల్ విజిలెన్స్ కమిషనర్ కేవీ చౌదరి తదితరులను ఆహ్వానించినట్లు నిర్వాహకులు తెలిపారు.



చెరుకూరి వెంకట సుబ్బారావు, వెంకట సుబ్బమ్మ స్వర్ణోత్సవ బ్లాక్ ★ యెర్నేని చలమయ్య ఆడిటోరియం ★ కొల్లి లింగయ్య వ్యాయామశాల ★ ప్రధాన గ్రంథాలయం ★ నాగార్జున ప్రారంభించనున్న రూసా భవనం

సామాన్యులకు 'న్యాయం' భారం కారాదు

సీజేఐ జస్టిస్ సూర్యకాంత్



భువనేశ్వర్, న్యూస్‌టుడే: సామాన్యులకు న్యాయం భారం కారాదని, కేసులు త్వరగా పరిష్కారం కావాలని కక్షిదారులు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కోకుండా న్యాయం అందాలని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ సూర్యకాంత్ పేర్కొన్నారు. ఒడిశా కటక్‌లోని సవిత్ భవన్‌లో ఆదివారం హైకోర్టు న్యాయవాదుల సంఘం నిర్వహించిన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. సుప్రీం, హైకోర్టుల్లో పేరుకుపోతున్న కేసులు త్వరగా పరిష్కారం కావాలన్నారు. ఈ బరువు తగ్గించుకోవడానికి 'ఆల్టర్నేటివ్ డిస్ప్యూట్ రిజల్యూషన్' పద్ధతి అనుసరించాలి లేదా మధ్యవర్తిత్వం ద్వారా పరిష్కరించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ హరీశ్ టాండన్, రాష్ట్ర అడ్వొకేట్ జనరల్ పీతాంబర్ ఆచార్య, న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు మనోజ్ కుమార్ మిశ్ర, ఉపాధ్యక్షుడు సిద్ధార్థ దాస్, కార్యదర్శి అవిజిత్ పట్నాయక్, ఇతర న్యాయమూర్తులు, న్యాయవాదులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా 50 ఏళ్లుగా న్యాయవాదులుగా సేవలందిస్తున్న వారిని సత్కరించారు.

భావితరాలకు ఉపయోగపడే పుస్తకం.. 'ఏ టేల్ ఆఫ్ టూ స్టేట్స్'

ఆవిష్కరించిన సీఎం చంద్రబాబు



'ఏ టేల్ ఆఫ్ టూ స్టేట్స్' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సీఎం చంద్రబాబు. చిత్రంలో రచయితలు ఐ.వెంకటరావు, అనురాధ, రిటైర్డ్ ఐఆర్ఎస్ అధికారి కె.చంద్రహాస్, ప్రచురణకర్తలు ఐ.వేణు, ఐ.రఘు

ఈనాడు, అమరావతి: ప్రముఖ పాత్రికేయుడు ఐ.వెంకటరావు రాసిన 'విలీనం-విభజన' పుస్తకం ఆంగ్ల అనువాదం 'ఏ టేల్ ఆఫ్ టూ స్టేట్స్'ను సీఎం చంద్రబాబు ఆదివారం ఆవిష్కరించారు. హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతూ.. పరిశోధకులు, భవిష్యత్తు తరాలకు ఈ పుస్తకం ఉపయుక్తంగా ఉంటుందని అన్నారు. పుస్తకాన్ని ఆంగ్లంలోకి అనువదించిన ఎన్.అనురాధను ఆయన అభినందించారు. ఏపీ, తెలంగాణ రాష్ట్రాల విలీనం, విభజన అంశాలతో పాటు తెలుగు రాష్ట్రాల్ని పరిపాలించిన సీఎంల గురించి రచయిత ఇందులో వివరించారు. రచయిత ఐ.వెంకటరావు, రచయిత, రిటైర్డ్ ఐఆర్ఎస్ అధికారి కె.చంద్రహాస్, పుస్తక ప్రచురణకర్తలు ఐ.వేణు, ఐ.రఘు పాల్గొన్నారు.

పవన్‌కల్యాణ్ చొరవతో ఉప్పాడ మత్స్యకారులకు శిక్షణ

ఈనాడు, అమరావతి: ఉప్పాడ తీర ప్రాంత మత్స్యకారుల జీవనోపాధి మెరుగుపరిచేందుకు ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ప్రకటించిన వంద రోజుల ప్రణాళికలో భాగంగా కేరళ, తమిళనాడు రాష్ట్రాల్లో 60 మంది మత్స్యకారులు శిక్షణ పొందారు. ఉప్పాడ మత్స్యకారులకు సాంకేతిక వసతులు కల్పించాలనే ఉద్దేశంతో ఈ శిక్షణ ఇచ్చినట్టు ఉప ముఖ్యమంత్రి కార్యాలయం ఓ ప్రకటనలో తెలిపింది. సెంట్రల్ సాల్ట్ అండ్ మెరైన్ కెమికల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్, నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పోస్ట్ హార్వెస్ట్ టెక్నాలజీ సంస్థల ద్వారా అధునాతన కేజ్ కల్చర్, రిఫ్ కల్చర్, మార్కెటింగ్ వ్యవస్థల ఏర్పాటు, హేచరీల్లో చేపల గుడ్లు పొదిగించడం, వలల తయారీ తదితర అంశాల్లో మత్స్యకారులు శిక్షణ పొందారని, అన్ని హంగులతో నిర్మించిన హార్బర్లను సందర్శించారని వెల్లడించింది.

నేడు కన్హా శాంతివనానికి సీఎం చంద్రబాబు

ఈనాడు, అమరావతి: హైదరాబాద్ శివారు శ్రీరామచంద్ర మిషన్ అభివృద్ధి చేసిన కన్హా శాంతివనాన్ని సీఎం చంద్రబాబు సోమవారం సందర్శించనున్నారు. ఈ సందర్భంగా ఆశ్రమ అధ్యక్షులు కమలేశ్ డి.పటేల్ దాజీతో ఆయన సమావేశం కానున్నారు. శాంతివనంలోని వెల్‌నెస్, మెడిటేషన్ సెంటర్, యోగా కేంద్రాలు సహా వివిధ ప్రాంతాల్ని ఆయన సందర్శిస్తారు. అనంతరం హెలికాప్టర్‌లో అమరావతి చేరుకుంటారు.

దుర్గగుడికి పోటెత్తిన భవానీ భక్తులు

ఆదివారం ఒక్క రోజే 1.50 లక్షల మంది దర్శనం



ఘాట్ రోడ్డులోని క్యూలైన్లలో కిక్కిరిసిన భవానీలు, భక్తులు

విజయవాడ వన్‌టౌన్, న్యూస్‌టుడే: ఇంద్రకీలాద్రిపై కొనసాగుతున్న భవానీ దీక్షల విరమణలకు ఆదివారం భక్తులు పోటెత్తారు. గిరిప్రదక్షిణ మార్గమంతా భవానీ భక్తులతో కిక్కిరిసిపోయింది. శనివారం రాత్రి 9 గంటల నుంచి ఆదివారం ఉదయం ఏడు గంటల వరకు రద్దీ కొనసాగింది. ఆదివారం రాత్రి 10 గంటల వరకు లక్షా 50 వేల మంది భవానీ భక్తులు దుర్గమ్మను దర్శించుకున్నారు. ఈ సంఖ్య రాత్రి ఆలయం మూసే సమయానికి రెండు లక్షలకు చేరవచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు.

అక్షరమాలలో ఒదిగిన గణనాథుడు!



తెలుగు అక్షరమాలలో కూర్చిన వినాయకుడి చిత్రాలతో శ్రీధరన్

ఇష్ట దైవమైన వినాయకుడిని తన మాతృభాష తెలుగుతో కలపాలని వినూత్నంగా ఆలోచించారు అనంతపురం జిల్లా గుంతకల్లుకు చెందిన శ్రీధరన్. రైల్వేలో పనిచేసి పదవీ విరమణ పొందిన అయనకు గణనాథుడంటే అమిత భక్తి. చిత్రకళనూ అభ్యసించారు. వివిధ అలంకారాల్లో గణేశుడి చిత్రాలను గీసి.. వాటిని తెలుగు అక్షరమాలలో ఒద్దికగా కూర్చారు. విజయవాడలో ఆదివారం ఏర్పాటు చేసిన 'చిత్రకళా సంత'లో అటు సృజనాత్మకత, ఇటు భాషాభిమానం కూడిన ఈ చిత్రాలు సందర్శకులను ఆకట్టుకున్నాయి.

– ఈనాడు, అమరావతి

జేఈఈ అడ్వాన్స్‌డ్ 2026 సిలబస్ విడుదల

ఈనాడు, హైదరాబాద్: జేఈఈ అడ్వాన్స్‌డ్ 2026కు సంబంధించి సిలబస్‌ను ఐఐటీ రూర్కీ ఆదివారం విడుదల చేసింది. వచ్చే ఏడాది మే 17న జేఈఈ అడ్వాన్స్‌డ్ జరిపేందుకు ఇప్పటికే షెడ్యూలు ఖరారైంది. ఈ నెల 5న ఈ పరీక్షకు సంబంధించి వెబ్‌సైట్‌ను ఐఐటీ రూర్కీ అధికారులు అందుబాటులోకి తెచ్చారు. సిలబస్‌లో ఎలాంటి మార్పు లేదు.

మాతృభాషను విస్మరించొద్దు

- ఎంపీ సుధా నారాయణమూర్తి

రాజాం, న్యూస్‌టుడే: విద్యార్థులకు ఆంగ్ల నైపుణ్యంతో పాటు మాతృభాష కీలకమని రాజ్యసభ సభ్యురాలు, ఇన్ఫోసిస్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షురాలు సుధానారాయణమూర్తి పేర్కొన్నారు. విజయనగరం జిల్లా రాజాంలోని జీఎంఆర్ ఇంజినీరింగ్ కళాశాల, నైరెడ్ శిక్షణ సంస్థ, జీఎంఆర్ వరలక్ష్మి కేర్ ఆసుపత్రులను ఆమె ఆదివారం జీఎంఆర్ గ్రూప్ అధినేత గ్రంధి మల్లికార్జునరావుతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత స్థాయికి చేరాలంటే దగ్గర దారులు ఉండవని, శ్రమించడం ఒక్కటే మార్గమన్నారు. అంతర్జాతీయ స్థాయిలో రాణించాలంటే ఆంగ్లంతోపాటు కమ్యూనికేషన్ స్కిల్స్ కీలకమని చెప్పారు. జీవితంలో బాగా ఎదిగాక సమాజానికి మనం ఏమివ్వగలమని ఆలోచించి పనిచేయాలని సూచించారు. అనంతరం గ్రంధి మల్లికార్జునరావు మాట్లాడుతూ జీఎంఆర్‌వీఎఫ్ ద్వారా చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు. ఎంతో మంది విద్యార్థులకు ఫౌండేషన్ ద్వారా చేయూత ఇవ్వడంతో వివిధ రంగాల్లో రాణిస్తున్నారని చెప్పారు. విద్యావేత్తగా, సంఘసంస్కర్తగా, రచయితగా గుర్తింపు పొందిన సుధానారాయణమూర్తిని అంతా స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. అంతకుముందు నైరెడ్‌లో కొత్తగా ఏర్పాటుచేసిన సాధికారత విభాగాన్ని సుధా నారాయణమూర్తి ప్రారంభించారు. మహిళా సాధికారత డాక్యుమెంటరీ చిత్రాన్ని ఆవిష్కరించారు. అక్కడ ఇస్తున్న శిక్షణలపై ఆరా తీస్తూ శిక్షణార్థులతో ఆమె మాట్లాడారు. గిఫ్టెడ్ చిల్డ్రన్‌కు పాఠశాల బ్యాగులు అందించారు. తర్వాత ఆమెను గ్రంధి మల్లికార్జునరావు కుటుంబ సభ్యులు సత్కరించారు. జీఎంఆర్ గ్రూప్ బిజినెస్ ఛైర్మన్లు బీవీఎస్ రాజు, బీవీ నాగేశ్వరరావు, బొమ్మిడాల రమాదేవి తదితరులు పాల్గొన్నారు.



జీఎంఆర్ గ్రూప్ అధినేత గ్రంధి మల్లికార్జునరావుతో కలిసి జ్యోతి ప్రజ్వలన కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీ సుధానారాయణమూర్తి చిత్రంలో బొమ్మిడాల రమాదేవి

మైనింగ్ రంగాన్ని అభివృద్ధి చేస్తాం

మంత్రి కొల్లు రవీంద్ర



మాట్లాడుతున్న మంత్రి కొల్లు రవీంద్ర

విజయవాడ సిటీ, న్యూస్‌టుడే: దేశ పారిశ్రామిక అవసరాలు తీర్చడంలో ఏపీ మైనింగ్ రంగాన్ని కీలకంగా మార్చబోతున్నామని గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. విజయవాడ లబ్బీపేటలోని ఎస్ఎస్ కన్వెన్షన్‌లో నిర్వహిస్తోన్న ఏపీ ఛాంబర్స్ బిజినెస్ ఎక్స్‌పోను ఆదివారం ఆయన సందర్శించారు. మంత్రి మాట్లాడుతూ.. మైనింగ్ రంగంలో పెట్టుబడులకు అపార అవకాశాలున్నాయన్నారు. ఉత్తరాంధ్రలో క్రిటికల్ మినరల్ ప్లాంట్ ఏర్పాటు చేయనున్నామని, బీచ్ శాండ్ మినరల్స్ కోసం ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. రాష్ట్రానికి ఆదాయం సమకూర్చడంతో పాటు 20 లక్షల ఉద్యోగాల కల్పన లక్ష్యాన్ని సాకారం చేయబోతున్నామని, ఇందులో పారిశ్రామికవేత్తలు భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏపీ ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఇండస్ట్రీస్ ఫెడరేషన్ అధ్యక్షుడు పొట్లూరి భాస్కరరావు, ప్రధాన కార్యదర్శి రావూరి సుబ్బారావు, ఉపాధ్యక్షుడు బి.రాజశేఖర్, కోశాధికారి సుంకర అక్కయ్య నాయుడు, ఛాంబర్ ప్రతినిధులు పాల్గొన్నారు.

రోడ్డు పనికి రూ.50 లక్షలే!

- 'ఉపాధి' పథకంలో అంతకు మించితే అనుమతి లేదు
- 'మెటీరియల్' నిధుల పనులపై కేంద్రం పరిమితి
- రూ.500 కోట్ల మేర 'పల్లె పండగ' బిల్లుల చెల్లింపులపై ప్రభావం

ఈనాడు, అమరావతి: ఉపాధి హామీ పథకంలో మెటీరియల్ కాంపోనెంట్ కింద చేపట్టే ఒక్కోపని రూ.50 లక్షలకు మించరాదని కేంద్రం పరిమితి విధించింది. ఇప్పటికే అనుమతులిచ్చి, పూర్తయిన పనులకు కూడా ఈ నిబంధన వర్తింపజేస్తున్నారు. దీంతో ఇప్పటికే పనులు పూర్తిచేసిన వారిలో ఆందోళన వ్యక్తమవుతోంది. ఇలాంటి బిల్లులు రాష్ట్ర వ్యాప్తంగా రూ.500 కోట్ల వరకు ఉంటాయని అంచనా. గతేడాది (2024-25) నవంబరులో పల్లె పండగ కార్యక్రమంలో రూ.1,800 కోట్ల మెటీరియల్ కాంపోనెంట్ నిధులతో 4 వేల కిలోమీటర్ల మేర రహదారుల నిర్మాణ పనులు చేపట్టారు. వీటిలో కొన్నింటికి పూర్తిగా, మరికొన్నిటికి పాక్షికంగా బిల్లులు చెల్లించారు. ఈ పనుల్లో అత్యధికం అంచనా విలువ రూ.50 లక్షల కంటే ఎక్కువ ఉన్నవే. దీంతో వాటికి సంబంధించిన ఫండ్ ట్రాన్స్‌ఫర్ ఆర్డర్లు (ఎఫ్‌టీవో) పోర్టల్‌లో తిరస్కరణకు గురవుతున్నాయి.

కలెక్టర్ల నుంచి పనుల రద్దు కోసం విజ్ఞప్తులు

రోడ్ల పనుల అంచనా విలువ రూ.50 లక్షల లోపు ఉండేలా.. తగ్గించి మరోసారి ఎఫ్‌టీవో అప్‌లోడ్ చేసేందుకు వీలుగా రాష్ట్ర డేటా బేస్ అప్లికేషన్ (డీబీఏ) లాగిన్‌లో ఇప్పటికే అప్‌లోడ్ చేసిన పనులను రద్దు (డిలీట్) చేయాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ కార్యాలయానికి కలెక్టర్ల నుంచి వినతులు వస్తున్నాయి. డిలీట్ చేయడం ద్వారా అవే పనుల అంచనాలను సవరించి మరోసారి అప్‌లోడ్ చేయనున్నారు. దీనివల్ల మొదటి విడత చెల్లింపు కింద ఇప్పటికే రూ.30 లక్షలు పొందిన వెండర్లకు మరో రూ.20 లక్షలు వస్తాయి. మొదటి విడత చెల్లింపు కూడా తీసుకోని వెండర్లు రూ.50 లక్షలు పొందొచ్చు. ఈ విధానం ద్వారా తాత్కాలిక ఉపశమనం లభించినా.. పూర్తిచేసిన మిగతా పనుల బిల్లుల మాటేమిటని వెండర్లు ప్రశ్నిస్తున్నారు. ఉదాహరణకు అనకాపల్లి జిల్లాకు చెందిన ఒకరు రూ.1.60 కోట్ల విలువైన రోడ్డు పని పూర్తిచేశారు. ఆయనకు మొదటి బిల్లు కింద రూ.14 లక్షలు వచ్చింది. మరో రూ.1.46 కోట్లు రావాలి. ఒక్కో రోడ్డు పని రూ.50 లక్షలకు పరిమితం చేయడం వల్ల ఇంకా రూ.36 లక్షలే రానుంది. మిగతా రూ.1.10 కోట్ల చెల్లింపులు ఎలా చేస్తారన్నదే ప్రశ్న.

మినహాయింపునకు కేంద్రానికి వినతి

గతేడాది చేసిన మెటీరియల్ పనులకు తాజా నిర్ణయం నుంచి మినహాయింపు ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరే యోచనతో రాష్ట్ర ప్రభుత్వం ఉంది. బిల్లుల చెల్లింపుల్లో తలెత్తిన సమస్యలను రాష్ట్ర అధికారులు ఇప్పటికే కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ దృష్టికి తీసుకెళ్లారు. సీఎం, డిప్యూటీ సీఎంల ద్వారా కేంద్రానికి లేఖ పంపితే సమస్యకు పరిష్కారం లభిస్తుందన్న ఆశాభావంతో ఉన్నారు. కేంద్ర ప్రభుత్వ నిర్ణయం నేపథ్యంలో పల్లె పండగ 2.0లో మెటీరియల్ నిధులతో చేపట్టే పనుల అంచనా విలువ రూ.50 లక్షల్లోపు ఉండేలా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. అలాంటి వాటికే కలెక్టర్లు అనుమతులిస్తున్నారు.

పాడి ప్రగతికి బాటలు

- 'ట్రిపుల్ ఎస్' వీర్యంతో 90% పెయ్య దూడలే
- పాల దిగుబడుల్లో ఏటా 20-30% వృద్ధి

ఈనాడు, అమరావతి, ఈనాడు, కాకినాడ: పాడి రంగం ప్రగతికి బాటలు వేసేలా రాష్ట్రీయ గోకుల్ మిషన్ ద్వారా పెయ్య దూడల ఉత్పత్తి పథకాన్ని ప్రభుత్వం విస్తృతంగా అందుబాటులోకి తెస్తోంది. ఇందుకోసం సెక్స్ సార్టెడ్ సెమెన్ (ట్రిపుల్ ఎస్- లింగ నిర్ధారిత వీర్యం)ను పాడి రైతులకు అందిస్తోంది. ఈ ఇంజెక్షన్ వేయడం ద్వారా ఆవులు, గేదెలు 90 శాతం కచ్చితత్వంతో ఆడ దూడలనే ఈనుతాయి. తద్వారా రెండు, మూడేళ్లలో పాల దిగుబడి భారీగా పెరుగుతుందని పశు సంవర్ధక శాఖ అంచనా వేస్తోంది. పశుగణన-2024 ప్రకారం రాష్ట్రంలో 93.62 లక్షల పాడి పశువులున్నాయి. ఓ దశలో గరిష్ఠంగా 1.08 కోట్ల వరకు ఉండేవి. పోషణ భారం కావడం, మగ దూడల సంతతి పెరగడంతో రైతులు పాడి రంగాన్ని వదిలేస్తున్నారు. ఈ సమస్యను అధిగమించేందుకు ప్రభుత్వం ట్రిపుల్ ఎస్ వినియోగాన్ని పెంచుతోంది. 2029-30 నాటికి 59 లక్షల పెయ్య దూడల ఉత్పత్తిని లక్ష్యంగా పెట్టుకుంది. ప్రస్తుతం రాష్ట్రంలో ఏటా 147 లక్షల టన్నుల పాల ఉత్పత్తి జరుగుతోంది. ఇది ఏటా 20-30 శాతం పెరిగేలా కార్యాచరణ ఉండాలని పశుసంవర్ధక శాఖకు ప్రభుత్వం నిర్దేశించింది.

ట్రిపుల్ ఎస్ తయారీ ఎలాగంటే..?

ప్రస్తుతం ట్రిపుల్ ఎస్ ఇంజెక్షన్‌ను హరియాణాలోని కర్నాల్‌లో ఉన్న ఓ ల్యాబ్‌లో తయారుచేసి, నేషనల్ డెయిరీ డెవలప్‌మెంట్ బోర్డు (ఎన్‌డీడీబీ) ఆధ్వర్యంలో రాష్ట్రానికి పంపిస్తున్నారు. దీన్ని ఇకపై స్థానికంగానే తయారు చేసుకునేలా పశు సంవర్ధక శాఖ ప్రణాళికలు రచిస్తోంది. ఒక పశువు నుంచి 10 ఎంఎల్ వీర్యం సేకరించి, అందులో ఎక్స్, వై క్రోమోజోమ్‌లను వేరుచేస్తారు. ఆడ దూడలను పుట్టించే వై క్రోమోజోమ్‌లతో కూడిన వీర్యాన్ని చిన్నపాటి నాళిక(స్ట్రా)ల్లో 0.25 ఎంఎల్ చొప్పున నింపుతారు. వాటిని లిక్విడ్ నైట్రోజన్‌లో -196 డిగ్రీల వద్ద నిల్వ చేస్తారు. మొదట్లో ఒక్కో డోస్ ధర రూ.1350 కాగా, ప్రభుత్వం వీటిని రూ.500కే అందించేది. ఈ ఏడాది జూన్ నుంచి వాటి విలువ రూ.300కి తగ్గగా, ప్రభుత్వం 50 శాతం రాయితీపై రూ.150కే సరఫరా చేస్తోంది. ఈ ఏడాది నుంచి 10 లక్షల డోస్‌లను ఎన్‌డీడీబీ ద్వారా సమీకరించి రైతు సేవా కేంద్రాల స్థాయిలో అందుబాటులో ఉంచనుంది. ఇప్పటికే కొన్ని జిల్లాల్లో 10 వేల చొప్పున ఇంజెక్షన్లు వినియోగించారు.

★ సాధారణ పద్ధతిలో ఎద ఇంజెక్షన్ చేస్తే పెయ్య దూడలే పుడతాయన్న గ్యారంటీ లేదు. ట్రిపుల్ ఎస్ వీర్యంతో ఆవులు, గేదెలు ఆడ దూడలనే ఈనుతాయన్న ధీమా వచ్చింది. పెయ్య దూడలతో మూణ్నాలుగేళ్లకు రైతులకు పాల ఆదాయం అందుతుంది. పాడి పశువును అమ్మినా రూ.50 వేల నుంచి రూ.75 వేల ధర పలుకుతుంది.

యూట్యూబ్ చూడటంపై ఇంట్లో మా పిల్లలపై ఆంక్షలు

సంస్థ సీఈవో

ఇంటర్నెట్ డెస్క్: పిల్లల్లో సోషల్ మీడియా వ్యసనంపై ప్రముఖ వీడియో స్ట్రీమింగ్ ప్లాట్‌ఫామ్ యూట్యూబ్ సీఈవో నీల్ మోహన్ ఓ ఇంటర్వ్యూలో మాట్లాడారు. సామాజిక మాధ్యమాలను అధికంగా ఉపయోగించడం మంచిది కాదని.. అందుకే తమ పిల్లలను సోషల్ మీడియాకు దూరంగా ఉంచుతామని ఆయన అన్నారు. వారాంతంలో తప్ప మిగిలిన రోజుల్లో యూట్యూబ్ సహా ఇతర సోషల్ మీడియాలకు దూరంగా ఉండాలని తమ పిల్లలపై ఆంక్షలు విధించినట్లు పేర్కొన్నారు. ఈ విషయంలో తాను, తన భార్య చాలా కఠినంగా ఉంటామన్నారు. వారాంతంలో కొన్ని పరిమితులతో వాటిని వాడుకోవడానికి అవకాశం ఇస్తామన్నారు. అంతే కాకుండా పిల్లలు సోషల్ మీడియాను ఎందుకు, ఏ విధంగా ఉపయోగిస్తున్నారనే విషయాలను గమనిస్తుండడం తల్లిదండ్రుల బాధ్యతల్లో ముఖ్యమైనదిగా తాను భావిస్తానన్నారు. పిల్లల అభ్యసనకు, నైతిక విలువలు నేర్చుకోవడానికి ఉపయోగపడే కంటెంట్‌ను సోషల్ మీడియాలో వారికి అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులకు సూచించారు. ఈ ఆలోచనతోనే పిల్లలకు అవసరమైన సమాచారాన్ని అందించే 'యూట్యూబ్ కిడ్స్' యాప్‌ను 2015లో తాము రూపొందించినట్లు తెలిపారు. కాగా నీల్ మోహన్ దంపతులకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు.

బస్సులో 100 మంది ప్రయాణికులు

సీజ్ చేసిన అల్లూరి జిల్లా పోలీసులు



సీజ్ చేసిన బస్సు | బస్‌లో కిక్కిరిసిన ప్రయాణికులు

చింతూరు, న్యూస్‌టుడే: ఒడిశా నుంచి విజయవాడ వెళ్తున్న ప్రైవేటు బస్సులో ప్రయాణికులు పరిమితికి మించి ఉండటంతో అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు పోలీసులు సీజ్ చేశారు. చింతూరు - మారేడుమిల్లి ఘాట్ రోడ్డులో ఇటీవల ఒక ప్రైవేటు బస్సు ప్రమాదానికి గురై 9 మంది మృతి చెందడంతో పోలీసులు నిఘా పెంచారు. శనివారం రాత్రి చేపట్టిన తనిఖీల్లో ఓ బస్సులో 100 మంది ప్రయాణికులు ఉన్నట్లు గుర్తించి, బస్సు సీజ్ చేశామని చింతూరు ఎస్సై రమేశ్ తెలిపారు.

బయోడీగ్రేడబుల్ ప్లేట్లకు ఊ కొడదాం!



వరిపొట్టు, తవుడు, బొప్పాయి పొడి మిశ్రమాన్ని కలిపి తయారుచేసిన ప్లేట్లు, చెంచాలు

ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయంగా కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రీసెర్చ్ సంస్థ సాంకేతిక సహకారంతో వరిపొట్టును ఉపయోగించి బయోడీగ్రేడబుల్ పేపర్ ప్లేట్లు, గ్లాసులు, చెంచాలను తయారు చేస్తున్నారు. పల్నాడు జిల్లా నరసరావుపేటకు చెందిన చైతన్య అనే యువకుడు మరో ఇద్దరితో కలిసి రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక సాయంతో కాకానిలో ఈ తరహా పరిశ్రమను ప్రారంభించారు. ధాన్యం మర ఆడించిన తర్వాత వచ్చే వరిపొట్టు, తవుడు, బొప్పాయి పొడే వీరి ముడి సరకు. ఈ మిశ్రమాన్ని 400 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలో వేడి చేయడం ద్వారా కావాల్సిన వస్తువులను తయారుచేస్తున్నారు. వీటిని ఒకసారి వాడేసిన తర్వాత 90 రోజుల్లో మట్టిలో కలిసిపోతాయని నిర్వాహకులు చెబుతున్నారు. విజయవాడలో నిర్వహిస్తున్న ఏపీ ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఎక్స్‌పో-2025లో వీటిని ప్రదర్శనకు ఉంచారు.

– ఈనాడు, అమరావతి

రెండు కప్పుల కాఫీతో కాలేయానికి మేలు



కాఫీతో కాలేయ కొవ్వు, వాపు ప్రక్రియ తగ్గుముఖం పడతాయి. ఫైబ్రోసిస్ పురోగతి నెమ్మదిస్తుంది. అంతేకాకుండా కాఫీ.. ఇన్సులిన్ సెన్సిటివిటీని పెంచుతుంది. శరీర జీవక్రియలను నియంత్రిస్తుంది. ఈ నేపథ్యంలో కాలేయ సమస్యలు ఉన్నవారు ప్రతిరోజూ రెండు కప్పుల కాఫీ తీసుకోవడంతో ప్రయోజనం పొందవచ్చని అమెరికన్ కాలేజ్ ఆఫ్ గ్యాస్ట్రోఎంటరాలజీ సిఫారసు చేసింది.

– బ్రాండన్ లు, ఇంటర్నల్ మెడిసిన్ వైద్యుడు


ఈనాడు

ఉన్నత విద్యకు సంస్కరణల చికిత్స

ఆర్థికాభివృద్ధిలో ఏ దేశమైనా దూసుకుపోవాలంటే నిపుణ మానవ వనరులు విరివిగా అందుబాటులో ఉండాలి. నవ్యావిష్కరణలతో సమాజం స్థితిగతుల్లో సానుకూల మార్పు తీసుకురాగలిగిన సమర్థత స్థానిక యువతలో ఉండాలి. పటిష్ఠమైన ఆధునిక విద్యావ్యవస్థ ద్వారానే నవతరం అంతటి శక్తియుక్తులను అందిపుచ్చుకోగలుగుతుంది. అలాంటి మేలిమి ఉన్నత విద్యతో యువతరాన్ని సానబట్టడంలో ఇండియా వెనకబడిందన్నది వాస్తవం. దేశీయంగా విశ్వవిద్యాలయ చదువులను యూజీసీ... సాంకేతిక, ఉపాధ్యాయ విద్యలను ఏఐసీటీఈ, ఎన్సీటీఈ పర్యవేక్షిస్తున్నాయి. వివిధ యంత్రాంగాలు వేర్వేరుగా నిర్ణయాలు తీసుకుంటుండటం వల్ల పైస్థాయి చదువుల్లో గందరగోళం నెలకొంటోంది. కాలంచెల్లిన ఈ పద్ధతులను ప్రక్షాళించాలని 2020 జాతీయ విద్యావిధానం సూచించింది. దానికి అనుగుణంగా దేశ ప్రగతికి వెన్నెముక వంటి ఉన్నత విద్యకు నూతన జవసత్వాలందించే లక్ష్యంతో వికసిత భారత్ శిక్షా అధిక్షణ్ బిల్లుకు కేంద్ర కేబినెట్ తాజాగా ఆమోదం తెలిపింది. తద్వారా న్యాయ, వైద్య విద్య మినహా మిగిలిన వాటిని ఒకే సంస్థ పరిధిలోకి తేవాలని సంకల్పించింది. ఉన్నత విద్యారంగ నియంత్రణ, ప్రమాణాల మెరుగుదల, గుర్తింపు తదితరాలపై స్వతంత్ర, సాధికారిక వ్యవస్థలను నెలకొల్పాలని కేంద్రం నిశ్చయించింది. ప్రతిపాదిత శాసన నియమాలు సక్రమంగా అమలైతేనే మెరుగైన ఫలితాలు సిద్ధించి జాతి భవితకు అవి కొత్త వెలుగులద్దుతాయి!

నిబంధనలను వేగంగా పారదర్శకంగా రూపొందించడం, వర్సిటీలూ కాలేజీ చదువుల్లో నాణ్యతనూ జవాబుదారీతనాన్ని పెంచడం, నైపుణ్యాలను అలవరిచే విద్యతో యువతను ఉద్యోగార్హులుగా తీర్చిదిద్దడం కొత్తబిల్లు లక్ష్యాలు. వినసొంపుగా ఉన్న ఈ ఆశయాలన్నీ సాకారం కావాలంటే, క్షేత్రస్థాయిలో రావాల్సిన మార్పులు అనేకమున్నాయి. కాలంతో పాటు మారని పాఠ్యప్రణాళికలు, అధ్యాపకుల కొరత, మౌలిక వసతుల లేమితో దేశీయ వర్సిటీలు కునారిల్లుతున్నాయి. అందువల్లే అంతర్జాతీయ ర్యాంకింగుల్లో అవి వెలాతెలా పోతున్నాయి. నీతిఆయోగ్ లెక్కల ప్రకారం రాష్ట్రస్థాయిలోని పది శాతం వర్సిటీల్లోనే పరిశోధనా సౌకర్యాలున్నాయి. వాటిలో కనీసం 40శాతం అధ్యాపక పోస్టులు ఖాళీగా పడున్నాయి. పార్లమెంటరీ కమిటీ పరిశీలన మేరకు మొన్న జనవరి నాటికి ఐఐటీలు, ఎన్ఐటీలు, ఐఐఎంలు, ఐఐఎస్ఈఆర్‌లు, సెంట్రల్ యూనివర్సిటీల్లో 28శాతం అధ్యాపక పోస్టులు భర్తీకి నోచుకోలేదు. వర్సిటీల పనితీరును దెబ్బతీసే ఇలాంటి సమస్యలను సత్వరం పరిష్కరిస్తేనే- ప్రపంచస్థాయి ఉన్నత చదువులకోసం విదేశాల బాట పట్టే అగత్యం భారతీయ యువతకు తప్పుతుంది!

ఇండియాలో ప్రతి అయిదుగురు ఇంజినీర్లలో ఒకరు, నలుగురు ఏంబీయే పట్టభద్రుల్లో ఒక్కరే ఉద్యోగార్హత కలిగి ఉన్నారని అంచనా! పుట్టగొడుగుల్లా పుట్టుకొచ్చిన చాలా ఇంజినీరింగ్ కాలేజీలు అర్హతలేనివారితో పాఠాలు చెప్పిస్తూ విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్నాయి. నిరుద్యోగుల ఉత్పత్తి కేంద్రాలుగా అవి పరువుమాస్తున్నాయి. వాటిని చక్కదిద్ది యువత ఉజ్జ్వల భవితకు భరోసాగా నిలవడంలో ఏఐసీటీఈ ఘోరంగా విఫలమవుతోంది. విద్యాసంస్థల ప్రమాణాలను మదింపువేసే 'న్యాక్' ధ్రువీకరణ ఎన్నో అవకతవకలతో ప్రహసనంగా మారింది. ఉపాధ్యాయ శిక్షణ సైతం వ్యవస్థాగత లోపాలతో భ్రష్టుపట్టింది. చాలా బీఈడీ కాలేజీలు కనీసం తరగతులు నిర్వహించకుండానే పట్టాలు ప్రదానం చేసేస్తున్నాయి. ఈ అవ్యవస్థను సమూలంగా సంస్కరించడంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నడుమ సమన్వయం, వాటి చిత్తశుద్ధే భారతావని ప్రగతికి చోదకశక్తి కాగలదు!




నీరు నిల్వ ఉంటే పాచి పడుతుంది. ఆరోగ్యకరం కాదు. ప్రవహించే నీరు పరిశుభ్రంగా ఉంటుంది. జీవితం కూడా అంతే. ఉన్నచోటే ఉండకుండా నిరంతర జ్ఞాన సముపార్జనతో మనిషి సుసంపన్నమవుతూ ఉండాలి, ఎదుగుతూ ఉండాలి.

– స్వామి రంగనాథానంద

నిశ్శబ్ద వాహిని

నిశ్శబ్దంగా ఉండటం అపురూపమైన జీవన కళ. మనసులోని ఆందోళనలను, గందరగోళాలను, ఉద్వేగాలను నిలువరించే శక్తి నిశ్శబ్దానికి ఉంది. ప్రపంచంలో అత్యంత పదునైన ఆయుధం నాలుక. దాన్ని వినియోగిస్తూ, అనవసరమైన మాటలు మాట్లాడకుండా వ్యూహాత్మకంగా మౌనాన్ని పాటించడం నిశ్శబ్దం అవుతుంది. ఎప్పుడు, ఎక్కడ, ఎంత, ఎలా మాట్లాడాలో విచక్షణ పాటించాలి. నిశ్శబ్దానికి అపారమైన శక్తి ఉంది. అనవసరంగా మాట్లాడటం వల్ల మనలోని సానుకూల శక్తి వృథా అవుతుంది. సందర్భోచితంగా మాట్లాడటం వల్ల ఎన్నో ప్రయోజనాలు చేకూరుతాయి. నిశ్శబ్దం అంటే కేవలం మాటలు లేకుండా ఉండటం కాదు. మనం మాట్లాడే ప్రతి మాట మంత్రమై భాసించాలి.



అంతర్యామి

నిన్ను నువ్వు తెలుసుకోవడమే అసలైన ఆధ్యాత్మిక చింతన అన్నారు రమణ మహర్షి. నిశ్శబ్దం అనేది మౌనంగా చేసే ధ్యానసాధన లాంటిది. నిశ్శబ్దం శాంతికి సింహద్వారం, అంతర్గత శక్తిని ప్రేరేపించడానికి అదే ఆలంబన అని గౌతమ బుద్ధుడు పేర్కొన్నాడు. ఆ నిశ్శబ్ద వాహిని మన జీవనయానంలో నిరంతరం ప్రవహించాలి. నిశ్శబ్దంగా ఉండటానికి ఎంతో సాధన చేయాలి. మనలో నిత్యం అనేక ఆలోచనలు పరవళ్లు తొక్కుతుంటాయి. ఆ ఆలోచనలను నియంత్రించుకుని, మనసును ఆలోచన రహిత స్థితికి తీసుకురావడం ద్వారా నిశ్శబ్ద మాధుర్యాన్ని ఆస్వాదించవచ్చు.

నిశ్శబ్దంలో దైవ సందేశాన్ని స్పష్టంగా వినవచ్చు. యోగులు, సాధకులు మౌనాన్ని అనుసరిస్తూ ధ్యానస్థితిలోకి వెళ్తారు. వారి అంతరంగ తరంగాల్లో నిశ్శబ్దం పల్లవిస్తుంది. ధ్యానాన్ని ఆశ్రయిస్తూ మనసును శూన్యస్థితికి తెచ్చుకోవాలి. ఆ సందర్భంలో మాటను వీడాలి. నిశ్శబ్దం ప్రకటించాలి. మనసును తెరవాలి. ఆత్మను దర్శించాలి. భావాతీత, రూపరహిత, నామాతీత స్థితే నిశ్శబ్దంతో కూడిన ధ్యానం.

నిశ్శబ్దానికి, మౌనానికి స్పష్టమైన తేడా ఉంది. మౌనంలో మనసు అనేక ఆలోచనలతో కలగాపులగమవుతుంది. అదే నిశ్శబ్దంలో ఎలాంటి భావాలు లేకుండా నిర్వికల్ప, నిరామయ స్థితి మనసును ఆవరించి ఉంటుంది. శబ్దం అనంత ఆకాశ తత్వాన్ని సంకేతిస్తే, నిశ్శబ్దం భగవత్ స్వరూపాన్ని ప్రతిఫలిస్తుంది. మౌనం నుంచి మౌనానికి ప్రవహించడమే నిశ్శబ్దం.

అంతర్గతంగా మౌనాన్ని ఆశ్రయించడమే అసలైన నిశ్శబ్దం. అనవసరంగా మాట్లాడి సమస్యల్లో చిక్కుకోవడం కన్నా నిశ్శబ్దాన్ని ఆశ్రయించి చిత్తశాంతిని అందుకోవడం మిన్న. లోతైన ఆలోచనతో కూడిన క్లుప్తమైన, స్పష్టమైన మాట ఎదుటివారిని ఎంతో ఆకట్టుకుంటుంది. సంపూర్ణంగా మనోవాక్కాయ కర్మలతో మౌనాన్ని ఆశ్రయించడం నిశ్శబ్దానికి ప్రధాన సూత్రం. ఏకాంతంలో నిశ్శబ్దం సాధన చేయడం సాధారణ విషయమే, అయితే సమూహంలో కూడా మౌనాన్ని ఆశ్రయిస్తూ, ఆంతరంగికమైన ప్రశాంతతను ఆస్వాదించడం ఘనతరమైన విషయం. మన లోపలి చీకట్లను ఛేదించే అపురూప కాంతిపుంజం నిశ్శబ్దం. మనలో చేతనత్వాన్ని పెంపొందించుకుని జాగృతితో మనసు చేసే సవ్వడిని ఆలకించాలి. మన చుట్టూ ఉన్న ప్రపంచం శబ్దమయం. ఆ చప్పుళ్లను విడనాడి మనలో నిశ్శబ్దమనే అంకురాన్ని పెంచి పోషిస్తే అది మహా శాంతివృక్షమై నీడనిచ్చి సేద తీరుస్తుంది.

– డాక్టర్ కావూరి రాజేశ్ పటేల్

ఆర్థిక అక్షరాస్యతా అవసరమే!

భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చి ఏడున్నర దశాబ్దాలు దాటింది. ప్రపంచంలో నాలుగో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగానూ ఇండియా అవతరించింది. అయినాసరే చాలామందికి, ముఖ్యంగా యువతకు ఆర్థిక విషయాలపై సరైన అవగాహన(ఆర్థిక సాక్షరత) కొరవడుతోంది. డబ్బుతో కూడిన వ్యవహారాల్లో క్రమశిక్షణ, సహేతుకత అనేవి ఆర్థిక సాక్షరతలో అంతర్భాగం. సామాన్యులు తమ పేరిట తెరిచిన జన్‌ధన్ ఖాతాలను వినియోగించుకోవడం లేదంటే కారణం- వారికి సరైన అవగాహన లేకపోవడమే!

'ఆర్థిక సాక్షరత' అంటే డబ్బు సంపాదించడం, ఖర్చు పెట్టడమే కాదు- ఆర్థిక కార్యకలాపాలను చక్కగా నిర్వహించగలగడం కూడా. సరైన ఆర్థిక అవగాహన ఉన్నవారు బ్యాంకుల్లో డబ్బును పొదుపు చేయడంతో పాటు పనికొచ్చే కార్యక్రమాలకూ వృత్తి వ్యాపారాలకూ రుణాలు తీసుకుని ఎదుగుతారు. తద్వారా ప్రభుత్వానికి పన్నుల రూపేణా ఆదాయమూ సమకూరుతుంది. కానీ, దేశంలో చాలామందికి... విద్యావంతులకు కూడా ఆర్థిక నిర్వహణ గురించి పెద్దగా తెలియదు. కేవలం మూడోవంతు మహిళలకే మదుపుచేసే అలవాటు ఉంది. జన్‌ధన్ ఖాతాలు ఉన్నా, చాలామంది వాటిని వినియోగించడం లేదు. తల్లిదండ్రులు, విద్యాసంస్థలు కూడా పిల్లలకు ఆర్థిక సాక్షరతను అలవర్చేందుకు అంతగా ప్రయత్నించడం లేదు. ఈ పరిస్థితిని మార్చాల్సిన అవసరముంది.



అవగాహనతో పురోగతి...

కేంద్ర ప్రభుత్వం 2047 నాటికల్లా 'వికసిత భారత్'ను సాధించాలనే లక్ష్యాన్ని నిర్దేశించుకుంది. తెలుగు రాష్ట్రాలు సైతం ఆ దిశగా ప్రణాళికాబద్ధంగా ముందడుగు వేస్తున్నాయి. ఆంధ్రప్రదేశ్ 2.4లక్షల కోట్ల డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఎదగాలని లక్షిస్తుంటే, తెలంగాణ మూడు లక్షల కోట్ల డాలర్లపై గురిపెట్టింది. ఏపీ తలసరి ఆదాయాన్ని 43వేల డాలర్లకు పెంచాలని ఆశిస్తుంటే, తెలంగాణ ఏమో కోటి కుటుంబాలను కోటీశ్వరులను చేయాలని భావిస్తోంది. పేదరిక నిర్మూలనకు ఏపీ 'పీ-4' పథకంతో ముందుకు సాగుతోంది. ఈ లక్ష్యాలను సాధించడానికి పెట్టుబడులు, మౌలిక వసతులు సమకూర్చుకోవడంతోపాటు ప్రజలకు ఆర్థిక సాక్షరతను అలవరచడమూ ఎంతో ముఖ్యం. నేటి కాలంలో ప్రజల అవసరాలు పెరిగాయి. దీర్ఘకాలంలో వాటిని తీర్చుకోవడానికి పొదుపు-మదుపు ముఖ్యం. కాబట్టి ఆర్థిక మోసాల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, రిస్కును సరిగ్గా అంచనావేస్తూ మదుపు చేయడం గురించి వారికి తెలియజెప్పాలి. ఎలాంటి పద్ధతులను అనుసరించాలి, ఏయే పథకాల్లో చేరాలి అనేది సామాన్యులకు వివరించాలి. స్టాక్ మార్కెట్లు, ప్రభుత్వ పథకాలు, సంపదను వృద్ధి చేసుకునే మార్గాల గురించీ తెలియజెప్పాలి. ఇదంతా ఆర్థిక సాక్షరతలో భాగమే.

సుమారు 80శాతం మంది అక్షరాస్యులు ఉన్న భారతదేశంలో 75 శాతం మంది వయోజనులకు ఆర్థిక అంశాలపై సరైన అవగాహన లేదనీ; మరీ ముఖ్యంగా 80శాతం మహిళలకు బొత్తిగా ఆర్థిక సాక్షరత లేదని స్టాండర్డ్ అండ్ పూర్స్ నివేదిక వెల్లడించింది. ఆర్థిక సంస్థలు అందించే పొదుపు, మదుపు, రుణ, బీమా పథకాల గురించి సమాజంలోని అన్ని వర్గాలకూ అవగాహన ఉండటం ముఖ్యమని రిజర్వు బ్యాంకు పేర్కొంది. అందునా అల్పాదాయ, బలహీన వర్గాలకు వీటిపై అవగాహన పెంచడంతో పాటు స్వల్ప వడ్డీపై రుణాలిచ్చి వారి ఆర్థిక పురోగతికి చేయూతనివ్వాలని రంగరాజన్ కమిటీ గతంలోనే కేంద్ర ప్రభుత్వానికి సిఫార్సు చేసింది. నగరాలు, పట్టణాల్లో పొదుపు, పెట్టుబడి, బ్యాంకింగ్ గురించి అవగాహన ఉన్న తల్లిదండ్రులు తమ పిల్లలకు బ్యాంకు ఖాతాలు తెరిచి చిన్ననాటి నుంచే వారితో చిన్న చిన్న మొత్తాలను పొదుపు చేయిస్తున్నారు. కిడ్డీ బ్యాంక్, జూనియర్స్ అకౌంట్ వంటి వాటిని ఇక్కడ ప్రస్తావించాలి. చిన్న పట్టణాలు, పల్లెలు, ఆదివాసీ ప్రాంతాల్లో ఇలాంటి పరిస్థితి కనిపించడం లేదు. ఈ అంతరాన్ని వెంటనే సరిదిద్దాలి.

పదేళ్ల వయసు నిండి, 6-10 తరగతుల్లో ఉన్న విద్యార్థులంతా బ్యాంకుల్లో పొదుపు ఖాతాలు తెరిచేలా చర్యలు తీసుకోవాలి. వారికి లభించే ఉపకార వేతనాలు, వేర్వేరు ప్రభుత్వ పథకాల ద్వారా అందే నగదు ప్రయోజనాలను వాటిలోనే జమ చేయాలి. పొదుపు-మదుపు ఎంత ముఖ్యమో వారికి అర్థమయ్యేలా తెలియజెప్పాలి. మరో అయిదేళ్లలో అందరికీ నాణ్యమైన విద్యను అందించాలని ఐక్యరాజ్య సమితి నిర్దేశించిన నాలుగో సుస్థిరాభివృద్ధి లక్ష్యం చెబుతోంది. అందులో భాగంగానే పాఠశాల, కళాశాల విద్యార్థులకు ఆర్థిక సాక్షరత అలవరచాలి. కేంద్రం నెలకొల్పిన జాతీయ ఆర్థిక విద్యా కేంద్రం(ఎన్‌సీఎఫ్ఈ) ఆర్థిక సాక్షరతను పెంపొందించడానికి కృషి చేస్తోంది. దీనికి రిజర్వు బ్యాంకుతో పాటు సెబీ, బీమా నియంత్రణ సంస్థ ఐఆర్‌డీఏఐ, పింఛన్ నియంత్రణ సంస్థల దన్ను ఉంది.

బాల్యం నుంచే నేర్పించాలి...

ఎన్‌సీఎఫ్ఈ 2019లో నిర్వహించిన సర్వేలో పలు ఆసక్తికర అంశాలు వెలుగులోకి వచ్చాయి. దేశంలో ఆర్థిక సాక్షరత 27శాతం ఉంటే, మహిళల్లో అది 21శాతమేనని తేలింది. సూక్ష్మ, చిన్న, మధ్యతరహా(ఎంఎస్ఎంఈ) పరిశ్రమల్లో స్త్రీలు 20శాతమే ఉన్నట్లు గుర్తించారు. పేద, బలహీన వర్గాలకు ఆర్థిక సాక్షరత ఉంటే... ప్రభుత్వం నుంచి నేరుగా సాయం పొందడమెలాగో వారికి అర్థమవుతుంది. తద్వారా అట్టడుగు వర్గాల అభ్యున్నతి కోసం ఉద్దేశించిన పథకాలు, ఆర్థిక సేవలు మరింతగా విస్తరిస్తాయి. క్రమంగా పెట్టుబడులు, ఉపాధి అవకాశాలతో పాటు ఆర్థిక కార్యకలాపాల్లో మహిళల భాగస్వామ్యమూ పెరుగుతుంది. వికసిత భారతం, స్వర్ణాంధ్ర, తెలంగాణ రైజింగ్ సంకల్పాలు సాకారమవ్వాలంటే సమాజంలోని అన్ని వర్గాలనూ ఆర్థిక వ్యవస్థలో భాగస్వాములను చేయాలి. తెలుగు రాష్ట్రాల్లో ఆర్థిక సాక్షరత సాధనకు ప్రత్యేక సంస్థల ఏర్పాటు అత్యావశ్యకం. వాటి ఆధ్వర్యంలో విద్యా, వ్యవసాయ, కార్మిక శాఖలు... రైతు సంఘాలు, నెహ్రూ యువకేంద్రాలు కలిసికట్టుగా ఆర్థిక సాక్షరత సాధనకు కృషి చేయాలి. రిజర్వు బ్యాంకు, నాబార్డ్‌ల సహకారాన్నీ తీసుకోవాలి. ప్రభుత్వాలు 'నేటి బాలలే రేపటి పౌరుల'ని గుర్తుంచుకుని, వారిని ఇప్పటి నుంచే వికసిత భారత్ సాధనలో భాగస్వాములను చేయాలి.



డాక్టర్ కరణం మదన్ కుమార్
ది ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోషల్ ఆడిటర్స్ ఆఫ్ ఇండియా సభ్యులు



అలాంటి ఫ్రెండ్స్... మీకున్నారా?

మంచి స్నేహితులను ఎంచుకోవాలని పిల్లలకు తల్లిదండ్రులు చెబుతుంటారు. నిజానికి ఆ వయసులో ఎవరు మంచో ఎవరు కాదో అర్థం కాదు. పాఠశాల నుంచి కళాశాల స్థాయికి ఎదిగే క్రమంలో మంచీ చెడుల పట్ల కొంత అవగాహన పెరుగుతుంది. మనకు తెలియకుండా మనమే మనలాగా ఆలోచించే వారికి దగ్గరగా, వ్యతిరేక భావజాలం ఉన్నవారికి దూరంగా జరగడం ప్రారంభిస్తాం. ఇద్దరు వ్యక్తుల మధ్య మైత్రికి రెండువైపుల నుంచి సమ ప్రాధాన్యం లభిస్తేనే అది విడదీయరాని బంధమవుతుంది. అయితే ఈరోజుల్లో ఇలాంటి గాఢమైన మైత్రీబంధాలు అరుదుగా మాత్రమే కనిపిస్తున్నాయి.

మనకు పరిచయస్తులు ఎక్కువగానే ఉంటున్నారు కానీ, 'స్నేహితులే' తక్కువగా ఉంటున్నారు. ఆ మధ్య అమెరికాలో ఈ స్నేహాల మీద చాలా అధ్యయనాలు జరిగాయి. మిత్రులు తగ్గిపోయి, ఒంటరితనంతో బాధపడుతున్న వారి సంఖ్య విపరీతంగా పెరుగుతున్నట్లు ఈ అధ్యయనాలు తేల్చాయి. ఒంటరితనం వ్యక్తుల మానసిక, శారీరక ఆరోగ్యాల మీద, సామాజిక జీవితం మీద ఎన్నో దుష్ప్రభావాలు చూపుతుంది. అది తెలుసుకున్న స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీ పరిశోధకులు ఆరోగ్యకరమైన స్నేహాలను ఎలా పెంచుకోవాలో చెబుతూ ఒక కోర్సును కూడా అందిస్తున్నారు. ఇది చాలదూ నిజమైన స్నేహాల అవసరం ఎంత ఉందో చెప్పడానికి?

స్నేహానికి ఆరోగ్యకరమైన సంభాషణ పునాది వేస్తుంది. ఇందులో వినడం, మాట్లాడటం రెండింటికీ సమప్రాధాన్యం ఉండాలి. సంభాషణను వాగ్వాదంగా మార్చకుండా చర్చగా మాత్రమే కొనసాగించగలగాలి. నేటి సమాజంలో భావోద్వేగాలను అదుపులో ఉంచుకోవడం క్లిష్టమైన సమస్యగా మారింది. సహానుభూతితో కూడిన స్నేహం అందుకు దోహదపడుతుంది. ఒకప్పుడు కలం స్నేహాల్లో వ్యక్తుల మధ్య అరమరికలు లేకుండా అభిప్రాయాలను పంచుకునేవారు. సాంకేతికత పెరిగి, సామాజిక మాధ్యమాలు అందుబాటులోకి వచ్చాక అపరిచితులతో కొత్త స్నేహాలు ఏర్పడుతున్నాయి. కలం స్నేహంలో కూడా అటువంటివే ఏర్పడినా మోసాలు, బ్లాక్‌మెయిలింగ్ లాంటి వాటికి తావుండేది కాదు. కానీ ఇప్పటి స్నేహాలు అంత నమ్మశక్యమైనవిగా ఉండటం లేదని జరుగుతున్న సంఘటనలు తెలియజేస్తున్నాయి.

ఆరోగ్యకరమైన స్నేహానికి ఎనిమిది ప్రధానమైన అంశాలు తోడ్పడతాయి. పరస్పర నమ్మకం కలిగి ఉండాలి. అవసరమైన సందర్భాల్లో ఇచ్చిపుచ్చుకునే ధోరణి ప్రదర్శించాలి. అభిప్రాయాలనూ ఆలోచనలనూ స్పష్టంగా వ్యక్తీకరించాలి. ఒకరినొకరు గౌరవించుకుంటూ, స్నేహబంధంలోనూ ఎవరి స్పేస్ వారికి ఇవ్వాలని తెలుసుకుని ప్రవర్తించాలి. దయా సానుభూతి కలిగి ఉండాలి. అభిప్రాయ భేదాలు వచ్చినప్పుడు సంయమనంతో వ్యవహరించాలి. బయటి నుంచి ఎదురైన సమస్యలను కలిసి పరిష్కరించుకోవాలి. చివరిది అన్నింటికన్నా ముఖ్యమైనది ఏ స్నేహమైనా హానికరంగా తయారైనప్పుడు దాన్ని వదులుకోవడానికి సిద్ధంగా ఉండాలి. శ్రీశ్రీ అన్నట్లు- నిన్ను నిన్నుగా ప్రేమించడానికే కాదు స్నేహించడానికి కూడా ఒకరు ఉండటం మహద్భాగ్యమే!

– బండ్ల మాధవరావు

మారణహోమం



(ఆధారం: ఉప్పల కాన్‌ఫ్లిక్ట్ డాటా ప్రోగ్రామ్-2025)

రూపాయి క్షీణత ఎంతదాకా?

డాలర్‌తో రూపాయి మారకం విలువ మునుపెన్నడూ లేనంతగా 90 రూపాయలకు పడిపోయింది. దీనివల్ల దేశార్థికంపై ప్రతికూల ప్రభావం ప్రసరిస్తుందన్న ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఇదెంతవరకూ నిజం? రూపాయిని మనమెలా బలోపేతం చేసుకోగలం?

భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చినప్పుడు అమెరికా డాలర్‌తో రూపాయి మారకం విలువ 3.30 రూపాయలు. 1991లో ఆర్థిక సంస్కరణలు వచ్చిన తరవాత రూపాయి తన విలువను వేగంగా కోల్పోయింది. నిరుడు 83 రూపాయల దగ్గర కొనసాగిన రూపాయి విలువ- ఇప్పుడు 90రూపాయలకు పడిపోవడం ఆర్థికవేత్తలను విస్మయపరుస్తోంది. సర్కారీ వర్గాలు మాత్రం ఆందోళనేమీ అక్కర్లేదని ధీమా వ్యక్తం చేస్తున్నాయి. డాలర్ బలపడటం వల్లే రూపాయి మారకపు విలువ తగ్గిందిగానీ, రూపాయి బలహీనపడలేదని ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ వ్యాఖ్యానించారు.

ఒత్తిడి ఎందుకు పెరుగుతోంది?

ఆసియాలోని మిగతా దేశాలతో పోలిస్తే మన రూపాయే ఎక్కువగా ప్రభావితమవుతుంటుంది. ఇందుకు ప్రధాన కారణం- అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీసుకుంటున్న వాణిజ్య నిర్ణయాలూ, ప్రతీకార సుంకాలే. మరోవైపు డాలర్ బలోపేతానికి అమెరికా ఫెడరల్ రిజర్వ్ కూడా కొన్ని చర్యలు తీసుకుంటోంది. న్యూదిల్లీ-వాషింగ్టన్ వాణిజ్య చర్చల్లో ప్రతిష్టంభన ఏర్పడటం, భారతీయ ఎగుమతులపై అగ్రరాజ్యం 50శాతం సుంకాలు విధించడం... విదేశీ మదుపరులు 17బిలియన్ డాలర్ల దాకా పెట్టుబడులను వెనక్కి తీసుకోవడం, డాలర్ కొనుగోలుకు మదుపరులు ఎగబడటం వంటి వరుస పరిణామాలతో డాలర్‌కు డిమాండ్ పెరిగింది. దాంతో రూపాయి మారకం విలువ పడిపోయింది.

ఇప్పుడు రూపాయి క్షీణించడం గురించి భిన్న వాదనలు, రాజకీయ విమర్శలెన్నో వినిపిస్తున్నాయి. వాటిని పక్కనపెడితే, రూపాయి విలువ పతనం ఇప్పటికిప్పుడు ఆర్థిక వ్యవస్థపై తీవ్రమైన ప్రతికూల ప్రభావమేదీ చూపకపోవచ్చు. కానీ, దీనివల్ల దీర్ఘకాలంలో లాభాల కంటే నష్టాలే ఎక్కువగా ఉంటాయన్న సూచనలైతే కనిపిస్తున్నాయి. ఎగుమతులను ప్రోత్సహించడానికి ప్రభుత్వమే స్వచ్ఛందంగా రూపాయి విలువను తగ్గిస్తే(డీవాల్యుయేషన్) కొన్ని రంగాల్లో అనుకూల ఫలితాలు వస్తాయి. 1966లో ద్రవ్యోల్బణాన్ని తగ్గించడానికీ, 1991లో విదేశీ మారకద్రవ్య నిల్వల లోటును అధిగమించడానికీ ఇలాగే చేశారు. ఇప్పుడు మార్కెట్ శక్తుల ప్రభావం వల్ల రూపాయి విలువ పతనమవుతోంది కాబట్టి- ప్రతికూల ఫలితాలే ఎక్కువగా రావచ్చు.



జేపీ మోర్గాన్ ఇండియా చీఫ్ సాజిత్ చినోయ్ చెబుతున్నట్లు- ప్రపంచవ్యాప్తంగా భారతీయ వస్తువులు చౌకగా మారడానికీ, దిగుమతులు భారంగా మారి దేశీయ తయారీదారులకు తోడ్పడటానికీ, ఉద్యోగాల సృష్టికీ, చైనా వస్తువులకు అడ్డుకట్ట వేయడానికీ రూపాయి విలువ తగ్గడం కొంతవరకు ఉపయోగపడుతుంది. కానీ, ఇదంతా పరిమితంగానే ఉంటుంది. ఆర్థిక పరిభాషలో చెప్పాలంటే- రూపాయి విలువ తగ్గినప్పుడు ధరలు పెరుగుతాయి. అంటే, ద్రవ్యోల్బణం ఏర్పడుతుంది. దానివల్ల ప్రజల కొనుగోలుశక్తి, వస్తువులకు డిమాండ్ తగ్గిపోతుంది. పెట్టుబడులూ ఉద్యోగావకాశాలూ తగ్గిపోతాయి. అయితే, ప్రభుత్వం ఇటీవల జీఎస్టీ శ్లాబులు తగ్గించడం, ఆర్‌బీఐ ద్రవ్య విధానం పరిస్థితిని కొంతవరకు సరిదిద్దగలుగుతాయి. సహజంగా రూపాయి విలువ క్షీణత ఎగుమతులను ప్రోత్సహించి, దిగుమతులను నిరుత్సాహపరుస్తుంది. దీనివల్ల విదేశీ మారక ద్రవ్య నిల్వల్లో అనుకూలత ఏర్పడుతుంది. కానీ, ట్రంప్ సుంకాల పెంపు వల్ల రూపాయి విలువ తగ్గినా, ఎగుమతుల రంగంలో రావాల్సిన అనుకూలత రాకుండా పోయే ప్రమాదముంది. ఇండియా 85శాతానికి పైగా చమురు, 60శాతం వంట నూనెలతో పాటు ఎలక్ట్రానిక్ వస్తువులు, ఎరువులు, రసాయనాలు, యంత్రాలు వంటి వాటిని ఇతర దేశాల నుంచి దిగుమతి చేసుకుంటోంది. ఇప్పుడు రూపాయి విలువ క్షీణించడం వల్ల వీటి ధరలు పెరగవచ్చు. ద్రవ్యోల్బణం తరహా పరిస్థితులు రవాణా వ్యవస్థపైనా, తద్వారా దేశార్థికంపైనా ప్రతికూల ప్రభావం చూపవచ్చు.

మన కరెన్సీ బలపడే మార్గమేంటి?

రూపాయి విలువ పతనాన్ని అడ్డుకోవడానికి రిజర్వుబ్యాంకు చేపట్టే వడ్డీ రేట్ల పెంపు, ఓపెన్ మార్కెట్ ఆపరేషన్ వంటి చర్యలు తాత్కాలిక ఉపశమనం కలిగిస్తాయి. అయితే, విదేశీ మదుపరుల్లో విశ్వాసం కలిగించడం, దిగుమతులను తగ్గించుకోవడం, దేశీయ ఉత్పత్తులకు గిరాకీ పెంచడం, రష్యా సహా ఇతర భాగస్వామ్య దేశాలతో సొంత కరెన్సీలో వ్యాపారం చేయడం, పోర్ట్‌ఫోలియో పెట్టుబడులను ఆకర్షించడం వంటివి ఎంతైనా అవసరం. విదేశీ మారకద్రవ్య నిల్వలనూ...పొదుపు-మదుపు- వినియోగాన్ని పెంచడం ద్వారా దేశార్థికాన్నీ, రూపాయినీ బలోపేతం చేసుకోవడంపై దృష్టి సారించాలి. భవిష్యత్తులో భారత్ గణనీయమైన వృద్ధిరేటును సాధించి, ప్రపంచంలోనే మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించినా- రూపాయి విలువను మార్కెట్ శక్తులే నిర్ణయిస్తాయని గుర్తుంచుకోవాలి!

– డాక్టర్ తిరునహరి శేషు, ఆర్థిక నిపుణులు

ఓహోయ్! బుజ్జీ!!

ఆలోచన మారాలి..!


వెంకటాపురంలో ఉండే రంగయ్య ఊరికి దగ్గర్లోని నదిలో చేపలు పడుతూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. అదే ఊళ్లో సోమయ్య అని మరో వ్యక్తి ఉండేవాడు. అనుకోకుండా ఒకసారి వ్యాపారంలో నష్టాలు రావడంతో ఆస్తులన్నీ కోల్పోయాడు. అప్పుడు అతను రంగయ్య ఇంటి పక్కనే ఒక ఇల్లు అద్దెకు తీసుకుని ఉండసాగాడు. ఏం చేయాలో తోచక కొన్నిరోజులు ఖాళీగానే ఉన్నాడతను. తరవాత రంగయ్యతో పాటు చేపల వేటకు వెళ్లడం అలవాటు చేసుకున్నాడు. రోజూ ఇద్దరూ కలిసి ఉదయాన్నే బయలుదేరేవారు. సాయంత్రానికి కొంత డబ్బుతో తిరిగి వచ్చేవాళ్లు. సోమయ్య రోజూ వచ్చిన డబ్బులో కొంత ఖర్చుపెట్టుకుని మిగతావి దాచుకునేవాడు. కొన్ని రోజుల తరవాత తన దగ్గరున్న డబ్బుతో కొత్త వలలు తీసుకుని ఇద్దరు మనుషులనూ పెట్టుకున్నాడు. రంగయ్య మాత్రం ఏరోజు డబ్బు ఆరోజే ఖర్చు పెట్టేవాడు.

ప్రతిరోజులానే రంగయ్య ఒక్కడే వేటకు బయలుదేరాడు. సోమయ్య తనతోపాటు ఆ ఇద్దరినీ కూడా తీసుకెళ్లాడు. రంగయ్య ఎప్పటిలాగే కొన్ని చేపలు పట్టుకొని వెళ్లాడు. సోమయ్య.. వాళ్లిద్దరితో కలిసి బోలెడు చేపలు పట్టాడు. దాంతో ఎక్కువ డబ్బు సంపాదించాడు.



రోజులు గడుస్తున్నకొద్దీ అతను మెల్లగా చేపలు పట్టడం, అమ్మడానికి మనుషులను ఇంకా పెట్టుకుంటూ, మళ్లీ చేపల వ్యాపారం చేయసాగాడు. కానీ రంగయ్య మాత్రం ఎప్పటిలా ఒకేలా బతికేస్తున్నాడు. సోమయ్య తనతో పాటు చేపలు పట్టడానికి రాకముందు రంగయ్య ఎలా ఉన్నాడో, ఇప్పటికీ అలాగే ఉండిపోయాడు. కాస్త కష్టమైనా పరిస్థితులకు తగ్గట్టుగా ఆలోచనా విధానాన్ని, పని తీరునూ మార్చుకుంటూ ముందుకెళ్లిన సోమయ్య మళ్లీ విజయం సాధించాడు. సంపాదించిందంతా ఎప్పటికప్పుడు ఖర్చు పెట్టుకుంటూ ఉన్న రంగయ్య.. రేపటి కోసం ఏమీ కూడబెట్టుకోలేకపోయాడు. అందుకే అంటారు పెద్దవాళ్లు.. నాలుగు రూపాయలు సంపాదిస్తే రెండు దాచుకుని, భవిష్యత్తు గురించి ఆలోచించాలని!

– చిట్టంపల్లి అంజలి



ఈనాడు
అమరావతి
ఎన్టీఆర్
సోమవారం డిసెంబరు 15, 2025

మదిలో దుర్గమ్మ.. ఇరుముడి తెస్తిమమ్మ






భవానీ దీక్షల విరమణ సందర్భంగా ఇంద్రకీలాద్రి ఆదివారం కిటకిటలాడింది. భారీ సంఖ్యలో భవానీలు తరలివచ్చి దుర్గమ్మకు ఇరుముడి సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. నాలుగు రోజుల్లో 3.75 లక్షల మంది వచ్చారని అధికారులు తెలిపారు. సోమవారం వేడుకలు ముగుస్తాయి. - ఈనాడు, అమరావతి

రాత్రి 11 గంటలయినా భక్తులతో కిటకిట

సూక్ష్మ కళ.. రూపు భళా..





ఆవగింజలతో శివుడు

దివ్యాంగుడైన అనకాపల్లి జిల్లా తూటిపాల గ్రామానికి చెందిన **బోడసపర్తి రవికుమార్** అనే సూక్ష్మ చిత్రకారుడు విజయవాడలో ఆదివారం ఏర్పాటు చేసిన చిత్రకళా సంతలో ప్రదర్శించిన చిత్రాలు సందర్శకులను ఆకట్టుకున్నాయి. తోటకూర, ఆవ, దోస గింజలు తదితరాలతో రూపొందించిన చిత్రాలు కనువిందు చేశాయి. ముఖ్యంగా భగవద్గీతలో 700 శ్లోకాలను 23,801 దోసగింజలను ఉపయోగించి ఒక్కో గింజపై ఒక్కో అక్షరం రాశారు. అంతేకాకుండా భగవద్గీతను అంగుళం సైజు పుస్తకంలో కూడా లిఖించారు. ఇవేకాకుండా పరమశివుడు, ఎన్టీఆర్, భారతదేశం, రైతు, సీఎం చంద్రబాబునాయుడు, రామోజీ గ్రూప్ సంస్థల ఛైర్మన్ రామోజీరావు తదితర చిత్రాలను ఆవ, తోటకూర గింజలతో రూపొందించడం విశేషం. **- ఈనాడు, అమరావతి**

ఇంధన పొదుపుపై అవగాహన ర్యాలీ నేడు

సూర్యారావుపేట, న్యూస్‌టుడే : జాతీయ ఇంధన పొదుపు, సంరక్షణ దినోత్సవం సందర్భంగా డిసెంబరు 12 వరకు వారోత్సవాలు నిర్వహిస్తున్నారు. సోమవారం ఉదయం 9 గంటలకు ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ప్రదర్శన ప్రారంభమవుతుంది. కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం వరకు ఏపీ స్టేట్ ఎనర్జీ కన్సర్వేషన్ మిషన్ ఆధ్వర్యంలో విద్యుత్తు పొదుపు, ఇంధన వనరుల సంరక్షణపై భారీ ప్రదర్శన నిర్వహిస్తారు. కలెక్టర్ జి.లక్ష్మీశ, ఏపీ జెన్‌కో ఎండీ ఎస్.నాగలక్ష్మి, ఏపీసీపీడీసీఎల్ డైరెక్టర్ టి.వి.ఎస్.ఎన్.మూర్తి తదితరులు జెండా ఊపి ప్రారంభిస్తారు. ఏపీసీపీడీసీఎల్ ఎస్‌ఈ హనుమయ్య తన కార్యాలయం నుంచి అధికారులు, ఉద్యోగులతో కలిసి ప్రదర్శనగా కలెక్టర్ క్యాంపు కార్యాలయానికి చేరుకుంటారు. అనంతరం ఇందిరాగాంధీ స్టేడియంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఇంధన పొదుపు, పరిరక్షణకు తీసుకోవాల్సిన చర్యల గురించి అతిథులు ప్రసంగిస్తారు.

రూ.లక్షలు వెచ్చిస్తే.. కోట్లు వస్తాయ్!

శిథిల దుకాణసముదాయాలు చక్కదిద్దితే ఆదాయం

ఈనాడు, అమరావతి

'**వి**జయవాడ నగరపాలికకు.. కీలక ప్రాంతాల్లో రూ.వందల కోట్ల విలువైన స్థలాలున్నాయి. వీటిని సరిగ్గా వినియోగిస్తే.. భారీగా ఆదాయం సమకూరుతుంది. వీటిలో దశాబ్దాల నాటి పురాతన దుకాణ సముదాయాలు ఉన్నాయి. ఇక్కడ ప్రైవేటు దుకాణాలు, కార్యాలయాల అద్దెలు ఆకాశంలో ఉండగా.. ఇవి మాత్రం పాడుబడి.. కూలేలా ఉన్నాయి. వీటిని ఆధునికీకరిస్తామని.. ఏళ్లుగా చెప్పడమే తప్ప.. ఆచరణ ఊసేలేదు.'' గాంధీనగర్‌లో రాజగోపాలాచారి మున్సిపల్ మార్కెట్ సముదాయం 80 సెంట్లలో ఉంది. వైకాపా హయాంలో కూలగొట్టి.. కొత్తగా కట్టాలని నిర్ణయించారు. సగం కూలగొట్టే సమయానికి.. నేతలు అడ్డుకోగా.. ఆధునికీకరణ ఆగింది. నాటి నుంచి.. ఈ దుకాణ నిర్వాహకులు చాలామంది అద్దెలే చెల్లించడం లేదు. వీరికి ప్రస్తుత పాలకవర్గమైన వైకాపా నేతలు అండ ఉంది.

విలువైన ప్రాంతాల్లో..

63 వాణిజ్య సముదాయాల్లో... 4000 దుకాణాలున్నా.. ఏటా రూ.22 కోట్ల ఆదాయమే వస్తోంది. వస్త్రలత, కాళేశ్వరరావు మార్కెట్, ఎన్టీఆర్ కాంప్లెక్స్, ఇందిరాగాంధీ స్టేడియం ఆనుకుని ఉన్న దుకాణాలకు భారీగా డిమాండ్ ఉంది. ఇవన్నీ అత్యంత ఖరీదైన ప్రాంతాల్లోనే ఉన్నా.. అద్దెలు అరకొరే వస్తున్నాయి. ఆధునికీకరిస్తే.. కనీసం నాలుగైదు రెట్లు ఆదాయం పెరుగుతుంది.

ఐదేళ్లు విచ్చలవిడితనం.. వైకాపా హయాంలో ఐదేళ్లు నేతలు విచ్చలవిడిగా ఈ దుకాణాలను కేటాయించుకున్నారు. తమకు డబ్బులు ఎవరు ఎక్కువ ఇస్తే.. వాళ్లకే ఇచ్చుకున్నారు. భారీగా చెల్లించాల్సిన గుడ్‌విల్‌కు కూడా గండికొట్టారు. రూ.30 లక్షల వరకూ గుడ్‌విల్ ఉంటే.. రూ.5 లక్షలకు తగ్గించేశారు. సగం వైకాపా నేతలు, మిగతాది పాడుకున్న వాళ్లు లబ్ధిపొందారు. టెండర్లు కూడా చాలా దుకాణాలకు పిలవలేదు. ఖాళీ అయితే.. సీల్డ్‌కవర్, బహిరంగ వేలంలో ఎవరు ఎక్కువకు పాడితే వాళ్లకే ఇవ్వాలి. కానీ.. ఇవేవీ అమలు జరగలేదు.



రాజగోపాలాచారి మున్సిపల్ మార్కెట్‌లో పాడుబడిన దుకాణాలు

అభివృద్ధికి ప్రణాళికలు..

- ఎ.శ్రీధర్, ఎస్టేట్ ఆఫీసర్

నగరంలో దుకాణ సముదాయాలను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు సిద్ధమవుతున్నాయి. అన్ని ప్రాంతాల్లో ఉండే దుకాణ సముదాయాలను ఆధునికీకరించి.. పాలికకు ఆదాయాన్ని పెంచేలా రాష్ట్ర ప్రభుత్వం కూడా ప్రత్యేక చర్యలు చేపడుతోంది.

రామయ్య.. కుడివైపునే సీతమ్మ



హనుమాన్‌జంక్షన్ కూడలిలోని రామాలయానికి ఓ ప్రత్యేకత ఉంది. ఇక్కడ స్వామి వారు సీతమ్మ సహితంగా కొలువుదీరి శ్రీసీతారామచంద్రుడిగా నిత్యం పూజలందుకుంటారు. ఇందులో వింతేముంది? అంటారా, కానీ ఇక్కడ మాత్రం సీతమ్మ వారు శ్రీరాముడికి కుడివైపున కొలువుదీరి ఉంటారు. దాదాపుగా ఏ గుడిలోనైనా అమ్మవారు రాముడికి ఎడమ వైపున ఉండేలా విగ్రహ ప్రతిష్ఠ చేస్తారు. కానీ జంక్షన్‌లో మాత్రం కుడివైపున అమ్మవారు దర్శనమిస్తుంటారు. పదేళ్ల కిందట లారీ ఢీకొట్టడంతో పాత ఆలయం పూర్తిగా నేలమట్టం అయింది. అప్పట్లో ఉన్న పాలరాతి విగ్రహాలు కూడా ధ్వంసమయ్యాయి. దాతల సాయంతో వెంటనే ప్రస్తుతం ఉన్న దేవాలయాన్ని నిర్మించగా, కొత్తగా ప్రతిష్ఠించిన నల్లరాతి విగ్రహాలను కూడా పాత తరహాలోనే ఏర్పాటు చేయడం గమనార్హం. – న్యూస్‌టుడే, హనుమాన్‌జంక్షన్

బావి తరాలకు బతుకు తరువై



గ్రామాల్లో ప్రజలకు తాగునీరు అందించే వనరుల్లో బావులు కీలకం. ఇప్పటికీ ఆ నీటినే తాగడానికి వినియోగిస్తుంటారు. అయితే కాలక్రమంలో వాటి నిర్వహణను పట్టించుకోకపోవడంతో చాలా చోట్ల పాడవుతున్నాయి. అలా ఉన్న బావిని కుండీగా చేసుకుని ఎదిగిన ఈ చెట్టును అందరూ ఆసక్తిగా తిలకిస్తున్నారు. పెడన మండలం చేవేంద్రపాలెం గ్రామంలో రహదారి పక్కన ఉన్న తాగునీటి బావిలో చెట్టు ఎదిగింది. బావి పాడైపోవడంతో నీటి అవసరాల కోసం సమీపంలో మరొకటి తవ్వారు. అయితే అలంకార ప్రాయంగా ఉన్న బావి.. ప్రస్తుతం ఆ వృక్షానికి ఆసరాగా నిలిచి అందరినీ ఆలోచింపజేస్తోంది. – మచిలీపట్నం (గొడుగుపేట), న్యూస్‌టుడే

శత వసంతం.. శుభమనంతం..!



ఈ అక్షర కోవెలకు 112 ఏళ్లు

నందిగామలో జడ్పీ ఉన్నత పాఠశాలకు ఒక ప్రత్యేకత ఉంది. దీనిని స్వాతంత్ర్యానికి పూర్వమే దివంగత తుర్లపాటి పెద్దవీరభద్రరావు, దివంగత అయ్యదేవర రామనరసింహం తదితర వ్యవస్థాపక కమిటీ సభ్యులు 9 జూన్ 1913లో 14 ఎకరాల విస్తీర్ణంలో స్థాపించారు. 1921లో ఉన్నత పాఠశాలగా మారింది. 1 ఆగస్టు 1922లో ఈ బడి జిల్లా బోర్డు పరిధిలోకి వచ్చింది. ఈ పాఠశాల ఏర్పాటై 112 సంవత్సరాలు అవుతోంది. ఇక్కడ చదివిన ఎంతోమంది రాజకీయ నాయకులుగా, ఉన్నత ఉద్యోగాల్లో స్థిరపడ్డారు. మాజీ హోం మంత్రి వసంత నాగేశ్వరరావు ఇక్కడే చదువుకున్నారు. ప్రస్తుతం ఇక్కడ ఆరు నుంచి పది వరకు 860 మంది విద్యార్థులు చదువుతున్నారు. పూర్వం నిర్మించిన భవనాలు శిథిలావస్థకు చేరడంతో వాటిని కూల్చారు. తరువాత నిర్మించిన భవనంలో కొన్ని గదుల్లో పదో తరగతి, హెచ్‌ఎం రూం, గ్రంథాలయం, సైన్స్ ల్యాబ్ ఏర్పాటు చేశారు. మిగిలిన తరగతుల విద్యార్థులకు కొత్తగా తరగతి గదులు నిర్మించారు. ఈ ప్రాంతంలో ఇదే పురాతన పాఠశాల అని ప్రధానోపాధ్యాయిని పొదిలి విజయలక్ష్మి తెలిపారు. **- నందిగామ గ్రామీణం, న్యూస్‌టుడే**

రిటర్నబుల్ ప్లాట్ల ఈ- లాటరీకి వేళాయె..

తుళ్లూరు, న్యూస్‌టుడే: ప్రజా రాజధాని నిర్మాణానికి భూ సమీకరణలో 9.14 అగ్రిమెంటు ద్వారా భూములు ఇచ్చిన రైతులకు, అనంతవరంలో ఎన్-17 రహదారిలో భూములు కోల్పోతున్న 24 మంది రైతులకు, మల్కాపురం సర్వే నెం.18లో మినహాయింపు భూమి వల్ల ప్రభావితమైన ఇద్దరు రైతులకు, మల్కాపురంలో అనధికార లేఔట్ వల్ల ప్రభావితమై 65శాతం-35 శాతం కింద ఉన్న ఏడుగురు రైతులకు ఈ లాటరీ ద్వారా ప్లాట్లు కేటాయించనున్నట్టు సీఆర్డీఏ కమిషనర్ కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. ★ కృష్ణాయపాలెం, నవులూరు 1, 2, కురగల్లు1, 2 వెలగపూడి, మందడం 1, 2, నిడమర్రు 1, 2 గ్రామాల రైతులకు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు అదేవిధంగా పెనుమాక, తుళ్లూరు 1, 2, నెక్కల్లు, అనంతవరం, రాయపూడి 1, 2 వెంకటపాలెం, దొండపాడు, ఐనవలోలు, లింగాయపాలెం, ఉద్దండరాయునిపాలెం గ్రామాల రైతులకు మ. 2 నుంచి 4 గంటల వరకు, అనంతవరం, మల్కాపురం గ్రామాలకు సంబంధించిన పత్యామ్నాయ ప్లాట్లకు సంబంధించి 4 గంటల నుంచి సాయంత్రం 5 వరకు రాయపూడి సమీపంలోని ఏపీ సీఆర్డీఏ ప్రధాన కార్యాలయంలో ఈ లాటరీ ప్రక్రియ నిర్వహించనున్నారు. మొత్తం 225 మంది రైతులకు 405 ప్లాట్లను ఆన్‌లైన్ ర్యాండమ్ సిస్టమ్ ద్వారా కేటాయిస్తారు.

స్మార్ట్‌గా పౌరసరఫరాలు

జనవరి నుంచి మనమిత్ర యాప్, వాట్సప్ సేవలు

ప్రజా పంపిణీ వ్యవస్థలో కొత్త ఒరవడి దిశగా కూటమి సర్కారు అడుగులు వేస్తోంది. సేవలను ప్రజలకు చేరువ చేసేందుకు ఇప్పటికే స్మార్ట్ రేషన్ కార్డులు, ఈ-పోస్ యంత్రాలు అందుబాటులోకి తెచ్చారు. అదే దిశగా కొత్త ఏడాది నూతన సంస్కరణలు చేస్తోంది. – ఈనాడు, అమరావతి

ఒక్క నంబర్.. ఎన్నో సేవలు..

✦ 95523 00009 నంబర్‌ను సేవ్ చేసుకుని హాయ్ అని మెసేజ్ పెడితే వెంటనే ప్రభుత్వంలోని వివిధ శాఖలు కనిపిస్తాయి. పౌర సరఫరాలపై క్లిక్ చేస్తే సేవలు కనిపిస్తాయి. వాటిల్లో మన సమస్యపై దరఖాస్తు చేయొచ్చు. * కొత్త రేషన్ కార్డుకు చరవాణి నుంచే దరఖాస్తు చేసుకోవచ్చు. అన్ని పత్రాలు అప్‌లోడ్ చేస్తే సచివాలయానికి దరఖాస్తు చేరుతుంది. పరిశీలన అనంతరం రేషన్ కార్డు చిరునామాకు చేరుతుంది. కార్డులో కొత్త సభ్యులను చేర్చడం, మరణించిన వారి తొలగింపు, చిరునామా మార్పు, ఇలా ఏ సేవైనా ఇందులో పొందవచ్చు. ✦ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రేషన్ దుకాణాల్లో స్మార్ట్ కార్డుల పంపిణీ జరుగుతోంది. వలసలు వెళ్లిపోవడం.. కార్డులు ఎక్కడ ఉన్నాయో తెలియకపోవడంతో వేల మంది ఇంకా కార్డులు తీసుకోలేదు. స్మార్ట్ కార్డు పోగొట్టుకున్నవారు డూప్లికేట్ కార్డు తీసుకునేందుకు యాప్‌లో అవకాశం ఉంది.

అక్రమాలు, అవకతవకలు, లోపాలపై ఫిర్యాదుకు వీలుగా ప్రతి చౌక దుకాణంలో క్యూఆర్ కోడ్ ఏర్పాటు చేశారు. ఫోన్‌లో స్కాన్ చేసి ఫిర్యాదులు, పౌరసరఫరాలపై అభిప్రాయాలు ఇవ్వొచ్చు. విచారణ చేసి చర్యలు తీసుకుంటారు.

☛ 73373 59375 నంబర్‌కు వాట్సప్‌లో హాయ్ అని మెసేజ్ పెడితే ధాన్యం కొనుగోలు ఎప్పుడు చేస్తారో షెడ్యూలు చేసుకునే వీలుంది.

☛ వివాహం తర్వాత పాత కార్డు నుంచి తొలగించి కొత్తగా కార్డు ఇవ్వడానికి పెద్ద ప్రహసనం సాగేది. ప్రస్తుతం పెళ్లి ధ్రువపత్రం అప్‌లోడ్ చేసి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేస్తే చాలు పాత కార్డు నుంచి తప్పిస్తారు.

అరచేతిలో సేవలు..

ఫోన్‌తో అన్ని సేవలు అందించేలా చర్యలు తీసుకున్నాం. కార్యాలయాల చుట్టూ తిరగడం, సిబ్బంది దగ్గర ప్రాధేయ పడాల్సిన అవసరం లేదు. అందరూ మనమిత్ర వాట్సప్ నంబర్ సేవ్ చేసుకుని ఉపయోగించుకోవాలి.

-నాదెండ్ల మనోహర్, పౌరసరఫరాల మంత్రి

ఇవ్వమంటే ఇరుకున.. ఇచ్చారంటే పరుగున

పౌరసేవల్లో పంచాయతీ కార్యదర్శుల దందా

ఈనాడు – అమరావతి



"**కొం**దరు పంచాయతీ కార్యదర్శుల అక్రమాలు హద్దు మీరుతున్నాయి. నిధుల దుర్వినియోగం, పౌర సేవల విషయంలో ఆమ్యామ్యాలు తీసుకోవడం.. పంచాయతీ ఆదాయానికి గండి కొట్టేయడం... ఇలా లెక్కకు మించిన వ్యవహారాలతో కాసులు పోగేసుకుంటున్నారు. పర్యవేక్షించాల్సిన అధికారులను వాటాలు ఇచ్చి ప్రసన్నం చేసుకుంటున్నారు. ఉమ్మడి జిల్లాలో ఏ నియోజకవర్గంలో చూసినా అడ్డగోలు వ్యవహారాలు చేస్తున్న కార్యదర్శులు ఉన్నారు. సర్పంచి అండ.. స్థానిక నాయకుల ఆశీస్సులతో సర్వం చక్కబెడుతున్నారు.''

ఎందెందు వెతికినా...

ఏ.కొండూరు మండలంలో మూడు పంచాయతీల్లోని ఇటుక బట్టీలు, వ్యాపార సముదాయాలు, పెట్రోలు బంకుల... పన్ను వసూలు సవ్యంగా చేయడం లేదు. మామూళ్లు తీసుకుని చెల్లించాల్సిన కొండంత పన్నుకు గోరంత వసూలు చేసి మమ అనిపిస్తున్నారు. ★ పెనుగంచిప్రోలు మండలంలో ఓ కార్యదర్శి సర్పంచితో కుమ్మక్కై గతంలో చేసిన పనులకు తప్పుడు బిల్లులు పెట్టి భారీగా సొమ్ము స్వాహా చేశారు. హరిత రాయబారులను నియమించకనే బినామీలతో రూ.లక్షల్లో సొమ్ము పక్కదారి పట్టించారు. ★ జగ్గయ్యపేట మండలంలో ఓ పంచాయతీలో జరిగిన రూ.కోట్ల అవినీతి వ్యవహారంలో కార్యదర్శి కీలక పాత్ర పోషించారు. అసలు పని చేయకుండానే చేసినట్లు చూపి భారీగా మింగేశారు. ★ విజయవాడ సమీపంలో భారీగా ఆదాయం వచ్చే పంచాయతీలో ఓ కార్యదర్శి అదనపు బాధ్యతలు నిర్వర్తించేలా ఓ నాయకుడిని ప్రసన్నం చేసుకుని భారీగా నిధుల స్వాహా చేస్తున్నారు.

నాయకుల అండతో..

పంచాయతీల్లో అక్రమాల్లో కార్యదర్శులు తెర ముందు పాత్రధారులే. తెర వెనుక సూత్రధారులు మాత్రం సర్పంచులు, స్థానిక నాయకులనేది బహిరంగ రహస్యమే. ★ కార్యదర్శులు అక్రమాలకు వెనుకంజ వేస్తున్నా 'మేమున్నాం చూసుకుంటాం' అని ముగ్గులోకి దించుతున్నారు. తీరా అక్రమాలు వెలుగులోకి వస్తే కార్యదర్శులే బలవుతున్నారు.

చర్యలు తీసుకుంటాం

★ దీనిపై ఎన్టీఆర్, కృష్ణా కలెక్టర్లు లక్ష్మీశ, బాలాజీ మాట్లాడుతూ, కార్యదర్శుల అక్రమాలపై పరిశీలించి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

బెజవాడ చరితకు సాక్ష్యం... గద్దబొమ్మ..



విజయవాడలో మున్సిపాలిటీ గోల్డెన్ జూబ్లీ పిల్లర్ ఎక్కడ ఉంది అని అడిగితే.. చాలా మంది చెప్పలేరు. కానీ గద్దబొమ్మ ఎక్కడంటే.. టక్కున చెప్పేస్తారు. ఆ రెండూ ఒక్కటే. ఆంగ్లేయుల కాలం నుంచే బెజవాడకు ఘనమైన చరిత్ర ఉంది. 2.14 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో.. 9,936 మంది జనాభాతో బెజవాడ పురపాలక సంఘం 1888, ఏప్రిల్ 3న ఏర్పడింది. 1945, జులై 23న స్వర్ణోత్సవాలు నిర్వహించారు. దీనికి గుర్తుగా 'బెజవాడ మున్సిపాలిటీ గోల్డెన్ జూబ్లీ పిల్లర్'ను కాళేశ్వరరావు మార్కెట్ సమీపంలో ఏర్పాటు చేశారు. 1888 నుంచి మున్సిపల్ ఛైర్మన్‌గా సేవలు అందిస్తున్న అయ్యదేవర కాళేశ్వరరావు పంతులు దీన్ని ఆవిష్కరించారు. దీని పైభాగంలో బంగారు రంగుతో మెరిసిపోయే గద్దబొమ్మ ఉంటుంది. స్థూప నిర్మాణ ఖర్చును మజ్జి సీతారామయ్య పాత్రుడు భరించారు. జీబు వెంకయ్యనాయుడు శంకుస్థాపన చేశారు.

ముఖ్యమైన కట్టడాలు తెలిపేలా.. ఈ స్తూపానికి నలువైపులా చరిత్రను తెలిపే శిలాఫలకాలు ఉన్నాయి. ముందు భాగం బెజవాడ చరిత్రకు అద్దం పడుతోంది. ముఖ్యమైన కట్టడాలు, అవి నిర్మించిన సంవత్సరాల వివరాలున్నాయి. శివుడి గుడి, దుర్గగుడి, అక్కన్న మాదన్న గుహలు, షారా ఐ ఖానా మస్క్, కృష్ణానదిపై ఆనకట్ట, రోమన్ క్యాథలిక్ చర్చి, విక్టోరియా మ్యూజియం, అరండల్ సత్రం, రైల్వేస్టేషన్ నిర్మాణాలు ఎప్పుడు నిర్మించారో వివరాలు ఉన్నాయి. మిగిలిన వైపున నాటి మున్సిపల్ కౌన్సిలర్లు, గోల్డెన్ జూబ్లీ కమిటీ సభ్యుల పేర్లు ఉన్నాయి.

భావితరాలకు అందిద్దాం.. ఈ స్తూపం పట్ల నగరపాలకసంస్థ నిర్లక్ష్యం వహిస్తోంది. దీనిపై గోడపత్రికలు అంటిస్తున్నారు. శిలాఫలకంపై పిచ్చి మొక్కలు పెరుగుతూ..శిథిలం చేస్తున్నాయి. అధికారులు స్పందించి.. సంరక్షించాల్సిన అవసరం ఎంతో ఉంది.

– గవర్నర్‌పేట, న్యూస్‌టుడే

నేడు విధుల్లోకి కలెక్టర్

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే: కలెక్టర్ జి.లక్ష్మీశ వ్యక్తిగత విదేశీ పర్యటన ముగిసిన నేపథ్యంలో ఈనెల 15వ తేదీ సోమవారం ఆయన తిరిగి విధుల్లోకి రానున్నారు.

ప్రజాసమస్యల పరిష్కార వేదిక రద్దు: భవానీ దీక్షల విరమణ నేపథ్యంలో కలెక్టరేట్‌లో నిర్వహించే పీజీఆర్ఎస్ రద్దు చేశామని అధికారులు తెలిపారు. పోలీస్ కమిషనరేట్‌లో కూడా రద్దు చేశామని సీపీ వెల్లడించారు.

అక్రమం గుట్టు... శివానికెరుక!

☛ అజ్ఞాతం వీడని లైఫ్ ఈజ్ బ్యూటీఫుల్ సీఈవో

☛ బోర్డు తిప్పేసే నాటికే సొమ్ము దారి మళ్లింపు

ఈనాడు, అమరావతి

'**ప్ర**స్తుతం మన భవిష్యత్తు ఏంటి? వచ్చే తరాలకు భరోసా ఏంటి? వీటిని దృష్టిలో పెట్టుకుని పేదలు, మధ్యతరగతి వారు ఆర్థికంగా ఎదిగేందుకు తోడ్పాటు అందిస్తామని' రంగురంగుల బ్రోచర్లతో ప్రచారం చేశారు. ఊరూరా భార్యాభర్తలు.. శివాని, దుర్గాప్రసాద్ అందరినీ నమ్మించారు. భారీగా డిపాజిట్లు రాగానే సొమ్ము పక్కదారి పట్టించి.. బోర్డు తిప్పేశారు. వేల మంది లైఫ్ ఈజ్ బ్యూటీఫుల్‌లో రూ.కోట్లలో పెట్టుబడి పెట్టి నష్టపోయారు. సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయన్సర్లతో యూట్యూబ్‌లో భారీగా ప్రచారం చేశారు. ఈ మాటలు నమ్మి మచిలీపట్నం, భవానీపురం, విస్సన్నపేట, రాజోలు, కాకినాడ, ఏలూరు, ఖమ్మం, తదితర చోట్ల కార్యాలయాలు పెట్టి డిపాజిట్లు వసూలు చేసి నిండా ముంచేశారు.

ప్రత్యేక బృందాల ఏర్పాటు...

విస్సన్నపేట ఠాణాలో శుక్రవారం రాత్రి సంస్థపై కేసు పెట్టారు. ఇంకా పలువురు బాధితులు వరుస కడుతున్నారు. పెద్దసంఖ్యలో బాధితులతో ముడిపడిన అంశం కావడంతో దర్యాప్తు కోసం ప్రత్యేక బృందాలను వేశారు. మొత్తం ఎంత వసూలు చేశారు? ఇప్పటికి ఎంత చెల్లించారు? డిపాజిట్‌దారులకు ఇచ్చిన బాండ్లు పరిశీలించనున్నారు. సంస్థ బ్యాంకు ఖాతాల నుంచి సొమ్ము ఎక్కడికి తరలింది? నిర్వాహకులు.. బినామీ పేర్లతో ఆస్తులు కొన్నారా? అని తేల్చనున్నారు. బ్యాంకు లావాదేవీల స్టేట్‌మెంట్లు తీసుకొని.. ఖాతాలను ఫ్రీజ్ చేయనున్నారు. దుర్గాప్రసాద్, శివానిల బంధువుల ఆస్తులను పరిశీలించనున్నారు. బాధితుల చిట్టా తయారీలో పోలీసులు నిమగ్నమయ్యారు.



బంధువుల ఖాతాలకు..

రెడ్డిగూడెం మండలంలో శివాని కనిపిస్తే పట్టుకున్నారని ప్రచారం సాగినా పోలీసులు ధ్రువీకరించలేదు. శుక్రవారం రాత్రి మద్దెలపర్వలో ఆమె తల్లిదండ్రుల ఇంటికి బాధితులు వెళ్లి పరిశీలించారు. ఇంట్లో 250 గ్రాముల బంగారు నగలు కొన్న రశీదులు దొరికాయి. నూజివీడులో ఓ దుకాణంలో ఏడాది లోపు కొన్న బిల్లులు కనిపించాయి. శివాని, ఆమె బంధువులు కొందరు కనిపించడం లేదని బాధితులు ఆరోపిస్తున్నారు. సంస్థకు చెందిన నాలుగు కరెంటు ఖాతాల నుంచి కుటుంబీకులు, బంధువుల బ్యాంకు ఖాతాలకు రూ.2-3 కోట్లు బదిలీ అయినట్లు భావిస్తున్నారు. శివాని స్థలాలు కూడా ఆమె బంధువుల పేర్లతో రిజిస్ట్రేషన్ చేసినట్లు తెలిసింది.

డ్వాక్రా మహిళలే ఎక్కువ..

పేద, మధ్యతరగతి వారినే లక్ష్యంగా చేసుకునే నిర్వాహకులు డిపాజిట్లు వసూలు చేశారు. వీరిలోనూ డ్వాక్రా మహిళలే ఎక్కువ. వీరికి రుణాలు మంజూరవగానే.. ఊళ్లలో సమావేశాలు పెట్టి, సంస్థలో పెట్టుబడి పెట్టాలని.. అధిక వడ్డీ ఆశజూపారు. దీంతో చాలా చోట్ల పొదుపు మహిళలు ఎక్కువగా డిపాజిట్లు చేశారు. బంగారాన్ని, ఇంటి పత్రాలను తనఖా పెట్టి మరీ డిపాజిట్ చేశారు. మార్చి నుంచే చెల్లింపులు ఆగాయి. గట్టిగా నిలదీసిన వారికీ అరకొరే ఇచ్చారు. మరికొందరికి చెక్కులిచ్చి చేతులు దులుపుకొన్నారు.

4 రోజులు.. 3.75 లక్షల మంది భవానీలు

పక్కా ఏర్పాట్లతో సత్ఫలితాలు


సూచనలు చేస్తున్న దేవాదాయశాఖ కమిషనర్ రామచంద్ర మోహన్, పక్కన ఈవో శీనానాయక్, ఛైర్మన్ రాధాకృష్ణ

ఈనాడు, అమరావతి : ఇంద్రకీలాద్రిపై ఈనెల 11 నుంచి కొనసాగుతున్న భవానీదీక్ష విరమణ వేడుకలకు ఆదివారం సాయంత్రం వరకు నాలుగు రోజుల్లో 3.75 లక్షల మంది భక్తులు తరలివచ్చారని దేవాదాయ శాఖ కమిషనర్ కె. రామచంద్రమోహన్ వెల్లడించారు. భవానీ భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా, చిన్న పొరపాటు కూడా తలెత్తకుండా పక్కాగా ఏర్పాట్లు చేశామన్నారు. ఆలయానికి వచ్చిన ప్రతి భక్తుడు సంతృప్తికరంగా అమ్మవారిని దర్శించుకుని వెళ్తున్నారన్నారు. ఇంద్రకీలాద్రిపై జరుగుతున్న వేడుకలు, భక్తులకు కల్పించిన సౌకర్యాలను ఆయన ఆదివారం పరిశీలించారు. క్యూలైన్లలో వెళ్తున్న భవానీ భక్తులతో మాట్లాడారు. సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం రామచంద్ర మోహన్ మాట్లాడుతూ.. భక్తులు ఎంతమంది వచ్చినా అందరికీ ఉచిత అన్నప్రసాదం అందుబాటులో ఉంచామన్నారు. వారికి ఎన్ని కావాలంటే అన్ని ఇచ్చేలా లడ్డూ ప్రసాదం ముందస్తుగా సిద్ధం చేశామని తెలిపారు.

దసరా ఉత్సవాల మాదిరిగానే.. : భవానీదీక్షలకు సైతం పక్కా ప్రణాళికతో ఏర్పాట్లు చేసినట్టు వెల్లడించారు. ప్రతి భవానీ భక్తుడు సంతృప్తికరంగా దీక్ష విరమణ చేసి వెళ్తున్నారని తెలిపారు. స్నానఘాట్ల వద్ద ఏర్పాట్లు, ఉచిత రవాణా, క్యూలైన్లలో వచ్చేవారికి మంచినీళ్లు, మజ్జిగ, బిస్కెట్ ప్యాకెట్లు, ఉచిత ప్రసాదం అందజేస్తున్నామని పేర్కొన్నారు.

ప్రణాళికతో ప్రసాదాల తయారీ.. : భవానీ దీక్ష విరమణ వేడుకల్లో ఏటా భక్తులు కోరినన్ని ప్రసాదాలు అందజేసే విషయంలోనే ఇబ్బందులు వస్తుండడంతో ఈసారి పక్కా ప్రణాళిక రూపొందించామన్నారు. ప్రధానంగా మూడు పాయింట్లలో నిరంతరాయంగా లడ్డూ ప్రసాదం తయారీ చేయిస్తూ.. భక్తులు కోరినన్ని లడ్డూలు అందజేస్తున్నట్లు తెలిపారు. ప్రసాదాల విషయంలో భవానీ భక్తులు సంతృప్తికరంగా ఉన్నారన్నారు.

☛ వేడుకల నిర్వహణలో ఈసారి కూడా సాంకేతికతను ఎక్కువగా వినియోగిస్తున్నామని, పోలీసు, రెవెన్యూ, మున్సిపల్ సహా అన్ని విభాగాలతో దేవాదాయశాఖ ఆధ్వర్యంలో అనుసంధానం చేసుకుంటూ వెళ్లడంతో ఎలాంటి ఇబ్బందులు తలెత్తలేదని తెలిపారు. సోమవారంతో వేడుకలు ముగుస్తున్న నేపథ్యంలో ఆఖరి నిమిషం వరకూ చాలా అప్రమత్తంగా ఉండాలంటూ అధికారులను రామచంద్రమోహన్ ఆదేశించారు. కార్యక్రమంలో దుర్గగుడి ఈవో వి.కె. శీనానాయక్, పాలకమండలి ఛైర్మన్ బొర్రా రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి తిరుపతమ్మ అమ్మవారి దీక్షాధారణ

పెనుగంచిప్రోలు, న్యూస్‌టుడే: శ్రీలక్ష్మీతిరుపతమ్మ అమ్మవారి మండల దీక్షాధారణ సోమవారం నుంచి ప్రారంభమవుతుందని ఆలయ ఈవో మహేశ్వర్‌రెడ్డి తెలిపారు. ఆలయంలో ఉదయం 5:59 గంటలకు దీక్ష ప్రారంభిస్తామన్నారు. దీక్ష తీసుకునే వారికి ఈనెల 21 వరకు అవకాశం ఉందని చెప్పారు. జనవరి 5వ తేదీ నుంచి 20వ తేదీ వరకు అర్ధ మండల దీక్షాధారణలు ఉంటాయని తెలిపారు. దీక్ష తీసుకునే భక్తులు ఆయా సమయాల్లో నేరుగా ఆలయం వద్దకు వచ్చి స్వీకరించవచ్చని చెప్పారు.

పూర్ణాహుతి నేడు

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: ఇంద్రకీలాద్రిపై భవానీ దీక్షల విరమణ ఉత్సవాలు ముగింపును పురస్కరించుకుని ఈనెల 15న ఉదయం 10 గంటలకు యాగశాలలో మహాపూర్ణాహుతిని నిర్వహిస్తున్నట్లు వైదిక కమిటీ పేర్కొంది. మహా పూర్ణాహుతితో భవానీ దీక్షల విరమణ మహోత్సవాలు పరిసమాప్తం అవుతాయని తెలిపారు.

రాత్రి వరకు ప్రసాదం పంపిణీ : భవానీ దీక్షల విరమణ నాల్గోరోజు రికార్డు స్థాయిలో 1.50 లక్షల మంది దీక్షాధారులు దుర్గమ్మను దర్శించుకున్నారు. గిరిప్రదక్షిణ మార్గం జగన్మాత నామస్మరణతో మార్మోగింది. అన్నదాన గ్రౌండ్ షెడ్లలో అన్నప్రసాదం, దద్దోజనం, కట్టెపొంగలి, కదంబం ప్రసాదం పంపిణీ ఉదయం 7 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు దేవస్థానం అధికారులు కొనసాగించారు.

వీఐపీ దర్శనాలకు బ్రేక్ : ఇంద్రకీలాద్రిపై వీఐపీ ప్రోటోకాల్ దర్శనాలను నిలిపి వేశారు. గిరిప్రదక్షిణ మార్గంలో వాహనాల రాకపోకలను బందోబస్తు పోలీసులు నియంత్రించారు. కుమ్మరిపాలెం సెంటరు నుంచి కాళేశ్వరరావు మార్కెట్ వరకు ప్రైవేటు వాహనాల రాకపోకలను నిలిపి వేశారు. వృద్ధులు, దివ్యాంగులను మాత్రమే దేవస్థానం బస్సుల్లో ఘాట్ రోడ్డులో ఇంద్రకీలాద్రిపైకి చేరుస్తున్నారు.


పుష్పాలతో అంతరాలయం అలంకరణ


దీవించు తల్లీ..

ఆదాయం రూ.81,58,730

విజయవాడ వన్‌టౌన్: ఇంద్రకీలాద్రిపై కొనసాగుతున్న భవానీ దీక్షల విరమణ సందర్భంగా నాల్గోరోజు దుర్గమ్మ ఆలయానికి వివిధ సేవల ద్వారా రూ.81,58,730 ఆదాయం సమకూరింది. ☛ రూ.15ల లడ్డు ద్వారా రూ.12,930 ☛ రూ.100ల లడ్డుల ద్వారా 76,08,900 ☛ శ్రీచక్రార్చన లడ్డుల ద్వారా రూ.9,500, ☛ కేశఖండనశాల ద్వారా రూ.5,28000 ☛ ఆదివారం సాయంత్రం ఆరు గంటల వరకు 22,437 మంది అన్నప్రసాదం, 26,586 మంది అల్పాహారం స్వీకరించారని అధికారులు వెల్లడించారు. ☛ మూడో రోజు పూర్తి వివరాలను అధికారులు తెలిపారు. శనివారం మొత్తం 1.21 లక్షల మంది భవానీ భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ☛ మూడో రోజు మొత్తం 49,948 మంది భక్తులకు ఉచిత అల్పాహారం, అన్నప్రసాదాన్ని అందజేశామని అధికారులు తెలిపారు.

జిల్లా రెవెన్యూ అసోసియేషన్ కొత్త కార్యవర్గం


ప్రమాణ స్వీకారం చేస్తున్న రామకృష్ణ, దుర్గాప్రసాద్, రవి తదితరులు

ఎన్టీఆర్ కలెక్టరేట్: ఏపీ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ ఎన్టీఆర్ జిల్లా శాఖ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నగరంలోని రెవెన్యూ భవన్‌లో ఆదివారం ఈ కార్యక్రమం నిర్వహించారు. అసోసియేషన్ అధ్యక్షుడిగా ఇబ్రహీంపట్నం డిప్యూటీ తహసీల్దార్ బత్తిన రామకృష్ణ, సహాధ్యక్షుడిగా కలెక్టరేట్ బి విభాగ సూపరింటెండెంట్ వందన దుర్గాప్రసాద్, ఉపాధ్యక్షులుగా ఎస్.వి.రవీంద్రనాథ్, జె.వెంకటేశ్వర్లు ఎన్నికయ్యారు. కార్యదర్శిగా యలమంచిలి రవి, సంయుక్త కార్యదర్శులుగా ఎన్.ఆనంద్ కుమార్, క్రీడలు, సాంస్కృతిక విభాగ కార్యదర్శిగా కమ్మిలి నాగభూషణం, సంయుక్త కార్యదర్శులుగా గుళ్లపల్లి వరప్రసాద్, వి.సునీల్ కుమార్, పి.సాయి కుమార్, కె.సుస్మంత్, కోశాధికారిగా పి.ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, కార్యనిర్వాహక సభ్యులుగా ఆర్.శ్రీనివాసరావు, మహమ్మద్ ఆలీ ఎన్నికయ్యారు. ఈమేరకు ఎన్నికల అధికారి బి. పుల్లయ్య నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. వారితో ప్రమాణ స్వీకారం చేయించారు. ఏపీ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ నిర్వాహక కార్యదర్శి పి.విజయలక్ష్మి తదితరులు సభ్యులను అభినందించారు.

కళాకారులకు ప్రభుత్వ ప్రోత్సాహం

అలరించిన చిత్రకళ సంత


ఆసక్తిగా తిలకిస్తున్న మంత్రి కొల్లు రవీంద్ర


దారి పొడవునా.. కళా రూపాలే..

కరెన్సీనగర్, న్యూస్‌టుడే: చిత్రకళాకారులు గీసిన చిత్రాలు, తీసిన ఛాయాచిత్రాలు నగరవాసులను కట్టిపడేశాయి. వీటిని తిలకించిన జిల్లావాసులు మంత్రముగ్ధులయ్యారు. తెలుగు వరల్డ్ ఆర్టిస్ట్స్ ఆర్ట్ సొసైటీ ఆధ్వర్యంలో విజయవాడ రూరల్ రోడ్డులో ఏర్పాటు చేసిన 4వ చిత్రకళా సంత ఆద్యంతం ఆకట్టుకుంది. దాదాపు 200లకు పైగా స్టాళ్లు ఏర్పాటు చేశారు. ఈ ప్రదర్శన, అమ్మకాలను రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర ప్రారంభించారు. కళల కాణాచి విజయవాడలో ఇటువంటి చిత్ర కళా సంతను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. నగర ప్రజల అభిరుచి మేరకు ప్రదర్శన నిర్వహించడం, ఆంధ్రప్రదేశ్‌తో పాటు ఒడిశా, తెలంగాణ, మహారాష్ట్ర, తమిళనాడు రాష్ట్రాల నుంచి విచ్చేయడం విశేషమన్నారు. కొన్నేళ్లుగా చిత్రకళకు ఆదరణ తగ్గిన ఇటువంటి ప్రదర్శనల ద్వారా ఎంతోమందికి ఆసక్తి పెరుగుతుందన్నారు. భవిష్యత్తులో చిత్ర, కళాకారులను ప్రోత్సహిస్తూ రాష్ట్ర ప్రభుత్వం తరఫున అండగా ఉంటామన్నారు. అమరావతి రాజధానిలో కళలకు ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. ప్రముఖ తెలుగు చిత్రకారులు, సమాఖ్య ప్రధాన కార్యదర్శి బాలయోగితో పాటు పలువురు చిత్ర కళాకారులు కాటూరి వెంకటేశ్వరరావు, వల్లభనేని సత్య సాయిబాబు పర్యవేక్షణలో ప్రదర్శన సాగింది.


కొబ్బరి చిప్పలతో కళాకృతులు


రకరకాల వస్తువులు, బొమ్మలు..

ఆలిండియా అడ్వకేట్స్ క్రికెట్ టోర్నీకి రాష్ట్ర జట్టు


క్రాంతికుమార్

విజయవాడ క్రీడలు: కొలంబో(శ్రీలంక)లో ఈ నెల 20న జరిగే 37వ ఆలిండియా అడ్వకేట్స్ క్రికెట్ టోర్నీలో తలపడే రాష్ట్ర జట్టుకు విజయవాడకు చెందిన యువ న్యాయవాది క్రాంతికుమార్ సారథ్యం వహిస్తాడని ఆ సంఘం అధ్యక్షుడు పొన్నేరి సురేష్‌కుమార్ తెలిపారు. సీహెచ్ సతీష్, పి. సురేష్‌కుమార్, టి. ధరణీధర్‌రెడ్డి, డి. జయప్రకాష్, పి. నవీన్, డి. సునీల్ అరవింద్, ఎస్. లక్ష్మీకాంత్(వైస్ కెప్టెన్), వి. దేవానంద్, పి. వెంకట్, ఎం. జగదీశ్వర్ విగ్నేష్, ఐ. యశ్వంత్ కిరణ్‌కుమార్, జి. రాజ్‌కుమార్, ఎస్‌కే మొహమ్మద్ మాజ్, బీడీ నిఖిల్ కుమార్, కె. సందీప్, ఎన్. భూచక్రవర్తిలు జట్టులో స్థానం సాధించారు.

బ్రాయిలర్ ధరలు (కేజీ కి రూ.లలో)

ఏపీ ఎగ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -120 రిటైల్ ధర 147 చికెన్ విత్ స్కిన్ - 213, చికెన్ స్కిన్‌లెస్ - 243. అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 139, 148, 159 చికెన్ విత్ స్కిన్ - 264 చికెన్ స్కిన్‌లెస్ - 274.

కార్టూనిస్టుల సంఘానికి సహకారం


సంఘం పేరును ఆవిష్కరిస్తున్న రఘురామకృష్ణరాజు, జస్టిస్ శేషసాయి, శ్రీనివాసరావు, శ్రీధర్ తదితరులు

రాఘవయ్యపార్క్ కూడలి(కృష్ణలంక): కార్టూనిస్టుల సంఘానికి ప్రభుత్వం నుంచి సహకారం అందేలా కృషి చేస్తానని శాసన సభ ఉపసభాపతి కె.రఘురామకృష్ణరాజు అన్నారు. బాలోత్సవ భవన్‌లో ఆదివారం ఆంధ్రప్రదేశ్ కార్టూనిస్టుల సంఘం ఆవిర్భావ సభ నిర్వహించారు. రఘురామకృష్ణరాజు, విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ ఎ.వి.శేషసాయి ముఖ్య అతిథులుగా హాజరై సంఘం లోగో, పేరును ఆవిష్కరించారు. ఉపసభాపతి మాట్లాడుతూ.. సమకాలీన సమస్యలను కార్టూనిస్టులు తమ కార్టూన్ల ద్వారా వెలుగులోకి తెస్తారన్నారు. చిన్నతనం నుంచి తనకు కార్టూన్‌లు అంటే ఎంతో ఇష్టమని చెప్పారు. ప్రఖ్యాత చిత్రకారుడు బాపుతో తనకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. జస్టిస్ ఎ.వి. శేషసాయి మాట్లాడుతూ.. కార్టూన్‌లో హాస్యం జోడించి ఉన్నందున వాటికి ప్రజల ఆదరణ ఎప్పటికీ ఉంటుందన్నారు. సమాజహితాన్ని కాంక్షిస్తూ మంచి కార్టూన్లను ప్రజలకు అందించాలని కోరారు. సంఘం అధ్యక్షుడు శ్రీధర్ మాట్లాడుతూ.. కార్టూన్ రంగానికి ప్రభుత్వ సహకారం అందించాలని కోరారు. నేటి యువత ఈ రంగంలోకి రావాలని పిలుపునిచ్చారు. తొలుత సంఘం గౌరవాధ్యక్షుడిగా దుగ్గరాజు శ్రీనివాసరావు, అధ్యక్ష, కార్యదర్శులుగా అన్నం శ్రీధర్(బాచి), రావెళ్ల శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడు బొమ్మన్‌లతో కలిపి 14 మందితో కూడిన నూతన కార్యవర్గం ఏర్పాటైంది. హాస్యానందం రాము, పద్మ, హరికృష్ణ, పద్మాదాసు, మురళీధర్, రాము, ఏపీఎం, మయూరి టెక్ పార్క్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

28న ఏపీ ఎన్జీవో నగర శాఖ ఎన్నికలు

విజయవాడ(గాంధీనగర్), న్యూస్‌టుడే : ఏపీఎన్జీవో అసోసియేషన్ నగర శాఖ ఎన్నికలు ఈ నెల 28న గాంధీనగర్‌లోని ఎన్జీవో హోమ్‌లో నిర్వహిస్తున్నట్లు ఎన్నికల అధికారి, సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు వి.వి.ప్రసాద్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఓటర్ల జాబితాను ఈ నెల 16న పబ్లిష్ చేస్తామని చెప్పారు. 22న నామినేషన్ల స్వీకరణ, పరిశీలన, అర్హుల జాబితా ప్రచురణ, నామినేషన్ల ఉపసంహరణ, తుది జాబితా ప్రచురణ ఉంటుందని తెలిపారు. ఒక్కో పదవికి ఒకటి కంటే ఎక్కువ నామినేషన్లు వస్తే.. 28న ఎన్నికలు నిర్వహించి, అదే రోజు ఫలితాలను వెల్లడిస్తామని చెప్పారు. ఓటు హక్కు ఉన్న ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని కోరారు. సహాయ ఎన్నికల అధికారిగా జిల్లా ఉపాధ్యక్షుడు జి.రామకృష్ణ, పర్యవేక్షకుడిగా జిల్లా కోశాధికారి బి. సతీష్‌కుమార్‌ను నియమిస్తూ సంఘం జిల్లా అధ్యక్షుడు డి.సత్యనారాయణరెడ్డి ఆదేశాలు జారీ చేసినట్లు ప్రసాద్ తెలిపారు.

ఏపీటీఎఫ్ జిల్లా నూతన కమిటీ నియామకం


ప్రమాణస్వీకారం చేస్తున్న సభ్యులు

సూర్యారావుపేట, న్యూస్‌టుడే : ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ (ఏపీటీఎఫ్) ఎన్టీఆర్ జిల్లా నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సూర్యారావుపేటలోని సంఘ రాష్ట్ర కార్యాలయంలో జిల్లా శాఖ ద్వితీయ కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. జిల్లా అధ్యక్షురాలిగా వేములపల్లి రాధిక, ప్రధాన కార్యదర్శిగా సయ్యద్ ఖాసిం, ఉపాధ్యక్షులుగా టి.పూర్ణచంద్రరావు, ఎన్.అవని, ఎం.నయీం అహ్మద్, డి.రాజకుమార్, కార్యదర్శులుగా బి.వసరాం, ఎ. సుందర రామారావు, శెట్టిపోగు రాము, షేక్ ఖాజా, షేక్ లాల్‌మద్, రాష్ట్ర కౌన్సిలర్లుగా పి.వి.దుర్గాప్రసాద్, ఎస్‌కె. నిఖత్ సుల్తానా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రాష్ట్ర కార్యదర్శి మక్కెన శ్రీనివాసరావు ఎన్నికల పరిశీలకులుగా వ్యవహరించారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు పువ్వాడ వెంకటేశ్వర్లు ఎన్నికలు నిర్వహించారు. సమావేశంలో ఎం. అనిత మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం 12వ పీఆర్సీ వేయాలని, ఉద్యోగ, ఉపాధ్యాయులకు 30 శాతం మధ్యంతర భృతి చెల్లించాలని కోరారు. ఏపీటీఎఫ్ రాష్ట్ర పూర్వ ప్రధాన కార్యదర్శి పి.పాండురంగ వరప్రసాద్ మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రైవేటీకరణను ప్రోత్సహిస్తున్నాయని విమర్శించారు. పని గంటలు పెంచేందుకు ప్రయత్నిస్తున్నాయని, వాటిని ఎదుర్కోవాలని సూచించారు. సంఘం ఇచ్చే పిలుపునకు ఉపాధ్యాయులు స్పందించి పెద్ద ఎత్తున కార్యక్రమాలకు తరలిరావాలని కోరారు. జిల్లా నూతన అధ్యక్షురాలు వేములపల్లి రాధిక మాట్లాడుతూ.. విద్యారంగ, ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించడంలో ఏపీటీఎఫ్ క్రియాశీలకంగా వ్యవహరించిందని తెలిపారు. జిల్లా ప్రధాన కార్యదర్శి సయ్యద్ ఖాసిం గత రెండు సంవత్సరాల సంఘ కార్యక్రమాల నివేదికను వెల్లడించారు. కార్యక్రమంలో మండాది వెంకటేశ్వర్లు, శోభనాద్రాచార్యులు, వై.భాస్కరరావు, కె.సీతారామయ్య తదితరులు పాల్గొన్నారు.

లైఫ్ ఈజ్ బ్యూటీఫుల్ యాజమాన్యంపై కేసు

విస్సన్నపేట: విస్సన్నపేటలో లైఫ్ ఈజ్ బ్యూటీఫుల్ పేరుతో సంస్థను ఏర్పాటు చేసి మూసేసిన యజమానులపై స్థానిక ఎన్టీఆర్ కాలనీకి చెందిన బాధితుడు అట్టదేవర రాజేష్ విస్సన్నపేట పోలీస్ స్టేషన్‌లో ఆదివారం ఫిర్యాదు చేశారు. ఎస్సై జి.రామకృష్ణ తెలిపిన వివరాల మేరకు.. ఫిర్యాదుదారు ఆ సంస్థ నిర్వాహకులైన నండూరి దుర్గాప్రసాద్, శివాని దంపతులకు ఏడాది కిందట రూ.5,00,000లు పెట్టుబడి నిమిత్తం ఇచ్చారు. ఆ సొమ్ము తాలూకు లాభాలు ఇవ్వకుండా జాప్యం చేయడంతో రాజేష్ పోలీసులను ఆశ్రయించారు. సంస్థ నిర్వాహకుడు దుర్గాప్రసాద్ ఇప్పటికే మృతి చెందగా ఆయన భార్య శివాని అజ్ఞాతంలో ఉన్నారు. తనతో పాటు మరికొంత మంది ఎల్‌బీఎఫ్ సంస్థలో పెట్టుబడి పెట్టి మోసపోయినట్లు బాధితుడు ఫిర్యాదులో పేర్కొన్నారు. రాజేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు చీటింగ్, డిపాజిటర్ యాక్టు కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. సంస్థ బాధితులు ఎవరు ఉన్నా స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తే పరిశీలిస్తామన్నారు.

బీటెక్ విద్యార్థి హత్య కేసులో ముగ్గురి అరెస్టు

హైదరాబాద్(అమీన్‌పూర్): అమీన్‌పూర్ పట్టణంలోని సృజన లక్ష్మీనగర్‌లో ఈ నెల 9న జరిగిన బీటెక్ విద్యార్థి హత్య కేసులో ముగ్గురు నిందితులను పోలీసులు రిమాండ్‌కు తరలించారు. సీఐ నరేశ్ కథనం ప్రకారం.. స్థానిక యువతి, ఎన్టీఆర్ జిల్లా పెనుగంచిప్రోలు గ్రామానికి చెందిన యువకుడు కాకాణి జ్యోతి శ్రవణ్‌సాయి (19) ప్రేమించుకుంటున్నారు. ఈ విషయమై యువతి కుటుంబసభ్యులు పలుమార్లు యువకుడిని హెచ్చరించారు. అయినా పట్టించుకోకుండా యువతిని కలుస్తూనే ఉండటంతో మాట్లాడుదామని.. ఈ నెల 9న శ్రవణ్‌సాయిని ఇంటికి పిలిచారు. ఇంటికి వెళ్లిన శ్రవణ్‌సాయితో యువతి తల్లి, తండ్రి, సోదరుడు గొడవ పడ్డారు. ఇంట్లో ఉన్న క్రికెట్ బ్యాట్‌తో దాడి చేయడంతో యువకుడి తల, శరీరంలోని పలు భాగాల్లో గాయాలయ్యాయి. అయినా పట్టించుకోకుండా గంటల తరబడి ఇంట్లోనే నిర్బంధించారు. అడ్డుకోబోయిన యువతిని సైతం కొట్టడంతో ఆమెకూ గాయాలయ్యాయి. మరుసటి రోజు ఆసుపత్రికి తరలించగా, అప్పటికే యువకుడు మృతిచెందాడు. మృతుడి పెద్ద నాన్న వెంకటేశ్వర్‌రావు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు. యువకుడి మృతికి యువతి తల్లి సిరి, తండ్రి హరిబాబు, సోదరుడు రామ్‌తేజ్ కారణమని నిర్ధారించి రిమాండ్‌కు తరలించారు.

'గత వైకాపా పాలనలో రాష్ట్రాన్ని రావణకాష్ఠం చేశారు'


మాట్లాడుతున్న బుద్ధా వెంకన్న

పటమట: గత వైకాపా ప్రభుత్వ పాలనలో రాక్షసులంతా కలిసి రాష్ట్రాన్ని రావణకాష్ఠంలా మార్చారని మాజీ ఎమ్మెల్సీ, తెదేపా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుద్ధా వెంకన్న విమర్శించారు. ఆదివారం గురునానక్ కాలనీలోని ఎన్టీఆర్ భవన్‌లో ఆయన మాట్లాడుతూ సుప్రీంకోర్టు ఆదేశాలతో వైకాపా నేత పిన్నెల్లి రామకృష్ణారెడ్డితో పాటు ఆయన సోదరుడిని అరెస్టు చేస్తే.. అది తప్పు.. అన్యాయం.. అంటూ సీఎం జగన్ మాట్లాడడం సిగ్గుచేటన్నారు. పిన్నెల్లి సోదరులు రాష్ట్రంలో తెదేపా మద్దతుదారులను చంపడమే లక్ష్యంగా పెట్టుకున్న దుర్మార్గులని మండిపడ్డారు. మున్సిపల్ ఛైర్మన్ పదవికి వేలంపాట పెట్టి దాడులు, హత్యలు చేయించిన నీచమైన చరిత్ర వారిదన్నారు. మాచర్ల నియోజకవర్గంలో బీసీ కార్యకర్తను జై వైకాపా అనలేదని నడిరోడ్డుపై పీక కోసి చంపేశారని బుద్ధా ఆరోపించారు. పిన్నెల్లి సోదరుల అరెస్టును ఆ నియోజకవర్గ ప్రజలు దీపావళిలా సంబరాలు చేసుకుంటే.. వైకాపా నేతలు మాత్రం కొవ్వొత్తులతో ప్రదర్శన చేయడాన్ని చూసి ప్రజలు నవ్వుకుంటున్నారని వెల్లడించారు.

తిరువూరు

• తిరువూరు • మైలవరం

జగన్మాత సేవలో నృత్య దర్శకుడు



ఇరుముడితో శేఖర్ మాస్టర్

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: విజయవాడలోని ఇంద్రకీలాద్రిపై కొలువైన కనక దుర్గమ్మను ప్రముఖ నృత్య దర్శకుడు శేఖర్ మాస్టర్ ఆదివారం దర్శించుకున్నారు. భవానీ దీక్ష స్వీకరించిన ఆయన గిరిప్రదక్షిణ పూర్తి చేసి ఇరుముడితో అమ్మవారి ఆలయానికి వచ్చారు. ఈ మేరకు ఆలయ సూపరింటెండెంట్ చందు శ్రీనివాస్ అమ్మవారి దర్శనం చేయించి ప్రసాదాలు అందజేశారు.

అంతర్ రాష్ట్ర అంధుల క్రికెట్ పోటీలకు రాష్ట్ర జట్టు



బృందంతో శిక్షకుడు అజయ్ కుమార్ రెడ్డి

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: రాష్ట్ర అంధుల క్రికెట్ సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 15 నుంచి 19వ తేదీ వరకు గుంటూరు జిల్లా నంబూరులోని డాక్టర్ గోకరాజు గంగరాజు ఎమ్మెస్కే క్రికెట్ మైదానంలో నగేష్ ట్రోఫీ కోసం జరిగే జాతీయ స్థాయి సీనియర్ అంధుల క్రికెట్ టోర్నీలో తలపడే రాష్ట్ర జట్టును ఆ సంఘం కార్యదర్శి సి.రవీంద్రబాబు ఆదివారం వెల్లడించారు. టి.దుర్గారావు(కెప్టెన్), ఎం.గణేష్(వైస్ కెప్టెన్), బి.అశోక్‌రెడ్డి, టి.శివశంకర్, కె.జాని, డి.వెంకటేష్, కె.పుణ్య శ్రీనాథ్, ఆర్.వెంకటేష్, డి.కోటయ్య, ఎం.శివరాజు, ఎ.రవి, డి.తాండవకృష్ణ, కె.విక్రాంత, ఎన్.రమణయ్య జట్టులో స్థానం సాధించగా.. శిక్షకుడిగా ఐ.అజయ్ కుమార్ రెడ్డి, మేనేజరుగా ఎల్.నరేష్ నియమితులయ్యారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

తిరువూరు: 98853 28820 మైలవరం: 80085 74705

స్పందనకు వందనం

నరసాపురం- చనుబండ రహదారి వెంట చెత్త పేరుకుందని స్థానికులు 'ఈనాడు' మేమున్నాం.. మీకు తోడుగా ద్వారా సమస్యను అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై ఈవో జి.స్వాతి స్పందించి యంత్ర సాయంతో చెత్తను ట్రాక్టర్‌కి ఎత్తించి డంపింగ్ యార్డుకు తరలించారు. కార్మికులతో ఆ ప్రాంతాన్ని శుభ్రం చేయించి బ్లీచింగ్ చల్లించారు. - న్యూస్‌టుడే, విస్సన్నపేట

? జి.కొండూరులోని వివేకానంద పాఠశాల సమీపంలో కృష్ణా జలాల పైపులైన్ లీకై నీరంతా సిమెంటు రోడ్డుపై వృథాగా పోతోంది. - నాగేశ్వరరావు, గ్రామస్థుడు

✔ సిబ్బందితో పైపులైన్‌కు మరమ్మతులు చేయించి నీటి వృథా అరికడతాం. - బసవ లింగేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి - న్యూస్‌టుడే, జి.కొండూరు

? కొండపల్లి రైల్వేస్టేషన్ కూడలి నుంచి ఈలప్రోలుకు వెళ్లే రహదారిలో స్థానికులు రోజు ఏదో కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఆ సమయంలో రోడ్డును మూసేస్తున్నారు. దీంతో రాకపోకలకు ఇబ్బందిగా ఉంటుంది. - శేషగిరి రావు, స్థానికుడు ✔ సిబ్బందితో పర్యవేక్షణ చేయించి వారికి అవగాహన కల్పిస్తాం. - వెంకటరత్నం, ఇన్‌ఛార్జి కమిషనర్ – న్యూస్‌టుడే, కొండపల్లి

డివిజన్ స్థాయి ఆటల పోటీలు నేడు

మైలవరం, న్యూస్‌టుడే : విజయవాడ డివిజన్ పరిధిలోని ఉపాధ్యాయుల డివిజన్ స్థాయి ఆటల పోటీలను స్థానిక లకిరెడ్డి హనిమిరెడ్డి క్రీడా ప్రాంగణంలో సోమవారం నిర్వహిస్తున్నట్లు ఎంఈవో ఎల్.బాలు తెలిపారు. పురుషుల విభాగంలో క్రికెట్, మహిళల విభాగంలో త్రోబాల్ పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

శ్మశాన వాటికలో ముళ్ల కంప తొలగింపు

మైలవరం, న్యూస్‌టుడే : స్థానిక పెద్ద ఎస్సీ ఏరియాకు సంబంధించిన శ్మశాన వాటికలో ఆదివారం ముళ్ల కంప తొలగింపు పనులను తెలుగు యువత నాయకుడు లంకా లితీష్ సహకారంతో నిర్వహించారు. కార్యక్రమంలో తెదేపా నాయకులు బాలకృష్ణ, సతీష్, సుధాకర్, ప్రేమ్‌సాగర్, భార్గవ్, బాబూరావు, యోహాన్ పాల్గొన్నారు.

ఇష్టమైన క్రీడలు.. అభివృద్ధికి అడుగులు

గుంటుపల్లి, ఇబ్రహీంపట్నం గ్రామీణం, న్యూస్‌టుడే

కూటమి ప్రభుత్వం క్రీడాభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపడుతోంది. ఇందులో భాగంగా అధికారులు గతంలో కన్న భిన్నంగా విద్యార్థులు ఇష్టమైన క్రీడలు ఆడుకునేందుకు వీలుగా క్రీడా సామగ్రిని సమకూరుస్తున్నారు. గతంలో అన్ని పాఠశాలలకు ఒకే విధమైన ఆట పరికరాలు ఇచ్చేవారు. ప్రస్తుతం విద్యార్థుల ఆసక్తి మేరకు స్కూల్స్ వారీగా క్రీడా పరికరాల జాబితాలు సేకరించి వాటినే సరఫరా చేశారు. చదువులో ఒత్తిడిని తగ్గించడంతో పాటు ఆటలపై ఆసక్తి పెరిగేలా చర్యలు తీసుకుంటున్నారు. ప్రభుత్వం క్రీడా రిజర్వేషన్లను రెండు నుంచి మూడు శాతానికి పెంచడంతో పాటు అంతర్జాతీయ, జాతీయ, రాష్ట్ర స్థాయి పోటీల్లో రాణించిన క్రీడాకారులకు ప్రోత్సాహకాలు అందజేస్తోంది. ఇప్పటికే పాఠశాలల్లో విశాలమైన ఆట మైదానాలు,

మండలం పేరు	పాఠశాలలు	విద్యార్థులు
మైలవరం	53	4,252
జి.కొండూరు	34	3,125
రెడ్డిగూడెం	41	2,700
ఇబ్రహీంపట్నం గ్రామీణం	24	4,735
కొండపల్లి పురపాలిక	18	2,600

నిష్ణాతులైన క్రీడా ఉపాధ్యాయులున్నారు. అయితే ఆట పరికరాల లేమి కారణంగా విద్యార్థులకు సరైన శిక్షణ అందడం లేదు. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఆటలకు మెరుగైన అవకాశం కల్పించే దిశగా ఏర్పాట్లు చేసింది.

మైలవరం నియోజకవర్గ పరిధిలో ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో అవసరమైన క్రీడా పరికరాలకు సమగ్ర శిక్షా ఆధ్వర్యంలో ఇండెట్లు తీసుకుని సమకూర్చారు. స్థాయి మేరకు ఉన్నత పాఠశాలకు రూ.25 వేల నుంచి రూ.30 వేల వరకు, ప్రాథమికోన్నత రూ.10 వేల నుంచి రూ.15 వేల వరకు, ప్రాథమిక రూ.5 వేల నుంచి రూ.10 వేలు లోపు విలువ చేసే కిట్లు సరఫరా చేశారు. అథ్లెటిక్స్‌కు సంబంధించి అన్ని పాఠశాలలకు ఒకే తరహా సామగ్రి అందించారు. క్రీడలతో విద్యార్థుల్లో ఒత్తిడిని దూరం చేయడంతో పాటు ఆరోగ్యం సమకూరుతుందని తద్వారా చదువుపై దృష్టి పెట్టి మెరుగైన ఫలితాలు సాధించడానికి అవకాశం ఉంటుందని ఉపాధ్యాయులు చెబుతున్నారు. ఆటల్లో విద్యార్థులు రాణించేందుకు ప్రభుత్వం అందించిన పరికరాలు ఎంతగానో దోహదపడతాయని వ్యాయామోపాధ్యాయులు పేర్కొంటున్నారు.

మెరుగైన ఫలితాలు సాధించడానికి..



కాచవరం ప్రాథమిక పాఠశాలకు వచ్చిన సామగ్రితో చిన్నారులు

అర్హులకు ప్రభుత్వ పథకాలు అందేలా కృషి



నూతనంగా ఎంపికైన ఎస్సీ సంక్షేమ సంఘం సభ్యులు

తిరువూరు టౌన్, న్యూస్‌టుడే : తిరువూరు నియోజకవర్గ ఎస్సీ సంక్షేమ సంఘాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు గోపాల్ మాట్లాడుతూ విద్య, ఉపాధి, సామాజిక న్యాయం అంశాలపై ప్రత్యేక కార్యాచరణ రూపొందించి, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందరికి చేరవేయడానికి కృషి చేస్తామన్నారు. నూతనంగా ఎంపికైన సంఘ సభ్యులను అభినందిచారు. సంఘం సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


సందడిగా సెమీ క్రిస్మస్ వేడుక



ప్రసంగిస్తున్న దేవినేని ఉమామహేశ్వరరావు

ఇబ్రహీంపట్నం గ్రామీణం, న్యూస్‌టుడే : క్రిస్మస్ ఆరాధనాలు సమాజంలో శాంతిని ప్రోత్సహిస్తాయని మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు పేర్కొన్నారు. గుంటుపల్లిలో ఆదివారం నిర్వహించిన సెమీ క్రిస్మస్ ఆరాధనలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా పాస్టర్ అల్లూరి విశ్వప్రసాద్ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. యేసుక్రీస్తు జన్మ ద్వారా మానవాళికి ఇచ్చిన శాంతి, ప్రేమ, క్షమాభావనలను వివరించారు. అనంతరం నిర్వాహకులు విశ్వాసులకు భోజనాలు వడ్డించారు. మోగాల్ భూమారెడ్డి, ఆయన కుటుంబ సభ్యులు పర్యవేక్షించారు.

కబడ్డీ రంగానికి సేవలు ఎనలేనివి



కేపీ రావును సత్కరిస్తున్న మాజీ ఎంపీ లగడపాటి రాజగోపాల్, చిత్రంలో నరసింహ చౌదరి

విజయవాడ (క్రీడలు), న్యూస్‌టుడే: రాష్ట్ర కబడ్డీ రంగానికి కేపీ రావు చేసిన కృషి మరవలేనిదని మాజీ ఎంపీ, రాష్ట్ర ఒలింపిక్ సంఘం మాజీ అధ్యక్షుడు లగడపాటి రాజగోపాల్ అన్నారు. గురునానక్ కాలనీలోని ఎన్‌ఏసీ కల్యాణ మండపంలో కేపీ రావు కబడ్డీలో 50 ఏళ్ల పూర్తి చేసుకున్న సందర్భంగా గోల్డెన్ జూబ్లీ వేడుక ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఇంటర్నేషనల్ ఒలింపిక్ కౌన్సిల్(ఐవోసీ) మాజీ సభ్యుడు నరేంద్ర ధ్రువ్‌బత్రా, మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు, మాజీ ఎంపీ లగడపాటి రాజగోపాల్ హాజరై కేపీ రావును సత్కరించారు. లగడపాటి మాట్లాడుతూ కేపీ రావు 50 ఏళ్ల క్రీడా జీవితం, ముఖ్యంగా కబడ్డీకి చేసిన సేవలను కొనియాడారు.

మహిళలు పారిశ్రామిక వేత్తలుగా మారాలి



బస్సు వద్ద మున్సిపల్ ఛైర్మన్ చిట్టిబాబు, తెదేపా నాయకులు

ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే : పొదుపు సంఘ మహిళలు చిన్న పాటి పారిశ్రామిక వేత్తలుగా ఎదిగేందుకే ఎన్ఐఆర్‌డీ(నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్)లో శిక్షణ కార్యక్రమమని కొండపల్లి పురపాలిక ఛైర్మన్ చిట్టిబాబు అన్నారు. కేశినేని ఫౌండేషన్, ఎన్ఐఆర్‌డీలు సంయుక్తంగా పొదుపు సంఘ మహిళలకు వివిధ అంశాల్లో అయిదు రోజుల శిక్షణను హైదరాబాద్‌లో ఇస్తోంది. ఈ నేపథ్యంలో 45 మంది పొదుపు సంఘ మహిళలతో కూడిన బృందం ఆదివారం శిక్షణ కేంద్రానికి బయలుదేరింది. ఈ సందర్భంగా ఛైర్మన్ చిట్టిబాబు, తెదేపా నాయకుడు సీతారామయ్య జెండా ఊపి బస్సును ప్రారంభించారు. పలువురు కూటమి నాయకులు పాల్గొన్నారు.

యూటీఎఫ్ మండల కార్యవర్గం ఎన్నిక



ఆర్మ్‌స్ట్రాంగ్ సూర్యనారాయణ

ఇబ్రహీంపట్నం గ్రామీణం, ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే : ప్రస్తుతం ఉపాధ్యాయులుగా విధులు నిర్వహిస్తున్న వారికి టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలని రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు కె.శ్రీనివాసరావు కోరారు. స్థానిక యూటీఎఫ్ కార్యాలయంలో ఆదివారం జరిగిన ఇబ్రహీంపట్నం మండల శాఖ ఎన్నికల నిర్వహణ కమిటీకి ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. అంతక ముందు జరిగిన మండల శాఖ ఎన్నికల్లో అధ్యక్షుడిగా కేజే ఆర్మ్‌స్ట్రాంగ్, ప్రధాన కార్యదర్శిగా సముద్రల సూర్యనారాయణ, కోశాధికారిగా ఫరూక్, ఉపాధ్యక్షులుగా కరిముల్లా, మరియ కుమారి ఎన్నికైయ్యారు. ఎన్నికలను జిల్లా కార్యదర్శులు హరిప్రసాద్, సదానందలు పర్యవేక్షించారు.

ఎమ్మెల్యే పవర్ ఏంటో చూపించమంటారా?

నందిగామ : నందిగామ శాసన సభ్యులు ఎవరో తెలియదని మాజీ ఎమ్మెల్యే మొండితోక జగన్మోహనరావు అహంకార పూరితంగా మాట్లాడుతున్నారని విప్, స్థానిక ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం స్థానిక కాకాని నగర్‌లోని తన కార్యాలయంలో సౌమ్య.. మాజీ ఎమ్మెల్యే ఆరోపణలపై ఘాటుగా స్పందించారు. గత సార్వత్రిక ఎన్నికల్లో తనపై 27 వేల ఓట్ల తేడాతో ఓడిపోయి మతిభ్రమించి మాట్లాడుతున్నారని ఆరోపించారు. ఎమ్మెల్యే ఎవరో, అధికారం ఎలా ఉంటుందో గుర్తుచేయడం తనకు పెద్ద కష్టం కాదని అన్నారు. కూటమి ప్రభుత్వంలో ప్రజలకు మెరుగైన వైద్యం అందించడానికే పీపీపీ విధానంలో వైద్య కళాశాలలను అప్పగించారని సౌమ్య తెలిపారు. గత వైకాపా ప్రభుత్వంలో నందిగామ వంద పడకల వైద్యశాలకు భూములు రిజిస్ట్రేషన్ చేయకుండానే ఊరు బయట భవన నిర్మాణానికి ఎన్నికలకు ముందు మాజీ ఎమ్మెల్యే సోదరులు శంకుస్థాపన చేయించారని ఎమ్మెల్యే సౌమ్య ఆరోపించారు.

చదువుతోనే ఉన్నత స్థాయికి ఎదుగుతాం



విద్యార్థులతో నాగేశ్వరరెడ్డి, వెంకటేశ్వరరావు, నాగలక్ష్మి

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే : ప్రతి విద్యార్థి చదువును ఆయుధంగా చేసుకుని ఉన్నత స్థాయికి చేరాలని రెడ్డిగూడెం ఎంఎన్ఆర్ ఫౌండేషన్ అధ్యక్షుడు ఎం.నాగేశ్వరరెడ్డి అన్నారు. ఆదివారం కుదప, కూనపరాజుపర్వ జడ్పీ ఉన్నత పాఠశాలల్లోని పది తరగతి విద్యార్థులకు యూటీఎఫ్ రూపొందించిన స్టడీ మెటీరియల్‌ను ఎంఎన్ఆర్ ఫౌండేషన్ అధ్యక్షుడు నాగేశ్వరరెడ్డి ఆర్థిక సాయంతో పంపిణీ చేశారు. కార్యక్రమంలో కూనపరాజుపర్వ పీఏసీఎస్ అధ్యక్షుడు ఆర్.వెంకటేశ్వరరావు, యూటీఎఫ్ నాయకులు డి.ప్రకాష్, నాగలక్ష్మి, భవాని, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దారి బాగు చేయండయ్యా..!



మండలంలోని పుల్లూరు శివారు చిలుకూరివారిగూడెంలో బుడమేరు వాగు అంచునున్న శ్మశాన వాటికకు వెళ్లే రోడ్డు దీర్ఘకాలంగా ఎటువంటి అభివృద్ధికి నోచుకోవడం లేదు. కాలాలకు అతీతంగా ప్రధాన రహదారి నుంచి బుడమేరు వాగు మీదుగా అక్కడకు వెళ్లే మార్గం బురదమయంగా మారింది. దీంతో పలువురు దహన సంస్కారాలకు ఇబ్బందులు పడుతుంటే, గ్రామస్థుల సాయంతో యువత విరాళాలతో గతంలోనే స్లాబు వేయించారు. కానీ అక్కడి వరకు వెళ్లాలన్నా ఇబ్బందిగా ఉండటంతో సీసీ రహదారి వేయాలని ప్రజలు ఏళ్లుగా కోరుతున్నా పాలకులకు పట్టడం లేదు. - న్యూస్‌టుడే, మైలవరం

వంతెన శిథిలం..ఎన్నటికో పదిలం



మండల కేంద్రంలోని ప్రధాన కూడలి నుంచి ఎస్సీవాడకు వెళ్లే రోడ్డులో కోతుల వాగుపై ఉన్న వంతెన శిథిలావస్థకు చేరింది. గతంలో దీనిపై నుంచి వాహనాలు వెళ్లకుండా అధికారులు అడ్డుగా గోడలు కట్టించారు. ప్రస్తుతం కొందరు వాటిని తొలగించి రాకపోకలు సాగిస్తుండటంతో ఎప్పుడు ఏం జరుగుతుందోనని స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి శిథిలావస్థకు చేరిన వంతెనను తొలగించి కొత్తది నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, రెడ్డిగూడెం

సమస్య తీవ్రం.. స్పందించని వైనం



వైకాపా హయాంలో పంచాయతీల్లో నిధుల లేమితో గ్రామాల్లో పారిశుద్ధ్యం అస్తవ్యస్తంగా తయారైంది. కూటమి ప్రభుత్వం రాకతో పల్లెలకు మహర్దశ పట్టిందని ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో పినపాక గ్రామంలో సీసీ రోడ్లు వేసి, ఎనిమిది వీధుల్లో డ్రెయిన్ల నిర్మాణం చేపట్టారు. కానీ ఇక్కడే మరో సమస్య ఎదురైంది. గ్రామంలోని ప్రధాన రహదారికి అనుసంధానంగా నిర్మించిన సీసీ డ్రెయిన్లపై మూతలు వేయకపోవడంతో వాటిని దాటలేక అవస్థలు పడుతున్నామని వృద్ధులు వాపోతున్నారు. ఈ సమస్యను పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం శూన్యమని స్థానికులు ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి కాలువలపై మూతలు వేయించి తమ అవస్థలు తొలగించాలని గ్రామస్థులు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, జి.కొండూరు

బోరు పని చేయక.. వెతలు తీరక



పినపాక ఎస్సీ శ్మశాన వాటికలోని పంచాయతీ బోరు పూర్తిగా ధ్వంసమైంది. ఇది పని చేయక పోవడంతో కర్మకాండలు నిర్వహించుకునేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యను పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం లేకుండా పోయిందని వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి బోరుకు మరమ్మతులు చేయించి తమ అవస్థలు తొలగించాలని పలువురు వేడుకుంటున్నారు. - న్యూస్‌టుడే, జి.కొండూరు

16 నుంచి వైష్ణవాలయాల్లో ధనుర్మాస ఉత్సవాలు



నెమలి కృష్ణాలయంలో గోదాదేవి అమ్మవారు

గంపలగూడెం, న్యూస్‌టుడే : తిరువూరు నియోజకవర్గంలోని వైష్ణవాలయాల్లో ఈ నెల 16 నుంచి ధనుర్మాసోత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఈ సందర్భంగా గోదారంగనాయకుల ఉత్సవాలు వైభవంగా నిర్వహించేందుకు అర్చకులు, ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేస్తున్నారు. వచ్చే నెల 14 వరకు వేకువజాము నుంచే గోదాదేవి పాశురాలు ఆలపిస్తూ ప్రజలను మేలుకొలుపుతారు. మార్గశిరం ఆధ్మాత్మిక మాసం కావడంతో ప్రజల్లో భక్తిభావం నెలకొంటోంది.

నేటి నుంచి ధ్యాన సప్తాహం కార్యక్రమాలు

కొండపల్లి, న్యూస్‌టుడే : ప్రపంచ ద్వితీయ ధ్యాన దినోత్సవం సందర్భంగా శాంతివన్ యోగా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ధ్యాన సప్తాహం కార్యక్రమాన్ని నేటి నుంచి వారం పాటు నిర్వహించనున్నామని సంస్థ ఛైర్మన్ లంకే జనార్దన్ తెలిపారు. ఇందులో భాగంగా పలు ప్రాంతాల్లో ప్రత్యేక ధ్యాన కార్యక్రమాలు నిర్వహిస్తామని ఆయన చెప్పారు.

జనవరి 3న మైలవరంలో హిందూ సమ్మేళనం



మైలవరం: కరపత్రాలు ఆవిష్కరిస్తున్న సంఘ సభ్యులు

జి.కొండూరు : ఇంటింటా ప్రచారం చేస్తున్న సభ్యులు

మైలవరం, న్యూస్‌టుడే : మైలవరంలో జనవరి 3న నిర్వహించనున్న హిందూ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని హిందూ సంఘ సభ్యులు తెలిపారు. కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను స్థానిక భగవద్గీతా మందిరంలో ఆవిష్కరించారు. సమ్మేళనానికి స్వామిజీలు, విశ్వ హిందూ పరిషత్ సభ్యులు, ఆర్‌ఎస్‌ఎస్ ప్రముఖులు హాజరవుతారని చెప్పారు.

జి.కొండూరు, న్యూస్‌టుడే : త్రైత సిద్ధాంతం ప్రబోధ సేవా సమితి హిందూ జ్ఞానవేదిక విజయవాడ వారి ఆధ్వర్యంలో భగవద్గీత ప్రచారం నిర్వహించినట్లు సేవా సమితి సభ్యుడు కె.సత్యం తెలిపారు. జి.కొండూరులో ఆదివారం భగవద్గీత ప్రచారకర్తలతో కలిసి ఇంటింటా తిరిగి పలు విషయాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో పి.నాగరాజు, రమేష్, లక్ష్మీ, చెంచు ప్రవీణ, రాజేశ్వరి, దుర్గారావు, చంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరాలకు విశేష స్పందన



రామచంద్రాపురం : వైద్య పరీక్షలు చేయించుకుంటున్న ప్రజలు

ఎ.కొండూరు, గంపలగూడెం, న్యూస్‌టుడే : ఎ.కొండూరు మండలం రామచంద్రాపురం శివదత్తసాయి మందిరంలో ఎన్నారై గుంటక సుదర్శన రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం విజయవాడ సెంటిని ఆసుపత్రి వైద్యులు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఇందులో గ్రామస్థులు 150 మంది పాల్గొని పలు రకాల వైద్య పరీక్షలు చేయించుకున్నారు. సాయి సేవాదళ్ సభ్యులు బాలాజీ ప్రసాద్, సుబ్బారావు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

పుట్రేల(విస్సన్నపేట), న్యూస్‌టుడే : మండల పరిధి పుట్రేల గ్రామంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో పుట్రేల సొసైటీ ఛైర్మన్ కస్తూరి సీతారామస్వామి ఆధ్వర్యంలో విజయవాడ బెస్ట్ ఆసుపత్రి వారిచే వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామస్థులకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఆసుపత్రి ఛైర్మన్ డా.కొండవీటి సంతోష్ కృష్ణ దంపతులు, జనసేన నాయకులు మనుబోలు శ్రీనివాసరావు, యాసిన్, ఉయ్యూరు జయప్రకాష్, పుచ్చకాయల నర్సారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కవులూరులో సేవలందిస్తున్న వైద్యులు ఈశ్వర్, పవన్

జి.కొండూరు, న్యూస్‌టుడే : కవులూరు గ్రామంలో ధన్వంతరి ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రతి నెలా రెండవ ఆదివారం నిర్వహించే ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. వైద్యులు ఈశ్వర్, పవన్ పలువురికి వైద్య పరీక్షలు చేశారు. ట్రస్టీ జువ్వా వెంకటేశ్వరరావు, రామారావు, బొర్రా నవీన్ పాల్గొన్నారు.

పొద్దుపోయే వరకు జాతీయ లోక్ అదాలత్

గవర్నర్‌పేట, న్యూస్‌టుడే : విజయవాడ మండల న్యాయ సేవాధికార కమిటీ ఆధ్వర్యంలో విజయవాడ న్యాయస్థానాల ప్రాంగణంలో శనివారం రాత్రి 9.30 గంటల వరకు కొనసాగింది. 16 బెంచిల ద్వారా 16,566 కేసులను పరిష్కరించారు. 67 మోటారు యాక్సిడెంట్ కేసులను పరిష్కరించి బాధితులకు రూ.4.15కోట్లు పరిహారం ఇచ్చారు. రాజీ పడతగ్గ క్రిమినల్ కేసులు 16,383 పరిష్కరించి బాధితులకు రూ.11.65కోట్లు, ఇతర సివిల్ కేసులు 69 పరిష్కరించి రూ.6.69 కోట్లు, 47 ప్రీలిటిగేషన్ కేసుల్లో రూ.2,11,271లు పరిహారం ఇప్పించారు. మండల న్యాయ సేవాధికార సంస్థ ఛైర్మన్, రెండో అదనపు జిల్లా జడ్జి ఎ.సత్యానంద్ మాట్లాడుతూ.. హైకోర్టు ఆదేశానుసారం రాత్రి పొద్దు పోయే వరకు బెంచ్‌లు పని చేసి కేసులను పరిష్కరించాయని తెలిపారు. సహకరించిన న్యాయమూర్తులు, న్యాయవాదులు, పోలీసులు, బీమా కంపెనీలకు, కక్షిదారులకు, కోర్టు సిబ్బందిని అభినందించారు.

4 రోజుల్లో 24 వేల ట్యాగ్‌లు



దుర్గాఘాట్ సమీపంలో చిన్నారికి ట్యాగ్ వేస్తున్న వాలంటీర్లు

ఇంద్రకీలాద్రి, విజయవాడ వన్‌టౌన్, న్యూస్‌టుడే: భవానీ దీక్షల విరమణలో వేల సంఖ్యలో దీక్షాధారులు తరలి వస్తున్న నేపథ్యంలో చిన్నారులకు ట్యాగ్ వేయాలని జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ అధికారి షేక్ రుక్సానా సుల్తానా బేగం పేర్కొన్నారు. మోడల్ గెస్టు హౌస్ సమీపంలోని కమాండ్ కంట్రోల్ రూమ్ వద్ద ఆదివారం ఆమె మాట్లాడారు. నాలుగు రోజులుగా 240 మంది సిబ్బంది.. 12 ప్రదేశాల్లో 24 వేల మంది చిన్నారులకు ట్యాగ్ వేశారన్నారు. చిన్నారులు తప్పి పోకుండా ట్రాక్ చేసేందుకు దోహదపడుతుందన్నారు. సీసీ కెమెరాల ఆధారంగా తప్పిపోయిన చిన్నారులను వారి తల్లిదండ్రులకు అప్పగించామని తెలిపారు. సీడీపీవోలు లక్ష్మీభార్గవి, కృష్ణకుమారి, భానుమతి, డీసీపీవోలు రాజేశ్వరరావు, కిరణ్‌కుమార్, దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

స్నానఘాట్‌లలో భజనలు



భవానీపురం, న్యూస్‌టుడే: భవానీ దీక్షల విరమణ పురస్కరించుకుని కృష్ణానది ఒడ్డున పున్నమి, భవానీ స్నానఘాట్‌ల వద్ద భవానీ భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. జల్లు స్నానాలు చేసి గిరి ప్రదక్షిణకు బయలుదేరి వెళ్లారు. అక్కడే భజనలు చేశారు.

ఆలోచన మరుగు.. అధ్వానం నెలవు

పురపాలికలో క్షీణించిన పారిశుద్ధ్యం

కొండపల్లి, న్యూస్‌టుడే

కొండపల్లి పురపాలికలోని డ్రెయిన్లలో వ్యర్థాలతో కూడిన కవర్ల మూటలు కుప్పలు తెప్పలుగా దర్శనమిస్తున్నాయి. దీంతో పురపాలికలో పారిశుద్ధ్యం ప్రశ్నార్థకంగా మారింది. ఎక్కడి కాలువలు చూసినా ప్లాస్టిక్ వ్యర్థాలతో నిండుగా కనిపిస్తున్నాయి. గృహాల్లో వినియోగించిన వ్యర్థాలను కాలువల్లో పడవేయవద్దని గతంలో పురపాలిక సంఘం అధికారులు ప్రకటనలు చేశారు. మూడు ప్లాస్టిక్ బుట్టలు అందించి తడి, పొడి చెత్త, హానికర వ్యర్థాలను విభజించి వాటిల్లో వేయాలని అవగాహన కల్పించారు. అయితే ఆ చెత్త బుట్టలను సేకరించేందుకు సిబ్బంది నివాసితుల వద్దకు వెళ్లకపోవడంతో మూడు ప్లాస్టిక్ బుట్టల ఆలోచన మరుగున పడిపోయింది. అవి నీరు నింపుకోవడానికి మాత్రమే పరిమితమయ్యాయి. గృహ వినియోగంలోని వ్యర్థాలు పాలిథిన్ కవర్లలో మూటలుగా మారిపోయాయి. దీంతో వాటిని అత్యధిక మంది డ్రెయిన్లలోనే విసిరేస్తున్నారు.

◆ ఈ నేపథ్యంలో కాలువల్లో మురుగు పారుదల లేక ఎక్కడికక్కడ నిలిచిపోతోంది. అయితే వీటిని తొలగించడానికి పారిశుద్ధ్య కార్మికులు నానా అవస్థలు పడుతున్నారు. ఆ ఇబ్బందులను భరించలేక కాలువల్లో మురుగును తొలగించే పనులకు వారు దూరంగా ఉంటున్నారు. దీంతో దాదాపు అన్ని వీధుల్లోనూ పారిశుద్ధ్య సమస్య తలెత్తుతుంది. మున్సిపాలిటీలో క్యాడర్ స్ట్రెంత్ లేకపోవడంతో పాటు పారిశుద్ధ్యానికి ప్రత్యేక అధికారులు లేకపోవడం పెద్ద సమస్యగా తయారైంది. ఇప్పటికైనా దీనిపై పుర ప్రజలకు అవగాహన కల్పించి చెత్తను సకాలంలో ఇంటింటా సేకరిస్తే పరిస్థితి మెరుగువుతోంది.



కొండపల్లిలోని డ్రెయిన్‌లో ప్లాస్టిక్ కవర్లు

పతాక స్థాయికి చేరిన వర్గ విభేదాలు

తిరువూరు, న్యూస్‌టుడే : తిరువూరు నియోజకవర్గ తెదేపాలో వర్గ విభేదాలు భగ్గుమంటున్నాయి. ఇవన్నీ సామాజిక మాధ్యమాల్లో వ్యక్తిత్వ హననం చేసుకునే స్థాయికి వెళ్లాయి. రెండ్రోజుల నుంచి ఎమ్మెల్యే కె.శ్రీనివాసరావుకు, ఆయన వ్యతిరేక వర్గీయులకు మధ్య జరుగుతున్న ఆరోపణలు పతాక స్థాయికి చేరాయి. దీంతో నియోజకవర్గంలో రాజకీయ దుమారం లేపాయి. సామాజిక మాధ్యమంలో పంచాయితీలకు తెరతీశాయి.



దుకాణాల నుంచి ఎగసి పడుతున్న మంటలు

వాణిజ్య సముదాయంలో భారీ అగ్ని ప్రమాదం

గుడివాడలో రూ.కోటికి పైగా ఆస్తి నష్టం

గుడివాడ, న్యూస్‌టుడే: కృష్ణా జిల్లా గుడివాడ పట్టణంలోని అద్దేపల్లి కాంప్లెక్స్ వాణిజ్య దుకాణ సముదాయంలో ఆదివారం తెల్లవారుజామున భారీ అగ్ని ప్రమాదం జరిగింది. ఏడు దుకాణాలు పూర్తిగా అగ్నికి ఆహుతి కాగా రూ.కోటికి పైగా ఆస్తి నష్టం వాటిల్లింది. కాంప్లెక్స్‌లో ఒ.యూసఫ్, ఊర్వేష్ రెండు గదులు అద్దెకు తీసుకుని సెల్‌ఫోన్ దుకాణం నిర్వహిస్తున్నారు. ఆదివారం తెల్లవారుజామున 4 గంటలకు దుకాణాల్లో సెల్‌ఫోన్లు పేలుతున్న శబ్దాన్ని రాత్రి కాపలాదారు పరశురామ్, మరో వ్యక్తి గుర్తించారు. వెంటనే దుకాణ నిర్వాహకులకు ఫోన్ చేసి చెప్పారు. ప్రమాదం విషయం తెలిసి విజయ, పావని టెక్స్‌టైల్స్, ప్రభు డిజైన్ వర్క్స్ దుకాణాల యజమానులైన బూరగడ్డ కృష్ణ మోహన్, ప్రభావతి దంపతులు అక్కడికి చేరుకున్నారు. షట్టర్ తీసి పట్టుచీరలు బయట పడేసేందుకు ఉపక్రమించగా మంటలు ఈ దుకాణానికీ వ్యాపించాయి. గుడివాడ, హనుమాన్ జంక్షన్, ఉయ్యూరు నుంచి వచ్చిన అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపుచేసేందుకు తీవ్రంగా శ్రమించారు. ప్రమాదానికి కారణం షార్ట్ సర్క్యూట్‌గా భావిస్తున్నారు.



కాలిపోయిన చీరలు



బూడిదైన సెల్‌ఫోన్లు

రైతులు సౌభాగ్యంగా ఉండేందుకు శిక్షణ

- ఎకరంలో 64 రకాల పంటల సాగుతో సత్ఫలితాలు
- వాటిని ఇతరులకు అందించేందుకు సేవ్ సంస్థ నిర్వాహకుడు విజయరామ్ కృషి



సౌభాగ్య విధానంలో సాగు చేసిన పంటలు

మచిలీపట్నం కార్పొరేషన్, గూడూరు, న్యూస్‌టుడే: మన పూర్వీకులు వ్యాధులంటే ఏంటో తెలియకుండా పెరిగారు. ఒకవేళ అనారోగ్యంగా ఉంటే శొంఠి, మిరియాల కషాయం లాంటి వాటితో తగ్గించుకునేవారు. ప్రస్తుతం పుట్టినప్పటి నుంచి ఆసుపత్రుల చుట్టూ తిరగాల్సి వస్తోంది. ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలంటే తీసుకునే ఆహారం ఔషధమై ఉండాలని, ప్రకృతి సేద్యంతోనే అది సాధ్యమని గుర్తించి.. కొన్నేళ్లుగా ఆ విధానం అవలంబిస్తూ ఇతర రైతులను సైతం ప్రోత్సహిస్తున్నారు.. 'సేవ్' సంస్థ నిర్వాహకుడు మేకపోతుల విజయరామ్. కొత్తగా సౌభాగ్యం పేరుతో మరో నూతన విధానాన్ని ఆయన అందుబాటులోకి తెచ్చారు.



పొలం మధ్యలో వేసిన పందిళ్లపై తీగజాతి కూరగాయల సాగు

3వేల మందికి శిక్షణ

బహుళ పంటల విధానంలో రోజూ పని దొరకడంతో పాటు ఆదాయం కూడా వస్తుంది. ఒక దానిలో నష్టం వచ్చినా మరొకటి ఆదుకుంటుంది. ఈ విధానంలో వరికి అందించే నీటిలో 2% అందిస్తే సరిపోతుంది. ఆయా ప్రయోజనాలను వివరించి రైతులను ప్రోత్సహించే దిశగా విజయరామ్ చర్యలు తీసుకున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో జిల్లాకు వందమందికి తగ్గకుండా దాదాపు 3వేల మందికి ఉచిత శిక్షణ ఇచ్చేందుకు ఏర్పాట్లు చేశారు. వీరిని మాస్టర్‌ట్రైనర్లుగా తీర్చిదిద్ది వారి ద్వారా ఆయా ప్రాంతాల్లో రైతులకు అవగాహన కల్పించాలని నిర్ణయించారు. ఇందుకోసం పినగూడూరులంక గోసదన్‌లో డిసెంబరు 15 నుంచి జనవరి 15 వరకు శిక్షణ తరగతులు నిర్వహించనున్నారు.



పసుపు పంటతో పాటు వివిధ రకాల మొక్కలు

సుభాష్ పాలేకర్ స్ఫూర్తితో..

"సుభాష్ పాలేకర్ స్ఫూర్తితో పలు విధానాల్లో ప్రకృతి సాగుచేస్తున్నా. కొత్తగా చేపట్టిన సౌభాగ్య విధానంలో ఏడాదికి రూ.3 లక్షలకు మించి ఆదాయం పొందా. 400 గజాల్లోనూ ఇలా సాగు చేయవచ్చు. నేను చెప్పినట్లు చేస్తే ఉప్పు తప్ప మరేదీ బయట కొనాల్సిన అవసరం ఉండదు."

– మేకపోతుల విజయరామ్, సేవ్ సంస్థ నిర్వాహకులు



ఏడాదికి రూ.3 లక్షలకు తగ్గకుండా ఆదాయం

అవసరాలకు మించి వరిసాగు చేయడం, ధాన్యం విక్రయాలకు ఇబ్బందులు పడడం చూసి కలత చెందిన విజయరామ్.. భూమి ఆరోగ్యం, ఆరోగ్యవంతమైన సమాజం, అన్నదాతలకు అధికాదాయం లక్ష్యంతో కొన్నేళ్లుగా ప్రకృతి సాగు చేస్తున్నారు. తెలంగాణ రాష్ట్రం వికారాబాద్‌లోని ఆయన వ్యవసాయ క్షేత్రంలో వరికి ప్రత్యామ్నాయంగా ఏడేళ్ల పాటు పరిశోధనలు చేసి సౌభాగ్యం అనే నూతన విధానాన్ని అందుబాటులోకి తెచ్చారు. దీన్ని కృష్ణాజిల్లా గూడూరు మండలం పినగూడూరులంకలోని ఆయనకు చెందిన గోసదన్‌లో ఎకరం విస్తీర్ణంలో సాగుచేశారు. పసుపు, వట్టివేరు, మునగ కొంత ఎక్కువగా వేసి మిగిలిన విస్తీర్ణంలో కరివేపాకు, అల్లం, మిరియాలు, చేమదుంప తదితరాలతో పాటు దోస, కాకర, బీర, వంగ, బెండ తదితర కూరగాయలు, తోటకూర, గోంగూర, పాలకూర లాంటి ఆకుకూరలు, అరటి, బొప్పాయి లాంటి పండ్ల మొక్కలు వేశారు. మొత్తం 64 రకాలు ఉన్నాయి. వీటిద్వారా ఏడాదికి రూ.3లక్షలకు తగ్గకుండా ఆదాయం వచ్చేలా రూపొందించారు.

చిన్నారుల్లో తగ్గిన పోషకాహార లోపం

- 2024 జూన్‌తో పోలిస్తే 2025 నవంబరు నాటికి గణనీయ పురోగతి
- అంగన్‌వాడీలపై పర్యవేక్షణ, పారదర్శక విధానాలతో మంచి ఫలితాలు

ఈనాడు, అమరావతి: గత ఏడాది జూన్‌తో పోలిస్తే 2025 నవంబరు నాటికి ఆరేళ్లలోపు చిన్నారుల్లో వయసుకు తగ్గ ఎత్తు, ఎత్తుకు తగ్గ బరువు విషయంలో మెరుగుదల నమోదైంది. అధిక బరువు(ఊబకాయం) ఉండే పిల్లల సంఖ్య భారీగా తగ్గింది. మహిళా శిశు సంక్షేమ శాఖ ప్రతి నెలా అంగన్‌వాడీ కేంద్రాల్లో నమోదైన పిల్లల బరువు, ఎత్తును తూచి పోషకాహార లోపాన్ని అంచనా వేస్తోంది. అప్పటితో పోలిస్తే వయసుకు తగ్గ ఎత్తు లేని పిల్లల సంఖ్య 9.6% తగ్గింది. వయసుకు తగ్గ బరువు లేని పిల్లల సంఖ్య 3.9%, ఎత్తుకు తగ్గ బరువు లేని చిన్నారుల సంఖ్య 1.7%, ఊబకాయం ఉండే పిల్లల సంఖ్య 0.7% తగ్గింది.



ఎఫ్‌ఆర్‌ఎస్ ద్వారా పోషకాహారం పంపిణీ...

అంగన్‌వాడీ కేంద్రాల్లో 0-3 ఏళ్ల చిన్నారులకు ఇంటికే పోషకాహారాన్ని అందిస్తారు. బాలామృతం, పాలు, గుడ్లు ఇస్తారు. 3-6 ఏళ్ల పిల్లలకు కేంద్రాల్లోనే విద్య అందించడంతోపాటు మధ్యాహ్నం భోజనం పెడతారు.

- ✦ గతంలో లబ్ధిదారుల ఇళ్లకు పోషకాహార పంపిణీని మాన్యువల్‌గా రిజిస్టర్‌లో నమోదు చేసి ఇచ్చే వారు.
- ✦ ఈ విధానంలో 100 శాతం పంపిణీ జరిగిందా? నిర్దేశిత చిన్నారులకే అది అందిందా? అనేది గుర్తించడం కష్టంగా ఉండేది.
- ✦ కూటమి ప్రభుత్వం పోషకాహారం అందించడంలో ఫేషియల్ రికగ్నేషన్ విధానాన్ని తీసుకొచ్చింది. ఇది పారదర్శకతను పెంచింది.
- ✦ అంతేకాకుండా పోషకాహారాన్ని కేంద్రాలకు సరఫరా చేసిన వెంటనే ఆ సమాచారాన్ని తల్లిదండ్రుల మొబైల్‌కు మెసేజ్ రూపంలో అందిస్తున్నారు.
- ✦ గుత్తేదారుల నుంచి అంగన్‌వాడీ కేంద్రాలకు పోషకాహారాన్ని సరఫరా చేయడంలో పర్యవేక్షణ పెంచారు. రాష్ట్రస్థాయి నుంచి అంగన్‌వాడీ కేంద్రం వరకు జీపీఎస్ విధానం ద్వారా రవాణా వాహనాలను ట్రాక్ చేస్తున్నారు. జాప్యం లేకుండా చర్యలు తీసుకుంటున్నారు. గతంలో 20 నుంచి నెల రోజుల జాప్యంలో పోషకాహారం పిల్లలకు అందేది.
- ✦ 3-6 ఏళ్ల చిన్నారులకు మధ్యాహ్న భోజనంలో నిర్దేశిత మెనూ అమలు చేస్తున్నారా? లేదా? అనేది కూడా పక్కాగా అంచనా వేస్తున్నారు. దీనికి ఏఐ ఆధారిత యాప్‌ను తీసుకొచ్చారు.
- ✦ పిల్లల్లో ఎత్తు, బరువును తెలుసుకొనేందుకు ఎలక్ట్రానిక్ పరికరాల్ని ప్రతి అంగన్‌వాడీ కేంద్రానికి అందించారు.

	వయసుకు తగ్గ ఎత్తు లేని పిల్లలు(%)	వయసుకు తగ్గ బరువు లేని పిల్లలు(%)	ఎత్తుకు తగ్గ బరువు లేని పిల్లలు(%)
2024 జూన్	20.7	9.8	5.6
2025 నవంబరు	11.1	5.9	3.9
తేడా	9.6	3.9	1.7

ప్రత్యేక డ్రైవ్...

అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారుల్లో పోషకాహార లోపంపై అధికారంలోకి రాగానే ప్రభుత్వం దృష్టి సారించింది. చిన్నారుల్లో ఎక్కువ పోషకాహార లోపం ఉండే కేంద్రాలను రాష్ట్రవ్యాప్తంగా గుర్తించి ప్రత్యేక డ్రైవ్ చేపట్టి కారణాల్ని అన్వేషించింది. తల్లిదండ్రులకు అవగాహన కల్పించడంతోపాటు కార్యకర్తలను ఇంటింటికీ పంపి కచ్చితంగా ప్రభుత్వం అందించే పోషకాహారం పిల్లలకే చేరేలా చర్యలు తీసుకుంది.

అప్పుడు

- ✦ 2024 జూన్‌లో రాష్ట్రవ్యాప్తంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో 0-6 ఏళ్ల వయసున్న చిన్నారుల సంఖ్య 24.87 లక్షలుగా ఉంది. వారిలో 23.98 లక్షల (96.45%) మంది బరువు, ఎత్తు విలువల్ని కొలిచారు.
- ✦ వారిలో4.96 లక్షల మంది వయసుకు తగ్గ ఎత్తు లేనట్లు గుర్తించారు
- ✦ 1.34 లక్షల మంది చిన్నారుల్లో వయసుకు తగ్గ బరువు లేనట్లు తేలింది.
- ✦ ఎత్తుకు తగ్గ బరువు లేని పిల్లలు 2.38 లక్షలున్నట్లు వెల్లడైంది.

ఇప్పుడు

- ✦ ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా 55,764 అంగన్‌వాడీ కేంద్రాల్లో ఉన్న 20.32 లక్షల మందిలో 20.17 లక్షల మంది(99.25%) చిన్నారుల కొలతల్ని నమోదు చేశారు.
- ✦ వీరిలో వయసుకు తగ్గ ఎత్తు లేని పిల్లలు 2.24 లక్షలు మంది ఉన్నారు.
- ✦ వయసుకు తగ్గ బరువు లేని పిల్లలు 80,354 మంది ఉన్నట్లు గుర్తించారు.ఎత్తుకు తగ్గ బరువు లేని చిన్నారులు 1.18 లక్షలు మంది ఉన్నట్లు తేలింది. 2024 జూన్‌లో ఊబకాయమున్న పిల్లలు 1.1 శాతం ఉండగా, ఇప్పుడు అది 0.4 శాతానికి తగ్గింది. అంటే 0.7 శాతం మేర తగ్గుదల కనిపించింది.

ఐపీఎస్ సునీల్‌కుమార్ విచారణ నేడు



పీవీ సునీల్‌కుమార్

ఈనాడు, అమరావతి: నాటి నరసాపురం ఎంపీ, ప్రస్తుత ఉప సభాపతి రఘురామకృష్ణరాజును వైకాపా ప్రభుత్వ హయాంలో సీఐడీ పోలీసుల కస్టడీలో హింసించిన కేసులో ప్రధాన నిందితుడి (ఏ1)గా ఉన్న సీనియర్ ఐపీఎస్ అధికారి పీవీ సునీల్‌కుమార్ విచారణ సోమవారం జరగనుంది. గుంటూరులోని సీసీఎస్ పోలీసుస్టేషన్‌లో విచారణ చేపట్టనున్నారు. ఈ మేరకు పోలీసులు అన్ని ఏర్పాట్లు చేశారు. విచారణాధికారిగా ఉన్న విజయనగరం ఎస్పీ దామోదర్ ఆదివారం గుంటూరుకు చేరుకున్నారు. డిసెంబరు 4న విచారణకు రావాలని గత నెల 26 న తొలి నోటీసు ఇవ్వగా.. కుటుంబ సభ్యులు అనారోగ్యంతో ఉన్నందున గడువు కావాలని సునీల్‌కుమార్ కోరిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో డిసెంబర్ 15న విచారణకు రావాలని ఈ నెల 6న రెండోసారి నోటీసు ఇచ్చారు.

ఐజీ సునీల్‌నాయక్ గైర్హాజరు

రఘురామకృష్ణరాజును కస్టడీలో హింసించిన కేసుకు సంబంధించి అప్పటి సీఐడీ డీఐజీ, ప్రస్తుతం బిహార్‌లో ఐజీగా పనిచేస్తున్న సునీల్‌నాయక్‌నూ ఆ రోజున ఏం జరిగిందో తెలుసుకోవడానికి గతంలో నోటీసు ఇచ్చి పిలిచారు. అప్పట్లో ఆయన విచారణకు హాజరుకాలేదు. ఇటీవల మళ్లీ ఆదివారం రావాలని దర్యాప్తు అధికారి మరోసారి నోటీసు ఇచ్చారు. అయితే, ఆదివారం కూడా ఆయన హాజరుకాలేదు. వ్యక్తిగత కారణాలతో తనకు గడువు కావాలని కోరినట్లు తెలిసింది. మరోసారి నోటీసు ఇచ్చేందుకు సిద్ధమవుతున్నారు.

సాగర గర్భంలో.. మీనాలకు కాంక్రీటు గూళ్లు!





కృత్రిమ ఆవాసాలుగా వినియోగించే కాంక్రీటు ఆకృతులు



ఉత్తరాంధ్ర తీరంలో గతంలో సముద్రంలోకి వదులుతున్న కాంక్రీటు ఆకృతులు

నరసాపురం, న్యూస్‌టుడే: కాలుష్య కారకాలు, డ్రెడ్జింగ్ తదితర కారణాలతో సముద్ర తీరం నుంచి 12 కిలోమీటర్ల పరిధిలో (ప్రొడక్టివ్ జోన్) చేపల లభ్యత గణనీయంగా తగ్గింది. దీంతో చేపల వేటే ఆధారంగా జీవించే గంగపుత్రులకు ఉపాధి కరవైంది. ఈ పరిస్థితిలో మార్పు తెచ్చే దిశగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్యాచరణ రూపొందించి అమల్లోకి తెచ్చాయి. ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా నుంచి నెల్లూరు జిల్లా వరకు తీరం వెంబడి మత్స్య సంపద వృద్ధి చెందేలా సముద్ర లోతుల్లో కృత్రిమ ఆవాసాలు ఏర్పాటు చేస్తున్నారు. దీనికి అయ్యే వ్యయాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 60:40 నిష్పత్తిలో భరిస్తున్నాయి.

తొలి దశ ఆశాజనకం

చేపలు గుడ్లు పెట్టేందుకు, చేప పిల్లలకు రక్షణ కల్పించేందుకు అనువుగా కాంక్రీటుతో జాలీలు, కుండీలు, పైపులు, ఇతర ఆకృతుల్లో కృత్రిమ ఆవాసాలను రూపొందిస్తున్నారు. వీటిని బోట్లపై తరలించి సముద్రంలో ముందుగా గుర్తించిన ప్రాంతాల్లో జారవిడుస్తున్నారు. తొలివిడతలో శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం జిల్లాల్లో తీరం వెంబడి రూ.7.70 కోట్ల విలువైన 22 కృత్రిమ ఆవాసాలు నెలకొల్పారు. రెండో విడతలో రాష్ట్రంలో మిగిలిన జిల్లాల్లో వీటిని ఏర్పాటు చేయనున్నారు. గతంతో పోల్చితే అంచనా వ్యయం తగ్గించి ప్రస్తుతం.. రూ.5.22 కోట్లతో 162 ఆవాసాలు నెలకొల్పేందుకు అధికారులు సన్నద్ధమవుతున్నారు. "కేరళ, తమిళనాడు రాష్ట్రాలు గతంలో ఈ విధానాన్ని పాటించి సత్ఫలితాలు సాధించాయి. ఆంధ్రప్రదేశ్‌లో ఆరు నెలల కిందట తొలి విడతలో ఉత్తరాంధ్ర జిల్లాల్లో కృత్రిమ ఆవాసాలు ఏర్పాటు చేసిన ప్రాంతాల్లో ఫలితాలు ఆశాజనకంగా ఉన్నాయి. అందుకే రెండో విడతలో మిగిలిన జిల్లాల పరిధిలో వీటి ఏర్పాటుకు చర్యలు చేపడుతున్నాం" అని ఏపీ మత్స్యశాఖ సంయుక్త సంచాలకుడు (మెరైన్) పి.సురేశ్ తెలిపారు.

కోడి.. పందేనికి రె'ఢీ'



డ్రైఫ్రూట్స్‌తో చేసిన చిన్నపాటి లడ్డూ తినిపిస్తూ..



వివిధ ఆకులను ఉడకబెట్టిన వేడినీటితో పందెం కోళ్లకు స్నానాలు చేయిస్తున్న నిర్వాహకులు



స్నానం చేయించిన కోళ్లకు ఆవిరి శరీరానికి పట్టేలా గోనెసంచుల్లో చుడుతూ..

సంక్రాంతి అంటే గుర్తొచ్చేది ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల్లోని పండగ సందడి. పండగ మూడు రోజుల పాటు ఇక్కడ జరిగే కోడి పందేలది మరో ఎత్తు. వాటిని చూసేందుకు స్థానికులతో పాటు ఇతర ప్రాంతాల నుంచి తరలివస్తారు. బరుల్లో రూ.లక్షలు చేతులు మారతాయి. ఆ పందెం కోళ్లను సిద్ధం చేయడమూ మామూలుగా ఉండదు. డేగ, కాకి డేగ, కొక్కిరాయి, నెమలి తదితర పేర్లతో పిలిచే కోళ్లకు దసరా నుంచే ప్రత్యేక ఆహారం అందిస్తూ.. తర్ఫీదిస్తారు. 15 రోజులకు ఒకసారి వాయిలాకు, వేపాకు, కుంకుడాకు, ఉసిరాకు, వట్టివేరు, పసుపు తదితర వాటిని నీటిలో ఉడకబెట్టి ఆ వేడి నీటిలో కోళ్లకు స్నానాలు చేయిస్తారు. అనంతరం ఆ ఆవిరి వాటి శరీరానికి పట్టేలా గోనెసంచుల్లో చుట్టి కొంతసేపు ఉంచుతారు. ఈత కొట్టించడం, ప్రత్యేక వ్యాయామాలు సైతం చేయిస్తుంటారు. ఇలా చేస్తేనే బరిలో అవలీలగా పోరాటం చేస్తాయని నిర్వాహకులు చెబుతున్నారు. కాకినాడ జిల్లా పెద్దాపురం మండలంలోని కట్టమూరులోని ఓ ఫారంలో పందెం కోళ్లను సిద్ధం చేస్తున్న చిత్రాలివి.

– ఈనాడు, కాకినాడ



కాకినాడ జిల్లా పెద్దాపురం మండలం కట్టమూరులో పెంచుతున్న పందెం కోళ్లు



పందేనికి సిద్ధం

11 ఆసుపత్రులను పీపీపీ కింద అప్పగించేందుకు దిల్లీ ప్రభుత్వ ప్రణాళిక

ఈనాడు, దిల్లీ: దేశరాజధాని దిల్లీలో నిర్మాణంలో ఉన్న 11 ఆసుపత్రులను పీపీపీ కింద అప్పగించడానికి దిల్లీ ప్రభుత్వం సిద్ధమవుతోంది. అక్కడ ఆలస్యమవుతున్న ఆసుపత్రుల నిర్మాణాన్ని వేగవంతంచేసి వైద్య ఆరోగ్యసేవలను విస్తరించడానికి పీపీపీ వైపు మొగ్గు చూపింది. దీనికున్న ఆర్థిక, సాంకేతిక, నిర్వహణ సాధ్యాసాధ్యాలపై పూర్తిస్థాయిలో ఫీజిబిలిటీని అధ్యయనం చేయడానికి బిడ్లు ఆహ్వానించింది. పీపీపీ ఫ్రేమ్‌వర్క్‌లో ఈ ఆసుపత్రులను సమర్థంగా పూర్తి చేసి, నిర్వహించడానికి సాధ్యాసాధ్యాలు, ఇందులో ప్రైవేటుభాగస్వామ్యం ఎలా ఉండాలన్నదానిపై అధ్యయనంచేసి నివేదిక రూపొందిస్తారు. ఈ అధ్యయనం పూర్తయిన తర్వాత రాష్ట్ర ప్రభుత్వం పీపీపీకి మొగ్గు చూపితే ఈ 11 ఆసుపత్రుల ద్వారా 10,073 పడకలు అందుబాటులోకి వస్తాయని అంచనా. అందులో 4,314 పడకలు ఐసీయూకి సంబంధించినవి ఉంటాయి. దిల్లీ నలుమూలల్లో ఉన్న నాలుగు సాధారణ ఆసుపత్రులు, ఏడు ఐసీయూ పడకల ఆసుపత్రులను పీపీపీ విధానంలో అప్పగించాలన్నది స్థానిక ప్రభుత్వ ఆలోచన. ప్రతిపాదిత ఫ్రేమ్‌వర్క్‌లో ప్రైవేటు ఏజెన్సీలను పోటీ బిడ్డింగ్ ప్రక్రియ ద్వారా ఎంపిక చేస్తారు. అందులో ఎంపికైన సంస్థలకు ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న ఆసుపత్రులను అప్పగిస్తారు. వాటిని పూర్తిచేసి, తర్వాత నిర్వహించే బాధ్యత వారికే అప్పగిస్తారు. ప్రభుత్వం మొత్తం పర్యవేక్షణ బాధ్యతలను తన చేతుల్లో ఉంచుకుంటుంది.

మూడో అతిపెద్ద స్టార్టప్ ఎకోసిస్టమ్‌గా భారత్

- భారీ ప్రాజెక్టులతో వేగంగా ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి
- మోదీ నాయకత్వంలో భారత్ అద్భుత ప్రగతి
- అటల్-మోదీ సుపరిపాలన యాత్రలో ఉత్తరాఖండ్ సీఎం పుష్కర్‌సింగ్ ధామీ

ఈనాడు డిజిటల్, తిరుపతి: మాజీ ప్రధాని, భారతరత్న అటల్ బిహారీ వాజ్‌పేయీ దేశభక్తి, ప్రజాస్వామ్య విలువలతో వేసిన బాటలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో.. భారత్ ప్రపంచంలోనే మూడో అతిపెద్ద స్టార్టప్ ఎకోసిస్టమ్‌గా ఎదిగిందని ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రి పుష్కర్‌సింగ్ ధామీ ఉద్ఘాటించారు. ఆత్మనిర్భర్ భారత్ లక్ష్యం దిశగా అద్భుత ప్రగతి సాధిస్తోందని చెప్పారు. ఆంధ్రప్రదేశ్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌ల నాయకత్వంలో పేదల సంక్షేమం, అభివృద్ధి వేగంగా జరుగుతోందని తెలిపారు. పోలవరం ప్రాజెక్టు, కొత్త పోర్టులు, గూగుల్ డేటా సెంటర్, సెమీకండక్టర్ పరిశ్రమలు వంటి భారీ ప్రాజెక్టుల ద్వారా అభివృద్ధి వేగం పుంజుకుందన్నారు. తిరుపతిలో ఐఐటీ, ఐఐఐటీ, ఐఐఎస్ఈఆర్ వంటి సంస్థల ఏర్పాటుకు కేంద్రం సహకరించిందని గుర్తుచేశారు. మాజీ ప్రధాని వాజ్‌పేయీ శతజయంతి ఉత్సవాల్లో భాగంగా 'అటల్-మోదీ సుపరిపాలన యాత్ర'ను అన్నమయ్య, తిరుపతి జిల్లాల్లో ఆదివారం నిర్వహించారు. రేణిగుంట పరిధిలోని మర్రిగుంట కూడలి వద్ద తొలుత వాజ్‌పేయీ విగ్రహాన్ని పుష్కర్‌సింగ్ ధామీ ఆవిష్కరించారు. అనంతరం బహిరంగ సభలో మాట్లాడారు. "స్టార్టప్ ఇండియా, మేడ్ ఇన్ ఇండియా, స్కిల్ ఇండియా, డిజిటల్ ఇండియా వంటి పథకాల ద్వారా కేంద్ర ప్రభుత్వం యువతకు అపారమైన అవకాశాలు కల్పించింది. దేశ ప్రధానిగా వాజ్‌పేయీ భారత్‌ను స్వతంత్ర, సంపన్న, ఆత్మనిర్భర దేశంగా మార్చడానికి బాటలు వేశారు. అయోధ్యలో రామమందిర నిర్మాణం, కాశీవిశ్వనాథ్ కారిడార్, ఉజ్జయినిలో మహాకాల్ లోక్ నిర్మాణం, ఉత్తరాఖండ్‌లో కేదార్‌నాథ్-బద్రీనాథ్ మాస్టర్‌ప్లాన్ల ద్వారా ఆధ్యాత్మిక వారసత్వాన్ని పరిరక్షిస్తున్నాం. ఉమ్మడి పౌరస్మృతిని దేశంలోనే తొలిసారిగా అమలు చేసి సామాజిక సమానత్వం, న్యాయం దిశగా ఉత్తరాఖండ్ దేశానికే ఆదర్శంగా నిలిచింది" అని చెప్పారు. అటల్ చూపిన సుపరిపాలన మార్గంలో ప్రధాని మోదీ నాయకత్వంలో దేశం ప్రగతిపథంలో సాగుతోందన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రజలు ఈ అభివృద్ధి యాత్రలో భాగస్వాములై స్వదేశీని ఆదరించి, ఆత్మనిర్భర్ భారత్ నిర్మాణానికి కృషి చేయాలని పుష్కర్‌సింగ్ ధామీ పిలుపునిచ్చారు. అంతకుముందు, అన్నమయ్య జిల్లా మదనపల్లె పట్టణం అమ్మచెరువుమిట్ట అన్నమయ్య కూడలిలో ఏర్పాటు చేసిన వాజ్‌పేయీ కాంస్య విగ్రహాన్నీ ఆయన ఆవిష్కరించారు.



రేణిగుంట పరిధిలోని మర్రిగుంట కూడలి వద్ద ఆదివారం వాజ్‌పేయీ విగ్రహాన్ని ఆవిష్కరించిన పుష్కర్‌సింగ్ ధామీ. చిత్రంలో రాష్ట్ర మంత్రి సత్యకుమార్ యాదవ్, పీవీఎన్ మాధవ్ తదితరులు

అటల్.. ఈ తరానికి స్ఫూర్తిప్రదాత: మాధవ్

"వాజ్‌పేయీ తన జీవితంలో సుమారు 70 సంవత్సరాలను ప్రజా జీవితానికి అంకితం చేశారు. అందులో 60 సంవత్సరాలు పార్లమెంటులో దేశం కోసం పోరాడారు" అని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు పి.వి.ఎన్. మాధవ్ తెలిపారు. నిష్కళంకంగా, అవినీతి మచ్చ లేకుండా రాజకీయ జీవితం గడిపారని, ఈతరం రాజకీయ నాయకులకు స్ఫూర్తి ప్రదాతగా నిలిచారని కొనియాడారు. అతి సామాన్య కుటుంబంలో జన్మించి కష్టపడి దేశ ప్రధాని అయ్యారన్నారు.

మన జీవితకాలం అత్యల్పం



ఈ భూమ్మీద మన జీవితకాలం అత్యంత అల్పం. మీరు అదృష్టవంతులైతే మీ కుటుంబంలో రెండు మూడు తరాలు మిమ్మల్ని గుర్తుంచుకుంటాయి. ఇది వాస్తవం. కాబట్టి జీవితంలో మీకు ఇష్టమైన ఉద్యోగాన్ని దక్కించుకోండి. పర్యటనలు చేయండి. పుస్తకాలు రాయండి. కుటుంబాన్ని ఏర్పరచుకుని పిల్లల్ని ప్రయోజకులుగా తీర్చిదిద్దండి.

– లిండ్సే స్టాంప్, ప్రొడక్ట్ మేనేజర్

వసుంధర

vasundhara@eenadu.in

మొక్కలకూ చలి చిక్కులా?



చలికాలంలో మనకే కాదు... మొక్కలకూ తగినంత సంరక్షణ అవసరం. అదెలాగంటే...

- ఈ కాలంలో మొక్కలు నెమ్మదిగా పెరుగుతాయి. కాబట్టి తక్కువ నీళ్లు పెట్టండి. వేర్లు కుళ్లిపోకుండా ఉండటానికి పై నుంచి అంగుళం లోతు వరకూ మట్టి పొడిగా ఉంటేనే నీటిని పోయండి.
- ఇండోర్ మొక్కల్ని ఎండ తగిలే చోటుకు మార్చండి. తేమను నిలిపేందుకు కుండీ అడుగున ట్రేలో గులకరాళ్లు వేయడం, మొక్కలన్నీ దగ్గర దగ్గరగా ఉంచడం మంచిది. అప్పుడప్పుడూ గాల్లోకి నీళ్లు స్ప్రే చేయాలి.
- మొలకల మీద మంచు కురవకుండా రక్షణగా ఏదైనా కవర్‌ని కప్పండి. మొదళ్ల దగ్గర మల్చింగ్ చేస్తే వేర్లు పాడవకుండా ఉంటాయి. ఈ సమయంలో రసాయనిక ఎరువులు వాడకపోతేనే మేలు. బదులుగా పేడ ఎరువుని అందించండి.
- శీతకాలంలో మన దగ్గరా రూమ్ హీటర్ల వాడకం పెరిగింది. వాటికి సమీపంలో మొక్కల్ని ఉంచడం మంచిది కాదు.
- మొక్కలు సూర్యరశ్మిని సమర్థవంతంగా గ్రహించడానికి తడి క్లాత్‌తో ఆకులపై ఉన్న దుమ్ముని సున్నితంగా తుడవండి.
- ఈ కాలంలో వీలైనంత వరకూ కొత్త మొక్కల్ని నాటొద్దు. తీవ్రంగా ప్రభావితమైతే తప్ప ప్రూనింగ్ చేయొద్దు. వాతావరణం పొడిగా ఉంటుంది కాబట్టి... ఇండోర్ మొక్కలు తెగుళ్ల బారిన పడే ఆస్కారం ఉంది.

మా అబ్బాయికి 17ఏళ్లు. వాడు పదో తరగతిలో ఉన్నప్పుడు ఏదో తప్పు చేశాడని మావారు బెల్టుతో కొట్టారు. దాంతో అప్పటినుంచి మాతో మాట్లాడటం మానేశాడు. ఇంటికి దూరంగా కాలేజీలో చేరాడు. రెండేళ్లు అవుతున్నా ఒక్కసారీ ఇంటికి రాలేదు. బాబుని మార్చేదెలా..? -ఓ సోదరి

కొట్టామని... మాకు దూరమయ్యాడు!

శారీరకంగా, మానసికంగా ఎన్నో మార్పులు చోటుచేసుకునే దశ టీనేజ్. ఈ సమయంలో చుట్టుపక్కల వాతావరణ ప్రభావం వారిమీద చాలా ఉంటుంది. అందుకే అందం, ఆహార్యం, అలవాట్లు, అభిరుచుల విషయంలో ఇతరులతో పోల్చుకుంటూ ఉంటారు. కొన్నిసార్లు ఆత్మన్యూనతకు గురవుతూ... వాళ్లలా ఉండటానికి ప్రయత్నిస్తారు. ఈక్రమంలో తప్పులు చేయడం సహజం. అందుకే ఈ దశలో తల్లిదండ్రుల సహాయమూ, ప్రోత్సాహమూ చాలా అవసరం. ముఖ్యంగా మంచీచెడుల్ని వివరంగా చెప్పాల్సిన దశ ఇది. అది వాళ్లని దండించినట్లో, కట్టడి చేసినట్లో కాకుండా సున్నితంగా అర్థమయ్యేట్లు చెప్పాలి. దీనికి భిన్నంగా పరిస్థితులు ఉంటే అది వారి మనసులో చెరగని ముద్ర వేస్తుంది. తల్లిదండ్రులు కూడా తమను అంగీకరించడం లేదనే భావనలోకి వెళ్లిపోతారు. దాంతో మానవసంబంధాలకు దూరం అవుతారు. మీ అబ్బాయి విషయంలోనూ ఇదే జరిగినట్లు ఉంది. అసలే పదో తరగతి పరీక్షలు, సిలబస్ ఒత్తిడీ, బాగా చదివే పిల్లలు, చదవని పిల్లలు అంటూ వేరు చేయడం లాంటి చాలా ఆందోళనలు వాళ్లని వెంటాడుతుంటాయి. ఇలాంటి సమయంలో తమను అర్థం చేసుకోవాల్సిన తల్లిదండ్రులే కటువుగా ప్రవర్తిస్తే... అది వాళ్ల మనసులో చెరగని ముద్ర వేస్తుంది. రెండేళ్లయినా మీ అబ్బాయి మీతో మాట్లాడలేదంటే అతను మానసికంగా కుంగిపోయి ఉండొచ్చు. దీన్ని 'సెలక్టివ్ మ్యూటిజమ్' అంటారు. నచ్చిన వాళ్లతో మాట్లాడుతూ తన మనసుని గాయపరచే వారికి దూరంగా ఉంటారు. మీ అబ్బాయి కూడా ఇదే చేస్తున్నాడు. మీరు ఆలస్యం చేయకుండా సైకియాట్రిస్టుని కలవండి. వాళ్లు అతని పరిస్థితిని తెలుసుకుంటారు. డిప్రెషన్, పోస్ట్ ట్రామాటిక్ స్ట్రెస్ డిజార్డర్... వంటివి ఉన్నాయేమో పరిశీలిస్తారు. దానిబట్టి సైకాలజిస్టుకు రిఫర్ చేస్తారు. తన మానసికస్థితిని విశ్లేషించి థెరపీని మొదలుపెడతారు. ట్రామా ఫోకస్డ్ కాగ్నిటివ్ బిహేవియరల్ థెరపీ ఇస్తారు. తర్వాత మీకూ బాబుకీ ఫ్యామిలీ కౌన్సెలింగ్ ఇచ్చి... మీ సంబంధ బాంధవ్యాలు మెరుగుపడటానికి సహకరిస్తారు.

డియర్ వసుంధర



డా. మండాది గౌరీదేవి
మానసిక నిపుణురాలు

జపాన్‌లో పుట్టి... ఒడిస్సీతో మెరిసి

ఆమె జపాన్ మహిళ... భారతీయ సంప్రదాయ నృత్యం ఒడిస్సీపై మక్కువ పెంచుకున్నారు. అలాగని చూసి ఆనందించాలనుకోలేదు యుకియో సాటో. అకుంఠిత దీక్షతో సాధన చేసి నేర్చుకున్నారు. గురువుగా ఎదిగి తమ దేశంలో యువతకు నేర్పిస్తున్నారు. తన శిష్యులు ఫుయుమి నరిటా, యుకాకో మాసేలతో కలిసి ఇటీవల హైదరాబాద్ వచ్చిన ఆమె వసుంధరతో మాట్లాడారు.



జపనీస్ సంప్రదాయ నృతంతో పాటు హిప్‌హాప్, జిమ్నాస్టిక్స్ వంటివెన్నో నేర్చుకున్నా. కానీ, నాకు సంతృప్తి కలగలేదు. ఒడిస్సీ చూశాక మరో ఆలోచన లేకుండా నేర్చుకోవడానికి భారత్‌కు వచ్చా. మూడేళ్ల పాటు ఇక్కడే ఉండి గురువు రతికాంత్ మహాపాత్ర, సుజాత దంపతుల వద్ద ఒడిస్సీ నృత్యం సాధన చేశా. జపాన్ తిరిగి వెళ్లాక... సంపత్తి ఇండియన్ డాన్స్ అకాడమీని స్థాపించా. ఇలా 17 ఏళ్లుగా ఒడిస్సీ నృత్యాన్ని మా దేశంలో నేర్పిస్తున్నా. ఆరు నెలల క్రితం కూచిపూడి, భరతనాట్య ప్రదర్శనలు కూడా ఏర్పాటుచేశా. జపాన్, భారతీయ సంప్రదాయ నృత్యాల మధ్య సారూప్యతలు ఉన్నాయి. కాకపోతే మా నృత్యం లక్ష్యం వినోదం మాత్రమే. భారతీయ నృత్యాలు ఆధ్యాత్మికతను పెనవేసుకుని ఉంటాయి.

స్థానికతను జోడించి

వృత్తిరీత్యా డిజైనర్‌ని. కానీ, ఒంటరి తల్లిగా బిడ్డను చూసుకోవడం కష్టం కావడంతో ఆ ఉద్యోగాన్ని వదిలేశా. నా అభిరుచి అయిన నృత్యంలోనే కెరియర్‌ని వెతుక్కోవాలనుకున్నా. ఇష్టంగా నేర్చుకున్న ఒడిస్సీని జపాన్ యువత, పిల్లలకు నేర్పించడం మొదలుపెట్టా. అయితే, దీన్ని యధాతథంగా భారతీయ సంప్రదాయంలో నేర్పిస్తే వారికి అర్థం కావడం కష్టమే. అందుకే, కాస్త స్థానికత జోడించి, సరళతను చేర్చి ఆసక్తిని పెంచడం ఆరంభించా. ఏడాది పాటు వారిని గమనించి ఒడిస్సీ నృత్యంపై ఆసక్తి ఉందనిపిస్తే గ్రేడ్ పెంచి మరిన్ని అంశాలు నేర్పిస్తా. జపాన్‌లోనూ చీరకట్టుతోనే కొనసాగుతున్నా. నృత్యం నేర్పించిన గురువుల పరంపరను కొనసాగించాలనేదే నా ఉద్దేశం. మా దేశంలో యువతీ, యువకులు పెళ్లి చేసుకోవడం కంటే ఒంటరిగా ఉండటానికే ఇష్టపడుతున్నారు. ఫలితంగా వయోధికులు పెరిగిపోయి, యువతరం తగ్గిపోతోంది. దీన్ని దృష్టిలో ఉంచుకుని పెళ్లి చేసుకోవాలనే సందేశమిస్తూ సంప్రదాయ నృత్య ప్రదర్శనలు ఇచ్చేందుకు ప్రయత్నం చేస్తున్నా. పాఠశాలలు, విశ్వవిద్యాలయాల్లో వర్క్‌షాప్స్, ప్రదర్శనలు ఏర్పాటుచేస్తూ యువతరానికి భారతీయ కళల గొప్పదనాన్ని తెలియజేస్తున్నా.

అంతా ప్రోత్సహిస్తున్నారు...

– ఫుయుమి నరిటా



నేను కంటెంట్ రైటర్‌ని. వివిధ దేశాల వారితో మాట్లాడుతున్నప్పుడు భారత్ విశిష్టత, ఇక్కడి సంప్రదాయ నృత్యాల ప్రత్యేకతలు తెలుసుకునే అవకాశం కలిగింది. జపాన్ సంప్రదాయ, బాలీవుడ్ నృత్యాలు నేర్చుకున్నా సంతృప్తి చెందలేకపోయాను. ఇలాంటి సందిగ్ధ సమయంలో ఒడిస్సీ నృత్యం ఆకట్టుకుంది. జపాన్‌వాసులు మొదట ఇదేంటన్నట్లు చూసినా.. ఈ నృత్యంలోని సౌందర్యాన్ని గుర్తించాక ముగ్ధులై ప్రోత్సహిస్తున్నారు.

కట్టూబొట్టూ ప్రత్యేకం...

– యుకాకో మాసే



నేను స్విమ్మింగ్ నేర్చుకున్నా.. ప్రస్తుతం వాహనాల కంపెనీలో ఉద్యోగం చేస్తున్నా. మా దగ్గర వస్త్రధారణ గమనిస్తే నలుపు, తెలుపు రంగు ఎక్కువగా కనిపిస్తుంది. రంగురంగుల భారతీయ సంప్రదాయ కట్టూబొట్టూ ప్రత్యేకం. పూరి జగన్నాథ్ ఆలయంలో ప్రదర్శన ఇచ్చినప్పుడు ఎంతో భావోద్వేగానికి లోనయ్యా.

– బి. వాజేంద్ర, హైదరాబాద్

దేశీ వంగడాల సీడ్ బ్యాంక్

నేలమీద మొక్కలు పెరగడం సహజ ప్రక్రియ. కానీ వ్యవసాయం కాస్తా, వ్యాపారంగా మారడంతో యంత్రాల వినియోగం ఎక్కువైంది. దీనికి భిన్నంగా సహజ వ్యవసాయం చేస్తూ రాణిస్తున్నారు శ్వేతా భట్కర్.



కొత్త పంట వేసే ముందు రైతులు పొలాన్ని దున్నుతుంటారు. కానీ ఔత్సాహిక యువరైతు శ్వేత అదేమీ చేయకుండా సహజ వ్యవసాయాన్ని చేస్తున్నారు. జీవవైవిధ్యాన్ని కాపాడటంతో పాటు ఆరోగ్యకరమైన ఆహారాన్ని ప్రోత్సహించేందుకు చొరవ చూపుతున్నారు. శ్వేతది మధ్యప్రదేశ్‌లోని పంధుర్న జిల్లా. నాగ్‌పుర్‌లో ఉన్నత విద్యనభ్యసించారు. అప్పుడే సహజ వ్యవసాయం గురించి లోతుగా తెలుసుకున్నారు. ఆపైన స్వగ్రామానికి తిరిగివచ్చారు. ఊళ్లో ఈమె కుటుంబానికి 16 ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. పొలాన్ని దున్నకుండా వ్యవసాయం చేయాలని సంకల్పించారు శ్వేత. 'పొలం దున్నితే నేల సారం దెబ్బతింటుంది. ప్రయోజనకరమైన మొక్కలు, జీవులు నాశనం అవుతాయి. దాంతో సమతుల్యతకు విఘాతం కలుగుతుంది. అందుకే సహజ వ్యవసాయ పద్ధతిని ఆచరించా. ఇది నేలలోని జీవాన్ని కాపాడుతుంద'ని చెబుతారు శ్వేత. ఈ విధానంలో తొలుత పొలంలోని అన్ని రకాల గడ్డి, కలుపు మొక్కలను పీకేస్తారు. అనంతరం విత్తనాలను విత్తుతారు. ఈవిధంగా గత కొన్నేళ్లలో పండించిన పంటల నుంచి సేకరించిన దేశీయ, నాటు విత్తనాలతోనే వీళ్లు విత్తన బ్యాంకును సిద్ధం చేశారు. ఈ విత్తనాలనే ఏటా విత్తుతున్నారు. దీంతో పంట నాణ్యంగా ఉండటమే కాదు, దిగుబడి ఎక్కువగా వస్తుంది. తన తోబుట్టువులతో కలిసి దాదాపు 300 రకాల దేశీ విత్తనాలతో విత్తన బ్యాంకును సిద్ధం చేశారు శ్వేత. వీటిలో చాలా వరకూ గతంలో వినియోగంలో ఉండి, హైబ్రిడ్ విత్తనాల కారణంగా కనుమరుగయ్యే దశలో ఉన్నవే. వీళ్లు పొలం గట్లపై చిరోంజి, ఇప్ప మొక్కల్ని పెంచుతారు. ఇవి దీర్ఘకాలంలో మంచి రాబడిని ఇస్తాయి.

15 గ్రామాల్లో స్పందన...

శ్వేత చూపిన చొరవ దాదాపు 15 పరిసర గ్రామాల రైతులపై ప్రభావాన్ని చూపింది. ప్రస్తుతం ఆ గ్రామాల్లోని 40 మందికిపైగా మహిళలు సహజ వ్యవసాయాన్ని అనుసరిస్తున్నారు. దేశీయ, నాటు విత్తనాలవల్ల లభించే ఆరోగ్యకరమైన ఆహారంపైనా వాళ్లు ప్రచారం చేస్తున్నారు. పొలాల్లో పండించిన పంటల్లోకంటే అడవుల నుంచి సేకరించిన ధాన్యాలు, మినుములు, చిక్కుడు కాయల్లోనే ఎక్కువ పోషకాలు ఉన్నాయని ఈ మహిళలు గుర్తించారు. ఒక్కసారి నాటితే దశాబ్దాల తరబడి ఫలాల్ని ఇచ్చే ఇప్ప, చిరోంజిలను గట్ల మీద పెంచేలా అన్నదాతలను చైతన్యం చేస్తున్నారీ మహిళా రైతులు.

ఈటీవీ భారత్

సంక్రాంతి ముగ్గులకు ఆహ్వానం...

రంగవల్లిక

ధనుర్మాసం మొదలవగానే... మగువలు సంక్రాంతి సంబరాలకు శ్రీకారం చుడతారు. వీధులన్నీ ముగ్గులతో నింపేస్తారు. నక్షత్రాల్నే చుక్కలుగా పేర్చి... వాటి మధ్య నుంచి సన్నటి గీతల్ని ఒడుపుగా తిప్పేస్తూ రంగవల్లికల్ని వేసేస్తారు. నేలనే కాన్వాస్‌గా మలచుకుని ముగ్గులెన్నో పెట్టేస్తారు. చక్కటి చిత్రాలెన్నో చూపిస్తారు. మీరూ ఇలా అందంగా ముగ్గులు వేయగలరా? మరి ఇంకెందుకాలస్యం.

తెల్లటి కాగితంపై చుక్కలు స్పష్టంగా కనిపించేలా ముగ్గులు పెట్టి మాకు పంపించండి. వచ్చిన వాటిల్లో ఉత్తమమైన రంగవల్లికల్ని 'వసుంధర' పేజీలో ప్రచురిస్తాం. మరికొన్నింటిని ఈ-పేపర్, ఈనాడు.నెట్, వసుంధర.నెట్‌ల్లో అప్‌లోడ్ చేస్తాం.

గమనిక: ముగ్గుల్లో చుక్కలు స్పష్టంగా కనిపించాలి. చుక్కల వివరాలు, మీ పేరు, ఫొటో, ఫోన్ నంబర్‌నూ జతచేయడం మరిచిపోవద్దు.

మెయిల్:
vasundhara@eenadu.in
వాట్సప్ నం: 9154091911
మా చిరునామా:
వసుంధర, ఈనాడు
ప్రధాన కార్యాలయం,
రామోజీ ఫిల్మ్‌సిటీ,
అనాజ్‌పూర్,
అబ్దుల్లాపూర్‌మెట్ మండలం,
రంగారెడ్డి జిల్లా - 501 512



మా సంస్థలో మహిళలకు సమ ప్రాధాన్యం ఇవ్వాలనేది పాలసీ. ఈ మార్పుని పైనుంచి తీసుకొస్తున్నాం. నేను కంపెనీలో చేరినప్పుడు బోర్డు సభ్యుల్లో ఒక్కరే మహిళ... ఇప్పుడు 50 శాతం ఉన్నారు. సీనియర్లు ఎందరో ఉన్నత నాయకత్వ స్థానాల్లో బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. మార్పు పైనుంచి మొదలుపెడితే ఆ ఫలితాలు వేగంగా దిగువ వరకూ వెళ్తాయనేది నా ఆలోచన.

- రోష్నీ నాడార్ మల్హోత్ర, ఛైర్‌పర్సన్, హెచ్‌సీఎల్ టెక్

'మెనోడివోర్స్'... తీసుకుంటున్నారట!



మెనోపాజ్, డివోర్స్ కలయికతో వచ్చిన పదమే 'మెనోడివోర్స్'. 40 ఏళ్లు వచ్చిన ప్రతి మహిళా మెనోపాజ్‌ని దాటాల్సిందే. దీనికీ విడాకులకూ సంబంధం ఏమిటి అనుకుంటున్నారా? ఇటీవల మధ్యవయసుకు చెందిన మహిళల సాధికారత కోసం పనిచేస్తున్న నూన్ అనే సంస్థ ఓ సర్వే నిర్వహించింది. దానిలో మెనోడివోర్స్‌లు ఎక్కువవుతున్నట్లు వెల్లడైంది. దాదాపు ముగ్గురిలో ఒకరు ఈ దశలో విడాకులు తీసుకోవడానికి మొగ్గు చూపుతున్నారట. మెనోపాజ్‌లో వచ్చే... శారీరక, మానసిక ఒత్తిళ్లకు తోడు, జీవితభాగస్వామి నుంచి సరైన ఆదరణ లేకపోవడమే దీనికి కారణమట. అయితే ఈ దశలోనే ఎందుకంటే? దాంపత్య బంధంలో అసంతృప్తి, మహిళలే సర్దుకుపోవాల్సి రావడం, ఏళ్లు గడిచినా భాగస్వామి తీరులో ఎలాంటి మార్పూ లేకపోవడం. తోడుగా ఉండాల్సిన ఈ వయసులో కూడా వాళ్ల ధోరణి ఇందుకు భిన్నంగా ఉండటం వంటివన్నీ దీనికి కారణాలు అంటున్నారు నిపుణులు. ఈ అసంతృప్తికి మెనోపాజ్‌లో వచ్చే మూడ్‌స్వింగ్స్, యాంగ్జయిటీ తోడవడంతో మెనోడివోర్స్ తీసుకుంటున్న వారి సంఖ్య పెరుగుతోంది. పైగా, అప్పటివరకూ భార్యాభర్తలు కలిసి ఉండటానికి పిల్లలు, వాళ్ల భవిష్యత్తు కారణంగా ఉంటున్నాయి. కానీ మహిళలు 40-50వ పడిలోకి వచ్చేసరికి పిల్లలూ తమ వృత్తి, కుటుంబ జీవితాల్లో స్థిరపడుతున్నారు. దాంతో ఇకనైనా జీవితాన్ని ఆనందంగా గడపాలనే విడాకుల వైపు మొగ్గు చూపిస్తున్నామని చెబుతున్నారు.

ఆమె చొరవ... ఎందరికో ప్రేరణ!

ఎవరైనా ఆపదలో ఉన్నారంటే చుట్టూ ఉన్నవాళ్లు ప్రేక్షకుల్లా చూడటం లేదంటే ఆ దృశ్యాన్ని ఫోన్లో చిత్రీకరించడం ఎక్కువైపోయింది. అంతేకానీ, కష్టంలో ఉన్నవాళ్లకి మనమేమైనా సాయం చేయగలమా అన్న ఆలోచనే రావడంలేదు జనాలకి. కేరళ, కన్నూర్ బీచ్ నిత్యం పర్యటకులతో కిటకిటలాడుతుంటుంది. తమిళనాడు నుంచి ఓ మిత్ర బృందం స్కార్పియోలో బీచ్‌కు వచ్చింది. అది కాస్తా, అక్కడ ఇసుకలో కూరుకుపోయింది. సాధారణంగా ఇలా జరిగినప్పుడు స్థానికంగా ఉండే కొందరికి డబ్బులిస్తే బయటకు తీస్తుంటారు. పర్యటకులు వాళ్లని ఆశ్రయించినా, లాభం లేకపోయింది. ఆ సమయంలో అక్కడున్న పోలీసులూ, వందలమంది పర్యటకులదీ ప్రేక్షకపాత్రే. కాసేపటికి అటుగా వచ్చిన ప్రేరణా దలాల్ పర్యటకులు పడుతున్న ఇబ్బందిని చూశాక, కాస్త చొరవ తీసుకుని... 'నా థార్ కారుతో ప్రయత్నించనా' అని అడిగారు. వాళ్లు సరేననడంతో కూరుకుపోయిన వాహనానికి తాడు కట్టించి... డ్రైవర్ సీట్లో కూర్చొని వెనక్కి లాగేందుకు ప్రయత్నించారు. అంతే, సెకన్లలో ఆ వాహనం బయటకు వచ్చేసింది. దాంతో అక్కడున్నవాళ్లంతా ప్రేరణను కొనియాడుతూ, సెల్ఫీలు దిగారు. 'అంతమంది మగాళ్లవల్ల కానిది ఒక్క మహిళతో సాధ్యమైంద'ంటూ... ఈ సంఘటనని ఒకరు వీడియో తీసి ఇన్‌స్టాలో పెట్టగా 24 గంటల్లో 1.2 మిలియన్ల వీక్షణలు వచ్చాయి. ప్రేరణ సొంతూరు దిల్లీ. ఈమెకు యోగ, స్లో ట్రావెలింగ్ అంటే బాగా ఇష్టమట. ఈ సంఘటన తర్వాత ఇన్‌స్టాలో ఈమెకు ఫాలోయర్లూ పెరిగిపోతున్నారు.



ప్రేరణ



గోడ మీద... పిచ్‌వాయీ బొమ్మ!

సీ్వట్ హోమ్









ఈ మధ్య ఇంటీరియర్‌లోనూ మినిమలిజాన్ని ఇష్టపడుతున్నారు గృహాలంకరణ ప్రియులు. ఇంటి నిండా వార్డ్‌రోబ్‌లు, గోడల నిండా రంగులు, ఫర్నిచర్ నింపేయకుండా ట్రెండీగా కనిపించే వాటిని ఎంపిక చేసుకుంటున్నారు. సంప్రదాయ కళలకూ ఓటేస్తున్నారు. అలా ఆదరణలోకి వచ్చినవే ఈ పిచ్‌వాయీ కాన్వాస్‌లు. ఒకప్పుడు రాజస్థాన్ ఆలయాల్లో మాత్రమే కనిపించే ఈ పెయింటింగ్స్ ఇప్పుడు ఇంటి అలంకరణలోనూ భాగం అయిపోయాయి. మొదట్లో చేత్తో వేసిన ఈ చిత్రాలు... ప్రస్తుతం డిజిటల్ ప్రింట్స్‌గానూ దొరుకుతున్నాయి. భారతీయ కళల గొప్పతనాన్ని తెలియజేస్తూ... కలువలు, లతలు, ఆవుల మధ్యలో శ్రీకృష్ణుడు కనువిందు చేస్తుంటాడు. ఇవి పూజగది, లివింగ్ రూమ్, పడక గది... గోడలపైన చక్కగా ఇమిడిపోతున్నాయి. కొందరు దీర్ఘకాలం మన్నేలా గోడలపై నేరుగా పెయింటింగ్స్ వేయిస్తుంటే ఇంకొందరు వాల్‌కి తగిలించుకునే హెచ్‌డీ ప్రింట్‌లనూ ఎంచుకుంటున్నారు. ఇంటి గోడలకు సింగిల్ లేదా పేస్టల్ కలర్స్ పెయింట్ చేయించుకుని ఈ పిచ్‌వాయీ కళలతో ఇంటిని ముస్తాబు చేసుకుంటున్నారు. ఖర్చు తక్కువ, అందానికి అందం... మనసుకి ప్రశాంతతనిచ్చే ఈ కాన్వాస్‌లు భలే ఉన్నాయి కదూ! మీకూ నచ్చితే ఓసారి ట్రై చేయండి.











వృద్ధాప్య సునామీని ఎదుర్కొందాం

'జెరియాట్రిక్ సొసైటీ ఆఫ్ ఇండియా' సదస్సు పిలుపు



"ప్రపంచవ్యాప్తంగా వృద్ధుల సంఖ్య శరవేగంగా పెరుగుతోంది. భారత్‌లో 2050 నాటికి సీనియర్ సిటిజన్లు రెట్టింపు కానున్నారు. దీనివల్ల వృద్ధాప్య సునామీ లాంటి పరిస్థితి ఏర్పడుతుంది. దాన్ని ఎదుర్కొనేందుకు భారతదేశం సిద్ధంగా ఉండాలి. కొత్తతరం వైద్యులు వృద్ధుల చికిత్సకు సంబంధించిన క్లినికల్ పద్ధతులకు ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వాలి'' అని ఉత్తర్‌ప్రదేశ్‌లోని ఆగ్రా వేదికగా జరిగిన 'జెరియాట్రిక్ సొసైటీ ఆఫ్ ఇండియా' జాతీయ సదస్సు పిలుపునిచ్చింది. ఈ నెల 12న మొదలైన ఈ సదస్సులో దేశ, విదేశాల నుంచి 500 మందికిపైగా వైద్యులు పాల్గొనగా.. ఆదివారంతో ముగిసింది. వృద్ధాప్య సమస్యలు, వాటి పరిష్కార మార్గాల గురించి పలువురు వైద్యులు అభిప్రాయాలు వెల్లడించారు.

- "సంతోషకరమైన వృద్ధాప్యాన్ని ప్రతి ఒక్కరూ కోరుకుంటారు. దీనికి ముందస్తు ప్రణాళిక అవసరం. పదవీ విరమణ తర్వాత విశ్రాంతి తీసుకోవాలనే భావనే తప్పు. సామాజిక, కుటుంబ కార్యకలాపాల్లో చురుగ్గా పాల్గొంటూ క్రియాశీలంగా ఉండాలి. ధ్యానం, సంగీతాలతో వృద్ధాప్య ఛాయలు అలుముకునే వేగం తగ్గుతుంది'' అని పద్మశ్రీ అవార్డు గ్రహీత డాక్టర్ దయా కిశోర్ హాజారా పేర్కొన్నారు.
- "వృద్ధాప్యంలో ఉన్నవారు తప్పకుండా ప్రతిరోజు 7 నుంచి 8 గంటలు నిద్రపోవాలి. వృద్ధులకు విటమిన్ 'ఎం' కంటే విటమిన్ 'ఎఫ్' (ఫ్రెండ్‌షిప్) చాలా ముఖ్యం. మిత్రులతో కొంతసేపైనా గడపాలి. దీనివల్ల మానసిక ఆరోగ్యం మెరుగుపడుతుంది'' అని ఆగ్రాకు చెందిన డాక్టర్ వీఎన్ కౌశల్ తెలిపారు.
- "చిన్న పిల్లలకు టీకాలు వేయిస్తుంటాం. పిల్లలకు ఆ టీకాలు ఎంత అవసరమో.. 5 సాధారణ వ్యాధుల నివారణకు వృద్ధులకూ టీకాలు వేయించడం అంతే ముఖ్యం'' అని జెరియాట్రిక్ సొసైటీ ఆఫ్ ఇండియా ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఓపీ శర్మ అభిప్రాయపడ్డారు.

\- ఈటీవీ భారత్

'బ్రాండ్ అంబాసిడర్' డాక్టర్ అనిల్‌కుమార్



ఉత్తర్‌ప్రదేశ్‌లోని మథురా జిల్లా కోసీ పట్టణానికి చెందిన డాక్టర్ అనిల్ కుమార్ అగర్వాల్ (71) సదస్సులో అందరి దృష్టిని ఆకర్షించారు. 35 ఏళ్ల కుర్రాడిలా కలయదిరిగిన ఆయనను ఈ సదస్సుకు బ్రాండ్ అంబాసిడర్‌గా పలువురు అభివర్ణించారు. బాలీవుడ్ హీరో అక్షయ్‌కుమార్ ఫిట్‌నెస్‌తో పోలుస్తూ ప్రశంసించారు. ఈ సందర్భంగా డాక్టర్ అనిల్ తన ఆరోగ్య రహస్యాలు వెల్లడించారు. "మద్యం, పొగాకుకు పూర్తిగా దూరం. రాత్రి పార్టీలకు వెళ్లను. రోజూ 8 గంటలకల్లా నిద్రపోతా. పూర్తిగా శాకాహారిని. తెల్లవారుజామున మూడింటికే నిద్రలేచి వాకింగ్, రన్నింగ్, యోగా వంటివన్నీ చేస్తా. ఆహారంలో గోధుమ రొట్టెలు తినను. వాటికి బదులుగా తాజా పండ్లు, సలాడ్లు, ఉడికించిన కూరగాయలు, ఎండు ఫలాలు, తృణధాన్యాలు తీసుకుంటా. ఉదయం 10 గంటలకు ఆస్పత్రికి వెళ్లి, సాయంత్రం 5.30 వరకే పనిచేస్తా. కొబ్బరినీరు కలిపి తయారుచేసిన సత్తును ప్రతిరోజు ఉదయాన్నే తాగుతా'' అని వివరించారు.

చిప్కో ఉద్యమంలా.. మర్రిచెట్టుకు గ్రామస్థుల రక్ష

ఈటీవీ భారత్: "గ్రామంలోని ఈ మర్రి, వేప చెట్లు మాకు దేవతలతో సమానం. మా దేవతల ఆవాసాలు ఇవి. వీటిని నరికేస్తే మా దేవుళ్లు ఎక్కడికి పోవాలి?'' అని ప్రశ్నిస్తున్నారు ఛత్తీస్‌గఢ్‌లోని సూరజ్‌పుర్ జిల్లా దేవ్‌గుడి గ్రామస్థులు. గ్రామంలోని మర్రిచెట్టులో కొంత భాగం గుర్తుతెలియని వ్యక్తుల చేతిలో ఇటీవల నరికివేతకు గురైంది. దీనిపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న గ్రామస్థులు చిప్కో ఉద్యమంలా (యూపీలో జరిగిన అటవీ సంరక్షణ ఆందోళన) మర్రిచెట్టును కౌగిలించుకొని కాపలా కాస్తున్నారు. "మేము ఏళ్లతరబడి ఈ మర్రిచెట్టు దగ్గరే వట్ సావిత్రీ పూజ చేస్తున్నాం. ఎటువంటి పరిస్థితుల్లోనూ ఈ చెట్టుపై గొడ్డలి వేటు పడనీయం'' అని గ్రామ మహిళలు అంటున్నారు.



ఉత్తమ అల్పాహారం ఏదంటే..



గ్రీక్ యోగర్ట్, ప్రొటీన్ పౌడర్, బ్లూబెర్రీలు కలిపి అల్పాహారంగా తీసుకోవడం ఉత్తమం. గ్రీక్ యోగర్ట్ మీ పేగు (గట్) ఆరోగ్యాన్ని కాపాడుతుంది. ప్రొటీన్ పౌడర్ మీ ఆకలిని నియంత్రించడంతోపాటు కండను పెంచుతుంది. బ్లూబెర్రీల్లోని పీచు, యాంటీఆక్సిడెంట్లు మీ శరీరంలో మంటను తగ్గిస్తాయి.

\- డాన్ గో, హెల్త్ కోచ్

నేటి నుంచి వెట్టింగ్



- సోషల్ మీడియా ఖాతాలను పరిశీలించనున్న అమెరికా
- హెచ్1బీ, హెచ్4 వీసా దరఖాస్తుదారులకు వర్తింపు

న్యూయార్క్, వాషింగ్టన్: హెచ్1బీ, హెచ్4 వీసా దరఖాస్తుదారుల సోషల్ మీడియా ఖాతాలను అమెరికా ప్రభుత్వం పరిశీలించే ప్రక్రియ సోమవారం నుంచి ప్రారంభమవుతోంది. 15వ తేదీ నుంచి వీసా దరఖాస్తుదారుల ఆన్‌లైన్ ఉనికిని సమీక్షించే ప్రక్రియను ప్రారంభిస్తున్నామని పేర్కొంటూ తాజాగా విదేశాంగశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. 'వెట్టింగ్‌కు వీలుగా హెచ్1బీ, హెచ్4, ఎఫ్, ఎం, జే వీసాలకు దరఖాస్తు చేసినవారంతా తమ సెట్టింగ్‌లను ప్రైవేటు నుంచి పబ్లిక్‌కు మార్చుకోవాలి' అని సూచించింది. ఎఫ్, ఎం, జే వీసాలకు విద్యార్థులు, ఎక్స్ఛేంజ్ విజిటర్లు దరఖాస్తు చేసుకుంటారు. కొత్త నిబంధనల కారణంగా ఇప్పటికే హెచ్1బీ వీసాల ఇంటర్వ్యూలను వాయిదా వేసిన సంగతి తెలిసిందే.

'అందరు వీసా దరఖాస్తుదారులను క్షుణ్నంగా వెట్టింగ్ చేస్తాం. వారి ఆన్‌లైన్ ఉనికిని పరిశీలిస్తాం. ప్రతి వీసా నిర్ణయమూ జాతీయ భద్రత కోణంలోనే ఉంటుంది. వీసా జారీ ప్రక్రియలో అమెరికా అత్యంత జాగరూకతతో ఉంటుంది. అమెరికాలోకి ప్రవేశించేవారు అమెరికన్లకు హాని చేయబోరని మేం నమ్మాలి. వారు అమెరికా ప్రయోజనాలకు నష్టం కలిగించబోరని విశ్వసించాలి. అందుకే వీసా దరఖాస్తుదారులందరూ తమ విశ్వసనీయతను నిరూపించుకోవాలి' అని అమెరికా విదేశాంగశాఖ స్పష్టం చేసింది.

దక్షిణాఫ్రికాలో కూలిపోయిన న్యూ అహోబిలం ఆలయం

భారత సంతతి వ్యక్తి సహా ఐదుగురి మృతి



ధ్వంసమైన ఆలయం

జొహన్నెస్‌బర్గ్: దక్షిణాఫ్రికాలో నిర్మాణ పనులు జరుగుతున్న న్యూ అహోబిలం ఆలయం కూలిపోవడంతో భారత సంతతి వ్యక్తి సహా ఐదుగురు ప్రాణాలు కోల్పోయారు. క్వాజులు-నాటల్ ప్రావిన్సులోని రెడ్‌క్లిఫ్‌లో శుక్రవారం ఈ విషాదం చోటుచేసుకుంది. ఈ ఘటనలో ఆలయ ట్రస్ట్ ఎగ్జిక్యూటివ్ సభ్యుడు, నిర్మాణ ప్రాజెక్టు మేనేజర్ విక్కీ జైరాజ్ పాండే(52) మరణించినట్లు అధికారులు చెప్పారు. ప్రమాదం జరిగిన సమయంలో కార్మికులు, పలువురు ఆలయ అధికారులు విధుల్లో ఉన్నట్లు తెలుస్తోంది. అయితే శిథిలాల కింద ఎంత మంది చిక్కుకున్నారనే విషయంపై స్పష్టతలేదని అధికారులు పేర్కొన్నారు. సహాయక చర్యలు కొనసాగుతున్నట్లు చెప్పారు. ఈ ఆలయ నిర్మాణానికి భారత్ నుంచి శిలలను సేకరించామని, నరసింహస్వామి భారీ ప్రతిమను ఇక్కడ ప్రతిష్ఠించాలన్నది తమ సంకల్పమని నిర్వాహకులు చెప్పారు.

మహిళా, ఎస్సీ, ఎస్టీ అధికారులకు ప్రాధాన్యం ఇవ్వండి

డిప్యుటేషన్ జాబితాపై రాష్ట్రాలకు కేంద్రం సూచన

దిల్లీ: డిప్యుటేషన్‌కు అధికారుల పేర్లు ప్రతిపాదించేటప్పుడు మహిళా అధికారులు, ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందినవారికి ప్రాధాన్యం ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాలకు కేంద్ర ప్రభుత్వం సూచించింది. తద్వారా సెంట్రల్ డిప్యుటేషన్‌లో వారికి తగిన ప్రాతినిధ్యం కల్పించడానికి వీలవుతుందని సూచించింది. సెంట్రల్ స్టాఫింగ్ స్కీం (సీఎస్ఎస్) కేటగిరీలో ఉండే పోస్టులకు రాష్ట్ర ప్రభుత్వాలు పంపించే పేర్లను పరిశీలిస్తామని, ప్రభుత్వ రంగ సంస్థల్లో చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్లు (సీవీఓ)గానూ నియమిస్తామని ఇటీవల రాసిన లేఖలో పేర్కొంది. అధికారి డిప్యుటేషన్‌పై విధుల్లో ఉన్నప్పుడు రాష్ట్ర ప్రభుత్వం ఏ కారణం చేతనైనా వెనక్కి తీసుకుంటే.. ఆ అధికారి వచ్చే ఐదేళ్ల పాటు కేంద్ర ప్రభుత్వంలోని ఏ పోస్టుకూ రాలేరని, విదేశాల్లో పోస్టింగ్‌కూ పరిగణనలోకి తీసుకోబోమని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. ఒకసారి జాబితాలో పేరు చేర్చాక.. ఆ సంవత్సరం అంతా ఆ అధికారి విధుల స్వీకరణకు సిద్ధంగా ఉండాలని తెలిపింది.

అమెరికాలోని బ్రౌన్ వర్సిటీలో కాల్పులు.. ఇద్దరి మృతి

ప్రావిడెన్స్: అమెరికాలోని బ్రౌన్ విశ్వవిద్యాలయంలో కాల్పులు కలకలం సృష్టించాయి. రోడ్ ఐలాండ్‌లోని క్యాంపస్‌లో పరీక్ష జరుగుతుండగా దుండగుడు కాల్పులకు పాల్పడ్డాడు. ఈ ఘటనలో ఇద్దరు మృతిచెందారు. మరో 9 మంది తీవ్రంగా గాయపడ్డారు. వారిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. నిందితుడి(35)ని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కాల్పుల ఘటనపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ స్పందించారు. ఇది ఎంతో భయంకరమైన విషయమన్నారు.

రూ.1,000 కోట్ల సైబర్ క్రైమ్ గుట్టురట్టు



- 111 డొల్ల కంపెనీలను గుర్తించిన సీబీఐ

దిల్లీ: నకిలీ సంస్థలు, డిజిటల్ స్కాముల ద్వారా రూ.వెయ్యి కోట్లకుపైగా మోసాలకు పాల్పడిన ఓ అంతర్జాతీయ సైబర్ ముఠా గుట్టును సీబీఐ ఛేదించింది. నలుగురు చైనీయులు సహా 17 మందిపై, మరో 58 కంపెనీలపై ఛార్జిషీట్‌ను దాఖలుచేసింది. సీబీఐ తుది నివేదిక ప్రకారం... మ్యూల్ అకౌంట్ల ద్వారా దాదాపు రూ.వెయ్యి కోట్లను ఆ ముఠా 111 డొల్ల కంపెనీలకు మళ్లించింది. డమ్మీ డైరెక్టర్లు, తప్పుదారి పట్టించేలా ఉన్న పత్రాలు, నకిలీ చిరునామాలతో షెల్ కంపెనీలు రూపుదిద్దుకున్నాయి. ఈ కంపెనీలతో బ్యాంకు ఖాతాలను తెరిచి, డబ్బును పంచుకున్నారు. 2020లోనే ఈ మోసం మూలాలను గుర్తించారు. జూయి, హువాన్ లియు, వీజియన్ లియు, గ్వాన్హువా వాంగ్ అనే నలుగురు చైనీయులకు షెల్ కంపెనీలు నేరుగా సహకారం అందిస్తున్నాయి. ఆన్‌లైన్ ప్రచారాలు, నకిలీ రుణాలు, పెట్టుబడి పథకాలు, పార్ట్‌టైమ్ ఉద్యోగాలు, ఆన్‌లైన్ ఆటలతో ప్రజలను మోసగించారు. భారీఎత్తున దేశ పౌరులపై ఆన్‌లైన్ మోసాలు జరుగుతుండటంతో కేంద్ర హోంశాఖ ఆధ్వర్యంలోని సైబర్ నేర సమన్వయ కేంద్రం సహకారంతో అక్టోబరులోనే ముగ్గురు వ్యక్తులను సీబీఐ అరెస్టు చేసింది. అనంతరం ఆంధ్రప్రదేశ్, కర్ణాటక సహా 27 రాష్ట్రాలపై దాడులు జరిపి మరింత సమాచారాన్ని సేకరించింది.

దగ్గుమందు రాకెట్ కేసు.. కానిస్టేబుల్ ఇల్లు చూసి ఈడీ షాక్



లఖ్‌నవూ: యూరోపియన్ శైలి అలంకరణలు, సుడులు తిరిగిన మెట్లు, వింటేజ్ లైటింగు, ఖరీదైన వస్తువులతో కూడిన ఆ భవనాన్ని చూసిన ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులు అవాక్కయ్యారు. కొడీన్ కలిపిన దగ్గుమందు రాకెట్‌లో తొలగింపునకు గురై అరెస్టయిన పోలీస్ కానిస్టేబులు అలోక్ ప్రతాప్‌సింగ్ ఉత్తర్‌ప్రదేశ్ రాజధాని లఖ్‌నవూలో నిర్మించుకొన్న రాజభవనం లాంటి ఈ ఇంటిపై ఈడీ దాడులు జరిపింది. లఖ్‌నవూ - సుల్తాన్‌పుర్ హైవే పక్కన రెండంతస్తులుగా 7,000 చదరపు అడుగుల్లో నిర్మించిన ఈ భవనం ఖరీదు దాదాపు రూ.7 కోట్లు ఉంటుందని అంచనా. దాడి అనంతరం పలు వస్తువులను సీజ్ చేసినట్లు ఈడీ అధికారులు తెలిపారు. యూపీ, ఝార్ఖండ్ రాష్ట్రాల్లో పై దగ్గుమందు టోకు వ్యాపార యూనిట్లు నడుపుతున్న నెట్‌వర్కులో ఆలోక్ ప్రతాప్‌సింగ్ భాగస్వామిగా ఆరోపణలు ఉన్నాయి. 2006లో నాలుగు కిలోల బంగారం దోపిడీ కేసులోనూ ఈయన అరెస్టు కాగా, సర్వీసు నుంచి తొలగించారు. ఆ తర్వాత నిర్దోషిగా విడుదల కావడంతో తిరిగి విధుల్లోకి తీసుకున్నారు. దగ్గుమందు కేసు విచారణకు యూపీ ప్రభుత్వం సిట్‌ను ఏర్పాటు చేసింది. ప్రధాన నిందితుడైన శుభం జయస్వాల్ దుబాయ్‌కి పరారైనట్లుగా అనుమానిస్తున్నారు.

మహారాష్ట్రలో మహాయుతికి బీటలు: కాంగ్రెస్

ముంబయి, నాగ్‌పుర్: మహారాష్ట్రలో అధికారంలో ఉన్న మహాయుతి కూటమి బీటలు వారుతున్నట్లు ప్రతిపక్ష కాంగ్రెస్ చెబుతోంది. డిప్యూటీ సీఎం అజిత్ పవార్ వ్యవహార శైలి అందుకు మరింత బలం చేకూరుస్తోంది. మహాయుతి కూటమి నేతలంతా నాగ్‌పుర్‌లోని ఆరెస్సెస్ వ్యవస్థాపకుడు కేశవ్ బలిరామ్ హెడ్గేవార్ స్మారక మందిరాన్ని ఆదివారం సందర్శించారు. అయితే, అజిత్ పవార్ గానీ, ఎన్సీపీ ఎమ్మెల్యేలుగానీ ఈ కార్యక్రమానికి హాజరు కాలేదు. ఇలా జరగడం ఇదే తొలిసారి కాదు. ఆరెస్సెస్ శతవసంత వేడుకల్లోనూ ఎన్సీపీ పాలు పంచుకోలేదు. గతేడాది ఎన్సీపీకి చెందిన కేవలం ఇద్దరు నేతలు మాత్రమే ఆరెస్సెస్ మెమోరియల్‌ను సందర్శించారు. ఈ పరిణామాలపై విపక్షాలు విమర్శలకు పదును పెడుతున్నాయి. ఏడాది తిరగక ముందే కూటమికి బీటలు వారుతున్నాయని కాంగ్రెస్ ఆరోపిస్తోంది. అందుకే కూటమి కార్యక్రమాలకు అజిత్‌పవార్, ఎన్సీపీ ఎమ్మెల్యేలు దూరంగా ఉంటున్నారని చెబుతోంది. కాంగ్రెస్ విమర్శలను ఎన్సీపీ తిప్పికొట్టింది. గతంలో మాదిరిగానే ఎన్సీపీ దృష్టి అభివృద్ధిపైనే ఉందని పేర్కొంది. సాహు మహరాజ్, బీఆర్ అంబేడ్కర్..తదితర మహనీయుల ప్రగతిశీల భావజాలంతో ఎన్సీపీ నడుస్తోందని పునరుద్ఘాటించింది.

మెస్సి ఈవెంట్ నిర్వాహకుడికి 14 రోజుల పోలీస్ కస్టడీ



కోల్‌కతా: అర్జెంటీనా ఫుట్‌బాల్ దిగ్గజం లియోనెల్ మెస్సి ఫుట్‌బాల్ మ్యాచ్‌ను కోల్‌కతాలోని సాల్ట్ లేక్ స్టేడియంలో నిర్వహించిన ఈవెంట్ నిర్వాహకుడు శతద్రు దత్తాను స్థానిక కోర్టు.. 14 రోజుల పోలీస్ కస్టడీకి ఆదివారం అనుమతించింది. మెస్సి బృందంతో శనివారం హైదరాబాద్ వెళుతున్న సమయంలో దత్తాను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. 'గోట్ టూర్ ఆఫ్ ఇండియా'లో భాగంగా ఈ అర్జెంటీనా ఫుట్‌బాలర్ తొలుత కోల్‌కతాకు వెళ్లాడు. సాల్ట్‌లేక్ స్టేడియంలో చెప్పినదాని కంటే తక్కువ సమయం గడపడంతో అభిమానులు ఆగ్రహానికి గురయ్యారు. స్టేడియంలో సీసాలు, ప్లాస్టిక్ కుర్చీలను మైదానంలోకి విసిరేశారు. ఉద్రిక్తత పరిస్థితులు తలెత్తాయి. పోలీసులు రంగంలోకి దిగి నిరసనకారులను చెదరగొట్టారు. ఈవెంట్‌ను సరిగా నిర్వహించకుండా గందరగోళానికి కారణమయ్యాడన్నది దత్తాపై ఆరోపణ. ఈ ఘటనపై రాజకీయ దుమారం కొనసాగుతోంది. ప్రతిపక్షాలు తీవ్రస్థాయిలో రాష్ట్ర ప్రభుత్వంపై విమర్శలు గుప్పిస్తున్నాయి. బెంగాల్ గవర్నర్ సి.వి.ఆనంద బోస్ ఆదివారం సాల్ట్ లేక్ స్టేడియానికి వెళ్లి అక్కడి పరిస్థితిని సమీక్షించారు. ఈ ఘటనపై జ్యుడీషియల్ విచారణ చేయాల్సిన అవసరం ఉందని అన్నారు. ఇలాంటి ఘటనలు భవిష్యత్తులో పునరావృతం కాకుండా ప్రభుత్వం విధివిధానాలు రూపొందించాలని పేర్కొన్నారు. ఈ ఘటనపై పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ వేసిన ముగ్గురు సభ్యుల విచారణ కమిటీ కూడా స్టేడియాన్ని సందర్శించింది.

సోనమ్ వాంగ్‌చుక్ విద్యాసంస్థ హియల్‌కు యూజీసీ గుర్తింపు ఇవ్వాలి: పార్లమెంటరీ కమిటీ



దిల్లీ: లద్దాఖ్ విద్యావేత్త, ఉద్యమకర్త సోనమ్ వాంగ్‌చుక్ స్థాపించిన హిమాలయన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆల్టర్‌నేటివ్స్ (హియల్-హెచ్ఐఏఎల్)కు విశ్వవిద్యాలయాల నిధుల సంఘం (యూజీసీ) గుర్తింపు ఇవ్వకపోవడంపై పార్లమెంటరీ ప్యానల్ ఆందోళన వ్యక్తం చేసింది. ఆదర్శవంతంగా పనిచేస్తున్న హియల్‌కు వెంటనే గుర్తింపు ఇవ్వాలని సూచించింది. విద్య, మహిళలు, యువత, క్రీడలపై ఏర్పాటైన కాంగ్రెస్ ఎంపీ దిగ్విజయ్ సింగ్ నేతృత్వంలోని పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ ఈ మేరకు పార్లమెంట్‌కు నివేదిక ఇచ్చింది. "లద్దాఖ్‌లోని హియల్‌ను మేం సందర్శించాం. అక్కడి విద్య, పరిశోధనలు, ఆంత్రప్రెన్యూర్‌షిప్ ఎకోసిస్టమ్‌లు బాగున్నాయి. నూతన విద్యావిధానం (ఎన్ఈపీ-2020) అమలుతో పాటు అనుభవపూర్వక, సామాజిక-సాంస్కృతిక, పర్యావరణ సంబంధ అంశాల్లోని విద్యా విధానాలను ఈ సంస్థ విజయవంతంగా అమలు చేస్తోంది. హియల్ నమూనాను కేంద్ర విద్యాశాఖ అధ్యయనం చేసి, ఇతర విద్యాసంస్థల్లో ఈ విధానాన్ని అమలు చేసే అంశాన్ని పరిశీలించాలి'' అని కమిటీ సూచించింది. కాగా, లద్దాఖ్‌కు రాష్ట్ర హోదాతో పాటు దాన్ని ఆరో షెడ్యూల్‌లో చేర్చాలంటూ సెప్టెంబరులో అక్కడ ఆందోళనలు జరిగాయి. ఈ ఘటనలో నలుగురు మృతి చెందడంతో పాటు మరో 90 మంది గాయపడ్డారు. దీనికి బాధ్యుడిగా పేర్కొంటూ సోనమ్ వాంగ్‌చుక్‌ను జాతీయ భద్రత చట్టం కింద అరెస్టు చేసిన విషయం తెలిసిందే.

దిల్లీని ఆక్రమిస్తాం

లష్కరే ఉగ్రవాది రెచ్చగొట్టే వ్యాఖ్యలు

ఇస్లామాబాద్: ఉగ్రసంస్థ లష్కరే తయ్యిబా వ్యవస్థాపకుడు హఫీజ్ సయ్యద్‌కు అత్యంత సన్నిహితుడు అబ్దుల్ రవూఫ్ భారత్‌పై మళ్లీ నోరుపారేసుకున్నాడు. 'దిల్లీని ఆక్రమిస్తాం' అని అర్థం వచ్చేలా.. ఆ నగరాన్ని పెళ్లికూతురుగా చేస్తామంటూ వ్యాఖ్యానించాడు. జమ్మూకశ్మీర్‌లో సాయుధపోరాటం సమసిపోయిందనే వాదనలను కొట్టిపారేశాడు. వివాదం మరింత తీవ్రమవుతుందని హెచ్చరించాడు. భారత రాజధానిని స్వాధీనం చేసుకోవడమే తమ గ్రూపు లక్ష్యమన్నాడు. దిల్లీని ఆక్రమిస్తామంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశాడు. రఫేల్ యుద్ధవిమానాలు, ఎస్-400 గగనతల రక్షణ వ్యవస్థలు, డ్రోన్‌లు అసమర్థమైనవిగా అభివర్ణించాడు. భారత వైమానిక దళం.. భారతదేశం పాక్ గగనతలంలోకి ప్రవేశించే ధైర్యం చేయదని వ్యాఖ్యానించాడు. ఇస్లామిక్ దేశాల్లో పాక్ వద్ద మాత్రమే అసలైన అణ్వాయుధాలు ఉన్నాయన్నాడు.

వృద్ధుడి ప్రాణాలు కాపాడిన భారత తీర రక్షక దళం

కొచ్చిన్: వృద్ధుడి ప్రాణాలు కాపాడేందుకు లక్షద్వీప్‌లో భారత తీర రక్షక దళం(ఐసీజీ) అర్ధరాత్రి సహాయక చర్యలు చేపట్టింది. అరుదైన వ్యాధితో బాధపడుతున్న 75 ఏళ్ల వృద్ధుణ్ని లక్షద్వీప్‌లోని అగత్తి నుంచి కొచ్చిన్‌కు చేర్చడానికి తీర రక్షక దళం పలు ఏర్పాట్లు చేసింది. ఐసీజీ రంగంలోకి దించిన డార్నియర్ విమానం శనివారం రాత్రి 11:20 గంటలకు అగత్తిలో ల్యాండ్ అయి.. వృద్ధుడిని 1:10 గంటలకు కొచ్చిన్‌కు తీసుకువచ్చింది. అక్కడి నుంచి వెంటనే ఆసుపత్రికి తరలించారు. ఈ ఆపరేషన్ అర్ధరాత్రి చిమ్మ చీకట్లో దాదాపు 3 గంటల పాటు కొనసాగింది.

మీ పౌరులను వెనక్కు తీసుకోండి

భారత్ సహా పలు దేశాలను కోరిన మయన్మార్

బ్యాంకాక్: తమ దేశంలోని స్కాం సెంటర్లలో పట్టుబడ్డ విదేశీ పౌరులను సంబంధిత దేశాలు వెనక్కు రప్పించుకోవాలని మయన్మార్ అంతర్జాతీయ సమాజాన్ని కోరింది. థాయ్ సరిహద్దు సమీప ప్రాంతాల్లోని స్కాం సెంటర్లపై గత కొన్ని నెలలుగా జరిపిన దాడుల్లో మయన్మార్ 13,272 మంది విదేశీయులను అదుపులోకి తీసుకుంది. వారిలో చాలామందిని దేశం దాటించినప్పటికీ.. ఇంకా 1,655 మంది అక్కడే సైన్యం అదుపులో ఉన్నారు. వారిలో 500లకు పైగా చైనాకు చెందిన వారని, మిగిలిన వారు ఇండోనేసియా, ఇథియోపియా, వియత్నాం, కెన్యా, భారత్ పౌరులుగా గుర్తించామని అధికారులు తెలిపారు.

పునరుత్పాదక ఇంధనాలపై దృష్టి పెట్టాలి

- రాష్ట్రపతి ముర్ము



జాతీయ ఇంధన పరిరక్షణ దినోత్సవ కార్యక్రమంలో ఏర్పాటు చేసిన పెయింటింగ్‌ను తిలకిస్తున్న రాష్ట్రపతి


దిల్లీ: దేశంలోని అన్ని రంగాల్లో ఇంధన సామర్థ్యం పెంపొందించాలంటే పౌరుల ప్రవర్తనలో మార్పు కీలకమని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము పేర్కొన్నారు. పునరుత్పాదక ఇంధనాలపై దృష్టి పెట్టడమూ కీలకమని అన్నారు. జాతీయ ఇంధన పరిరక్షణ దినోత్సవం సందర్భంగా ఆదివారం ఇక్కడ జరిగిన కార్యక్రమంలో ముర్ము మాట్లాడుతూ, ప్రకృతికి అనుగుణంగా సమతూకమైన జీవితాన్ని పౌరులు అవలంబించాలని సూచించారు. ఈ స్పృహ.. భారత సాంస్కృతిక సంప్రదాయానికి ప్రాథమిక సూత్రమని చెప్పారు. ఈ భావమే ప్రపంచానికి మనం అందిస్తున్న 'పర్యావరణానికి జీవనశైలి- లైఫ్' సందేశమని ఉద్ఘాటించారు. "ఇంధనాన్ని ఆదా చేయడమంటే తక్కువ వినియోగించాలని అర్థం కాదు. తెలివిగా, బాధ్యతగా వ్యవహరించడం. అనవసరంగా ఎలక్ట్రిక్ పరికరాలను వినియోగించడాన్ని నివారించాలి. ఇంధనాన్ని పొదుపు చేసే సాధనాలను వాడాలి. ఇళ్లు పని ప్రదేశాల్లో సహజ కాంతిని, వెంటిలేషన్‌ను ఉపయోగించుకోవాలి. సోలార్, పునరుత్పాదక ఇంధన ప్రత్యామ్నాయాలను స్వీకరించాలి. అలా చేస్తే మనం ఇంధనాన్ని పొదుపు చేయడమే కాదు, కర్బన ఉద్గారాలను తగ్గించగలుగుతాం'' అని చెప్పారు.

■ రెండేళ్ల బాలికను కిడ్నాప్ చేసి అత్యాచారం చేసిన కేసులో క్షమాభిక్ష పిటిషన్‌ను ఇటీవల రాష్ట్రపతి ముర్ము తిరస్కరించారు. 2012లో ఈ అత్యాచార ఘటన జరిగింది. విచారణ జరిపిన ట్రయల్ కోర్టు నిందితుడికి మరణశిక్ష విధించింది. బాంబే హైకోర్టు, సుప్రీంకోర్టు కూడా ఈ తీర్పును సమర్థించాయి.

లిబియాలో భారతీయ కుటుంబం కిడ్నాప్

- రూ.2కోట్ల డిమాండ్

ఇంటర్నెట్‌డెస్క్: ఆఫ్రికా దేశం లిబియాలో భారతీయ కుటుంబం కిడ్నాప్‌నకు గురైంది. బాధితులను విడిచిపెట్టేందుకు వారి బంధువుల నుంచి దుండగులు రూ.2కోట్లు డిమాండ్ చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. గుజరాత్‌లోని మెహసాణా జిల్లాకు చెందిన కిస్మత్‌సింగ్ చావ్డా తన భార్య హీనాబెన్, కుమార్తె దేవాన్షి(3)లతో కలసి పోర్చుగల్‌కు వెళ్తుండగా దుండగులు వారిని అపహరించారు. పోర్చుగల్‌లో స్థిరపడ్డ కిస్మత్ సింగ్ సోదరుడి వద్దకు వలస వెళ్లాలని ఆ కుటుంబం భావించింది. ఇందుకోసం అక్కడి ఏజెంట్ సాయం తీసుకొని గతనెల 29న విమానంలో అహ్మదాబాద్ నుంచి దుబాయ్‌కి వెళ్లారు. అక్కడి నుంచి ఈ కుటుంబాన్ని లిబియాలోని బెంఘాజీ నగరానికి తీసుకువెళ్లే క్రమంలోనే ఘటన జరిగినట్లు తెలుస్తోంది. ఈ ఘటనపై రాష్ట్ర ప్రభుత్వం, విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖకు సమాచారం అందింది.



ఈజిప్ట్‌లోని లక్సర్ నగరంలో ఇటీవల పునరుద్ధరణ పనులు పూర్తయిన 'కొలొస్సి ఆఫ్ మెమ్నాన్' అని పిలిచే రెండు భారీ పాలరాతి ఫారో విగ్రహాల సముదాయాన్ని ఆవిష్కరించేందుకు పురావస్తు శాస్త్రవేత్తలు ఏర్పాట్లు చేస్తున్నారు. దాదాపు 20 ఏళ్ల పాటు వీటి పునరుద్ధరణ పనులు జరిగినట్లు అధికారులు తెలిపారు. ఈ విగ్రహాలు 3,400 సంవత్సరాల క్రితం ఈజిప్టును పరిపాలించిన అమెన్‌హోటెప్- 3కి ప్రతిరూపాలు

కొవిడ్ టీకాకు, యువతలో ఆకస్మిక మరణాలకు సంబంధం లేదు

ఎయిమ్స్ అధ్యయనంలో వెల్లడి

దిల్లీ: కొవిడ్-19కు వేసిన టీకాలు సురక్షితమైనవేనని మరోసారి రుజువైంది. ఈ వ్యాక్సీన్లకు యువతలో ఆకస్మిక మరణాలతో సంబంధంలేదని తేలింది. దిల్లీలోని ఎయిమ్స్ ఏడాదిపాటు నిర్వహించిన అటాప్సీ ఆధారిత అధ్యయనం తేల్చింది. యువతలో ఆకస్మిక మరణాలు ఆందోళనకరమని ఇది పేర్కొంది. దీనికోసం ప్రత్యేకంగా ప్రజారోగ్య వ్యూహాలను సిద్ధం చేయాలని సూచించింది. అంతుబట్టని ఆకస్మిక మరణాలపై మరింత లోతైన పరిశోధనలు అవసరమని వివరించింది. ఏడాదికాలంలో ఇలా మరణించిన 18-45 ఏళ్ల వయసువారిపై పరిశోధనలు చేశారు. ఇందుకోసం భిన్నవిభాగాలకు చెందిన నిపుణులు.. శవపరీక్షలు, ఇతరత్రా విధానాల ద్వారా వివరాలు సేకరించారు. కొవిడ్-19 టీకాకు ఈ ఆకస్మిక మరణాలకు మధ్య ఎలాంటి సంబంధం లేదని గుర్తించారు. గుండె, రక్తనాళాలకు సంబంధించిన కారణాలే ఈ మరణాలకు ప్రధాన కారణమని గుర్తించారు. ఆ తర్వాతి స్థానంలో శ్వాస సంబంధ ఇబ్బందులు ఉన్నాయి. కొవిడ్-19 టీకాలకు ఈ ఆకస్మిక మరణాలకు మధ్య సంబంధం ఉందంటూ కొందరు తప్పుడు, నిరాధార వాదనలు చేస్తున్న నేపథ్యంలో ఈ పరిశోధన ఫలితాలకు ప్రాధాన్యం పెరిగిందని దిల్లీలోని ఎయిమ్స్ ప్రొఫెసర్ సుధీర్ అరవ తెలిపారు. యువతలో అప్పటికే ఉన్న ఆరోగ్యసమస్యలే వారిలో ఆకస్మిక మరణాలకు కారణమని నిపుణులు గతంలోనూ పేర్కొన్నారు. ఇలాంటి వాటిని నివారించడానికి సత్వర స్క్రీనింగ్, జీవనశైలి మార్పులు, సకాలంలో వైద్య చికిత్స వంటివి అవసరమని సూచించారు.

కేరళ ఫలితాలపై భాజపా తప్పుడు ప్రచారం

కాంగ్రెస్ విమర్శ

తిరువనంతపురం: కేరళ స్థానిక ఎన్నికల్లో తమ విజయాలు పెరిగాయంటూ భాజపా తప్పుడు ప్రచారం చేస్తోందని కాంగ్రెస్ విమర్శించింది. 1,199 స్థానాల్లో భాజపా 29 స్థానాలను మాత్రమే దక్కించుకుందని, అవి మొత్తం స్థానాల్లో ఒక్క శాతం కూడా కాదని ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్ ఆదివారం నాడిక్కడ గుర్తుచేశారు. భాజపా తిరువనంతపురం కార్పొరేషన్‌ను గెలుచుకున్నప్పటికీ, జిల్లా పంచాయత్‌లలో ఒక్క సీటు కూడా సొంతం చేసుకోలేకపోయిందన్నారు. 2020తో పోలిస్తే కేవలం 8 సీట్లే అధికంగా గెలుపొందిందని, పాలక్కాడ్, పందలం మునిసిపాలిటీల్లో మెజారిటీని కోల్పోయిందన్నారు. ప్రజలను ప్రభావితం చేసేందుకు కేరళ రాష్ట్రం భాజపా వైపు ప్రయాణిస్తోందన్న తప్పుడు ప్రచారం చేస్తోందని విమర్శించారు.



తొలి టీ20లో భారత బౌలర్ల ధాటికి దాసోహమంది దక్షిణాఫ్రికా. రెండో మ్యాచ్‌లో సఫారీ జట్టు పుంజుకుని టీమ్‌ఇండియాను ఓడించింది. మూడో టీ20లో మళ్లీ భారత్ వంతు. మరోసారి బంతితోనే ప్రత్యర్థిని దెబ్బ కొట్టింది సూర్య సేన. అర్ష్‌దీప్, వరుణ్, కుల్‌దీప్, హర్షిత్ రాణా విజృంభించడంతో దక్షిణాఫ్రికాను స్వల్ప స్కోరుకే కట్టడి చేసింది. ఆపై అభిషేక్ మెరుపులతో లక్ష్యాన్ని ఛేదించి సిరీస్‌లో 2-1తో ఆధిక్యంలోకి వెళ్లింది.

భారత్‌దే మూడో టీ20

చుట్టేశారు.. కొట్టేశారు

- విజృంభించిన అర్ష్‌దీప్, వరుణ్, హర్షిత్
- అభిషేక్ మెరుపులు
- దక్షిణాఫ్రికాపై విజయం

ధర్మశాల

భారత్ మళ్లీ గాడిలో పడింది. రెండో టీ20లో ఓటమి తర్వాత పుంజుకుని మూడో టీ20లో అదిరే విజయాన్ని అందుకుంది. ఆదివారం టీమ్‌ఇండియా 7 వికెట్ల తేడాతో దక్షిణాఫ్రికాను ఓడించింది. మొదట 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అర్ష్‌దీప్ సింగ్ (2/13), వరుణ్ చక్రవర్తి (2/11), కుల్‌దీప్ (2/12), హర్షిత్ రాణా (2/34) విజృంభించడంతో.. దక్షిణాఫ్రికా 20 ఓవర్లలో 117 పరుగులకే ఆలౌటైంది. మార్‌క్రమ్ (61; 46 బంతుల్లో 6×4, 2×6) మాత్రమే రాణించాడు. అభిషేక్ శర్మ (35; 18 బంతుల్లో 3×4, 3×6) మెరుపులతో భారత్ 15.5 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. శుభ్‌మన్ గిల్ (28; 28 బంతుల్లో 5×4), తిలక్‌వర్మ (26 నాటౌట్; 34 బంతుల్లో 3×4) కూడా రాణించారు. ఈ మ్యాచ్‌లో బుమ్రా, అక్షర్‌లకు విశ్రాంతి ఇచ్చిన భారత్.. కుల్‌దీప్, హర్షిత్‌లను ఆడించింది. బుధవారం లఖ్‌నవూలో నాలుగో టీ20 జరగనుంది.

అభిషేక్ దూకుడు: స్వల్ప ఛేదనలో ఇన్నింగ్స్‌ను భారత్ దూకుడుగా ఆరంభించింది. ఓపెనర్ అభిషేక్ శర్మ తనశైలిలో ఆడి స్కోరును పరుగులెత్తించాడు. దక్షిణాఫ్రికా బౌలర్లను ఏమాత్రం కుదురుకోనీయకుండా ఎదురుదాడి చేశాడు. తొలి బంతికే సిక్స్ బాదిన అతడు.. యాన్సెన్ వేసిన రెండో ఓవర్లో మరో సిక్స్, ఫోర్ బాదేశాడు. ఫామ్‌లో లేని శుభ్‌మన్ గిల్ (28; 28 బంతుల్లో 5×4) ఈ మ్యాచ్‌లో కాస్త మెరుగ్గా ఆడాడు. మరోవైపు అభిషేక్ జోరు కొనసాగించడంతో 5 ఓవర్లకు 60/0తో భారత్ లక్ష్యం దిశగా దూసుకెళ్లింది. ఈ క్రమంలో బార్ట్‌మన్ బౌలింగ్‌లో పాయింట్ దిశగా అతడు కొట్టిన సిక్సర్ హైలైట్. జోరుమీదున్న అభిషేక్‌ను బోష్ ఔట్ చేసి దక్షిణాఫ్రికాకు బ్రేక్ ఇచ్చాడు. మూడో స్థానంలో వచ్చిన తిలక్‌వర్మతో కలిసి గిల్ ఇన్నింగ్స్‌ను ముందుకు తీసుకెళ్లాడు. లక్ష్యం (78 బంతుల్లో 43) అందుబాటులో ఉండడంతో ఈ జోడీ ఆచితూచి ఆడింది. 9-13 ఓవర్ల మధ్య దక్షిణాఫ్రికా కట్టుదిట్టంగా బౌలింగ్ చేయడంతో 4 ఓవర్లలో కేవలం 12 పరుగులే వచ్చాయి. ఈ స్థితిలో శుభ్‌మన్ ఔటయ్యాడు. ఫామ్‌తో తంటాలు పడుతున్న సూర్యకుమార్ (11 బంతుల్లో 12) రెండు ఫోర్లు కొట్టి వెనుదిరగ్గా... శివమ్ దూబె (10 నాటౌట్) పని పూర్తి చేశాడు. భారత్ మరో 25 బంతులు ఉండగానే లక్ష్యాన్ని అందుకుంది.

దక్షిణాఫ్రికాకు కళ్లెం: అంతకుముందు మంచుతో కూడిన వాతావరణంలో భారత పేసర్లు ఆరంభం నుంచే స్వింగ్‌తో విజృంభించారు. దీంతో 5 ఓవర్లలో దక్షిణాఫ్రికా మూడు వికెట్లు కోల్పోయి 14 పరుగులే చేసింది. తొలి ఓవర్ నాలుగో బంతికి హెండ్రిక్స్ (0)ను ఔట్ చేయడం ద్వారా అర్ష్‌దీప్ వికెట్ల వేటను మొదలుపెట్టాడు. ఈ వికెట్‌ను భారత్ సమీక్షలో సాధించింది. ఆ తర్వాత హర్షిత్ రాణా అందుకున్నాడు. రెండో టీ20లో అదిరే ఇన్నింగ్స్ ఆడిన క్వింటన్ డికాక్ (1)ను పెవిలియన్ చేర్చి ప్రత్యర్థిని గట్టిదెబ్బ కొట్టాడు. హర్షిత్ బౌలింగ్‌లో ఓ బంతిని అడ్డంగా ఆడబోయిన డికాక్ ఎల్బీగా ఔటయ్యాడు. తన తర్వాతి ఓవర్లో బ్రెవిస్ (2)ను ఔట్ చేసి మరో వికెట్ ఖాతాలో వేసుకున్నాడు హర్షిత్. ఈ స్థితిలో కెప్టెన్ మార్‌క్రమ్ కాస్త ధాటిగా ఆడే ప్రయత్నం చేశాడు. హర్షిత్ వేసిన ఇన్నింగ్స్ అయిదో ఓవర్లో అతడు రెండు ఫోర్లు కొట్టడంతో స్కోరు కాస్త కదిలింది. పవర్ ప్లే ఆఖరికి దక్షిణాఫ్రికా 23/3తో నిలిచింది. ఆ తర్వాత సఫారీ జట్టు మళ్లీ తడబడింది. స్టబ్స్ (9), బోష్ (4) స్వల్ప స్కోర్లకే వెనుదిరిగారు. 11 ఓవర్లకు 48/5తో దక్షిణాఫ్రికా కష్టాల్లో పడింది. ఈ స్థితిలో మార్‌క్రమ్, ఫెరీరా (20) వికెట్ల పతనం ఆపడంతో పాటు పరుగులు రాబట్టారు. ముఖ్యంగా ఫెరీరా దూకుడుగా ఆడడంతో దక్షిణాఫ్రికా ఇన్నింగ్స్ కాస్త వేగాన్ని అందుకుంది. కానీ ఫెరీరాను బౌల్డ్ చేసిన వరుణ్ ఈ జోడీని విడగొట్టాడు. ఆ తర్వాత యాన్సెన్ (2) కూడా కూడా వరుణే ఔట్ చేశాడు. మార్‌క్రమ్ మాత్రం పోరాటం ఆపలేదు. హర్షిత్ వేసిన 18వ ఓవర్లో రెండు సిక్స్‌లు, ఫోర్ బాదేశాడు. అతను 41 బంతుల్లో అర్ధసెంచరీ అందుకున్నాడు. మార్‌క్రమ్‌ను అర్ష్‌దీప్ ఔట్ చేయడంతో ఓ మోస్తరు స్కోరు చేయాలన్న దక్షిణాఫ్రికా ఆశలు ఆవిరయ్యాయి. 120లోపే ఆ జట్టు ఇన్నింగ్స్ ముగిసిపోయింది. 20వ ఓవర్లో కుల్‌దీప్ రెండు వికెట్లు తీసి దక్షిణాఫ్రికా ఇన్నింగ్స్‌కు తెరదించాడు.



- టీ20ల్లో 1000 పరుగులు చేసి, 100 వికెట్లు తీసిన తొలి భారత ఆటగాడిగా హార్దిక్ పాండ్య ఘనత సాధించాడు.

3 భారత్ తరఫున టీ20ల్లో 100 వికెట్లు తీసిన మూడో బౌలర్ హార్దిక్ పాండ్య. అర్ష్‌దీప్ సింగ్, జస్ప్రీత్ బుమ్రా అతడి కంటే ముందు ఈ క్లబ్‌లో ఉన్నారు.



మార్‌క్రమ్ సూపర్ క్యాచ్

దక్షిణాఫ్రికా కెప్టెన్ మార్‌క్రమ్ పట్టిన క్యాచ్ ఈ మ్యాచ్‌లో హైలైట్. భారత ఓపెనర్ అభిషేక్ శర్మ జోరుకు తన మెరుపు ఫీల్డింగ్‌తో బ్రేక్ వేశాడు మార్‌క్రమ్. బోష్ బౌలింగ్‌లో అభిషేక్ ఆఫ్‌సైడ్ భారీ షాట్ కొట్టేందుకు ప్రయత్నించాడు. బంతి గాల్లోకి లేవడంతో లోపలి వృత్తంలో ఉన్న మార్‌క్రమ్ బంతిని చూస్తూ పరుగెత్తుతూ దాదాపు బౌండరీ లైన్ సమీపంలో క్యాచ్‌ను అందుకున్నాడు. ఒకవైపు మంచు కారణంగా ఔట్ ఫీల్డ్‌లో జారిపడే ప్రమాదం ఉన్నా కూడా మార్‌క్రమ్ చాలా కష్టంగా నియంత్రించుకుంటూ వెనక్కి పరుగెత్తి క్యాచ్‌ను ఒడిసిపట్టడం విశేషం.

దక్షిణాఫ్రికా ఇన్నింగ్స్: డికాక్ ఎల్బీ (బి) హర్షిత్ 1; హెండ్రిక్స్ ఎల్బీ (బి) అర్ష్‌దీప్ 0; మార్‌క్రమ్ (సి) జితేశ్ (బి) అర్ష్‌దీప్ 61; బ్రెవిస్ (బి) హర్షిత్ 2; స్టబ్స్ (సి) జితేశ్ (బి) హార్దిక్ 9; బోష్ (బి) దూబె 4; డొనోవాన్ ఫెరీరా (బి) వరుణ్ 20; యాన్సెన్ (బి) వరుణ్ 2; నోకియా స్టంప్డ్ (బి) జితేశ్ (బి) కుల్‌దీప్ 12; ఎంగిడి నాటౌట్ 2; బార్ట్‌మన్ (సి) సూర్య (బి) కుల్‌దీప్ 1; ఎక్స్‌ట్రాలు 3 **మొత్తం:** (20 ఓవర్లలో ఆలౌట్) **117; వికెట్ల పతనం:** 1-1, 2-1, 3-7, 4-30, 5-44, 6-69, 7-77, 8-113, 9-115; **బౌలింగ్:** అర్ష్‌దీప్ 4-0-13-2; హర్షిత్ రాణా 4-0-34-2; హార్దిక్ పాండ్య 3-0-23-1; వరుణ్ చక్రవర్తి 4-0-11-2; శివమ్ దూబె 3-0-21-1; కుల్‌దీప్ 2-0-12-2

భారత్ ఇన్నింగ్స్: అభిషేక్ శర్మ (సి) మార్‌క్రమ్ (బి) బోష్ 35; శుభ్‌మన్ (బి) యాన్సెన్ 28; తిలక్ వర్మ నాటౌట్ 26; సూర్యకుమార్ (సి) బార్ట్‌మన్ (బి) ఎంగిడి 12; శివమ్ దూబె నాటౌట్ 10; ఎక్స్‌ట్రాలు 9 **మొత్తం:** (15.5 ఓవర్లలో 3 వికెట్లకు) 120; **వికెట్ల పతనం:** 1-60, 2-92, 3-109; **బౌలింగ్:** ఎంగిడి 3-0-23-1; యాన్సెన్ 3-0-24-1; బార్ట్‌మన్ 3.5-0-34-0; బోష్ 3-0-18-1; నోకియా 3-0-14-0


స్క్వాష్ ప్రపంచకప్

విజేత భారత్

చెన్నై: భారత స్క్వాష్ జట్టు చరిత్ర సృష్టించింది. స్క్వాష్ ప్రపంచకప్‌ను సొంతం చేసుకున్న తొలి ఆసియా జట్టుగా రికార్డులకెక్కింది. చెన్నైలో ఆదివారం జరిగిన ఫైనల్లో భారత్ 3-0తో హాంకాంగ్‌పై ఘనవిజయం సాధించింది. మహిళల సింగిల్స్‌లో సీనియర్ క్రీడాకారిణి జోష్న చిన్నప్ప 3-1 (7-3, 7-5, 7-1)తో లీ కాయిని ఓడించి భారత్‌కు శుభారంభం అందించగా.. అభయ్ సింగ్ పురుషుల సింగిల్స్‌లో 3-0 (7-1, 7-4, 7-4)తో అలెక్స్ లవును చిత్తు చేశాడు. రెండో మహిళల సింగిల్స్ అనాహత్ సింగ్ 3-0 (7-2, 7-3, 7-5)తో టమోటో హోను ఓడించడంతో భారత్ విజయం పూర్తయింది. చివరి మ్యాచ్‌లో వేలవన్ సెంథిల్ కుమార్ బరిలోకి దిగాల్సిన అవసరం లేకపోయింది. భారత బృందం క్వార్టర్స్‌లో దక్షిణాఫ్రికాను, సెమీస్‌లో ఈజిప్ట్‌ను ఓడించింది. ఇప్పటిదాకా 2023లో మూడో స్థానంలో నిలవడమే భారత్‌కు టోర్నీలో ఉత్తమ ప్రదర్శన.


ప్రపంచకప్‌తో సెంథిల్, జోష్న, అనాహత్, అభయ్


సచిన్ ప్రపంచకప్ జెర్సీతో మెస్సి



క్రికెట్ దేవుడితో ఫుట్‌బాల్ గ్రేట్

- ముంబయిలో మెస్సికి సచిన్ 'నంబర్ 10' జెర్సీ
- ప్రతిగా మాస్టర్‌కు ప్రపంచకప్ బంతి

ముంబయి

ప్రతిష్ఠాత్మక వాంఖడే స్టేడియంలో అపురూప దృశ్యం! భారత క్రికెట్ దేవుడు సచిన్ తెందుల్కర్‌ను ఫుట్‌బాల్ గోట్ (గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్ టైమ్) లియోనెల్ మెస్సి కలిసిన అరుదైన సందర్భం! పదో నంబరు జెర్సీలు (క్రికెట్లో సచిన్.. ఫుట్‌బాల్‌లో మెస్సి) ఒకే వేదికను పంచుకున్న సన్నివేశానికి ఆదివారం ముంబయిలోని వాంఖడే స్టేడియం వేదికగా నిలిచింది. 'ద గోట్ ఇండియా టూర్'లో భాగంగా ఆదివారం ముంబయిలో మెస్సి పర్యటించాడు. శనివారం హైదరాబాద్‌లో అలరించిన మెస్సి.. ఆదివారం ముంబయిలో సందడి చేశాడు. మధ్యాహ్నం ముంబయి చేరుకున్న మెస్సి, రోడ్రిగో డి పాల్, లూయిస్ సువారెజ్.. పటిష్ఠ భద్రత నడుమ సాయంత్రం 4 గంటలకు బ్రబోర్న్ స్టేడియానికి వెళ్లారు. అక్కడ సెలబ్రిటీ ఫుట్‌బాల్ మ్యాచ్‌ను వీక్షించారు. అనంతరం వాంఖడే స్టేడియానికి మెస్సి బృందం చేరుకుంది. అభిమానుల కోలాహలం.. కేరింతల మధ్య ఆల్ స్టార్స్ మ్యాచ్‌ను మెస్సి వీక్షించాడు. భారత ఫుట్‌బాల్ దిగ్గజం సునీల్ ఛెత్రి ఈ మ్యాచ్‌లో పాల్గొని గోల్ కూడా సాధించాడు. సచిన్, మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్, బాలీవుడ్ తారలు అజయ్ దేవ్‌గణ్, టైగర్ ష్రాఫ్‌తో సహా చాలామంది సెలబ్రిటీలు స్టేడియానికి తరలివచ్చారు. అభిమానుల కేరింత నడుమ మెస్సి, రోడ్రిగో, సువారెజ్ మైదానంలో అడుగుపెట్టారు. ఆల్ స్టార్స్ ఆటగాళ్లతో కరచాలనం చేసిన మెస్సి.. ఛెత్రిని ఆత్మీయంగా ఆలింగనం చేసుకున్నాడు. ఛెత్రికి నంబర్ 10 జెర్సీని బహూకరించాడు. ఉప్పల్ స్టేడియం మాదిరే వాంఖడేలో అభిమానుల వైపు ఫుట్‌బాల్‌లను తరలించాడు. స్టేడియమంతా కలియదిరుగుతూ స్టాండ్స్‌లోకి బంతులను పంపించాడు. కొద్దిసేపు చిన్నారులతో కలిసి మెస్సి, రోడ్రిగో, సువారెజ్ ఫుట్‌బాల్ ఆడారు.

"ముంబయిని కలల నగరం అంటారు. ఈ మైదానంలో నా కలలు కొన్ని నెరవేరాయి. మీ మద్దతు లేకుంటే 2011లో ఇక్కడ మధుర స్మృతులు ఉండేవి కావు. ఈ రోజు ఈ ముగ్గురు ఆటగాళ్లు ఇక్కడికి రావడం ముంబయికి గొప్ప సందర్భం. వీరిని మీరు స్వాగతించిన తీరు అమోఘం. మెస్సి ఆట గురించి మాట్లాడడానికి ఇది సరైన వేదిక కాదు. అతను ప్రతిదీ సాధించాడు. తన పట్టుదల, నిబద్ధతను అందరూ ఇష్టపడతారు. అన్నింటికీ మించి అతడి అణకువ గొప్పది. ఇక్కడి యువతకు ప్రోత్సాహాన్నిచ్చినందుకు అందరి తరఫున అతడికి ధన్యవాదాలు"
– సచిన్

ఇక వాంఖడే మైదానంలోకి సచిన్ వస్తున్నప్పుడు స్టేడియం హోరెత్తిపోయింది. మైదానంలోని వేదికపైకి సచిన్ చేరుకుంటున్నప్పుడు మెస్సి, రోడ్రిగో, సువారెజ్ చప్పట్లతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా 2011 వన్డే ప్రపంచకప్ జెర్సీ (నంబర్ 10)ని మెస్సికి సచిన్ అందజేశాడు. జెర్సీపై తన ఆటోగ్రాఫ్ ఉన్నట్లు మెస్సికి వివరించాడు. ఫుట్‌బాల్‌లో మెస్సి జెర్సీ నంబర్ కూడా పదే అన్న సంగతి తెలిసిందే. బదులుగా ఫుట్‌బాల్ వరల్డ్‌కప్ బంతిని సచిన్‌కు మెస్సి బహూకరించాడు. గంటసేపు వాంఖడే స్టేడియంలో మెస్సి సందడి చేశాడు.

నేడు దిల్లీలో.. ప్రధానితో: మెస్సి సోమవారం దిల్లీలో పర్యటించనున్నాడు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీతో భేటీ కానున్నాడు. అనంతరం అఖిల భారత ఫుట్‌బాల్ సమాఖ్య (ఏఐఎఫ్‌ఎఫ్) మాజీ అధ్యక్షుడు, ఎన్‌సీపీ పార్లమెంటు సభ్యుడు ప్రఫుల్ పటేల్ ఇంట్లో భారత ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్, ఆర్మీ చీఫ్ ఉపేంద్ర ద్వివేదిలను మెస్సి కలవనున్నాడు. మధ్యాహ్నం 3.30 గంటలకు ఫిరోజ్ షా కోట్లా మైదానంలో ప్రారంభమయ్యే కార్యక్రమంలో మెస్సి పాల్గొంటాడు.

మేనేజర్ పొరపాటు వల్లే అలా..: గ్రీన్

అడిలైడ్: ఐపీఎల్‌లో బౌలింగ్ చేసేందుకు సిద్ధంగా ఉన్నానని ఆస్ట్రేలియా ఆల్‌రౌండర్ కామెరూన్ గ్రీన్ అన్నాడు. మేనేజర్ చేసిన పొరపాటు వల్ల మంగళవారం దుబాయ్‌లో జరిగే ఐపీఎల్ మినీ వేలంలో తన పేరు బ్యాటర్ల జాబితాలో చేర్చారని అతడు వివరణ ఇచ్చాడు. "బౌలింగ్ చేసేందుకు సిద్ధంగా ఉన్నా. ఐపీఎల్ వేలంలో మేనేజర్ తప్పుడు సమాచారం ఇవ్వడంతో నా పేరు బ్యాటర్‌గా నమోదు అయింది. వేలం ఎలా సాగుతుందోనని ఆసక్తిగా ఉంది. ఏ జట్టుకు వెళ్తామనేది ఒక లాటరీ లాంటిది' ' అని గ్రీన్ చెప్పాడు. 2023 ఐపీఎల్‌లో ముంబయికి ఆడిన గ్రీన్.. 2024లో బెంగళూరుకు ప్రాతినిధ్యం వహించాడు. ఆర్సీబీ విడిచిపెట్టడంతో అతడు రూ.2 కోట్ల కనీస ధరతో వేలంలోకి వచ్చాడు.

భారత్ చేతిలో పాక్ చిత్తు

అండర్-19 ఆసియా కప్

దుబాయ్: క్రికెట్లో ఏ స్థాయి టోర్నీ అయినా పాకిస్థాన్‌పై భారత్ ఆధిపత్యం కొనసాగుతోంది. కనిష్క్ చౌహాన్ ఆల్‌రౌండ్ ప్రదర్శన, ఆరోన్ జార్జి మెరుపులతో ఆదివారం అండర్-19 వన్డే ఆసియాకప్ గ్రూప్-ఎ మ్యాచ్‌లో భారత్ 90 పరుగుల తేడాతో పాక్‌ను చిత్తు చేసింది. మొదట భారత్ 46.1 ఓవర్లలో 240 పరుగులకు ఆలౌటైంది. ఆరోన్ (85; 88 బంతుల్లో 12×4, 1×6) టాప్ స్కోరర్. ఛేదనలో దీపేశ్ దేవేంద్రన్ (3/16), కనిష్క్ (3/33), కృష్ణన్ సింగ్ (2/33) ధాటికి పాక్ 41.2 ఓవర్లలో 150 పరుగులకే కుప్పకూలింది. టాస్ ఓడి మొదట బ్యాటింగ్ చేసిన భారత్‌కు ఆరంభంలోనే ఎదురుదెబ్బ తగిలింది. సూపర్ ఫామ్‌లో ఉన్న వైభవ్ సూర్యవంశీ (5) ఎక్కువసేపు నిలవలేదు. ఈ స్థితిలో ఆరోన్ జార్జి, కెప్టెన్ ఆయుష్ మాత్రే (38) ఇన్నింగ్స్‌ను నిలబెట్టారు. మాత్రే వెనుదిరిగినా.. ఆరోన్ నిలవడంతో భారత్ ఒక దశలో 173/4తో బలమైన స్థితిలో కనిపించింది. కానీ 67 పరుగుల తేడాతో 7 వికెట్లు చేజార్చుకుని భారీ స్కోరు చేసే అవకాశాన్ని కోల్పోయింది. కనిష్క్ చౌహాన్ (46), అభిజ్ఞాన్ కుందు (22) రాణించడంతో భారత్ పోరాడే స్కోరు చేయగలిగింది. ప్రత్యర్థి బౌలర్లలో సయ్యమ్ (3/67), సుభాన్ (3/52) సత్తా చాటారు. ఛేదనలో భారత బౌలర్ల ధాటికి.. పాక్ ఏమాత్రం నిలవలేకపోయింది. 21/0తో బాగానే ఆరంభించిన ఆ జట్టు.. తర్వాత క్రమం తప్పకుండా వికెట్లు చేజార్చుకుంది. 77/5తో ఓటమిని ఖాయం చేసుకుంది. హుజైఫా (70; 83 బంతుల్లో 9×4, 2×6) పోరాటం సరిపోలేదు. అతడు కాకుండా ఫర్హాన్ (23), ఉస్మాన్ ఖాన్ (16) మాత్రమే రెండంకెల స్కోరు చేశారు. ఈ టోర్నీలో భారత్‌కు ఇది వరుసగా రెండో విజయం. పాకిస్థాన్ ఆటగాళ్లతో కరచాలనం చేయకూడదనే విధానాన్ని భారత్ ఈ మ్యాచ్‌లోనూ కొనసాగించింది. టాస్ సమయంలో భారత కెప్టెన్ ఆయుష్, పాక్ కెప్టెన్ ఫర్హాన్ ఒకరినొకరు పలకరించుకోలేదు. కరచాలనం కూడా చేయలేదు. మ్యాచ్ ముగిసిన తర్వాత కూడా ఆటగాళ్లు షేక్ హ్యాండ్ ఇచ్చుకోలేదు.



అగ్రస్థానంలో హైదరాబాద్


రాజస్థాన్‌పై ఘనవిజయం

పుణె: సయ్యద్ ముస్తాక్ అలీ టీ20 ట్రోఫీ సూపర్ లీగ్‌లో హైదరాబాద్ సత్తా చాటుతోంది. వరుసగా రెండో విజయంతో హైదరాబాద్ (8 పాయింట్లు) గ్రూప్-బి పట్టికలో అగ్రస్థానానికి దూసుకెళ్లింది. ఆదివారం జరిగిన మ్యాచ్‌లో హైదరాబాద్ ఆరు వికెట్ల తేడాతో రాజస్థాన్‌పై విజయం సాధించింది. మహిపాల్ లొమ్రోర్ (48; 35 బంతుల్లో 1×4, 4×6) రాణించడంతో మొదట రాజస్థాన్ 9 వికెట్లకు 178 పరుగులు రాబట్టింది. హైదరాబాద్ బౌలర్లలో మహ్మద్ సిరాజ్ (2/23), సి.వి.మిలింద్ (3/25), తనయ్ త్యాగరాజన్ (3/38) మెరిశారు. అనంతరం హైదరాబాద్ లక్ష్యాన్ని 17.1 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి ఛేదించింది. 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' తన్మయ్ అగర్వాల్ (73; 41 బంతుల్లో 8×4, 4×6), రాహుల్ బుద్ధి (55; 36 బంతుల్లో 6×4, 2×6) అర్ధసెంచరీలతో సత్తాచాటారు.



హేమంత్ సెంచరీ.. ఆంధ్ర గెలుపు

పుణె: ఆంధ్ర యువ బ్యాటర్ హేమంత్‌రెడ్డి (109 నాటౌట్; 53 బంతుల్లో 11×4, 7×6) అదరగొట్టాడు. సూపర్ సెంచరీతో సయ్యద్ ముస్తాక్ అలీ టీ20 ట్రోఫీ సూపర్ లీగ్‌లో ఆంధ్రకు తొలి విజయాన్ని అందించాడు. ఆదివారం ఆంధ్ర 5 వికెట్ల తేడాతో పంజాబ్‌ను ఓడించింది. మొదట పంజాబ్ 5 వికెట్లకు 205 పరుగులు సాధించింది. హర్నూర్ సింగ్ (42; 30 బంతుల్లో 4×4, 1×6), అన్మోల్‌ప్రీత్ సింగ్ (47; 27 బంతుల్లో 3×4, 3×6), సలిల్ అరోరా (42 నాటౌట్; 22 బంతుల్లో 5×6), రమణ్‌దీప్ సింగ్ (43; 18 బంతుల్లో 5×4, 2×6) సత్తాచాటారు. అనంతరం గుర్నూర్ బ్రార్ (3/23) దెబ్బకు 56 పరుగులకే 5 వికెట్లు కోల్పోయిన ఆంధ్ర.. పీకల్లోతు కష్టాల్లో చిక్కుకుంది. అయితే 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' హేమంత్‌రెడ్డి, ప్రసాద్ (53 నాటౌట్; 35 బంతుల్లో 2×4, 4×6) అద్వితీయంగా పోరాడటంతో ఆంధ్ర 19.5 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. హేమంత్, ప్రసాద్ ఆరో వికెట్‌కు అజేయంగా 155 పరుగులు జోడించి జట్టును గెలిపించారు.



యశస్వి శతకం.. ముంబయి విజయం

పుణె: యశస్వి జైస్వాల్ (101; 50 బంతుల్లో 16×4, 1×6) సెంచరీతో కదంతొక్కడంతో సయ్యద్ ముస్తాక్ అలీ టీ20 ట్రోఫీ సూపర్ లీగ్‌లో ముంబయి బోణీ కొట్టింది. ఆదివారం గ్రూప్-బి పోరులో ముంబయి 4 వికెట్ల తేడాతో హరియాణాపై గెలుపొందింది. మొదట హరియాణా 3 వికెట్లకు 234 పరుగులు సాధించింది. కెప్టెన్ అంకిత్ కుమార్ (89), నిశాంత్ సింధూ (63 నాటౌట్) చెలరేగి జట్టు భారీ స్కోరులో కీలక పాత్ర పోషించారు. 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' యశస్వి, సర్ఫరాజ్ ఖాన్ (64; 25 బంతుల్లో 9×4, 3×6) చెలరేగడంతో ముంబయి 15 బంతులుండగానే 6 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది.



గిరిజన విద్యార్థులకు ఆర్థిక సాయం పెంపు

- తెదేపా ఎస్టీ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు దారునాయక్

ఈనాడు, అమరావతి: గత వైకాపా ప్రభుత్వం నిర్వీర్యం చేసిన విదేశీ విద్య పథకాన్ని కూటమి ప్రభుత్వం పునరుద్ధరించడంతో పాటు గిరిజన విద్యార్థులకు ఆ పథకం కింద ఆర్థిక సహాయాన్ని రూ.15 లక్షలకు పెంచిందని తెదేపా ఎస్టీ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు దారునాయక్ తెలిపారు. ఎస్టీలకు సంబంధించిన 16 సంక్షేమ పథకాల్ని రద్దు చేసిన ద్రోహి జగన్‌రెడ్డి అని మండిపడ్డారు. ఆయన పాలనలో గిరిజన ప్రాంతాల్లో రహదారులు వేయలేదని, విద్య, వైద్య సౌకర్యాలు కల్పించలేదని ఆదివారం ఓ ప్రకటనలో దుయ్యబట్టారు. గిరిజనుల సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు.

పిన్నెల్లి సోదరులకు మద్దతా?

- జగన్‌పై మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి ధ్వజం

ఈనాడు, అమరావతి: "వైకాపా మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి లాంటి వ్యక్తులకు మద్దతుగా నిలుస్తున్న మీకు మానవత్వం ఉందా?" అని వైకాపా అధినేత జగన్‌ను మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి ప్రశ్నించారు. గత వైకాపా ప్రభుత్వంలో మాచర్ల నియోజకవర్గంలో పిన్నెల్లి సోదరులు చేసిన దాడులు, దౌర్జన్యాలు, హత్యలు రాష్ట్రమంతా తెలుసని పేర్కొన్నారు. తురకా కిషోర్ లాంటి వారిని ప్రజల మీదకు వదిలి జగన్‌తో కలిసి పిన్నెల్లి సోదరులు సైకో ఆనందం పొందారని ఆదివారం ఓ ప్రకటనలో బ్రహ్మానందరెడ్డి దుయ్యబట్టారు.



తొలి ఐదేళ్లు చదువు కోసం కాదు

చిన్నారుల జీవితంలో తొలి ఐదేళ్లు పుస్తకాలతో కుస్తీ పట్టే చదువు కోసం కాదు. ఆరోగ్యకరమైన భావోద్వేగ అనుబంధాలు పెరిగేందుకు, మంచి అలవాట్లు నేర్చుకునేందుకు, సౌందర్యం, ప్రకృతి, సత్యం గొప్పతనాలు తెలుసుకునేందుకు ఆ కాలం ఉపయోగపడాలి. ఈ పునాది సరిగా పడకపోతే ఆ చిన్నారి జీవిత కాలంలో నేర్చుకున్న విద్య అంతా వ్యర్థం అయ్యే అవకాశం ఉంది.

– మేఘా, రచయిత

ఈ-వ్యర్థాల సమస్యకు త్వరలో చెక్!

- నగరాలు, పట్టణాల్లో ఏర్పాటుకానున్న సేకరణ కేంద్రాలు
- శాస్త్రీయ విధానంలో రీసైక్లింగ్‌కు కార్యాచరణ ప్రణాళిక
- పర్యావరణం, ప్రజారోగ్యంపై ప్రభావం చూపుతున్న వ్యర్థాలపై ప్రభుత్వం దృష్టి

ఈనాడు, అమరావతి: నగరాలు, పట్టణాల్లో సమస్యగా తయారైన ఈ-వ్యర్థాలపై ప్రభుత్వం దృష్టి సారించింది. వీటి సేకరణ, నిర్వహణ, రీసైక్లింగ్ కోసం కార్యాచరణ రూపొందించింది. హైదరాబాద్‌కు చెందిన 'ఆర్‌ఈ సస్టెయిన్‌బిలిటీ రెల్డన్ రిఫైనింగ్' సంస్థతో ఇందుకోసం అవగాహన ఒప్పందం చేసుకుంది. ప్రతి నగరం, పట్టణంలో రెండు, మూడు ఈ-వ్యర్థాల సేకరణ కేంద్రాలు



త్వరలో ప్రారంభించనున్నారు. వీటి ద్వారా ఇళ్లు, షాపులు, కార్యాలయాల్లో ఉన్న పాడైన కంప్యూటర్లు, మొబైల్ ఫోన్లు, కేబుళ్లు, గృహోపకరణాలు వంటి ఎలక్ట్రానిక్ వ్యర్థాలు సేకరిస్తారు. వాటిని ఆర్‌ఈ సస్టెయిన్‌బిలిటీ సంస్థ రీసైక్లింగ్ చేస్తుంది. ఈ-వ్యర్థాల సేకరణ, నిర్వహణ, రవాణా, రీసైక్లింగ్ తదితర అంశాలకు సంబంధించి రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ప్రత్యేక మార్గదర్శకాలు రూపొందించింది. వచ్చే నెల 1 నుంచి ఇవి అమలులోకి రానున్నాయి. 46 పట్టణాల్లో ప్రయోగాత్మకంగా 4 నెలల క్రితం చేపట్టిన కార్యక్రమంలో 25 మెట్రిక్ టన్నుల ఈ-వ్యర్థాలు సేకరించారు. మిగతా నగరాలు, పట్టణాల్లోనూ సమస్య తీవ్రంగా ఉన్నట్లు గుర్తించి రాష్ట్రంలోని 132 పట్టణ స్థానిక సంస్థల్లోనూ అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.

ఈ-వ్యర్థాలకు నగదు చెల్లింపు

- పుర, నగరపాలక సంస్థల్లో త్వరలో ప్రారంభించే సెంటర్లకు ప్రజలు తీసుకొచ్చే ఈ-వ్యర్థాలకు ధర నిర్ణయించి నగదు చెల్లించే ఆలోచన ప్రభుత్వం చేస్తోంది. దీని వల్ల ప్రజలు, వ్యాపారులు ఇళ్లు, దుకాణాల్లోని వ్యర్థాలు బయటకు తీసి ఇస్తారని అంచనా వేస్తోంది. ఈ విధంగా సమస్యకు పరిష్కారం లభిస్తుందని అధికారులు భావిస్తున్నారు.
- ఈ-వ్యర్థాల సేకరణకు త్వరలో యాప్ కూడా తీసుకొచ్చే విషయాన్ని ప్రభుత్వం పరిశీలిస్తోంది. ఇళ్లు, షాపులు, కార్యాలయాల్లో వ్యర్థాలున్నట్లయితే యాప్‌లో ఆ వివరాలు పెట్టొచ్చు. సెంటర్ల నుంచి సిబ్బంది వెళ్లి వాటిని సేకరించి నగదు చెల్లిస్తారు. అదే విధంగా యాప్ ద్వారా ఈ-వ్యర్థాలతో నష్టాలపై ప్రజల్లో అవగాహన కల్పించనున్నారు.

ఆంధ్రప్రదేశ్‌కు విద్యుత్తు సంరక్షణ పురస్కారం

రాష్ట్రపతి చేతుల మీదుగా అవార్డు ప్రదానం

ఈనాడు, దిల్లీ: ఇంధన సంరక్షణలో మంచి పనితీరు కనబరిచినందుకు ఆంధ్రప్రదేశ్‌కు జాతీయ ఇంధన సంరక్షణ అవార్డు-2025 గ్రూప్-2 విభాగంలో మొదటి బహుమతి లభించింది. ఆదివారం ఇక్కడి విజ్ఞాన్‌భవన్‌లో జరిగిన కార్యక్రమంలో ఏపీఎస్పీడీసీఎల్ సీఎండీ శివశంకర్ లోతేటి రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము చేతులమీదుగా ఈ అవార్డు స్వీకరించారు. అలాగే 53,132 యూనిట్ల విద్యుత్తు పొదుపు చేసినందుకు దక్షిణమధ్య రైల్వే పరిధిలోని గుంతకల్లు డీజిల్ ట్రాక్షన్ ట్రైనింగ్ సెంటర్ ప్రభుత్వ భవనాల విభాగంలో జాతీయస్థాయి పురస్కారాన్ని సొంతం చేసుకుంది. దాని తరపున దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్‌కుమార్ శ్రీవాస్తవ రాష్ట్రపతి చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. కార్యక్రమంలో కేంద్ర విద్యుత్తు శాఖ మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్, సహాయమంత్రి శ్రీపాద యశోనాయక్ కూడా పాల్గొన్నారు.





రాష్ట్రపతి నుంచి అవార్డు స్వీకరిస్తున్న ఏపీఎస్పీడీసీఎల్ సీఎండీ శివశంకర్ లోతేటి ★ దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్‌కుమార్ శ్రీవాస్తవ

భార్య ఉసురు తీసి.. మృతదేహంతో స్టేషన్‌కు

పల్నాడు జిల్లా మాచవరంలో దారుణం

రొంపిచర్ల, న్యూస్‌టుడే: అనుమానంతో కట్టుకున్న భార్యను కడతేర్చిన భర్త.. ఆమె శవాన్ని ద్విచక్ర వాహనంపై తీసుకెళ్లి పోలీస్ స్టేషన్‌లో లొంగిపోయిన ఘటన పల్నాడు జిల్లా రొంపిచర్ల మండలం మాచవరంలో చోటుచేసుకుంది. బాపట్ల జిల్లా సంతమాగులూరు మండలం ఏల్చూరుకు చెందిన అల్లడి వెంకటేశ్వర్లు, రొంపిచర్ల మండలం మాచవరం గ్రామానికి చెందిన మహాలక్ష్మి (28)ని ప్రేమ వివాహం చేసుకున్నాడు. వీరికి కుమార్తె, కుమారుడు ఉన్నారు. వెంకటేష్ బేకరీలో పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. మహాలక్ష్మి ప్రవర్తనపై భర్తకు అనుమానం రావటంతో ఇద్దరి మధ్య తరచూ గొడవలు జరిగేవి. దీంతో మహాలక్ష్మి





నిందితుడు అల్లడి వెంకటేశ్వర్లు ★ మృతురాలి గొంతుపై గాయాలు

రెండు నెలలుగా భర్తకు దూరంగా మాచవరంలోని పుట్టింట్లో ఉంటోంది. ఆదివారం ఉదయాన్నే వెంకటేశ్వర్లు మాచవరం వచ్చాడు. పాపకు బంగారం తెచ్చానని, ఇంటికి వెళదామని.. మాట్లాడాలంటూ నమ్మబలికాడు. భార్యను ద్విచక్ర వాహనంపై ఎక్కించుకుని మాచవరం నుంచి విప్పర్ల వెళ్లే మార్గం వద్దకు తీసుకెళ్లాడు. అక్కడ కూడా ఇద్దరూ గొడవ పడ్డారు. దీంతో మహాలక్ష్మి ధరించిన స్వెట్టర్‌కు ఉన్న తాడును ఆమె గొంతుకు బిగించి హత్య చేశాడు. మృతదేహాన్ని ద్విచక్ర వాహనం పెట్రోలు ట్యాంకుపై ఉంచి.. బైక్ నడుపుతూ తీసుకెళ్లి సంతమాగులూరు పోలీస్ స్టేషన్‌కు వెళ్లి లొంగిపోయాడు. మహాలక్ష్మి ప్రాణంతో ఉందేమోనని భావించిన పోలీసులు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే ఆమె చనిపోయినట్లు వైద్యులు నిర్ధారించారు. పోలీసులు ఆ సమాచారాన్ని రొంపిచర్ల పోలీస్ స్టేషన్‌కు చేరవేశారు. వారు సంతమాగులూరు చేరుకొని మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. మృతురాలి తల్లి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఏపీఆర్‌జేసీ చదువుతో ఈ స్థాయికి ఎదిగా

- స్వర్ణోత్సవంలో తెలంగాణ సీఎస్ కె.రామకృష్ణారావు



మాట్లాడుతున్న తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు

ఈనాడు డిజిటల్, నరసరావుపేట, న్యూస్‌టుడే, విజయపురిసౌత్: 'ఏపీఆర్‌జేసీ వీడిన తర్వాత ప్రపంచాన్ని గెలవవచ్చని తెలుసుకున్నాం. ఇక్కడ చదువు పూర్తయి బయటకు వచ్చాక ఎంతో మార్పు కనిపించింది. దాని ఫలితమే నన్ను ఈ స్థాయికి చేర్చింది' అని తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు అన్నారు. తరగతి గదుల్లో ఎంత నేర్చుకున్నామో, కళాశాల బయట అంతే నేర్చుకున్నామన్నారు. పల్నాడు జిల్లా నాగార్జునసాగర్ ఏపీఆర్‌జేసీ స్వర్ణోత్సవం రెండ్రోజులపాటు నిర్వహించారు. ఆదివారం జరిగిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. తొలుత సీఎస్ రామకృష్ణారావుకు అధ్యాపకులు, పూర్వ విద్యార్థులు మేళతాళాలు, నృత్యాలతో ఘనస్వాగతం పలికారు.

పాత జ్ఞాపకాలు గుర్తుకొస్తున్నాయి..

రామకృష్ణారావు మాట్లాడుతూ.. 'మిమ్మల్ని చూస్తుంటే.. సినిమా రీల్ తిరిగినట్టు పాతజ్ఞాపకాలు గుర్తుకొస్తున్నాయి. మా ఊరు హిందూపురం. అక్కడికి సమీపంలోని కొడిగెనహళ్లిలో చదువుకున్నా. నాగార్జునసాగర్‌కు వచ్చాక అక్కడికంటే ఇక్కడ తక్కువ మౌలిక వసతులు ఉన్నాయనిపించింది. నాగార్జునసాగర్ జలాశయ నిర్మాణ సమయంలో ఏర్పాటు చేసిన సిమెంట్ గోదాములను హాస్టల్‌కు కేటాయించారు. వాటిల్లో చదువుకుని ఎంతోమంది ఐఏఎస్, ఐపీఎస్, ఐఎఫ్ఎస్ అధికారులయ్యారు. నేను చదువుకుంటున్న సమయంలో మా గదిలోని దుస్తులు అపహరణకు గురయ్యాయి. వెంటనే గురజాల పోలీసులు రికవరీ చేశారు. ఆ జ్ఞాపకాలు బాగా గుర్తున్నాయి. మాలో కొంతమంది ఐఐటీలు, అమెరికాల్లో చదువుకున్నా.. అందుకు పునాది మాత్రం ఏపీఆర్‌జేసీనే. మా బ్యాచ్‌లోని రాము ఇంటర్ ఫస్టియర్‌లోనే ఐఐటీ పాస్ అవ్వడమే కాకుండా. . సెకండియర్‌లో ఆల్‌ఇండియా 4వ ర్యాంకు సాధించాడు. అంత బాగుండేది ఇక్కడి చదువు. ఒకప్పుడు సరైన మౌలిక వసతులు లేకపోయినా ఎంతోమంది ఇక్కడ చదివి ఉన్నతస్థానాలకు ఎదిగారు. పీవీ నరసింహారావు ఆశయాల మేరకు ఈ కళాశాల నుంచి ఉద్దండులు బయటకు వచ్చారు. నాటి అధ్యాపకులు గురుకుల విద్యాసంస్థలను గాడినపెట్టడంలో కీలక పాత్ర పోషించారు. కళాశాల బాగు కోసం అందరం భాగస్వాములవుదాం. ప్రభుత్వాల తరపున కూడా సాయమందేలా చొరవతీసుకుందాం. ఇప్పుడున్న విద్యార్థులు, అధ్యాపకులు కళాశాల చరిత్రను దృష్టిలో పెట్టుకుని ముందుకెళ్లాలని కోరుకుంటున్నా' అని ఆయన అన్నారు. రెండ్రోజులపాటు నిర్వహించిన స్వర్ణోత్సవ వేడుకలు ఆదివారంతో ముగిశాయి. ఈ కార్యక్రమంలో పూర్వవిద్యార్థులైన ఏపీఈడబ్ల్యూఐడీసీ ఛైర్మన్ ఎస్.రాజశేఖర్, ఏపీఆర్ఈఐఎస్ సెక్రటరీ మస్తానయ్య, తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ తుకారాంజీ, ఏపీ వెల్ఫేర్ సెక్రటరీ ఎమ్.ఎమ్.నాయక్, తెలంగాణ మాజీ డీజీపీ ఎమ్.మహేంద్రరెడ్డి, ఐఎఫ్ఎస్ అధికారి రాజశేఖర్, ఐజీ ఎమ్.రమేశ్‌రెడ్డి, మాజీ ప్రిన్సిపల్ మారెళ్ల అంజిరెడ్డి, ప్రస్తుత ప్రిన్సిపల్ సరోజినీ దేవీ తదితరులు పాల్గొన్నారు.

ఊడలే వృక్షాలై.. అందమైన వనమై!



చెట్టు ప్రధాన మొదలు చనిపోయినా.. ఊడలే వృక్షాలై ఎకరం మేర విస్తరించాయి. కాకినాడ జిల్లా తుని గ్రామీణ మండలంలోని దొండవాక గ్రామ సమీపంలోని మరిడమ్మ ఆలయం వద్ద ఉందీ ఊడల మర్రి. ఇది వందేళ్ల కిందటి చెట్టని స్థానికులు తెలిపారు. చాలా ఏళ్ల కిందటే ప్రధాన వృక్షం చనిపోయింది. దాన్నుంచి వచ్చిన ఊడలు ఒక్కోటి ఒక్కో చెట్టులా మారి అక్కడో వనంలా పెరిగాయి. అందుకే దీని మొదలేదో, ఊడ ఏదో ఎవరూ కనిపెట్టలేరు. సెలవులు, పండగ రోజుల్లో చుట్టుపక్కల ఊరివాళ్లతో చెట్టుకింద సందడి నెలకొంటుంది. – న్యూస్‌టుడే, తుని గ్రామీణం

EENADU Vol: 52, Issue: 125 Printed and Published by M Nageswara Rao on behalf of Ushodaya Publications, a division of Ushodaya Enterprises Pvt Ltd. Printed and Published at Ushodaya Publications, Eenadu Press, Survey No. 239/3, 240/3B & 240/4, Gudavalli Village, Vijayawada Rural Mandal, NTR District - 521 104, Andhra Pradesh. Editor: M Nageswara Rao. Phones: 0866-2494900, 2862111. Regd. No. VJ/013/2024-26. RNI No.32238/1978. Air Surcharge Extra. Mumbai, Kolkata, Goa. Re. 1.00, Portblair Rs. 10.00. Founder Ramoji Rao

ప్రతి ట్రేడింగ్ గంటలో రూ.152 కోట్ల షేర్ల విక్రయం

ఇదీ విదేశీ పెట్టుబడిదార్ల తీరు

ఈ ఏడాది (2025)లో విదేశీ మదుపర్లు మొత్తం మీద రూ. 2.23 లక్షల కోట్ల విలువైన షేర్లను విక్రయించారు. అయితే దేశీయ సంస్థాగత మదుపర్లు, రిటెయిల్ మదుపర్లు భారీగా కొనుగోళ్లు జరపడం వల్ల.. విదేశీ పెట్టుబడుల ఉపసంహరణల ప్రభావం మన మార్కెట్లపై పెద్దగా పడలేదు. విదేశీ సంస్థాగత మదుపర్లు (ఎఫ్ఐఐ), ఈ ఏడాదిలో జరిపినంతగా గతంలో ఎన్నడూ విక్రయాలకు దిగలేదు. ఈ ఏడాది జనవరి నుంచి వారు జరిపిన అమ్మకాలను గమనిస్తే, ప్రతి ట్రేడింగ్ గంటలో సగటున రూ.152 కోట్ల విలువైన షేర్లను విక్రయించినట్లు అయ్యింది. దేశీయ మార్కెట్‌లో ఎఫ్ఐఐలు ఇప్పటివరకు రూ.2.23 లక్షల కోట్ల షేర్లను విక్రయించారు. ఈ ఏడాదిలో ట్రేడింగ్ జరిగిన రోజులు, గంటల ప్రకారం లెక్కిస్తే సగటున ఒక ట్రేడింగ్ రోజులో రూ.900 కోట్లు, ప్రతి ట్రేడింగ్ గంటలో రూ.152 కోట్ల విలువైన షేర్లను విక్రయించినట్లయ్యింది.



2 ఏళ్లలో 20 కోట్ల ఖాతాదారులే లక్ష్యం

- నేడు యోనో 2.0 ఆవిష్కరణ
- ఎస్‌బీఐ ఛైర్మన్ సి.శ్రీనివాసులు శెట్టి



స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) మొబైల్ యాప్, యోనో వినియోగదారుల సంఖ్యను రెండేళ్లలో దాదాపు రెట్టింపు చేసి 20 కోట్లకు చేర్చడమే లక్ష్యమని ఎస్‌బీఐ ఛైర్మన్ సి.శ్రీనివాసులు శెట్టి వెల్లడించారు. మరింతగా ఆధునికీకరించిన యోనో యాప్ కొత్త వెర్షన్ 'యోనో 2.0'ను బ్యాంక్ సోమవారం విడుదల చేయనుంది. ఇది ముఖ్యమైన అప్‌గ్రేడ్ అని, ఖాతాదారులకు మెరుగైన సేవలు, బలమైన డిజిటల్ ప్లాట్‌ఫామ్‌ను అందిస్తుందని, 6-8 నెలల్లో పూర్తి స్థాయిలో మరిన్ని ఫీచర్లు అందుబాటులోకి తెస్తామని శ్రీనివాసులు శెట్టి తెలిపారు. 'బ్యాంకు కోణంలో చూస్తే డిజిటలీకరణలో యోనో 2.0 చాలా కీలకం. ఇంటర్నెట్ బ్యాంకింగ్, మొబైల్ బ్యాంకింగ్‌లను ఇది అనుసంధానిస్తుంది. అన్ని విభాగాల్లో ఉన్న కొత్త ఆర్థిక పథకాలను, యోనో 2.0పై వేగంగా, సజావుగా పొందొచ్చు. కొత్త వెర్షన్‌తో డిజిటల్ విస్తరణ, వినియోగదారులకు మెరుగైన సేవలను అందించడమే బ్యాంక్ లక్ష్యం' అని శెట్టి వివరించారు. వినియోగదారుల కోసం యోనో 2.0 సాధారణ వ్యవస్థను అభివృద్ధి చేసిందని, ఖాతా తెరవడం లేదా ఏదైనా ఇతర లావాదేవీల కోసం ఇంటర్నెట్ బ్యాంకింగ్, మొబైల్ బ్యాంకింగ్, బ్యాంక్ శాఖల వారీగా సులభమైన సేవలు అందిస్తుందని ఆయన అన్నారు. ప్రస్తుతం 10 కోట్ల మంది యోనో యాప్‌ను వినియోగిస్తున్నారని, వీరి సంఖ్యను 20 కోట్లకు చేర్చడమే లక్ష్యమని స్పష్టం చేశారు.

టీవీ - మొబైల్ భారం

- రూపాయి క్షీణత నేపథ్యం
- ఆదాయం పెంపునకు టెలికాం సంస్థలు కూడా



డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ బలహీనపడటం, కొన్ని రకాల విడిభాగాల ధరలు పెరగడం వల్ల ఎల్ఈడీ టీవీలు, మొబైల్ ధరలను కంపెనీలు పెంచుతున్నాయి. వీటి తయారీలో కీలకమైన మెమొరీ చిప్స్, ఓపెన్ సెల్, సెమీ కండక్టర్ చిప్స్, మదర్‌బోర్డుల వంటి వాటి కోసం దిగుమతులపైనే అధికంగా ఆధారపడుతున్నందునే.. డాలర్ రూపేణ పడుతున్న భారాన్ని కంపెనీలు వినియోగదారులకు బదిలీ చేస్తున్నాయి. ఆదాయ వృద్ధి తక్కువగా ఉంది కనుక, మొబైల్ నెట్‌వర్క్ సంస్థలు కూడా టారిఫ్‌లను పెంచడం లేదా వివిధ పథకాల కాలావధిని తగ్గించడం చేస్తున్నాయి.

- జనవరి నుంచి టెలివిజన్ ధరలను కంపెనీలు 3-4% పెంచే అవకాశ ఉంది. దేశీయంగా తయారవుతున్న/అసెంబ్లింగ్ జరుగుతున్న ఎల్ఈడీ టీవీల్లో.. ఇక్కడ విలువ జతచేరుతోంది 30 శాతమే. 70% విడిభాగాలు ప్రధానంగా ఓపెన్ సెల్, సెమీ కండక్టర్ చిప్స్, మదర్‌బోర్డుల వంటివి దిగుమతి చేసుకుంటున్నట్లు హైయర్ అప్లయన్సెస్ ఇండియా ప్రెసిడెంట్ ఎన్ఎస్ సతీష్ తెలిపారు. డాలర్ విలువ రూ.90 మించడంతో, తమపై భారాన్ని తగ్గించుకునేందుకు టీవీల ధరలను 3-4% పెంచక తప్పదని వివరించారు. ఎల్ఈడీల ధరలను పెంచక తప్పదని థామ్సన్, కోడక్, బ్లాపుంట్ బ్రాండ్ల టీవీలు తయారు చేసే సూపర్ ప్లాస్ట్రోనిక్స్ ప్రైవేట్ లిమిటెడ్ సీఈఓ అవనీత్ సింగ్ మార్వా వెల్లడించారు.
- 32 అంగుళాలు, అంతకుమించిన టీవీలపై జీఎస్‌టీని గత సెప్టెంబరులో 28% నుంచి 18 శాతానికి ప్రభుత్వం తగ్గించడంతో.. టీవీల ధరలు రూ.4,500 వరకు తగ్గాయి. అప్పుడు 10% వరకు తగ్గితే, జనవరి నుంచి కొంతమేర పెరగనున్నాయి.

ప్రీపెయిడ్ ఛార్జీలు పెరుగుతున్నాయ్!

డాలర్ విలువ పెరుగుతున్న క్రమంలో, గత 40 రోజులుగా సెల్‌ఫోన్ ధరలను కంపెనీలు స్వల్పంగా పెంచాయి. ఇదే సమయంలో టెలికాం నెట్‌వర్క్ సంస్థలు కూడా, తమ లాభదాయకత పెంచుకునేందుకు ప్రీపెయిడ్ ఛార్జీలను పెంచడం, కాలావధులను తగ్గించడం వంటి చర్యలకు దిగుతున్నాయి. రిలయన్స్ జియో మినహా మిగిలిన సంస్థలు ఇదే క్రమంలో ఉన్నట్లు సమాచారం. ఇప్పటికే భారతీ ఎయిర్‌టెల్, వొడాఫోన్ ఐడియా టారిఫ్ సవరింపులకు సంబంధించి వివరాలు వెల్లడిస్తుండగా, ప్రభుత్వరంగ బీఎస్ఎన్ఎల్ కూడా కాలావధిని తగ్గిస్తోంది.

ఆదాయంలో వృద్ధి తగ్గడం వల్లేనా?

టెలికాం సంస్థల ఆదాయాల్లో వృద్ధి ఇటీవలి కాలంలో తగ్గుతూ వస్తోంది. గత ఏడాది ఇదే సమయంతో పోల్చుకుంటే జూన్ త్రైమాసికంలో 14-16 శాతంగా ఉన్న టెలికాం నెట్‌వర్క్ సంస్థల సగటు ఆదాయ వృద్ధి, సెప్టెంబరు త్రైమాసికంలో 10 శాతానికి పరిమితం అయ్యింది. డిసెంబరు త్రైమాసికంలో ఆదాయ వృద్ధి మరింత తగ్గుతుందనే అంచనాలున్నాయి. ఈ నేపథ్యంలోనే ఆదాయం తద్వారా లాభదాయకత పెంచుకునేందుకు టెలికాం సంస్థలు ప్రయత్నిస్తున్నాయి. ఇందుకోసం ప్రీపెయిడ్ ఛార్జీలను 15% వరకు పెంచొచ్చని భావిస్తున్నారు.

ఇప్పటికే ఈ మార్పులు

- వొడాఫోన్ ఐడియా తమ వార్షిక పథకం రూ.1,999 ధరను 12% పెంచి రూ.2249 చేసింది. 84 రోజుల పథకం ధరను రూ.509 నుంచి 7% పెంచి రూ.548 చేసింది.
- భారతీ ఎయిర్‌టెల్ కూడా నెలవారీ అతితక్కువ రీఛార్జి పథకం రూ.189 ధరను రూ.10 చొప్పున పెంచింది.
- బీఎస్ఎన్ఎల్ ఛార్జీలు పెంచకపోయినా, తక్కువ ధర రీఛార్జి పథకాల కాలావధులను తగ్గించింది.

అంచనాలు ఇలా

సమీపకాలంలో ఎన్నికల వంటివి లేనందున, టారిఫ్ పెంపునకు ఇదే సమయమని టెలికాం సంస్థలు భావిస్తున్నాయని మోతీలాల్ ఓస్వాల్ పేర్కొంది. ఈనెలలోనే ఈ మార్పులుండొచ్చని పేర్కొంది. నెలవారీ అపరిమిత కాల్స్, రోజూ 1.5 జీబీ డేటా ఇచ్చే పథకం ధరలు సగటున రూ.50 వరకు పెరగొచ్చని అంచనా వేసింది. వొడాఫోన్ ఐడియా ఇప్పటికే తమ చందాదార్లలో తక్కువ మొత్తం చెల్లించేవారిని ఎయిర్‌టెల్, జియోకు కోల్పోయింది. అయితే ఎప్పటినుంచో వొడాఫోన్, ఐడియా కంపెనీల చందాదారులుగా ఉన్న కొందరు మాత్రం అలానే ఉండిపోయారు. వీరు ఎక్కువగా 365 రోజుల కాలావధి పథకాలను వినియోగిస్తుంటారు. 5జీ సేవల కోసం కొందరు ఇతర నెట్‌వర్క్‌లకు మళ్లారు. అయితే వొడాఫోన్ ఐడియా కూడా ఇప్పుడు 5జీ సేవలను అందుబాటులోకి తెస్తుండటం గమనార్హం.

హైదరాబాద్‌లో రూ.2,600 కోట్ల అమ్మకాలు


గోద్రేజ్ ప్రాపర్టీస్

స్థిరాస్తి సంస్థ గోద్రేజ్ ప్రాపర్టీస్, హైదరాబాద్‌లో కార్యకలాపాలు ప్రారంభించిన మొదటి సంవత్సరంలోనే రూ.2,600 కోట్ల విలువైన ఆస్తులను విక్రయించినట్లు సంస్థ ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్ పిరోజ్‌షా గోద్రేజ్ తెలిపారు. 2025 జనవరి-మార్చి త్రైమాసికంలో కోకాపేటలో శ్రీకారం చుట్టిన తొలి ప్రాజెక్టు, జులై-సెప్టెంబరులో చేపట్టిన రెండో ప్రాజెక్టుల్లో కలిపి మొత్తం రూ.2,600 కోట్లకు పైగా విలువైన బుకింగులు వచ్చాయన్నారు. హైదరాబాద్‌లో ప్రీమియం, విలాసవంత ఇళ్లు/ఫ్లాట్లకు ఉన్న గిరాకీని సద్వినియోగం చేసుకునేలా ఇక్కడ తమ వ్యాపారాన్ని విస్తరిస్తామని పేర్కొన్నారు.

- నియోపోలీస్‌లో 5 ఎకరాల భూమిని సంస్థ వేలంలో కొనుగోలు చేసింది. ఇక్కడ రూ.4,150 కోట్ల విలువైన నివాస సముదాయాన్ని నిర్మించనుంది.

ఏఐలో భారత్‌కు మూడో ర్యాంకు

ప్రకటించిన స్టాన్‌ఫోర్డ్ విశ్వవిద్యాలయం



ఏఐ (కృత్రిమమేధ) సాంకేతికత అభివృద్ధి, వినియోగంలో అంతర్జాతీయంగా భారత్ మూడోస్థానంలో ఉందని స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీ '2025 గ్లోబల్ ఏఐ వైబ్రెన్సీ టూల్' నివేదిక వెల్లడించింది. 2024 గ్లోబల్ ఏఐ వైబ్రెన్సీ ర్యాంకింగ్ ఆధారంగా, తాజా జాబితాను స్టాన్‌ఫోర్డ్ విడుదల చేసింది. గత జాబితాతో పోలిస్తే భారత్ 4 స్థానాలు పైకొచ్చింది. ఏఐకి సంబంధించి 'పరిశోధన -అభివృద్ధి, బాధ్యతాయుత ప్రవర్తన, ఆర్థిక వ్యవస్థ, నైపుణ్యాలు, విధాన నిర్ణయాల అమలు, ప్రజాభిప్రాయం, మౌలిక వసతులు' వంటి అంశాల ఆధారంగా గతేడాది వ్యవధిలో వచ్చిన మార్పులను పరిగణనలోకి తీసుకుని, వివిధ దేశాలకు ర్యాంకులను స్టాన్‌ఫోర్డ్ ప్రకటించింది. ఈ ప్రకారం.. ఏఐ పురోగతిలో అమెరికా (స్కోర్ 78.6), చైనా (36.95) తరవాత స్థానంలో మనదేశం ఉంది. ఈ సూచీలో మనదేశ స్కోర్ 21.59 కాగా, దక్షిణ కొరియా (17.24), యునైటెడ్ కింగ్‌డమ్ (16.64), సింగపూర్ (16.43), స్పెయిన్ (16.37), యూఏఈ (16.06), జపాన్ (16.04) మన కంటే దిగువనే ఉన్నాయి.

మనదేశం ఎలా మెరుగుపడిందంటే

- గత జాబితాలో మనదేశం ఏడోస్థానంలో ఉండగా, ఇప్పుడు 4 స్థానాలు మెరుగుపరచుకుంది. ప్రధానంగా ఏఐ పరిశోధన-అభివృద్ధిలో భారత్ అధికంగా రాణించింది. వినూత్న ఉత్పత్తులు, పేటెంట్ కార్యకలాపాలు, ప్రజా విశ్వాసం పొందేందుకు - ఇదేక్రమంలో నష్టాన్ని నివారించేలా బాధ్యతాయుత ఏఐ ప్రమాణాలు అనుసరించడం, ఏఐలోకి వస్తున్న పెట్టుబడులు, లభిస్తున్న ఉద్యోగాలు కూడా ర్యాంకింగ్‌పై ప్రభావం చూపాయి. ఏఐ నైపుణ్యాలు - ఇందుకు అనుసరిస్తున్న విద్యావిధానం మనదేశంలో మెరుగ్గా ఉంది. అయితే విధాన నిర్ణయాలు, అమల్లో మాత్రం మనదేశం 5 స్థానాలు కిందకు వచ్చింది.

పెట్టుబడులు ఇలా

వివిధ ప్రభుత్వాలు కూడా ఏఐలో పెట్టుబడులు పెడుతున్నాయి. కెనడా 2.4 బి.డా.(సుమారు రూ.21,600 కోట్లు), చైనా 47.5 బిలియన్ డాలర్ల (సుమారు రూ.4.27 లక్షల కోట్ల) సెమీకండక్టర్ నిధి, ఫ్రాన్స్ 109 బిలియన్ యూరోలు (సుమారు రూ.11.44 లక్షల కోట్లు), భారత్ 1.25 బి.డా.(సుమారు రూ.11,250 కోట్లు), సౌదీ అరేబియా 100 బి.డా. (సుమారు రూ.9 లక్షల కోట్ల) పెట్టుబడులను ఈ రంగానికి ప్రకటించాయి.

అప్పట్లో సెన్సెక్స్‌లో.. ఇప్పుడు అప్రాధాన్యంగా

సూచీ నుంచి 80% ప్రారంభ కంపెనీల నిష్క్రమణ



1987లో బీఎస్ఈ సెన్సెక్స్ సూచీలో ఉన్న 30 కంపెనీల్లో, ప్రస్తుతం 24 అందులో లేవని.. అంటే సూచీ ప్రారంభం నాటి 80% కంపెనీలు ఇప్పుడు ప్రాధాన్యం కోల్పోయాయని ట్రస్ట్ మ్యూచువల్ ఫండ్ చీఫ్ ఇన్వెస్ట్‌మెంట్ అధికారి మిహిర్ వోరా తెలిపారు. కొన్ని దివాలా స్మృతికి చేరడం, మరికొన్నింటిని ఇతర కంపెనీలు కొనుగోలు చేయడం, విలీనం వంటి కారణాల వల్ల 8 కంపెనీలు మనుగడలోనే లేవని వివరించారు. అప్పట్లో సెన్సెక్స్ సూచీలో ఆర్థిక రంగ (బ్యాంకులు, ఎన్‌బీఎఫ్‌సీలు, క్యాపిటల్ మార్కెట్లు) కంపెనీలు లేవని.. ఇప్పుడేమో సూచీలో ఈ రంగ కంపెనీల వెయిటేజీ 31 శాతమని అన్నారు. అప్పట్లో టెలికాం, ఐటీ కంపెనీలు కూడా సెన్సెక్స్‌లో లేవని, ఇప్పుడు వాటికి 22% ప్రాతినిధ్యం ఉందని తెలిపారు. అంటే ప్రారంభ సూచీలో లేని రంగాల నుంచే, ప్రస్తుతం 50% వాటా సూచీలో ఉందని పేర్కొన్నారు.

కొత్తతరం కంపెనీల విలువలపై ఆందోళన వద్దు

ఇవన్నీ దృష్టిలో పెట్టుకుంటే.. 'ప్రస్తుత కొత్త తరం కంపెనీల విలువలపై ఆందోళన చెందాల్సిన అవసరం లేద'ని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రతి వ్యాపారం ప్రారంభ దశలో 'కొత్త తరం'గానే కనిపిస్తుందని, కానీ పెట్టుబడిదార్లు దీర్ఘకాలిక వృద్ధి సత్తా ఆధారంగా కంపెనీ విలువలను మదింపు చేసుకోవాలని సూచించారు. కొత్త తరం టెక్నాలజీలు, వ్యాపారాలు ఎప్పుడూ వస్తూనే ఉంటాయని, అవి కొత్త అవకాశాలను సృష్టించడం లేదా ఉన్న వ్యాపారాలకు ఆటంకాలు కలిగిస్తుంటాయని వివరించారు.

- 1990, 2000 దశాబ్దాల్లో ఐటీ సేవల కంపెనీలను కొత్త తరం, వేగంగా వృద్ధి చెందే కంపెనీలుగా పరిగణించేవారు. ప్రస్తుతం అందులో చాలా వరకు వస్తు సేవలు అందించే వాటిగా ఉన్నాయి. వృద్ధి దశలో ఒక రంగం లేదా కంపెనీ విలువలు అధికంగా కనిపించడం సాధారణమేనని అన్నారు.
- దాదాపు బిలియన్ డాలర్ల మార్కెట్ విలువతో భారతీ ఎయిర్‌టెల్ ఐపీఓకు వచ్చినపుడు, ఆ టెలికాం నెట్‌వర్క్ కంపెనీ నష్టాల్లో ఉందని హీలియోస్ క్యాపిటల్ వ్యవస్థాపకుడు సమీర్ అరోరా గుర్తుచేశారు. కానీ ఇప్పుడు ఆ షేరు ఎంతగా పెరిగి, మదుపర్లకు భారీ లాభాలు తెచ్చిపెట్టిందో గమనించాలన్నారు.

ఆర్‌బీఐ ప్రామాణిక రేటుతో ఎంఎస్ఎంఈ రుణాల అనుసంధానం

బ్యాంకులకు ఆర్‌బీఐ సూచన



ఎంఎస్ఎంఈల రుణాలను ప్రామాణిక వడ్డీ రేటుకు అనుసంధానించాలని, బ్యాంకులకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) సూచించింది. ద్రవ్యపరపతి విధాన నిర్ణయాల బదలాయింపును మెరుగుపరిచేందుకు ఈ నిర్ణయం తీసుకుంది. ఎక్స్‌టెర్నల్ బెంచ్‌మార్క్ వ్యవస్థ కింద, రుణాల రీసెట్ నిబంధనను 3 నెలలకు తగ్గించారు. ఎక్స్‌టెర్నల్ బెంచ్‌మార్క్ ఆధారిత వడ్డీ రేట్లను ప్రస్తుత రుణగ్రహీతలకు అందుబాటులోకి తెచ్చేందుకు, పరస్పరం అంగీకరించిన నిబంధనల ప్రకారం స్విచ్‌ఓవర్ సదుపాయాన్ని కల్పించాలని బ్యాంకులకు ఆర్‌బీఐ సూచించింది. దేశీయ ఉత్పత్తికి అంతరాయం కలగకుండా చూసేందుకు.. ఎంఎస్ఎంఈలకు మినహాయింపులు, సడలింపులతో నాణ్యతా నియంత్రణ ఉత్తర్వుల (క్యూసీఓ)ను ప్రభుత్వం అమలు చేస్తోందని కేంద్ర సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల సహాయ మంత్రి శోభా కరంద్లాజే లోక్‌సభకు లిఖిత పూర్వకంగా తెలిపారు.

- ఎంఎస్ఎంఈలకు మినహాయింపులు, సడలింపులతో మంత్రిత్వ శాఖలు జారీ చేసిన క్యూసీఓలను, దశలవారీగా బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ (బీఐఎస్), వినియోగదారు వ్యవహారాల శాఖ ద్వారా ప్రభుత్వం అమలు చేస్తోంది. క్యూసీఓల అమల్లో సూక్ష్మ సంస్థలకు ఆరు నెలలు, చిన్న తరహా సంస్థలకు 3 నెలల సమయాన్ని ప్రభుత్వం ఇచ్చింది.

కోడి గుడ్లు

15న ఫారం వద్ద రైతు అమ్మకం ధరలు (నెక్) (100కు రూపాయలలో)




హైదరాబాద్	666	తూ/ప గోదావరి	675
వరంగల్	668	విశాఖపట్నం	675
విజయవాడ	700	చిత్తూరు	683

పసుపులో లాభాల స్వీకరణ!

కమొడిటీస్ ఈ వారం

పసిడి



పసిడి ఫిబ్రవరి కాంట్రాక్టుకు ఈవారం రూ.1,31,065 వద్ద స్టాప్‌లాస్ పెట్టుకుని, లాంగ్ పొజిషన్లు కొనసాగించడం మంచిదే. సాంకేతికంగా పసిడి కాంట్రాక్టు మోతాదుకు మించి పెరిగి ఉన్నందున.. అధిక స్థాయుల వద్ద లాభాల స్వీకరణకు అవకాశం ఉంది. ఒకవేళ మరింత పెరిగినా రూ.1,36,223 వద్ద నిరోధం ఎదురుకావచ్చు. రూ.1,30,061 కంటే కిందకు వస్తే రూ.1,26,500; రూ.1,23,899 వరకు దిద్దుబాటు కావచ్చు.

వెండి



వెండి మార్చి కాంట్రాక్టు రూ.1,81,429 కంటే కిందకు రాకుంటే సానుకూల ధోరణి కొనసాగొచ్చు. అయితే రూ.2,02,944 వద్ద నిరోధం ఎదురుకావచ్చు. ఈ స్థాయిని అధిగమిస్తే రూ.2,13,037; రూ.2,24,459 వరకు పెరగొచ్చు. ఒకవేళ రూ.1,81,429 కింద ట్రేడయితే, రూ.1,70,007; రూ.1,59,914 వరకు దిగిరావచ్చు.

ప్రాథమిక లోహాలు




- రాగి డిసెంబరు కాంట్రాక్టు రూ.1,073.15 కింద ట్రేడయితే.. రూ.1,049.45; రూ.1,023.65 వరకు దిగిరావచ్చు. రూ.1,122.65 ఎగువన ట్రేడయితే మాత్రం రూ.1,148.55; రూ.1,172.25 వరకు పెరగొచ్చు.
- సీసం డిసెంబరు కాంట్రాక్టుకు రూ.182.95 వద్ద స్టాప్‌లాస్ పెట్టుకుని, రూ.181.95 దిగువన షార్ట్ సెల్ చేయడం మంచిదే.
- జింక్ డిసెంబరు కాంట్రాక్టు రూ.312.05 కంటే దిగువన చలించకుంటే, లాంగ్ పొజిషన్లు అట్టే పెట్టుకోవచ్చు. అయితే రూ.324.35 వద్ద నిరోధం ఎదురుకావచ్చు.
- అల్యూమినియం డిసెంబరు కాంట్రాక్టును రూ.277.75 దిగువన షార్ట్ సెల్ చేయడం మంచిదే. లాంగ్ పొజిషన్లున్న ట్రేడర్లు రూ.282.20 దరిదాపుల్లో లాభాలు స్వీకరించొచ్చు.

ఇంధన రంగం



- ముడి చమురు జనవరి కాంట్రాక్టు రూ.5,225 దిగువకు వస్తేనే షార్ట్ సెల్ వైపు మొగ్గు చూపాలి. అయితే రూ.5,287 దిగువన స్టాప్‌లాస్ పెట్టుకోవాలి. ఒకవేళ రూ.5,396 కంటే పైకి వెళితే రూ.5,555; రూ.5,664 వరకు పెరగొచ్చు.
- సహజవాయువు డిసెంబరు కాంట్రాక్టు రూ.377 కంటే కింద ట్రేడయితే, రూ.341; రూ.321 వరకు దిగిరావచ్చు.

వ్యవసాయ ఉత్పత్తులు



- పసుపు ఏప్రిల్ కాంట్రాక్టుకు అధిక స్థాయుల వద్ద లాభాలు స్వీకరించడం మంచిది. రూ.15,165 కంటే కిందకు వస్తే రూ.13,970; రూ.13,355 వరకు దిగిరావచ్చు. ఒకవేళ రూ.16,975 కంటే పైకి వెళితే రూ.17,590; రూ.18,785 వరకు పెరగొచ్చు.
- జీలకర్ర జనవరి కాంట్రాక్టు సానుకూల ధోరణిలో చలిస్తే రూ.21,528 వద్ద నిరోధం ఎదురుకావచ్చు. ఈ స్థాయిని అధిగమిస్తే రూ.21,991; రూ.22,428 వరకు పెరగొచ్చు. ఒకవేళ కిందకు వస్తే రూ.20,628 వద్ద మద్దతు లభించొచ్చు. ఈ స్థాయిని కోల్పోతే రూ.20,191; రూ.19,728 వరకు దిద్దుబాటు కావచ్చు.

– ఆర్ఎల్‌పీ కమొడిటీ అండ్ డెరివేటివ్స్

గతవారం కదలికలు ఇలా

కమొడిటీ	ప్రారంభం	ముగింపు	వృద్ధి/క్షీణత
	(రూ.లలో)		(శాతంలో)
పసిడి (ఫిబ్రవరి)	1,30,431	1,33,622	2.45
వెండి (మార్చి)	1,81,900	1,92,851	6.02
రాగి (డిసెంబరు)	1,089.15	1,096.80	0.70
సీసం (డిసెంబరు)	182.60	181.95	-0.36
జింక్ (డిసెంబరు)	310	316.70	2.16
అల్యూమినియం (డిసెంబరు)	278.95	278.90	-0.02
ముడి చమురు (జనవరి)	5,419	5,238	-3.34
సహజ వాయువు (డిసెంబరు)	468.50	377.10	-19.51
పసుపు (ఏప్రిల్)	14,726	16,360	11.10
జీలకర్ర (జనవరి)	21,555	21,065	-2.27

'బుల్' రంకె వినిపించేనా!

స్టాక్ మార్కెట్ ఈ వారం

విశ్లేషకుల అంచనాలు

- నిఫ్టీ సూచీ 26,000పైన ముగియడం సానుకూలం
- షేర్ల అధిక ధరల వల్ల కొంత ఒత్తిడికీ అవకాశం
- ఔషధ, వాహన, లోహ షేర్లు రాణించొచ్చు



స్టాక్ మార్కెట్లో కీలక సూచీలు రాణించొచ్చని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. రెండు రోజుల లాభాలు, మదుపర్ల సెంటిమెంటును మెరుగుపరచాయని భావిస్తున్నారు. నిఫ్టీ-50 తన కీలక స్థాయి 26,000 పైన ముగియడంతో మరింత పుంజుకోవచ్చని చెబుతున్నారు. అయితే అమెరికా-భారత్ వాణిజ్య ఒప్పందంలో ఆలస్యం, షేర్ల అధిక ధరల వల్ల విక్రయాల ఒత్తిడి ఎదురుకావొచ్చనీ అంటున్నారు. బ్యాంక్ ఆఫ్ జపాన్ ఈనెల 18నాటి సమీక్షలో వడ్డీ రేట్లు పెంచే అవకాశం ఉండడం ప్రతికూలాంశమే. విదేశీ పోర్టుఫోలియో మదుపర్లు ఈనెలలో రూ.17,955 కోట్ల నికర విక్రయాలు జరిపారు. వీరి ధోరణి, రూపాయి కదలికలు ఈవారం కీలకం అవుతాయి. సాంకేతికంగా చూస్తే నిఫ్టీ-50కి 26,300 వద్ద నిరోధం; 25,850-25,900 వద్ద మద్దతు లభించొచ్చు. వివిధ రంగాలపై విశ్లేషకులు ఏమంటున్నారంటే..

- నిఫ్టీ బ్యాంక్ సూచీ ఈ వారం స్థిరీకరణకు గురికావొచ్చు. కొద్ది నెలలుగా వేగంగా రాణించినందున ఇపుడు చాలా తక్కువ శ్రేణికి పరిమితం కావొచ్చు. ఏడాది చివర్లో కొంత లాభాల స్వీకరణ జరగొచ్చు.
- **టెలికాం** కంపెనీల షేర్లు సమీప భవిష్యత్తులో పెరగొచ్చు. టారిఫ్‌ల పెంపు వల్ల సగటు వినియోగదారు ఆదాయం (ఆర్పు) 2027-28 కల్లా రూ.270-300కు చేరొచ్చని అంచనా. వొడాఫోన్ ఐడియా షేర్లు బలమైన బ్రేక్ అవుట్‌ను సూచిస్తున్నాయి. రూ.14.30 వరకు వెళ్లొచ్చు. భారతీ ఎయిర్‌టెల్ షేర్లు స్వల్పకాలంలో పుంజుకోవచ్చు.
- **యంత్రపరికరాల** షేర్ల ధరలు అధికంగా, ఉన్నందున ఈ వారం నష్టపోవచ్చు. మార్చి వరకు మూలధన వ్యయాలు బలహీనంగా ఉండొచ్చన్న అంచనాలు ఇందుకు కారణం. రక్షణ రంగ కంపెనీల షేర్లపై అప్రమత్తత అవసరం.
- **లోహ** షేర్లు బులిష్ ధోరణిని ప్రదర్శించొచ్చు. నిఫ్టీ లోహ సూచీలో తాజా కొనుగోళ్లు కనిపించొచ్చు. మెరుగైన విలువలతో ఉన్నందున, ఉక్కు షేర్లకు విశ్లేషకులు మొగ్గుచూపుతున్నారు. సేఫ్‌గార్డ్ సుంకంలో ఆలస్యం చేస్తే, ఉక్కు ఆదాయాలపై ఒత్తిడి ఏర్పడొచ్చు.
- **ఐటీ** కంపెనీల షేర్లు చాలా తక్కువ శ్రేణిలో, సానుకూల ధోరణితో చలించొచ్చు. రూపాయి క్షీణత, ఫెడ్ రేట్ల కోత ఈ రంగానికి సానుకూలతలు తెచ్చిపెట్టొచ్చు. అమెరికా-భారత్ ఒప్పందంపై మదుపర్ల దృష్టి సారించొచ్చు. ఐటీ సూచీ 40,000-41,000 స్థాయికి చేరొచ్చు.
- **ఎఫ్ఎమ్‌సీజీ** కంపెనీల షేర్లు ఒక శ్రేణిలోనే ట్రేడవవచ్చు. ఈ రంగంలో పోటీ వల్ల వృద్ధి, మార్జిన్ల పెంపు పరిమితంగానే ఉండొచ్చని అంచనా.
- **భారీ - మధ్య స్థాయి సిమెంటు** కంపెనీల షేర్లు మెరుగ్గానే ట్రేడవవచ్చు. ఇటీవలి లాభాల స్వీకరణ అనంతరం పుంజుకునే సంకేతాలున్నాయి. అల్ట్రాటెక్ రూ.12,400-12,800 స్థాయికి వెళ్లొచ్చు.
- **ఔషధ** కంపెనీల షేర్లు మెరవొచ్చు. అక్టోబరు-డిసెంబరు ఈ రంగానికి కలిసి వస్తోంది. బయోసెక్యూర్ చట్టాన్ని అమెరికా కాంగ్రెస్ ఆమోదిస్తే, భారత కంపెనీలకు సానుకూలతలొస్తాయి.
- **వాహన** కంపెనీల షేర్లు లాభపడొచ్చు. టీవీఎస్ మోటార్, ఐషర్ మోటార్స్, మహీంద్రా అండ్ మహీంద్రా తమ పోటీదార్ల కంటే మిన్నగా రాణించొచ్చు.
- **చమురు-గ్యాస్** సూచీ ఎటు వెళుతుందో అనిశ్చితి ఉంది. 12,000 స్థాయిని 3-4 రోజుల్లో అధిగమిస్తేనే సానుకూలతలు ఏర్పడొచ్చని విశ్లేషకులు అంటున్నారు. రూపాయి మారకపు విలువ, రష్యా-ఉక్రెయిన్ పరిణామాలు కీలకం.

వాహన	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
అశోక్ లేలాండ్	163.86	167.50	158.50
బజాజ్ ఆటో	9015.00	9151.00	8892.00
ఐషర్ మోటార్స్	7229.00	7317.00	7144.00
హీరో మోటోకార్ప్	5960.00	6069.70	5895.70
ఎం అండ్ ఎం	3679.60	3712.30	3644.90
మారుతీ	16522.00	16724.00	16146.00
టీవీఎస్ మోటార్	3655.20	3683.10	3609.10

ఎఫ్ఎమ్‌సీజీ	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
బ్రిటానియా ఇండస్ట్రీస్	5915.50	5985.80	5794.80
కోల్గేట్ పామోలివ్	2161.30	2184.30	2130.30
డాబర్ ఇండియా	495.00	507.30	487.90
ఇమామీ	539.55	550.30	521.70
హిందుస్థాన్ యునిలీవర్	2260.60	2335.70	2207.10
ఐటీసీ	400.10	405.50	397.20
మారికో	727.05	733.90	715.30

యంత్రపరికరాలు	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
భెల్	285.15	293.80	272.50
సీజీ పవర్	665.90	678.80	658.30
ఎల్ అండ్ టీ	4074.10	4144.30	4013.50
సీమెన్స్	3144.60	3331.30	2899.50
థెర్మాక్స్	2870.40	3020.70	2745.90

బ్యాంకింగ్	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్	1,001.50	1,008.00	995.00
ఐసీఐసీఐ బ్యాంక్	1,366.00	1,374.10	1359.30
ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్	82.29	84.10	79.70
ఇండస్ఇండ్ బ్యాంక్	846.15	857.70	833.30
కోటక్‌మహీంద్రా బ్యాంక్	2,176.60	2,210.40	2157.80
పీఎన్‌బీ	117.81	118.90	116.30
ఎస్‌బీఐ	963.15	971.70	953.70

ఔషధ	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
అరబిందో ఫార్మా	1195.10	1217.40	1159.20
బయోకాన్	386.35	392.10	379.60
సిప్లా	1517.40	1531.90	1502.90
డాక్టర్ రెడ్డీస్	1279.30	1288.80	1262.60
గ్లెన్‌మార్క్ ఫార్మా	1975.00	1997.20	1940.00
నాట్కో ఫార్మా	905.65	933.70	887.10

లోహ	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
హిండాల్కో	852.10	870.30	821.50
హిందుస్థాన్ జింక్	561.65	588.90	518.70
ఎన్ఎమ్‌డీసీ	77.94	79.70	74.60
సెయిల్	131.90	133.80	129.40
టాటా స్టీల్	171.89	175.70	165.50
వేదాంతా	543.60	553.30	530.20

ఐటీ	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
హెచ్‌సీఎల్ టెక్	1673.20	1688.30	1652.50
ఇన్ఫోసిస్	1598.20	1613.40	1575.00
పర్సిస్టెంట్ సిస్టమ్స్	6336.50	6452.20	6146.20
టీసీఎస్	3220.50	3247.00	3172.40
టెక్ మహీంద్రా	1578.40	1594.30	1550.70
విప్రో	260.60	263.10	256.10

చమురు	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
రిలయన్స్ ఇండస్ట్రీస్	1556.50	1567.80	1540.40
బీపీసీఎల్	365.05	375.60	347.30
హెచ్‌పీసీఎల్	459.90	469.60	443.60
ఐఓసీఎల్	163.67	166.40	160.70
ఓఎన్‌జీసీ	238.02	240.50	235.80
ఆయిల్ ఇండియా	404.35	407.50	399.70

సిమెంటు	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
ఏసీసీ	1771.70	1805.50	1753.10
అంబుజా సిమెంట్స్	548.15	558.10	532.00
ఇండియా సిమెంట్స్	414.15	432.50	401.60
శ్రీ సిమెంట్	26285.00	26641.70	25921.70
అల్ట్రాటెక్ సిమెంట్	11723.00	11904.30	11390.30

టెలికాం	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
భారతీ ఎయిర్‌టెల్	2,083.40	2110.20	2037.20
ఎమ్‌టీఎన్ఎల్	36.86	38.20	36.10
టాటా కమ్యూనికేషన్స్	1799.10	1826.60	1771.60
వొడాఫోన్ ఐడియా	11.64	12.00	11.10

ఈనాడు సినిమా

'నువ్వు నాకు నచ్చావ్'.. తెరపైకి మరోమారు



కథానాయకుడు వెంకటేశ్ నుంచి వచ్చిన మంచి వినోదాత్మక చిత్రాల్లో 'నువ్వు నాకు నచ్చావ్' ఒకటి. త్రివిక్రమ్ కథ, మాటలతో దర్శకుడు కె.విజయభాస్కర్ రూపొందించిన ఈ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్.. 2001 సెప్టెంబరు 6న విడుదలై బ్లాక్‌బస్టర్ ముందు భారీ విజయాన్ని అందుకుంది. ఇప్పుడీ సినిమా 24ఏళ్ల తర్వాత 4కే హంగులతో తిరిగి థియేటర్లలో సందడి చేయనుంది. ఈమేరకు దీన్ని జనవరి 1న ప్రపంచ వ్యాప్తంగా రీరిలీజ్ చేయనున్నట్లు నిర్మాత స్రవంతి రవికిశోర్ ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. "కొత్త సంవత్సరాన్ని కుటుంబంతో కలిసి నవ్వులు పూయిస్తూ ప్రారంభించడానికి ఇదే సరైన సమయం. ఎన్నేళ్లైనా రకరకాల మాధ్యమాల్లో అలరిస్తున్న 'నువ్వు నాకు నచ్చావ్' చిత్రాన్ని.. ఇప్పుడు 4కే హంగులతో జనవరి 1న థియేటర్లలో పరిపూర్ణంగా ఆస్వాదించండి. అప్పట్లో ఇది విదేశాల్లో పూర్తి స్థాయిలో రిలీజ్ కాలేదు. అందుకే ఈసారి అక్కడ కూడా దీన్ని ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నాం. ఈ సినిమా చిత్రీకరణ 87రోజులు జరిగింది. దీన్ని ఒక టీమ్ వర్క్‌లా ఎంత ఇష్టపడి చేశామో ప్రతి ఫ్రేమ్ గుర్తుంది" అన్నారు. ఈ చిత్రంలో వెంకీకి జోడీగా ఆర్తి అగర్వాల్ నటించారు. ప్రకాశ్‌రాజ్, బ్రహ్మానందం, సునీల్, చంద్రమోహన్, ఎంఎస్ నారాయణ తదితరులు కీలక పాత్రలు పోషించారు.


బాలీవుడ్‌లోకి తొలి అడుగు?



రుక్మిణీ వసంత్

కాంతార 2లో శక్తిమంతమైన పాత్రతో ఇటీవలే సినీప్రియుల్ని పలకరించింది అందాల తార రుక్మిణీ వసంత్. ప్రస్తుతం భాషతో సంబంధం లేకుండా వరుస అవకాశాలు అందుకుంటోన్న ఈమె.. త్వరలో బాలీవుడ్ ప్రేక్షకుల్ని కూడా అలరించేందుకు సిద్ధమైనట్లు తెలుస్తోంది. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న రుక్మిణి.. హిందీ భాష గురించి మాట్లాడింది. "హిందీ నాకు చిన్నప్పటి నుంచి సుపరిచితమైన భాష. బాలీవుడ్ సినిమాల పట్ల ఎప్పుడూ ఆసక్తి ఉండేది. ఆర్మీ నేపథ్యమే దీనికి కారణమని అనుకుంటున్నా. కానీ ఆ భాషలో భావోద్వేగాలను వ్యక్తపరిచే అవకాశం నాకు ఇంకా రాలేదు. కాబట్టి దాని కోసం ఉత్సాహంగా ఎదురు చూస్తున్నా. దీని గురించి చాలా చర్చలు జరుగుతున్నాయి. దేవుడి దయతో నేను త్వరలోనే ఈ పనిని ప్రారంభిస్తానని భావిస్తున్నా" అని చెప్పుకొచ్చింది. దీంతో ఆమె ఇప్పటికే ఓ హిందీ చిత్రానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు అభిమానుల్లో ఊహాగానాలు మొదలయ్యాయి.

గెలిచి ఉనికి చాటుకుందాం..!



"మనవెంట కాలం మెరుపులాంటి వేగం.. ఎదురులేని ధైర్యం.. వీరత్వం త్యాగం.. బాధ కొరకే యుద్ధం" అంటూ యువతలో స్ఫూర్తి నింపుతున్నారు శివకార్తికేయన్. ఆయన ప్రధాన పాత్రలో నటించిన 'పరాశక్తి' చిత్రం కోసమే ఇదంతా. సుధా కొంగర దర్శకత్వం వహించారు. శ్రీలీల కథానాయిక. ఇటీవలే విడుదలైన ఈ సినిమా పాటలు, టీజర్‌కు ప్రేక్షకుల నుంచి మంచి స్పందన వచ్చింది. తాజాగా ఈ సినిమా నుంచి 'జంజర..' అనే మరో పాటను విడుదల చేసింది చిత్రబృందం. 'గెలిచి ఉనికి చాటుకుందాం లే.. గాయమంతా.. నవ్వులతో పోయిందిగా' అంటూ సాగుతున్న ఈ గీతానికి జీవీ ప్రకాశ్ కుమార్ సంగీతమందించారు. డాన్ పిక్చర్స్ నిర్మించిన ఈ చిత్రంలో రవిమోహన్ కీలక పాత్రలో కనిపించనున్నారు. వచ్చే ఏడాది జనవరి 14న రానుందీ చిత్రం.

ఎప్పటికీ 'సోగ్గాడు' శోభన్‌బాబే

"మేం నిర్మించిన 'అతడు' సినిమాలో ఓ ముఖ్య పాత్ర కోసమని శోభన్‌బాబును సంప్రదించాం. బ్లాంక్ చెక్ ఇచ్చి నటించమని కోరాం. కానీ ఆయన అంగీకరించలేదు. అందాల నటుడిగా తనకున్న పేరు అలాగే కొనసాగాలని.. అందుకే ఇతర పాత్రలేవీ చేయకూడదని నిర్ణయించుకున్నానని నాతో చెప్పారు. అప్పటికీ, ఇప్పటికీ తెలుగు ప్రేక్షకుల మదిలో 'సోగ్గాడు' శోభన్ బాబే" అన్నారు ప్రముఖ నటుడు మురళీమోహన్. ఆయన ముఖ్య అతిథిగా 'సోగ్గాడు' స్వర్ణోత్సవ సన్మాన సమావేశాన్ని ఆదివారం హైదరాబాద్‌లో నిర్వహించారు. శోభన్‌బాబు కథానాయకుడిగా నటించిన 'సోగ్గాడు' సినిమా విడుదలై యాభైఏళ్లు పూర్తయింది. ఈ సందర్భంగా ఆ చిత్రాన్ని నిర్మించిన సురేశ్ ప్రొడక్షన్స్ ఈ నెల 19న దీన్ని మళ్లీ ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తోంది. ఆదే రోజే అఖిల భారత శోభన్‌బాబు సేవా సమితి ఆధ్వర్యంలో స్వర్ణోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. సమావేశాన్ని ఉద్దేశించి మురళీమోహన్ మాట్లాడుతూ.. 'నన్ను సినిమా రంగంలోకి ఆహ్వానించిన హీరో శోభన్‌బాబు. ఆ తర్వాత ఆయనతో 'ముగ్గురు మిత్రులు' చిత్రం కూడా తీశా. క్రమశిక్షణకు మారు పేరైన ఆయన నాలాంటి వాళ్లందరికీ ఆదర్శం. ఆయన భౌతికంగా దూరమై 17ఏళ్లయింది. అంతకు ముందు 13ఏళ్లపాటు ఆయన నటించలేదు. అంటే 30ఏళ్లు గడిచినా శోభన్‌బాబును గుర్తు పెట్టుకుని అభిమానులు మంచి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారంటే.. అది ఆయనపై వారికున్న ప్రేమ, గౌరవం కారణం" అన్నారు. నిర్మాత డి.సురేశ్‌బాబు మాట్లాడుతూ "1975లో విడుదలైన 'సోగ్గాడు' సినిమా మా సంస్థకు మంచి పేరుని, డబ్బును తెచ్చిపెట్టింది. నేటి సాంకేతికతతో ఈ చిత్రాన్ని రీరిలీజ్‌గా ప్రేక్షకుల ముందుకు తీసుకువస్తున్నాం" అన్నారు. ఈ కార్యక్రమంలో సినీ ప్రముఖులు త్రైలా నాగేశ్వరరావు, ఆటూరి పూర్ణచంద్రరావు, కె.ఎస్.రామారావు, బీవీఎస్ఎన్.ప్రసాద్, రేలంగి నరసింహారావు, రాశి మూవీస్ నరసింహారావు, కె.మురళీమోహనరావు, మాజీ ఎమ్మెల్యే జేష్ఠ రమేశ్‌బాబు, అఖిల భారత శోభన్‌బాబు సేవా సమితి ఛైర్మన్ సుదాకర్‌బాబు, కన్వీనర్ సాయి కామరాజుతోపాటు నాయకులు పూడి శ్రీనివాస, బి.బాల సుబ్రహ్మణ్యం, భట్టిప్రోలు శ్రీనివాస్‌రావు తదితరులు పాల్గొన్నారు.



బీవీఎస్ఎన్.ప్రసాద్, పూర్ణచంద్రరావు, మురళీ మోహన్, సురేశ్‌బాబు

ఈ చిత్రంతో సనాతన హైందవ ధర్మం మీసం మెలేసింది: బాలకృష్ణ

● త్వరలో ప్రధాని మోదీ కోసం 'అఖండ 2' స్పెషల్ షో



తమన్, బాలకృష్ణ, బోయపాటి శ్రీను

"ఓ సినిమా ఎప్పుడొచ్చిందన్నది కాదు.. దాని ప్రభావం సమాజంపై ఎంత ఉందన్నదే ముఖ్యమ"ని అన్నారు కథానాయకుడు నందమూరి బాలకృష్ణ. 'అఖండ 2' కేవలం తెలుగు సినిమా మాత్రమే కాదని.. ఇది ప్రపంచ సినిమా అని చెప్పారు. ఈ చిత్రాన్ని విజయవంతం చేసిన ప్రేక్షకులకు కృతజ్ఞతలు తెలిపారు. 'అఖండ'కి కొనసాగింపుగా బాలకృష్ణ - దర్శకుడు బోయపాటి శ్రీను కలయికలో రూపొందిన పాన్ ఇండియా చిత్రమే 'అఖండ 2: తాండవం'. ఎం.తేజస్విని నందమూరి సమర్పణలో రామ్ ఆచంట, గోపీ ఆచంట నిర్మించారు. సంయుక్తా మేనన్ కథానాయిక. ఆది పినిశెట్టి ప్రతినాయకుడిగా నటించారు. ఈ సినిమా ఇటీవల విడుదలైన నేపథ్యంలో ఆదివారం రాత్రి హైదరాబాద్‌లో సక్సెస్‌మీట్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా హీరో బాలకృష్ణ మాట్లాడుతూ.. "మేము ఏ ఉద్దేశంతో ఈ సినిమాని తీశామో.. దాన్ని ప్రేక్షకులంతా పాటించాలి. ఈరోజు సనాతన హైందవ ధర్మం మీసం మెలేసిందంటూ సినిమా చూసిన ప్రతిఒక్కరూ చెబుతున్నారు. మన వేదాలు.. భారతదేశం మూలాలు.. ధర్మం.. గర్వం.. తేజస్సు కలగలిపిన చిత్రమిదని ఆబాలగోపాలం మెచ్చుకుంటున్నారు. ఈ సినిమాలో ఒక్కో డైలాగ్ ఒక్కో ఆణిముత్యమని కొనియాడుతున్నారు. ప్రతి సీన్ ప్రకంపనమని చెప్తున్నారు. ప్రస్తుతం సినిమా అనేది ప్రతి ఒక్కరికీ ఓ నిత్యావసర వస్తువైపోయింది. కాబట్టి మనం ఎలాంటి చిత్రాలు చేయాలన్నది ఇండస్ట్రీలోని పెద్దలు ఆలోచించాల్సిన అవసరముంది. చాలా మంది అంటుంటారు.. బాలకృష్ణకి ఎవర్ని చూసుకుని ఇంత పొగరని. నన్ను చూసుకునే నాకున్న ఈ పదునైన పొగరు. నా వ్యక్తిత్వమే నన్ను ఉసిగొలిపే విప్లవం. నన్ను నేను తెలుసుకోవడమే నాకు తెలిసిన గొప్ప విద్య. ఈ కథ భగవద్గీత, మహాభారతాలకు సంబంధించినదే కాదు. ఖురాన్, బైబిల్‌కి సంబంధించినది కూడా. ఇది నా ఒక్కడి విజయం కాదు. మా చిత్రబృందం మొత్తానిది" అన్నారు. "దేవుడు వెనకుండి గెలిపించిన చిత్రమిది. ఆ దైవ సంకల్పాన్ని ప్రేక్షకులు గొప్పగా ఆదరించారు. దీనికి కొందరి వల్ల కొన్ని అడ్డంకులొచ్చినా సరే మేము ఏం అనలేదు. ఎందుకంటే ఏదైనా ఆ దేవుడే చూసుకుంటాడు. అది ఆయన బాధ్యత. బాలకృష్ణ సపోర్ట్ లేకపోతే ఇంత పెద్ద చిత్రాన్ని.. ఇంత తక్కువ రోజుల్లో చేసేవాళ్లం కాదు. దీన్ని త్రీడీలో చూడండి. కచ్చితంగా ఓ కొత్త లోకాన్ని చూస్తారు. తెలుగు పరిశ్రమంతా ఓ కుటుంబం లాంటిది. బయట వాళ్లు మనల్ని చూసి ఇబ్బంది పడేలా చేసుకోకూడదు. కచ్చితంగా మనల్ని మనం నిలబెట్టుకోవాలి. త్వరలో ప్రధానమంత్రి మోదీ కోసం దిల్లీలో ఈ చిత్రాన్ని ప్రత్యేకంగా ప్రదర్శించనున్నాం" అన్నారు దర్శకుడు బోయపాటి శ్రీను. నిర్మాత దిల్‌రాజు మాట్లాడుతూ.. "ఈ సినిమాతో బాలకృష్ణని ఇండియన్ సూపర్ హీరోగా మార్చేశారు దర్శకుడు బోయపాటి శ్రీను. ఈ చిత్రం చూస్తున్నంత సేపూ చాలా చోట్ల వావ్ అనిపించింది. ఇలాంటి సినిమాలకు లాజిక్‌లతో పనిలేదు. భలేగా మ్యాజిక్ చేశారనిపించింది" అన్నారు. "ఆ శివుడి ఆజ్ఞ లేనిదే ఈ చిత్రం లేదు. ఇది డిసెంబరు 5న రావాల్సింది.. 12న వచ్చింది. ఆఖరి నిమిషంలో కేసు వేసి దీన్ని ఆపారు. దీన్ని బట్టే అర్థం చేసుకోవచ్చు.. మన చుట్టూ ఐక్యత ఎలా ఉందనేది. ప్రతి ఒక్కరూ నాదే.. నేనే అన్నట్లు ఉంటున్నారు. మనం అనేది కనిపించట్లేదు. అందరూ ఛానెల్ దొరికితే వెళ్లి సలహాలిస్తున్నారు. అదేదో నిర్మాతల దగ్గరకి వెళ్లి మాట్లాడితే వాళ్లకి కాస్త భరోసా వచ్చేది. ఇండస్ట్రీలోనే ఐక్యత లేదు. నాలుగు గోడల మధ్య ఉండాల్సింది.. బయట ప్రపంచానికి చెడుగా వెళ్తోంది. మనది చాలా గొప్ప ఇండస్ట్రీ. మనకున్నంత మంది హీరోలు, ఫ్యాన్స్ పవర్ ఏ భాషలోనూ లేరు. ప్రతి ఒక్కరూ ఇది మన ఇండస్ట్రీ అనుకునే టైమ్ వచ్చింది. ఎవరికైనా దెబ్బ తగిలితే వెళ్లి బ్యాండేజ్ వెయ్యండి. దయ చేసి బయటకు వెళ్లి బ్యాండ్‌లా వాయించకండి. అది చాలా తప్పు" అన్నారు సంగీత దర్శకుడు తమన్. ఈ కార్యక్రమంలో విజ్జి చంద్రశేఖర్, రామ్-లక్ష్మణ్, గంగాధర శాస్త్రి, కల్యాణ్ చక్రవర్తి, బద్రి, సంతోశ్, నాగ గురునాథ శర్మ తదితరులు పాల్గొన్నారు.

ఎంత దూరమైనా పరుగెత్తించే ప్రేమ



అనీశ్

'ఛలో', 'భీష్మ' లాంటి విజయవంతమైన చిత్రాలతో ప్రేక్షకుల్ని కడుపుబ్బా నవ్వించారు దర్శకుడు వెంకీ కుడుముల. ఇప్పుడాయన తొలి సారి నిర్మాతగా సొంత నిర్మాణ సంస్థ వాట్ నెక్ట్స్ ఎంటర్‌టైన్‌మెంట్స్‌పై 'ఇట్లు అర్జున' అనే సినిమాని ప్రారంభించారు. అనీశ్ హీరోగా తెరపై అడుగు పెట్టబోతున్న ఈ సినిమాతో మహేశ్ ఉప్పల దర్శకుడిగా పరిచయమవుతున్నారు. అనస్వర రాజన్ కథానాయిక. ఈ చిత్ర గ్లింప్స్‌ను 'సోల్ ఆఫ్ అర్జున' పేరుతో ఆదివారం విడుదల చేశారు. "ప్రేమ.. అది ఎంత దూరమైనా పరుగెత్తిస్తుంది. కానీ, ఎంత ఇష్టమో చెప్పనివ్వదు" అంటూ కథానాయకుడు నాగార్జున వాయిస్ ఓవర్‌తో మొదలైన గ్లింప్స్ ఆద్యంతం ఆసక్తికరంగా సాగింది. ''అసలే నువ్వు మూగోడివి.. నీ ప్రేమను ఎలా చెప్తావు అర్జున. అయినా మాటలు రావని నిన్ను తక్కువ అంచనా వెయ్యలేములే" అంటూ ఆఖర్లో నాగ్ డైలాగ్‌తో అనీశ్ పాత్రను పరిచయం చేసిన తీరు ఆకట్టుకుంది. మొత్తంగా ఈ ప్రచార చిత్రాన్ని బట్టి.. ఇదొక అందమైన ప్రేమకథతో ముడిపడిన యాక్షన్ డ్రామాగా ఉండనున్నట్లు అర్థమవుతోంది. ఈ చిత్రానికి తమన్ సంగీతమందిస్తుండగా.. రాజా మహదేవన్ ఛాయాగ్రాహకుడిగా వ్యవహరిస్తున్నారు.

ఇక్కడ ఎవర్నీ ఎవరూ ప్రశంసించరు

తాను పుట్టుకతోనే కష్టజీవినని అంటున్నారు బాలీవుడ్ నటుడు మనోజ్ బాజ్‌పేయి. 'ది ఫ్యామిలీ మ్యాన్ సీజన్ 3', 'ఇన్‌స్పెక్టర్ జెండే' లాంటి కథలతో ఇటీవలే ప్రేక్షకుల్ని పలకరించారీయన. ప్రయోగాత్మక పాత్రల్ని ఎంచుకుంటూ అభిమానుల్ని మెప్పించే ప్రయత్నం చేసే ఈయన.. ప్రస్తుతం 'పోలీస్ స్టేషన్ మెయిన్ భూత్' సినిమా చిత్రీకరణలో బిజీగా ఉన్నారు. ఈ నేపథ్యంలోనే తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న మనోజ్.. హిందీ చిత్రపరిశ్రమ, ఎంచుకునే పాత్రల గురించి కొన్ని ఆసక్తికర విషయాల్ని పంచుకున్నారు.



"హిందీ చిత్రపరిశ్రమలోని నటులలో కొనసాగుతున్న అభద్రత గురించి నేను చెప్పాలనుకుంటున్నా. ఇక్కడ నటులు ఎప్పుడూ ఒకరినొకరు ప్రశంసించుకోరు. వారిలో అభద్రతా భావం ఎక్కువ. అందుకే ఒకరి పనిని అభినందించడానికి కనీసం ఫోన్ కూడా చేయరు. బాలీవుడ్‌లో నటుల మధ్య అభద్రతా, పోటీ భయం చాలా లోతుగా ఉన్నాయి. కానీ నేను ఇప్పటికీ మంచి పాత్రల కోసం ఫోన్ చేసి అడుగుతుంటాను. నా పని గురించి కూడా ప్రేక్షకుల్ని అడిగి తెలుసుకుంటా".

ఇది అంత సులభం కాదు

"చాలా మంది చిత్రపరిశ్రమ అంటే గ్లామర్, బాక్సాఫీస్ వసూళ్లు, విజయాలు మాత్రమే అని అనుకుంటారు.. కానీ తెరవెనుక వాస్తవికత వేరే ఉంది. రోజూ ఎంతో మంది నటీనటులు తమ ప్రతిభను నిరూపించుకోవడానికి ఇక్కడి వస్తారు. ఈ జన సమూహంలో ఒక కళాకారుడు తన స్థానాన్ని నిలబెట్టుకోవడం అంత సులభమైన విషయం కాదు. అంటే ఇక్కడ తదుపరి చిత్రం, పాత్రకు ఎటువంటి హామీ లేదు. ఒక సినిమా విజయవంతమవుతుందా? తర్వాత మరో పాత్ర లభిస్తుందా అనేది అదృష్టం, కృషిపైనే ఆధారపడి ఉంటుంది. ఇక్కడ రోజూ ఒక నటుడు తనను తాను నిరూపించుకోవాల్సిందే. అందుకే నన్ను నేను పుట్టుకతోనే పోరాట యోధుడిగా భావిస్తాను.

విజయంలో కూడా ఆందోళనే

"దాదాపు రెండు దశాబ్దాలకు పైగా సినీ రంగంలో రాణిస్తున్నా. ఎన్నో విజయవంతమైన సినిమాల్లో నటించాను. అయినా కూడా నా తదుపరి చిత్రం, తదుపరి పాత్ర ఏమిటనే భయం నుంచి నేను ఎప్పటికీ విముక్తి పొందలేను. అందుకే విజయం కూడా ఆందోళనతోనే వస్తుందని నమ్ముతుంటా. రోజులు గడుస్తున్న కొద్దీ.. పరిశ్రమ వేగంగా మారుతుంది. ట్రెండ్ మారుతూనే ఉంది. కొత్త ముఖాలు వస్తూనే ఉంటాయి. సినిమాలు విజయవంతం కాకపోతే కళాకారుడు వెనకపడిపోతాడు. అందువల్ల నటులు సురక్షితంగా భావించినప్పుడే నిజమైన విజయం వస్తుంది. కానీ ఆ స్థానాన్ని సాధించడం అంత తేలిక కాదు".

కొత్త ఏడాదిలో 'విచిత్ర'



జ్యోతి అపూర్వ

జ్యోతి అపూర్వ ప్రధాన పాత్రధారిగా తెరకెక్కిన చిత్రం 'విచిత్ర'. రవి రావణ్ రుద్ర, శ్రేయ తివారి జంటగా నటించారు. బేబి శ్రీహర్షిణి, మీనా వాసు ప్రత్యేక పాత్రల్ని పోషించారు. సైఫుద్దీన్ మాలిక్ స్వీయ దర్శకత్వంలో నిర్మించారు. సెన్సార్ కార్యక్రమాలు పూర్తయ్యాయని, కొత్త ఏడాదిలో చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తామని సినీ వర్గాలు తెలిపాయి. దర్శకనిర్మాత మాట్లాడుతూ "తల్లి, కూతురు బంధం ప్రధానంగా సాగే చిత్రమిది. ప్రేమ, త్యాగం, బంధాల గురించి ఆలోచించేలా చేస్తుంది" అన్నారు.

రెండు మనసులు.. ఒకే ప్రయాణం

బాలీవుడ్ యువ కథానాయకుడు కార్తిక్ ఆర్యన్, అనన్య పాండే జంటగా నటించిన చిత్రం 'తూ మేరీ మై తేరా మై తేరా తూ మేరీ'. సమీర్ విద్వాన్స్ దర్శకత్వం వహించారు. ఈ నెల 25న థియేటర్లలోకి రానుందీ చిత్రం. ఈ నేపథ్యంలోనే ప్రచార కార్యక్రమాలను పరుగులు పెట్టిస్తోంది చిత్రబృందం. తాజాగా ఈ సినిమా నుంచి మరో గీతాన్ని ఇన్‌స్టా వేదికగా విడుదల చేసింది. "ఇద్దరు వ్యక్తులు.. రెండు మనసులు.. ఒకే ప్రయాణం.. ఒకే ప్రేమ" అనే వ్యాఖ్యల్ని జోడించింది. 'తేను జ్యాదా మొహబ్బత్..' అంటూ భావోద్వేగంగా సాగుతున్న ఈ గీతాన్ని విశాల్, శేఖర్ స్వరపరిచారు. ఇందులో ప్రేమను కోల్పోయిన జంటగా కార్తిక్, అనన్యలు కనిపిస్తూ ఆకట్టుకుంటున్నారు. రొమాంటిక్ కామెడీ డ్రామాగా రూపొందిన ఈ చిత్రాన్ని ధర్మ ప్రొడక్షన్స్ నిర్మించింది.



అనన్యపాండే, కార్తిక్ ఆర్యన్

హనుమాన్ సినిమాలో సన్నీ?



సన్నీ దేఒల్

సినీప్రేమికులందరి దృష్టి ప్రస్తుతం 'రామాయణ' మీదే. రాముడిగా.. రణ్‌బీర్ కపూర్, సీత పాత్రలో సాయిపల్లవి నటిస్తున్నారు. నితేశ్ తివారీ దర్శకత్వంలో రాబోతున్న ఈ చిత్రంలో బాలీవుడ్ సీనియర్ హీరో సన్నీ దేఒల్... హనుమంతుడిగా కనిపించనున్న సంగతి తెలిసిందే. ఇప్పుడీ పాత్రనే ఆధారంగా చేసుకొని ప్రత్యేకంగా ఓ చిత్రాన్ని తీర్చిదిద్దుతున్నట్లు తెలుస్తోంది. దీనికి సన్నీ నాయకత్వం వహించనున్నారట. "నితేశ్ తివారీ 'రామాయణ' ప్రపంచాన్ని విస్తరించాలనుకుంటున్నారు. ఇందులో భాగంగానే రామాయణ విశ్వానికి కీలకంగా నిలిచే హనుమాన్ కేంద్రీకృత ప్రాజెక్టును తీర్చిదిద్దుతున్నారు. సన్నీ స్క్రీన్ ప్రజెన్స్, శారీరక రూపంను దృష్టిలో ఉంచుకొని.. ఈ చిత్రానికి ఆయన మాత్రమే సరిగ్గా సరిపోతారని నిర్ణయించుకుంది చిత్రబృందం. త్వరలో దీనిపై అధికారిక ప్రకటన వచ్చే అవకాశాలున్నాయ"ని సన్నీ సన్నిహిత వర్గాలు తెలిపాయి. ప్రస్తుతం ఆయన 'బార్డర్ 2'తో బిజీగా ఉన్నారు.

సరికొత్తగా 'మసక మసక చీకటిలో...'



స్మిత

పలు గీతాలతో ప్రేక్షకుల్ని అలరించిన గాయని స్మిత.. పాత పాటలకు కొత్తదనాన్ని జోడించి సరికొత్త ప్రయోగాలు చేస్తుంటారు. ఇందులో భాగంగానే వచ్చిన 'మసక మసక చీకటిలో' అనే గీతం అప్పట్లో ఎంత పెద్ద హిట్ అయ్యిందో అందరికీ తెలిసిన విషయమే. ఇప్పుడామె మరో కొత్త ప్రయోగానికి తెర తీశారు. నేటి యువతరాన్ని ఆకట్టుకునేలా అదే 'మసక మసక' పాటకు ర్యాప్ జోడించి కొత్త వెర్షన్‌లో ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చారు. నటుడు, ర్యాపర్ నోయల్‌తో కలిసి ఆమె స్టెప్పులు వేసిన ఈ పాట విడుదల కార్యక్రమం ఇటీవల జరిగింది. ఈ సందర్భంగా స్మిత మాట్లాడుతూ.. "2026లో నా జీవితంలో కేవలం మ్యాజిక్ మాత్రమే ఉండబోతుంది. మీరు కూడా అందులో భాగం కావాలని కోరుకుంటున్నా. ఈ పాటను నాగార్జున బిగ్‌బాస్ వేదికపై లాంచ్ చేశారు. ఇకపై వరుసగా నా నుంచి పాటలు రాబోతున్నాయ"ని అన్నారు. ఈ కార్యక్రమంలో దర్శకుడు దేవా కట్టా, నోయల్, కొరియోగ్రాఫర్ విజయ్ బిన్నీ, నోయల్ తదితరులు పాల్గొన్నారు.

అవును.. నేను అవకాశవాదినే!



నుస్రత్ భరూచా

'డ్రీమ్ గర్ల్', 'ఛోరీ' లాంటి వైవిధ్యమైన చిత్రాలతో ప్రేక్షకుల్ని అలరించింది బాలీవుడ్ కథానాయిక నుస్రత్ భరూచా. కొన్ని సందర్భాల్లో ముక్కుసూటిగా సమాధానం చెప్పే స్వభావమున్న ఈ తార.. తను పాత్రలు ఎంచుకునే విధానం గురించి ఆసక్తికర విషయాల్ని పంచుకుంది. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న నుస్రత్ మాట్లాడుతూ.. "నేను కూడా ఒక అవకాశవాదిని. నా కలల జాబితాలో ఉన్న ఓ పాత్ర పోషించే అవకాశం వస్తే.. నేనే వెళ్లి ఇందులో నటించాలనుకుంటున్నానని చెబుతాను. ప్రతి ఒక్కరూ ఏదో ఒక దశలో ఇలానే ఉంటారు. అయినా అది చెడ్డ విషయం కాదు. అవకాశవాదిగా ఉండడం తప్పుకాదు. కానీ ఆ మార్గంలో నడుస్తున్నప్పుడు మీ చర్యలు బాధ్యతాయుతంగా ఉండాలి. ఈ విషయాన్ని కాలక్రమేణా నేర్చుకుంటారు. నాకు ఎదురైన అనుభవాల నుంచి ఈ విషయాన్ని తెలుసుకున్నా. నా విలువలు, ఆలోచనలు సరిగ్గా అనిపిస్తే.. అవి నాకు సరైనవే" అని చెప్పుకొచ్చింది.

జూనియర్ రిసెర్చ్ ఫెలోలు

డీఆర్‌డీవోలోని డిఫెన్స్ జియో ఇన్ఫర్మేటిక్ రిసెర్చ్ ఎస్టాబ్లిష్‌మెంట్, చండీగఢ్.. జూనియర్ రిసెర్చ్‌ఫెలో, రిసెర్చ్ అసోసియేట్ ఫెలోషిప్‌ల కోసం ఇంటర్వ్యూలు నిర్వహిస్తోంది.

▸ జూనియర్ రిసెర్చ్‌ఫెలో: 14 ▸ రిసెర్చ్ అసోసియేట్: 01

అర్హత: సంబంధిత విభాగంలో ఎంఈ, ఎంటెక్, ఎమ్మెస్సీ/బీఈ/బీటెక్, పీహెచ్‌డీ, నెట్/గేట్ స్కోరు ఉండాలి. **స్టైపెండ్:** నెలకు జూనియర్ రిసెర్చ్ ఫెలోకు రూ.37,000. రిసెర్చ్ అసోసియేట్‌కు రూ.67,000.

వయసు: జేఆర్ఎఫ్‌కు 28 ఏళ్లు మించకూడదు.

ఇంటర్వ్యూ తేదీలు: డిసెంబరు 29, 30.

వేదిక: డీజీఆర్ఈ, చండీగఢ్.

వెబ్‌సైట్: https://drdo.gov.in/drdo/en

ఎన్టీపీసీలో ఎగ్జిక్యూటివ్‌లు

ఎన్టీపీసీ లిమిటెడ్.. ఎగ్జిక్యూటివ్ పోస్టుల కోసం ప్రకటన వెలువరించింది.

▸ ఎగ్జిక్యూటివ్ (కంబైన్డ్ సైకిల్ పవర్ ప్లాంట్-ఓ అండ్ ఎం): 15

అర్హత: సంబంధిత విభాగంలో డిగ్రీతో పాటు పని అనుభవం ఉండాలి.

వయసు: 35 ఏళ్లలోపు ఉండాలి.

వేతనం: నెలకు రూ.90,000.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: డిసెంబరు 24.

దరఖాస్తు ఫీజు: జనరల్, ఓబీసీ, ఈడబ్ల్యూఎస్‌లకు రూ.500. ఎస్సీ, ఎస్టీ, పీడబ్ల్యూబీడీ, ఈఎస్ఎం, మహిళలకు ఫీజు లేదు.

ఎంపిక: రాత పరీక్ష/సీబీటీ, ఇంటర్వ్యూలతో.

వెబ్‌సైట్: https://careers.ntpc.co.in/recruitment/

యూపీఎస్సీ

యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్, న్యూదిల్లీ.. వివిధ విభాగాల్లో పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తోంది.

▸ ఎగ్జామినర్ ఆఫ్ ట్రేడ్ మార్క్స్ అండ్ జియోగ్రాఫికల్ ఇండికేషన్స్ - 100

▸ డిప్యూటీ డైరెక్టర్ (ఎగ్జామినేషన్ రిఫార్మ్స్) - 02

అర్హత: పోస్టులను అనుసరించి సంబంధిత విభాగంలో డిప్లొమా/డిగ్రీ/పీజీ/పీహెచ్‌డీతో పాటు ఉద్యోగానుభవం ఉండాలి.

వయసు: 30-45 ఏళ్ల మధ్య ఉండాలి.

దరఖాస్తు ఫీజు: జనరల్ అభ్యర్థులకు రూ.25. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులు, మహిళలకు ఫీజు ఉండదు. **ఎంపిక:** ఇంటర్వ్యూతో **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేదీ:** 01.01.2026. **వెబ్‌సైట్:** https://upsc.gov.in/recruitment/recruitment-advertisement

కోర్సు ఉచితం కొలువు ఉన్నతం

రక్షణ రంగంలోని లక్షణమైన ఉద్యోగాల కోసం నేషనల్ డిఫెన్స్ అకాడెమీ, నేవల్ అకాడెమీలు సాదరంగా ఆహ్వానిస్తున్నాయి. ఇంటర్మీడియట్ విద్యార్హతతోనే దరఖాస్తు చేసుకోవచ్చు. యూపీఎస్సీ నిర్వహించే పరీక్ష, ఇంటర్వ్యూల్లో ఎంపికైతే బీటెక్, బీఎస్సీ, బీఏ వీటిలో ఏదైనా ఉచితంగా చదువుతూ శిక్షణ పొందవచ్చు. ఆ తర్వాత లెవెల్-10 వేతనంతో ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్సుల్లో సేవలు అందించవచ్చు. ఇటీవలే ఎన్‌డీఏ&ఎన్ఏ- 2026(I) ప్రకటన వెలువడింది.

రక్షణ రంగంలో అత్యున్నత ఉద్యోగాలు ఆశించేవారు రాయాల్సిన పరీక్షల్లో ముఖ్యమైంది ఎన్‌డీఏ&ఎన్ఏ. ఇందులోని ప్రతిభతో ఉచితంగా పైలట్ శిక్షణ పొంది, ఎయిర్‌ఫోర్స్‌లో ఫైటర్ పైలట్‌గానూ సేవలందించవచ్చు. ఏడాదికి రెండుసార్లు యూపీఎస్సీ దీన్ని నిర్వహిస్తోంది. అన్ని దశలూ దాటినవారు పుణెలోని నేషనల్ డిఫెన్స్ అకాడెమీ (ఎన్‌డీఏ)లో బీటెక్, బీఎస్సీ, బీఏ చదువుకుంటూ రక్షణలో ప్రాథమిక శిక్షణ పొందవచ్చు. విద్య, వసతి, భోజనం, దుస్తులు, శిక్షణ... ఇలా అన్నీ దాదాపు ఉచితమే. నేవల్ అకాడెమీ(ఎన్ఏ)కి ఎంపికైనవాళ్లు కేరళలోని ఎజిమాళలో బీటెక్ కోర్సు అభ్యసిస్తారు. ఎన్‌డీఏ, ఎన్ఏల్లో చదువు పూర్తిచేసుకున్నవారికి జేఎన్‌యూ, న్యూదిల్లీ డిగ్రీలను ప్రదానం చేస్తుంది. ఆ తర్వాత ట్రేడ్ శిక్షణ సంబంధిత కేంద్రాల్లో అందిస్తారు. ఈ సమయంలో ప్రతినెలా రూ.56,100 స్టైపెండ్ చెల్లిస్తారు. శిక్షణ పూర్తిచేసుకున్నవారు ఆర్మీలో లెఫ్టినెంట్, నేవీలో సబ్ లెఫ్టినెంట్, ఎయిర్‌ఫోర్స్‌లో ఫ్లయింగ్ ఆఫీసర్ (పైలట్)/ గ్రౌండ్ డ్యూటీ ఆఫీసర్ హోదాతో విధులు నిర్వర్తిస్తారు. ఇవన్నీ సమాన స్థాయి ఉద్యోగాలే. వీరు మొదటి నెల నుంచే రూ.లక్షకుపైగా వేతనం, పలు ప్రోత్సాహకాలూ పొందుతారు. ఇలా చేరినవారు మేటి ప్రతిభతో ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్‌లకు అత్యున్నత అధికారి, త్రివిధ దళాలకు అధిపతీ కావచ్చు.

పరీక్ష

ఇందులో రెండు పేపర్ల నుంచి 900 మార్కులకు ప్రశ్నలు వస్తాయి. ఒక్కో పేపర్ వ్యవధి రెండున్నర గంటలు. పేపర్-1 మ్యాథ్స్ 300 మార్కులకు. మొత్తం 120 ప్రశ్నలు. ప్రతి ప్రశ్నకు రెండున్నర మార్కులు. పేపర్-2లో జనరల్ ఎబిలిటీ విభాగం నుంచి 150 ప్రశ్నలు 600 మార్కులకు ఉంటాయి. ప్రతి ప్రశ్నకు 4 మార్కులు. ఇందులో పార్ట్-ఏ ఇంగ్లిష్‌కు 200, పార్ట్-బీ జనరల్ నాలెడ్జ్‌కి 400 మార్కులు. ఇంగ్లిష్‌లో 50, జనరల్ నాలెడ్జ్ విభాగంలో.. ఫిజిక్స్ 25, కెమిస్ట్రీ 15, జనరల్ సైన్స్ 10, చరిత్ర, స్వాతంత్ర్యోద్యమాలు 20, భూగోళశాస్త్రం 20, వర్తమానాంశాల నుంచి 10 ఆబ్జెక్టివ్ ప్రశ్నలు వస్తాయి. తప్పు సమాధానాలకు ఆ ప్రశ్నకు కేటాయించిన మార్కులో మూడో వంతు తగ్గిస్తారు. పరీక్షలో అర్హతకు సబ్జెక్టులవారీ కనీస మార్కులు (20 లేదా 25 శాతం) పొందాలి. అర్హుల జాబితా నుంచి మెరిట్ ప్రకారం కొంతమందికి సర్వీస్ సెలక్షన్ బోర్డు (ఎస్ఎస్‌బీ) ఆధ్వర్యంలో ఇంటెలిజెన్స్ అండ్ పర్సనాలిటీ టెస్టులు యూపీఎస్సీ నిర్వహిస్తుంది. ఈ విభాగానికీ 900 మార్కులు. ఇందులో.. గ్రూప్ టెస్టులు, గ్రూప్ డిస్కషన్, గ్రూప్ ప్లానింగ్, అవుట్‌డోర్ గ్రూప్ టాస్కుల్లో ప్రతిభ చూపాలి. వీటిని రెండంచెల్లో ఐదు రోజులు నిర్వహిస్తారు. రాత పరీక్ష, సర్వీస్ సెలక్షన్ బోర్డు ఇంటర్వ్యూల మొత్తం మార్కుల మెరిట్‌తో తుది నియామకాలుంటాయి.



ముఖ్య వివరాలు

ఖాళీలు: 394. వీటిలో 24 మహిళలకు కేటాయించారు.

అర్హత: ఆర్మీ వింగ్‌కు ఏదైనా గ్రూపుతో ఇంటర్. ఎయిర్ ఫోర్స్, నేవల్ వింగ్స్ (ఎన్‌డీఏ), 10+2 క్యాడెట్ ఎంట్రీ స్కీమ్ (ఇండియన్ నేవల్ అకాడెమీ)లకు ఎంపీసీ గ్రూపుతో ఇంటర్. చివరి ఏడాది విద్యార్థులూ అర్హులే.

వయసు: జులై 1, 2007 - జులై 1, 2010 మధ్య జన్మించినవారు అర్హులు.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 30.12.2025.

దరఖాస్తు ఫీజు: రూ.వంద. మహిళలు, ఎస్సీ, ఎస్టీలకు ఫీజు లేదు. **పరీక్ష తేదీ:** 12.04.2026

వెబ్‌సైట్: https://upsconline.nic.in/

విజయానికి 40 శాతం!

పరీక్ష, ఇంటర్వ్యూల్లో 40 శాతం మార్కులతో ఎన్‌డీఏలో అవకాశం పొందవచ్చు. 2025(1) పరీక్షలో 900కి 334 మార్కులతో ఇంటర్వ్యూకు అర్హత సాధించారు. తుది ఎంపికలో చివరి అభ్యర్థి పొందిన మార్కులు 699. 2024(2) పరీక్షలో 305 మార్కులతో ఇంటర్వ్యూకు, 673 మార్కులు పొందినవారు ఏదో ఒక విభాగానికి ఎంపికయ్యారు. అంటే పరీక్షలో 900కి 40 శాతం (360 మార్కులు) పొందితే ఇంటర్వ్యూకు, పరీక్ష + ఇంటర్వ్యూల్లో 1800కి 40 శాతం (720) మార్కులు పొందినవారు ఏదో ఒక సర్వీస్‌కు ఎంపిక కావచ్చు. పోటీ ఎక్కువే అయినప్పటికీ.. ఏటా రెండుసార్లు పరీక్ష నిర్వహిస్తున్నారు. అందువల్ల ఇంటర్మీడియట్ పూర్తిచేసుకున్న తాజా అభ్యర్థులు గరిష్ఠ వయసులోగా కనీసం ఏడెనిమిది సార్లు ఈ పరీక్ష రాసుకోవచ్చు. దీంతో నిబద్ధతతో సన్నద్ధమైనవారు విజయాన్ని అందుకోగలరు. ఇదే సన్నద్ధత ఇతర రక్షణ పరీక్షలకూ ఎంతో ఉపయోగపడుతుంది.

గెలుపు వ్యూహం

- ముందుగా నోటిఫికేషన్‌లోని సిలబస్ వివరాలు శ్రద్ధగా పరిశీలించాలి. ప్రాథమికాంశాలతో సన్నద్ధత ప్రారంభించాలి. ఇందుకోసం 8,9,10 తరగతుల మ్యాథ్స్, సైన్స్, సోషల్ పాఠ్యపుస్తకాలు చదువుతూ ముఖ్యాంశాలు నోట్సు రాసుకోవాలి. ఆ తర్వాత సీబీఎస్ఈ 11,12 తరగతుల పాఠ్యపుస్తకాలు బాగా చదవాలి.
- పాత ప్రశ్నపత్రాలు పరిశీలించాలి. ఇవి యూపీఎస్సీ వెబ్‌సైట్‌లో ఉంచారు. సబ్జెక్టు ప్రశ్నలు ఏ చాప్టర్ల నుంచి, ఏ స్థాయిలో అడుగుతున్నారు, వాటికి ఎంత ప్రాధాన్యం దక్కుతోందీ గమనించి, విస్తృతంగా చదవాలి.
- వీలైనన్ని నమూనా పరీక్షలు రాయాలి. ఫలితాలు విశ్లేషించుకోవాలి. తప్పులు సరిదిద్దుకోవాలి. తర్వాతి పరీక్షల్లో పునరావృతం కాకుండా చూసుకోవాలి. ఇబ్బందికరమైన పాఠ్యాంశాలను ప్రత్యేక ప్రాధాన్యంతో చదివి, వీలైనన్ని మాదిరి ప్రశ్నలు సాధన చేయాలి. వాటి ద్వారా కచ్చితమైన సమాధానం తక్కువ వ్యవధిలో గుర్తించగలుగుతారు.
- పరీక్షకు సుమారు 4 నెలల వ్యవధి ఉంది. ఇందులో మొదటి 2 నెలలూ సన్నద్ధతకు కేటాయించాలి. తర్వాతి 30 రోజులు పాత ప్రశ్నపత్రాలు సాధన చేస్తూ, సన్నద్ధతను మెరుగుపరుచుకోవాలి. ఆ తర్వాత రోజుకు ఒకటి చొప్పున 20 రోజులు మాక్ పరీక్షలు రాయాలి. జవాబులు సరిచూసుకుని, తప్పులు జరుగుతోన్న, వెనుకబడుతోన్న విభాగాలపై ప్రత్యేక దృష్టి సారించాలి. పరీక్షకు ముందు 10 రోజులూ ముఖ్యాంశాలు పునశ్చరణ చేసుకుంటూ, సందేహాలన్నీ నివృత్తి చేసుకోవాలి.
- రుణాత్మక మార్కుల కారణంగా తెలియని ప్రశ్నలను వదిలేయాలి. అలాగే జవాబు కోసం ఎక్కువ వ్యవధి అవసరమయ్యే ప్రశ్నలను పరీక్ష చివరలోనే, సమయం మిగిలితే ప్రయత్నించాలి.

ఇలాంటి వెసులుబాటు ఉంటుందా?

బీఏ (హెచ్‌ఈపీ)తో పూర్తయింది. ఇప్పుడు మనసు సైకాలజీ వైపు మళ్లింది. నేరుగా పీజీ కంటే డిగ్రీ సైకాలజీ చదవాలనుంది. ఇప్పటికే బీఏ ఉంది కాబట్టి, ఈ ఒక్క సబ్జెక్టు పేపర్లే రాసి, సైకాలజీ డిగ్రీ పొందే అవకాశం ఉంటుందా? – నాగరాజు

గత కొన్నేళ్లుగా బీఏ (హిస్టరీ, ఎకనామిక్స్, పొలిటికల్ సైన్స్) లాంటి కోర్సులు పూర్తిచేసిన చాలా మంది సైకాలజీ రంగంలో పెరుగుతున్న ఉద్యోగావకాశాలు, మానవ ప్రవర్తనను శాస్త్రీయంగా అర్థం చేసుకోవాలన్న ఆసక్తి కారణంగా ఈ కోర్సు వైపు ఆకర్షితులవుతున్నారు. విద్య, ఆరోగ్యం, కౌన్సెలింగ్, హ్యూమన్ రిసోర్సెస్, సోషల్ వర్క్ లాంటి అనేక రంగాల్లో సైకాలజీ ప్రాధాన్యం పెరుగుతున్న నేపథ్యంలో, ఈ మార్పు సహజమైనదే!

▼ భారతదేశంలో ఉన్నత విద్యను నియంత్రించే యూజీసీ (యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్) నిబంధనల ప్రకారం.. ప్రతీ డిగ్రీ ప్రోగ్రామ్ ఒక నిర్దిష్ట కోర్సు నిర్మాణం ఆధారంగా రూపొందుతుంది. బీఏ సైకాలజీ డిగ్రీ కేవలం సైకాలజీ పేపర్ల కలయికే కాదు. ఇందులో కోర్ సైకాలజీ పేపర్లు, అనుబంధ సామాజికశాస్త్ర కోర్సులు, జనరల్ ఎడ్యుకేషన్ పేపర్లు, స్కిల్ డెవలప్‌మెంట్ కోర్సులు, ప్రాజెక్ట్ వర్క్, ప్రాక్టికల్స్ కూడా ఉంటాయి. అందువల్ల ఇప్పటికే బీఏ డిగ్రీ పూర్తిచేసినవారు కేవలం సైకాలజీకి సంబంధించిన పేపర్లు చదివి అందులో పట్టా పొందడం యూజీసీ నిబంధనల ప్రకారం సాధ్యం కాదు.

▼ కొంతమంది విద్యార్థులు 'లేటరల్ ఎంట్రీ' లేదా 'క్రెడిట్ ట్రాన్స్‌ఫర్' ద్వారా ఈ సమస్యను అధిగమించవచ్చా? అని అడుగుతూ ఉంటారు. అయితే అండర్ గ్రాడ్యుయేట్ స్థాయిలో ఒక విభాగం నుంచి పూర్తిగా భిన్నమైన మరో విభాగానికి లేటరల్ ఎంట్రీ అవకాశాలు చాలా పరిమితంగా ఉంటాయి. నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీ 2020 ప్రకారం అకడమిక్ బ్యాంక్ ఆఫ్ క్రెడిట్స్ (ఏబీసీ) విధానం ఉన్నప్పటికీ ఇది ప్రధానంగా ఒకే డిగ్రీ ప్రోగ్రామ్ మధ్యలో చదువు నిలిపివేసిన వారికి లేదా అదే విభాగంలో కొనసాగే వారికే ఉపయోగపడుతుంది. సాధారణంగా హిస్టరీ, ఎకనామిక్స్, పొలిటికల్ సైన్స్ లాంటి విభాగాల నుంచి నేరుగా సైకాలజీ కోర్ డిగ్రీకి క్రెడిట్లు మార్చుకునే అవకాశం ఉండదు.



▼ మరికొన్ని మార్గాల్లో మీరు సైకాలజీ చదవడానికి ప్రయత్నించవచ్చు. బీఏ సైకాలజీని రెండో డిగ్రీగా రెగ్యులర్ విధానంలో పూర్తిచేయవచ్చు. ఇటీవల యూజీసీ జారీచేసిన నిబంధనల ప్రకారం సైకాలజీ, మైక్రో బయాలజీ, ఫుడ్ టెక్నాలజీ, న్యూట్రిషన్ లాంటి హెల్త్ కేర్ అనుబంధ సబ్జెక్టులను ఓపెన్/ ఆన్‌లైన్/ డిస్టెన్స్ విధానంలో చదవడం సాధ్యం కాదు. - మరో డిగ్రీ రెగ్యులర్ విధానంలో వద్దు అనుకుంటే సైకాలజీలో పీజీ చదువుకోవచ్చు.

▼ మన దేశంలో చాలా విశ్వవిద్యాలయాలు డిగ్రీలో సైకాలజీ సబ్జెక్టు చదవనప్పటికీ పీజీలో చేరే అవకాశం ఇస్తున్నాయి. కొన్ని యూనివర్సిటీల్లో ప్రారంభంలో సైకాలజీలో రెండు లేదా మూడు బ్రిడ్జ్ లేదా ఫౌండేషన్ కోర్సులు ఉండొచ్చు. కాబట్టి మీరు సైకాలజీలో రెగ్యులర్‌గా డిగ్రీ లేదా పీజీ లేదంటే ఈ రెండూ చదివే ప్రయత్నం చేయొచ్చు. సీయూఈటీ యూజీ, సీయూఈటీ పీజీలతో దేశవ్యాప్తంగా పలు విశ్వవిద్యాలయాలు అందించే సైకాలజీ కోర్సుల్లోకి ప్రవేశం లభిస్తుంది. తెలుగు రాష్ట్రాల్లోనూ కొన్ని విశ్వవిద్యాలయాలు సైకాలజీ పీజీలోకి గ్రాడ్యుయేట్లందరికీ అవకాశం కల్పిస్తున్నాయి.

– ప్రొ. బెల్లంకొండ రాజశేఖర్, కెరియర్ కౌన్సెలర్

ఇంటర్న్‌షిప్స్

వర్క్ ఫ్రమ్ హోమ్

వాట్సాప్ మేనేజర్

సంస్థ: బడ్డింగ్ మారినర్స్

నైపుణ్యాలు: కేన్వా, కమ్యూనిటీ మేనేజ్‌మెంట్, కంటెంట్ ఎడిటింగ్, కంటెంట్ మేనేజ్‌మెంట్, కంటెంట్ మార్కెటింగ్, కంటెంట్ రైటింగ్, ఎఫెక్టివ్ కమ్యూనికేషన్, ఇంగ్లిష్, హిందీ మాట్లాడటం, రాయడం, గ్రాఫిక్ డిజైన్, మేనేజ్‌మెంట్, మార్కెట్ అనాలిసిస్, టైమ్ మేనేజ్‌మెంట్, వీడియో ఎడిటింగ్, వీడియో మేకింగ్

స్టైపెండ్: రూ.1,500-2,000

దరఖాస్తు గడువు: జనవరి 8

☛ https://shorturl.at/T4Mjz

ప్రొడక్ట్ మార్కెటింగ్

సంస్థ: పాజ్ **నైపుణ్యాలు:** అడ్వాన్స్‌డ్ ఎక్సెల్, కంటెంట్, డిజిటల్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, ఈమెయిల్, సెర్చ్ ఇంజిన్, సోషల్ మీడియా మార్కెటింగ్, ఇంగ్లిష్ రాయడం, మాట్లాడటం, మార్కెట్ అనాలిసిస్, ప్రొడక్ట్ మేనేజ్‌మెంట్, ప్రొడక్ట్ స్ట్రాటజీ, టైమ్ మేనేజ్‌మెంట్

స్టైపెండ్: రూ.1,500-15,000

దరఖాస్తు గడువు: జనవరి 7

☛ https://shorturl.at/JOIsc

గ్రాఫిక్ డిజైన్

సంస్థ: ఇన్‌అమిగోస్ ఫౌండేషన్

నైపుణ్యాలు: క్రియేటివ్ రైటింగ్, వీడియో ఎడిటింగ్

స్టైపెండ్: రూ.4,500-6,500

దరఖాస్తు గడువు: జనవరి 7

☛ https://shorturl.at/S21bP

కంటెంట్ అండ్ సోషల్ మీడియా మార్కెటింగ్

సంస్థ: సోషల్ కడక్

నైపుణ్యాలు: కేన్వా, కంటెంట్ రైటింగ్, క్రియేటివ్ థింకింగ్, క్రియేటివ్ రైటింగ్, ఇంగ్లిష్ మాట్లాడటం, సెర్చ్ అండ్ అనలిటిక్స్, సోషల్ మీడియా మార్కెటింగ్

స్టైపెండ్: రూ.2,500-8,000

దరఖాస్తు గడువు: జనవరి 9

☛ https://tinyurl.com/svppkev8

టెలికాలింగ్

సంస్థ: కోడింగ్ జూనియర్

నైపుణ్యాలు: ఇంగ్లిష్ మాట్లాడటం, రాయడం, హిందీ మాట్లాడటం, ఎంఎస్-ఎక్సెల్ **స్టైపెండ్:** రూ.2,000

దరఖాస్తు గడువు: జనవరి 9

☛ https://tinyurl.com/yrzz4a5b

కంప్యూటర్ విజన్

సంస్థ: స్వఫినిక్స్ టెక్నాలజీస్ ప్రై.లి.

నైపుణ్యాలు: ఏడబ్ల్యూఎస్ లాంబా, కంప్యూటర్ విజన్, డీప్ లెర్నింగ్, జాంగో, ఫ్లాస్క్, జావాస్క్రిప్ట్, లినక్స్, మెషీన్ లెర్నింగ్, ఓపెన్‌సీవీ, పైతాన్

స్టైపెండ్: రూ.25,000-37,000

దరఖాస్తు గడువు: జనవరి 9

☛ https://tinyurl.com/y2475kkp

టెక్నికల్ అసిస్టెంట్లు

అడ్వాన్స్‌డ్ మెటీరియల్ అండ్ ప్రాసెసెస్ రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్, భోపాల్.. తాత్కాలిక ప్రాతిపదికన టెక్నికల్ అసిస్టెంట్, టెక్నీషియన్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తోంది.

టెక్నికల్ అసిస్టెంట్: 05 టెక్నీషియన్: 08 **అర్హత:** టెక్నికల్ అసిస్టెంట్ పోస్టుకు డిప్లొమా, బీఎస్సీ; టెక్నీషియన్ పోస్టులకు టెన్త్, ఐటీఐతో పాటు పని అనుభవం ఉండాలి. **వయసు:** 28 ఏళ్లు మించకూడదు.

వేతనం: నెలకు టెక్నికల్ అసిస్టెంట్‌కు రూ.66,500; టెక్నీషియన్‌కు రూ.37,000.

ఎంపిక: షార్ట్‌లిస్ట్, రాత పరీక్ష, ట్రేడ్ టెస్టులతో

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 04-01-2026.

వెబ్‌సైట్: https://ampri.res.in/

కొచ్చిన్ షిప్‌యార్డ్ లిమిటెడ్‌లో..

కొచ్చిన్ షిప్‌యార్డ్ లిమిటెడ్, ఉడుపి.. ఒప్పంద ప్రాతిపదికన వివిధ విభాగాల్లో పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహిస్తోంది.

▸ కమిషనింగ్ ఇంజినీర్(మెకానికల్): 02

▸ కమిషనింగ్ ఇంజినీర్(ఎలక్ట్రికల్/ఎలక్ట్రానిక్స్): 01

▸ కమిషనింగ్ అసిస్టెంట్(ఎలక్ట్రీషియన్): 10

అర్హత: పోస్టుల ప్రకారం సంబంధిత విభాగంలో టెన్త్, డిప్లొమాతో పాటు పని అనుభవం ఉండాలి.

వేతనం: నెలకు కమిషనింగ్ ఇంజినీర్‌కు రూ.50,000 - రూ.53,045, కమిషనింగ్ అసిస్టెంట్‌కు రూ.48,000 - రూ.50,924. **ఎంపిక:** ఇంటర్వ్యూతో

ఇంటర్వ్యూ తేదీ: 06.01.2026.

వేదిక: రిసెప్షన్ క్లబ్, కొచ్చిన్ షిప్‌యార్డ్ లిమిటెడ్ థెవారా గేట్, కొచ్చి- 68015.

వెబ్‌సైట్: https://udupicsl.com/index.php/careers/

డీఆర్‌డీఓలో సేవలందిస్తారా?

డిఫెన్స్ రిసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ (డీఆర్‌డీఓ).. 764 పోస్టులను భర్తీచేయనుంది. ఇంజినీరింగ్ డిప్లొమా లేదా బీఎస్సీ డిగ్రీ/ ఐటీఐతో దరఖాస్తు చేసుకోవచ్చు. కంప్యూటర్ బేస్డ్ టెస్ట్‌తో నియామకాలు ఉంటాయి.

సీనియర్ టెక్నికల్ అసిస్టెంట్ 'బీ': 561 ఖాళీలు ఉన్నాయి. ఆటోమొబైల్/ కెమికల్/ సివిల్/ కంప్యూటర్ సైన్స్/ ఎలక్ట్రికల్/ ఎలక్ట్రానిక్స్/ ఇన్‌స్ట్రుమెంటేషన్/ ఎలక్ట్రానిక్స్ అండ్ టెలికమ్యూనికేషన్ ఇంజినీరింగ్ డిప్లొమా. ఎమ్మెస్సీ, బీటెక్, బీఈ, పీహెచ్‌డీ చేసినవారు, విద్యార్హతల తుది ఫలితాలు వెలువడనివారూ దరఖాస్తుకు అనర్హులు.

రెండు దశల్లో ఎంపిక చేస్తారు. టైర్-1లో కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ (సీబీటీ)కు 150 మార్కులు. ప్రశ్నకు ఒక మార్కు. ప్రశ్నపత్రం ఇంగ్లిష్, హిందీల్లో ఉంటుంది. జనరల్ సైన్స్-40, జనరల్ ఇంగ్లిష్-30, క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్/ జనరల్ మ్యాథ్స్-40, జనరల్ ఇంటెలిజెన్స్ అండ్ రీజనింగ్ - 40 ప్రశ్నల చొప్పు ఇస్తారు. వ్యవధి 120 నిమిషాలు. ఇది టైర్-2కు స్క్రీనింగ్ టెస్ట్ మాత్రమే.


◆ టైర్-2లో రెండు పార్ట్‌లు ఉంటాయి. పార్ట్-1లోని పర్సనాలిటీ టెస్ట్ వ్యవధి 20 నిమిషాలు. పార్ట్-2లో సబ్జెక్టు సంబంధిత ప్రశ్నలు 120 ఇస్తారు. ప్రశ్నకు ఒక మార్కు. వ్యవధి 120 నిమిషాలు. పర్సనాలిటీ టెస్ట్ అర్హత పరీక్ష మాత్రమే. పార్ట్-2లో సాధించిన మార్కుల ఆధారంగా మెరిట్ లిస్ట్ చేస్తారు. టైర్-1, టైర్-2ల్లో ప్రశ్నకు ఒక మార్కు. ప్రతి తప్పు సమాధానానికీ పావుమార్కు తగ్గిస్తారు.

వేతన శ్రేణి: నెలకు రూ.35,400-1,12,400.

టెక్నీషియన్ 'ఏ': 203 ఖాళీలు ఉన్నాయి. పదోతరగతి, బుక్ బైండర్/ కార్పెంటర్/ సీఎన్‌సీ ఆపరేటర్/ డ్రాఫ్ట్స్‌మ్యాన్/ ఎలక్ట్రీషియన్/ ఫిట్టర్/ మెషినిస్ట్/ మెకానిక్ (మోటార్ వెహికల్)/ ఆప్టికల్ వర్కర్/ ఫొటోగ్రాఫర్/ షీట్‌మెటల్ వర్కర్/ సర్వేయర్/ టర్నర్/ వెల్డర్ ట్రేడ్‌తో ఐటీఐ.

◆ ఈ పోస్టులకు కూడా ఎంపిక రెండు దశల్లో జరుగుతుంది. టైర్-1 ప్రశ్నపత్రం సీనియర్ టెక్నికల్ అసిస్టెంట్ ప్రశ్నపత్రం మాదిరిగానే 150 మార్కులకు ఉంటుంది. టైర్-2లో ట్రేడ్ టెస్ట్ 120 మార్కులకు ఐటీఐ స్థాయిలో ఉంటుంది. వ్యవధి 90 నిమిషాలు. అయితే అభ్యర్థి చదివిన ట్రేడ్‌ను బట్టి ట్రేడ్ టెస్ట్ వ్యవధిలో మార్పులు ఉంటాయి. దాన్ని అడ్మిట్ కార్డులో తెలియజేస్తారు.

వేతన శ్రేణి: నెలకు రూ.19,900-63,200. మూలవేతనానికి అదనంగా డీఏ, హెచ్ఆర్ఏ, టీఏ, చిల్డ్రన్ ఎడ్యుకేషన్ అలవెన్స్, ఎల్‌టీసీ, మెడికల్, ఎన్‌పీఎస్/యూపీఎస్ సదుపాయాలు ఉంటాయి.



సన్నద్ధత: టైర్-2లోని పార్ట్-2 పరీక్షలో సబ్జెక్టు సంబంధిత ప్రశ్నలే ఇస్తారు. పాఠ్యాంశాల్లోని ముఖ్యాంశాలను అధ్యయనం చేసి పునశ్చరణ చేసుకోవాలి. ఇందులో సాధించిన మార్కులతోనే తుది ఎంపిక చేస్తారు.

✦ టైర్-1 అనేది టైర్-2కు స్క్రీనింగ్ పరీక్ష మాత్రమే. అయితే ఇందులో కనీసార్హత మార్కులు రాకపోతే టైర్-2కు హాజరయ్యే అవకాశమే ఉండదు. ఈ అంశాలపై అవగాహన కోసం వివిధ పోటీ పరీక్షల పాత ప్రశ్నపత్రాలను సాధన చేయాలి.

✦ ప్రతి దశలోనూ ప్రశ్నపత్రాన్ని నిర్ణీత వ్యవధిలోనే పూర్తిచేయగలగాలి. అంటే సమయ నిర్వహణపై తగిన పట్టుండాలి. మాక్ టెస్టులు రాయడం వల్ల దీనిపై అవగాహన వస్తుంది. అలాగే తక్కువ మార్కులు వచ్చిన అంశాలకు ఎక్కువ సమయాన్ని కేటాయించాలి.

✦ సీబీటీ తేదీని ఇంకా ప్రకటించలేదు. ఇప్పటి నుంచే సన్నద్ధతను కొనసాగిస్తే సమయాన్ని సద్వినియోగం చేసుకోవచ్చు.

వివరాలు

వయసు: రెండు పోస్టులకూ 01.01.2026 నాటికి 28 సంవత్సరాలు మించకూడదు. ఎస్సీ/ఎస్టీకి ఐదేళ్లు, ఓబీసీ-ఎన్‌సీఎల్‌కు మూడేళ్లు, దివ్యాంగులకు పది నుంచి పదిహేనేళ్ల సడలింపు ఉంటుంది. మాజీ సైనికోద్యోగులు, సంస్థ ఉద్యోగులకు ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా సడలింపులు వర్తిస్తాయి.

దరఖాస్తు ఫీజు: సీనియర్ టెక్నికల్ అసిస్టెంట్‌కు.. అన్‌రిజర్వ్‌డ్/ ఓబీసీ/ ఈడబ్ల్యూఎస్‌కు రూ.750. మహిళలు/ ఎస్సీ/ ఎస్టీ/ దివ్యాంగులు/ మాజీ సైనికోద్యోగులకు రూ.500.

✦ టెక్నీషియన్-ఏకు జనరల్/ ఓబీసీ/ ఈడబ్ల్యూఎస్‌లకు రూ.600. మహిళలు/ ఎస్సీ/ ఎస్టీ/ దివ్యాంగులు/ మాజీ సైనికోద్యోగులకు రూ.500.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 01.01.2026

వెబ్‌సైట్: https://www.drdo.gov.in/

అలెన్ స్కాలర్‌షిప్ టెస్ట్

అలెన్ కెరియర్ ఇన్‌స్టిట్యూట్.. ఇంజినీరింగ్, మెడిసిన్ ఆశావహులకు స్కాలర్‌షిప్ టెస్టులు నిర్వహిస్తోంది. అలెన్ స్కాలర్‌షిప్ అడ్మిషన్ టెస్టు(ఏశాట్)లో ప్రతిభావంతులకు ఆ సంస్థ శిక్షణ ఫీజులో 90 శాతం వరకు రాయితీ లభిస్తుంది. ఈ పరీక్షను డిసెంబరు 21న దేశవ్యాప్తంగా వివిధ కేంద్రాల్లో నిర్వహిస్తారు. ఆ తర్వాత జనవరి 4న మరోసారి జరుగుతుంది. ఇందులో కోర్ సబ్జెక్టులు, సైంటిఫిక్, అకడమిక్, సైకలాజికల్ అసెస్‌మెంట్, ఐక్యూ ప్రశ్నలు ఇస్తారు. ఐఐటీ-జేఈఈ మెయిన్స్, అడ్వాన్స్‌డ్, నీట్-యూజీ సన్నద్ధతలో ఉన్నవారు అలెన్ సంస్థ నిర్వహించే ఏశాట్ కోసం ప్రయత్నించవచ్చు.

వెబ్‌సైట్: www.allen.in

సైంటిఫిక్ అనాలిసిస్ గ్రూప్

డీఆర్‌డీవో- సైంటిఫిక్ అనాలిసిస్ గ్రూప్(ఎస్ఏజీ).. ఆరు నెలల కాలానికి యూజీ, పీజీ ఇంజినీరింగ్, సైన్స్ విద్యార్థులకు ఇంటర్న్‌షిప్పుల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తోంది.

▸ బీఈ/బీటెక్, ఎంఈ/ఎంటెక్/ఎమ్మెస్సీ: 24 ఖాళీలు

విభాగాలు: సీఎస్/ఏఐ/ఐఎస్ఈ/సైబర్‌సెక్యూరిటీ, ఎలక్ట్రానిక్స్/ ఈసీఈ/ఈఐఈ, ఫిజిక్స్, మ్యాథమెటిక్స్/స్టాటిస్టిక్స్

అర్హత: సంబంధిత విభాగాల్లో చివరి ఏడాది బీఈ/బీటెక్, ఎంఈ/ఎంటెక్, ఎమ్మెస్సీ. **స్టైపెండ్:** నెలకు 5,000 చొప్పున ఆరు నెలలకు మొత్తం రూ.30,000. **ఎంపిక:** విద్యార్హత మార్కులు, ఇంటర్వ్యూలతో.

దరఖాస్తు పంపాల్సిన ఈమెయిల్: (saghr.sag@gov.in) .

దరఖాస్తుకు చివరి తేదీ: 19.12.2025.

వెబ్‌సైట్: https://www.drdo.gov.in/drdo/en/offerings/vacancies

చదువు

కెరియర్, ఉన్నతవిద్యలకు సంబంధించి మీకు ఏ సందేహాలున్నా వాటిని మాకు పంపండి. నిపుణులు సమాధానాలు ఇస్తారు.

మా చిరునామా:
చదువు, ఈనాడు కార్యాలయం,
అనాజ్‌పూర్, అబ్దుల్లాపూర్‌మెట్ మండలం,
రామోజీ ఫిల్మ్‌సిటీ – 501 512 edc@eenadu.in

మూడు భుజాలు సమానం అదే.. సమబాహు త్రిభుజం!

ఏపీపీఎస్సీ పరీక్షల ప్రత్యేకం
అరిథ్‌మెటిక్



త్రిభుజాలు

ముఖ్యాంశాలు

- మూడు శీర్షాలు, మూడు భుజాలు, మూడు అంతర కోణాలు కలిగి ఉన్న సంవృత బహుభుజినే త్రిభుజం అంటారు.
- త్రిభుజంలో మూడు అంతర కోణాల మొత్తం 180°
- త్రిభుజంలో ఏవైనా రెండు భుజాల పొడవుల మొత్తం మూడో భుజం పొడవు కంటే ఎక్కువగా ఉంటుంది.
- త్రిభుజంలో మూడు భుజాల పొడవుల మొత్తాన్ని చుట్టుకొలత అంటారు.
- త్రిభుజ వైశాల్యం $= \frac{1}{2} \times$ భూమి $\times$ ఎత్తు
- లంబకోణ త్రిభుజంలో ఒక కోణం 90° ఉంటుంది.
  దీనిలో కర్ణం^{2} = భూమి^{2} + ఎత్తు^{2}
- సమద్విబాహు లంబకోణ త్రిభుజంలో కర్ణం $= \sqrt{2}\,a$
  (a = సమాన భుజం పొడవు)
  వైశాల్యం $= \frac{1}{2}a^2$, చుట్టుకొలత $= (2+\sqrt{2})a$
- విషమబాహు త్రిభుజ భుజాలు వరుసగా a, b, c లు అనుకుంటే,
  త్రిభుజం చుట్టుకొలత $= 2s = a+b+c \Rightarrow s = \frac{a+b+c}{2}$
  త్రిభుజ వైశాల్యం $= \sqrt{s(s-a)(s-b)(s-c)}$
- సమద్విబాహు త్రిభుజంలో సమాన భుజం పొడవు = a, అసమాన భుజం పొడవు = b అయితే
  ఆ త్రిభుజ వైశాల్యం $= \frac{b}{4}\sqrt{4a^2-b^2}$,
  ఎత్తు $= h = \frac{1}{2}\sqrt{4a^2-b^2}$
- సమబాహు త్రిభుజంలో మూడు భుజాలు సమానంగా ఉంటాయి.
  దాని పొడవు = a అయితే, ఎత్తు $= h = \frac{\sqrt{3}}{2}a$
  త్రిభుజ వైశాల్యం $= \frac{\sqrt{3}}{4}a^2 = \frac{h^2}{\sqrt{3}}$

మాదిరి ప్రశ్నలు

1. ఒక త్రిభుజం భుజాల పొడవులు వరుసగా 13 సెం.మీ., 17 సెం.మీ., 20 సెం.మీ. అయితే ఆ త్రిభుజ వైశాల్యం?

1) $30\sqrt{20}$ చ.సెం.మీ. 2) 60 చ.సెం.మీ.
3) $20\sqrt{30}$ చ.సెం.మీ. 4) 50 చ.సెం.మీ.

సాధన: a = 13 సెం.మీ., b = 17 సెం.మీ., c = 20 సెం.మీ.,

$s = \frac{a+b+c}{2} = 25$ సెం.మీ.,

త్రిభుజ వైశాల్యం $= \sqrt{s(s-a)(s-b)(s-c)}$ చ.సెం.మీ.
$= \sqrt{25 \times 12 \times 8 \times 5}$ చ.సెం.మీ.
$= 20\sqrt{30}$ చ.సెం.మీ.

సమాధానం: 3

2. ఒక త్రిభుజంలో భుజాలు $\frac{1}{3} : \frac{2}{5} : \frac{3}{4}$ నిష్పత్తిలో ఉన్నాయి. త్రిభుజం చుట్టుకొలత 267 సెం.మీ. అయితే దాని పెద్ద భుజం పొడవు ఎంత?

1) 133 సెం.మీ. 2) 145 సెం.మీ.
3) 153 సెం.మీ. 4) 135 సెం.మీ.

సాధన: $a : b : c = \left(\frac{1}{3} : \frac{2}{5} : \frac{3}{4}\right) \times 60$ (3, 5, 4 ల కసాగు = 60)
$= 20 : 24 : 45$
లెక్క ప్రకారం, 20 + 24 + 45 = 89 భాగాల పొడవు = 267
పెద్ద భుజం పొడవు = 45 భాగాల పొడవు
$= 45 \times 3 = 135$ సెం.మీ.

సమాధానం: 4

3. ఒక త్రిభుజం భూమి 21 సెం.మీ., ఎత్తు 16 సెం.మీ. దీనికి రెట్టింపు వైశాల్యం ఉన్న త్రిభుజం ఎత్తు 24 సెం.మీ. అయితే దాని భూమి పొడవు ఎంత?

1) 28 సెం.మీ. 2) 26 సెం.మీ.
3) 30 సెం.మీ. 4) 24 సెం.మీ.

సాధన: మొదటి త్రిభుజ వైశాల్యం $= \frac{1}{2}bh = \frac{1}{2} \times 21 \times 16$
$= 168$ చ.సెం.మీ.

రెండో త్రిభుజ వైశాల్యం $= \frac{1}{2}bh = 168 \times 2$

$\Rightarrow b \times 24 = 168 \times 4 \Rightarrow b = 28$ సెం.మీ.

సమాధానం: 1

4. ఒక త్రిభుజంలోని ప్రతి భుజం పొడవు $13\frac{1}{3}$ సెం.మీ. అయితే ఆ త్రిభుజం ఎత్తు ఎంత?

1) $\frac{20}{3\sqrt{3}}$ సెం.మీ. 2) $\frac{20\sqrt{3}}{3}$ సెం.మీ.
3) $\frac{20}{3}$ సెం.మీ. 4) $20\sqrt{3}$ సెం.మీ.

సాధన: సమబాహు త్రిభుజం ఎత్తు $= \frac{\sqrt{3}}{2}a = \frac{\sqrt{3}}{2} \times \frac{40}{3}$
$= \frac{20\sqrt{3}}{3}$ సెం.మీ.

సమాధానం: 2

5. ఒక లంబకోణ త్రిభుజ వైశాల్యం దాని ఎత్తుకు 37 రెట్లు. అయితే దాని భూమి పొడవు ఎంత?

1) 67 యూనిట్లు 2) 75 యూనిట్లు
3) 70 యూనిట్లు 4) 74 యూనిట్లు

సాధన: లంబకోణ త్రిభుజ వైశాల్యం = 37h

$\frac{1}{2}bh = 37h \Rightarrow = b = 74$ యూనిట్లు

సమాధానం: 4



రచయిత
డా. వంగల శ్రీనివాస్
విషయ నిపుణులు

6. ఒక త్రిభుజం భుజాల పొడవు వరుసగా 7 సెం.మీ., 9 సెం.మీ., 12 సెం.మీ. అయితే ఆ భుజాల మధ్య బిందువులను కలిపితే ఏర్పడే త్రిభుజ వైశాల్యం?

1) $\frac{7}{2}\sqrt{5}$ చ.సెం.మీ. 2) $7\sqrt{5}$ చ.సెం.మీ.
3) $\frac{7}{3}\sqrt{5}$ చ.సెం.మీ. 4) $\frac{7}{2}\sqrt{3}$ చ.సెం.మీ.

సాధన: a = 7 సెం.మీ., b = 9 సెం.మీ., c = 12 సెం.మీ.

$s = \frac{a+b+c}{2} = 14$ సెం.మీ

త్రిభుజ వైశాల్యం $= \sqrt{s(s-a)(s-b)(s-c)}$
$= \sqrt{14 \times 7 \times 5 \times 2}$ చ.సెం.మీ.
$= 14\sqrt{5}$ చ.సెం.మీ.

లెక్కలో కోరిన త్రిభుజ వైశాల్యం $= \frac{1}{4} \times 14\sqrt{5}$

$= \frac{7}{2}\sqrt{5}$ చ.సెం.మీ.

సమాధానం: 1

7. ఒక సమబాహు త్రిభుజ వైశాల్యం $36\sqrt{3}$ చ.సెం.మీ. అయితే దాని చుట్టుకొలత ఎంత?

1) 45 సెం.మీ. 2) $48\sqrt{3}$ సెం.మీ.
3) 48 సెం.మీ. 4) $45\sqrt{3}$ సెం.మీ.

సాధన: సమబాహు త్రిభుజ వైశాల్యం $= \frac{\sqrt{3}}{4}a^2 = 36\sqrt{3}$

$\Rightarrow a^2 = 36 \times 4$
$\Rightarrow a = \sqrt{36 \times 4}$
$\Rightarrow a = 6 \times 2 = 12$ సెం.మీ.
త్రిభుజం చుట్టుకొలత $= 4a = 4 \times 12$
$= 48$ సెం.మీ.

సమాధానం: 3

8. ఒక సమబాహు త్రిభుజం ఎత్తు $\frac{17}{\sqrt{3}}$ సెం.మీ. దాని వైశాల్యం ఎంత?

1) $\frac{289}{3}$ చ.సెం.మీ. 2) $\frac{289}{3\sqrt{3}}$ చ.సెం.మీ.
3) $\frac{289}{\sqrt{3}}$ చ.సెం.మీ. 4) $289\sqrt{3}$ చ.సెం.మీ.

సాధన: $h = \frac{17}{\sqrt{3}}$ సెం.మీ

సమబాహు త్రిభుజ వైశాల్యం $= \frac{\sqrt{3}}{4}a^2 = \frac{h^2}{\sqrt{3}}$ చ.సెం.మీ.

$= \frac{17 \times 17}{3\sqrt{3}} = \frac{289}{3\sqrt{3}}$ చ.సెం.మీ.

సమాధానం: 2

Word of the Day 861

Verbose

Telugu meaning: అధిక ప్రసంగం, అతిగా మాట్లాడటం

English meaning: The word verbose (వర్బోస్) is an adjective that describes speech or writing that uses more words than necessary.

Synonyms: Wordy, Rambling

Antonyms: Concise, Brief

Usage: 1. The professor's verbose explanation confused the students instead of clarifying the concept.

2. He tends to become verbose when nervous, adding unnecessary details to simple points.

కరెంట్ అఫైర్స్



బీమా రంగంలోకి విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల (ఎఫ్‌డీఐ) పరిమితిని ప్రస్తుత 74% నుంచి 100 శాతానికి పెంచే బిల్లుకు 2025, డిసెంబరు 12న కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. డిసెంబరు 19న ముగియనున్న పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లోనే బీమా సవరణ బిల్లు-2025ను ప్రవేశపెట్టే అవకాశం ఉంది. ఇన్సూరెన్స్ చట్టం-1938లో సవరణలు చేసి, జీవిత, సాధారణ బీమా రెండింటినీ ఒకే సంస్థ అందించే విధంగా కాంపోజిట్ లైసెన్స్ విధానాన్ని తీసుకురావాలని కొత్త బిల్లు నిర్ణయించింది.

2025 ఏడాదికిగానూ 'పర్సన్ ఆఫ్ ద ఇయర్'గా 'ఆర్కిటెక్ట్స్ ఆఫ్ ఏఐ'ని (ఏఐ సృష్టికర్తలు) ప్రముఖ అంతర్జాతీయ మ్యాగజీన్ టైమ్ ప్రకటించింది. 2025ను ఏఐ ఏడాదిగా అభివర్ణించిన ఈ మ్యాగజీన్.. దాని శక్తి ప్రపంచానికి స్పష్టంగా కనిపించిందని పేర్కొంది. ఏఐ మన జీవితాలను మార్చడంలో, ఆశ్చర్యపరచడంలో, ఆందోళన కలిగించడంలో ప్రధాన పాత్ర పోషించిందని వివరించింది. జెన్సెన్ హువాంగ్, సామ్ ఆల్ట్‌మన్, డొనాల్డ్ ట్రంప్, బెంజమిన్ నెతన్యాహు, జోహ్రాన్ మమ్దానీ పర్సన్ ఆఫ్ ద ఇయర్ రేసులో పోటీ పడ్డారు.

గత ఆర్థిక సంవత్సరం (2024-25)లో తలసరి రాష్ట్ర స్థూల జాతీయోత్పత్తి (జీఎస్‌డీపీ)లో రూ.3.87 లక్షలతో దేశంలోని రాష్ట్రాలన్నింటిలో తెలంగాణ టాప్‌లో నిలిచింది. ఈ విషయాన్ని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) పేర్కొంది. తర్వాత వరుసగా కర్ణాటక రూ.3.80 లక్షలు, తమిళనాడు రూ.3.61లక్షలు, మహారాష్ట్ర రూ.3.09 లక్షలతో 2, 3, 4 ర్యాంకుల్లో నిలిచాయి. కేంద్రపాలిత ప్రాంతాలను కూడా కలిపి చూస్తే దిల్లీ రూ.4.93 లక్షల జీఎస్‌డీపీతో ముందుంది.



దేశంలో రైలు ప్రమాదాలు 2004-14 నుంచి 2024-25 మధ్యకాలంలో ఏటా 171 నుంచి 64కు తగ్గిపోయాయని రైల్వేమంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. ఆయన 2025, డిసెంబరు 12న రాజ్యసభలో ఈ విషయాన్ని వెల్లడించారు. 2004-14 మధ్య పదేళ్ల కాలంలో మొత్తం 1,711 ప్రమాదాలు జరగ్గా, 2014-25 మధ్యకాలంలో 709 జరిగాయని చెప్పారు. 2025-26లో ఈ నవంబరు వరకు 11 ప్రమాదాలు చోటుచేసుకున్నాయని తెలిపారు.

మరిన్ని కరెంట్ అఫైర్స్ కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

స్టడీ జోన్

దీవులు

చుట్టూ నీటితో కప్పి ఉన్న భూభాగాలను దీవులు లేదా ద్వీపాలు అంటారు. ఇవి ఒంటరిగా లేదా సమూహాలుగా ఉండొచ్చు. ప్రపంచంలోనే అత్యంత అందమైన, ఆకర్షణీయమైన ప్రదేశాలుగా వీటిని పరిగణిస్తారు. విశాలమైన మహాసముద్రాలు, సముద్రాల నుంచి నదులు, సరస్సుల్లోనూ ఇవి కనిపిస్తాయి. దీవులు సాధారణంగా చిన్న పరిమాణంలో ఉండి స్థానిక ప్రాముఖ్యతను కలిగి ఉంటాయి. జీవ వైవిధ్యం, పర్యావరణ పరిరక్షణలో ఇవి ప్రధాన పాత్ర పోషిస్తాయి. మనుషులకు ఆవాసాలుగానూ ఉపయోగపడతాయి. పోటీ పరీక్షల నేపథ్యంలో వీటి గురించి ముఖ్యాంశాలను తెలుసుకుందాం..!

ఎలా ఏర్పడతాయి?


ద్వీపాలు వివిధ మార్గాల్లో ఏర్పడతాయి. అగ్నిపర్వతాల విస్ఫోటనం, టెక్టోనిక్ ప్లేట్ల కదలికలు, పగడపు దిబ్బల పెరుగుదల దీనికి ప్రధాన కారణాలుగా ఉన్నాయి.

- సముద్రంలోని అగ్ని పర్వతాలు విస్ఫోటనం చెందినప్పుడు ఆ ప్రాంతంలో భూమి పైకి లేవడం ప్రారంభమవుతుంది. అలా ఏర్పడిన భూ స్వరూపం ద్వీపంలా కనిపిస్తుంది.
- టెక్టోనిక్ ప్లేట్లు కదిలే సమయంలో కన్వర్జెంట్ సరిహద్దుల వద్ద ఖండాంతర పలకలు ఢీకొనడం వల్ల అక్కడ భూమి పైకి లేస్తుంది. కాలక్రమంలో అది ద్వీపంలా మారుతుంది.
- ఒక నిర్దిష్ట సమయంలో కోత ప్రక్రియ కారణంగా ఇసుక, ఇతర శిథిలాలు నిక్షేపణకు గురై, దీవులుగా రూపాంతరం చెందుతాయి.

భారతదేశంలోని దీవులు

భారతదేశంలో రెండు పెద్ద ద్వీప సమూహాలు ఉన్నాయి. ఒకటి అరేబియా సముద్రంలో కేరళలోని మలబార్ తీరానికి సమీపంలో ఉన్న లక్షద్వీప్ ద్వీప సమూహం కాగా, మరొకటి బంగాళాఖాతంలో ఉన్న అండమాన్ - నికోబార్ ద్వీప సమూహం.

- వీటిలో తూర్పు దిక్కున ఉన్న బంగాళాఖాతంలోని దీవుల్లో ఎక్కువ మంది నివసిస్తున్నారు. ఈ దీవులు సముద్ర గర్భం నుంచి సముద్ర ఉపరితలానికి వ్యాపించిన పర్వతాలు. అరేబియా సముద్రంలోనివి మాత్రం పగడపు దీవుల వల్ల ఏర్పడిన ప్రవాళ భిత్తికలు.



దీవుల్లో రకాలు, భారతదేశంలోని దీవులు, గత పరీక్షల్లో అడిగిన ప్రశ్నల కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

జనరల్ స్టడీస్ - బయాలజీ

పత్ర రూపాంతరాలు

మొక్కల్లో కిరణజన్య సంయోగక్రియ, ట్రాన్స్‌పిరేషన్ లాంటి సాధారణ విధులతోపాటు కొన్ని ప్రత్యేక విధులను నిర్వహించడానికి పత్రాలు రూపాంతరాలతో సవరణకు గురవుతాయి. కొన్నిసార్లు ఈ మార్పులు పలు పర్యావరణ పరిస్థితులకు ప్రతిస్పందనగా ఉంటాయి.

నిల్వ పత్రాలు


నీరు లభ్యం కాని పరిస్థితుల్లో (జిరోఫైటిక్ ఆవాసాల్లో) కొన్ని మొక్కలు, క్రాసులేసి కుటుంబానికి చెందినవి సాధారణంగా నీటి నిల్వ కణజాలాల్లో బాగా దగ్గరగా అమరి ఉండే కణజాలంతో రసవంతమైన పత్రాలను కలిగి ఉంటాయి.

లీఫ్ టెండ్రిల్స్

బలహీనమైన కాండం ఉన్న మొక్కల్లో పత్రం లేదా పత్రంలో కొంత భాగం పచ్చదారం లాంటి నిర్మాణాలుగా మారుతుంది. వీటినే టెండ్రిల్స్ అంటారు.

లీఫ్-స్పైన్స్

కొన్ని మొక్కల పత్రాలు పూర్తిగా లేదా పాక్షికంగా రక్షణ ప్రయోజనం కోసం స్పైన్స్ లేదా కంటకం అనే పదునైన, కోణాల నిర్మాణాలుగా మార్పు చెందుతాయి. అందుకే ఒపన్షియాలో పార్శ్వ మొగ్గ సూక్ష్మ పత్రాలు కంటకాలుగా మారతాయి.



టెండ్రిల్స్‌గా మారే పత్రం భాగాలు, కరపత్ర హుక్స్, పత్రం మూలాలు, ఫైలోడ్ మొదలైన అంశాలతోపాటు మాదిరి ప్రశ్నలతో సహా పూర్తి సమాచారం ఈ-బుక్ రూపంలో 'ఈనాడు ఈప్రతిభ' వెబ్‌సైట్‌లో 'జనరల్ స్టడీస్ ఈ-బుక్స్' కోర్సులో అందుబాటులో ఉంది. మరిన్ని వివరాలకు క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

Latest Updates

Legal Consultant Posts

Directorate of Enforcement invites applications for the Legal Consultant posts on a contractual basis. The total no. of posts is 75. Eligible candidates can apply online before 30 December 2025.

Graduate and Technician Apprentice Posts

ISRO - Vikram Sarabhai Space Centre (VSSC) in Thiruvananthapuram, Kerala, invites applications to recruit Graduate and Technician Apprentice Posts. The total no. of posts is 90. Eligible candidates can appear for the interview on 29 December 2025.

PG Diploma Admissions

MSME Tool Room Hyderabad, Central Institute of Tool Design (CITD) is inviting applications for admissions in the Post Graduate Diploma course for the January 2026 batch. The application fee is Rs.300. The last date for online applications is 20 December 2025.

Did You Apply..?

Today (December 15) is the last date for the following Jobs

- 422 Nursing Officer Jobs in Dr.Ram Manohar Lohia Institute. *Eligibility:* B.Sc (Hons) Nursing / B.Sc Nursing.
- 124 Management Trainee (Technical) posts in SAIL. *Eligibility:* Degree, PG.
- 41 jobs in Rajiv Gandhi Super Speciality Hospital. *Eligibility:* Medical PG (MD/MS/MCh/DM).

For more information and other notifications - scan QR code

SSC Exams English

Antonyms

Directions (Qs. 1 - 13): *In each of the questions given below, a word is given in bold letters and four options are presented. Choose the appropriate antonym from those options that suits the word given in bold letters.*

1. Proliferate
A) Expand B) Multiply
C) Increase D) Diminish

2. Disconcert
A) Disturb B) Calm
C) Confuse D) Unsettle

3. Sanction
A) Permit B) Approve
C) Prohibit D) Authorize

4. Acrimony
A) Bitterness B) Hostility
C) Harmony D) Resentment

5. Adamant
A) Stubborn B) Flexible
C) Rigid D) Unyielding

6. Repulse
A) Attract B) Reject
C) Push D) Resist

7. Incriminate
A) Accuse B) Blame
C) Exonerate D) Charge

8. Truism
A) Fact B) Falsehood
C) Obvious truth D) Reality

9. Fictitious
A) Imaginary B) Unreal
C) Invented D) Genuine

10. Barbarous
A) Civilized B) Savage
C) Inhuman D) Cruel

11. Commotion
A) Disturbance B) Chaos
C) Silence D) Disorder

12. Generous
A) Stingy B) Liberal
C) Kind D) Charitable

13. Conspicuous
A) Noticeable B) Hidden
C) Prominent D) Visible

Directions (Qs. 14 - 24): *In each of the questions given below, a sentence is given with one word printed in bold letters, along with four options to choose from. Choose the appropriate antonym from those options that suits the word given in bold letters.*

14. The committee dismissed the report as **specious,** noting that it appeared convincing on the surface but collapsed under scrutiny.
A) Sound B) Deceptive
C) Fallacious D) Misleading

15. The ruler was known for his **capricious** decisions, often changing policies without warning or justification.
A) Erratic B) Consistent
C) Impulsive D) Whimsical

16. Despite overwhelming evidence, the official offered a **prevaricating** response that avoided a direct answer.
A) Evasive B) Ambiguous
C) Forthright D) Deceptive

17. The novel was criticized for its **turgid** prose, which made even simple ideas exhausting to read.
A) Pompous B) Lucid
C) Tedious D) Overblown

18. The general adopted an **intransigent** stance, refusing to negotiate under any circumstances.
A) Rigid B) Unyielding
C) Amenable D) Obstinate

19. The activist's **strident** tone alienated many potential supporters who preferred measured discourse.
A) Harsh B) Aggressive
C) Shrill D) Moderate

20. His **obsequious** behaviour towards superiors was widely seen as insincere and self-serving.
A) Assertive B) Servile
C) Submissive D) Fawning

21. The policy was criticized as **myopic,** failing to account for its long-term consequences.
A) Far-sighted B) Short-sighted
C) Narrow-minded D) Limited

22. The diplomat handled the sensitive negotiations with remarkable **tact,** avoiding any remarks that could offend.
A) Diplomacy B) Bluntness
C) Prudence D) Sensitivity

23. The witness's testimony was dismissed as **equivocal,** offering no clear or decisive account of events.
A) Ambiguous B) Vague
C) Definitive D) Uncertain

24. The scholar was admired for his **erudite** lectures, rich with historical and philosophical references.
A) Learned B) Scholarly
C) Intellectual
D) Ignorant

Scan the QR code for Key

Writer: P. Manoj Kumar, Subject Expert

కరెంట్ అఫైర్స్ — మాదిరి ప్రశ్నలు

◆ ఐక్యరాజ్య సమితి గ్లోబల్ జియోస్పేషియల్ ఇన్ఫర్మేషన్ మేనేజ్‌మెంట్ ఫర్ ఆసియా అండ్ ది పసిఫిక్ (యూఎన్ – జీజీఐఎం– ఏపీ)కి ఇటీవల భారత్ కో-ఛైర్‌గా ఏ కాలానికి ఎన్నికైంది? **జ:** 2025- 2028

UN-GGIM-AP

◆ ట్రాన్స్‌జెండర్ హక్కుల పరిరక్షణ కోసం సమాన అవకాశాల విధానాన్ని రూపొందించేందుకు ఏర్పడిన సుప్రీంకోర్టు ప్యానెల్‌కు నియమితులైన మొదటి ట్రాన్స్‌జెండర్‌గా ఇటీవల ఎవరు వార్తల్లో నిలిచారు? **జ:** అక్కై పద్మశాలి, కర్ణాటక

◆ కారుణ్య మరణాన్ని చట్టబద్ధం చేసిన మొదటి లాటిన్ అమెరికన్ దేశంగా ఇటీవల ఏ దేశం చరిత్ర సృష్టించింది? **జ:** ఉరుగ్వే (కొలంబియా, ఈక్వెడార్ గతంలో న్యాయ నిర్ణయాల ద్వారా కారుణ్య మరణాన్ని అనుమతించినప్పటికీ అధికారికంగా చట్టాన్ని చేసిన తొలి దేశంగా ఉరుగ్వే నిలిచింది.)

మరింత సమాచారం

◆ కేంద్ర ప్రభుత్వం ఇటీవల ఎంత మొత్తంతో 'కపస్ క్రాంతి మిషన్'ను ప్రారంభించింది? (హెచ్‌డీపీ (హై- డెన్సిటీ ప్లాంటేషన్) పద్ధతులు, డిజిటల్ సాధనలు, రైతులకు మద్దతు కల్పించడం ద్వారా దీర్ఘకాలిక పత్తి దిగుబడిని పెంచడానికి కేంద్ర ప్రభుత్వం ఈ మిషన్‌ను ప్రారంభించింది.) **జ:** రూ. 600 కోట్లు




దరఖాస్తు చేశారా?

☛ రాజీవ్ గాంధీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌లో ఉద్యోగాలు
చివరి తేదీ: 15-12-2025

☛ బీఈఎంఎల్‌లో ఎగ్జిక్యూటివ్ పోస్టులు
చివరి తేదీ: 17.12.2025

సీనియర్ ఇంటర్ గణితం–2బి — వృత్త సరణులు



ఫైనల్ పరీక్షలు 2026 — ముఖ్యమైన ప్రశ్నలు - జవాబులు

2 మార్కులు

1. $x^2 + y^2 + 4x + 8 = 0,\ x^2 + y^2 - 16y + K = 0$ వృత్తాలు లంబఛేదనం చేసుకుంటే K విలువను కనుక్కోండి.

సాధన: దత్త వృత్తాల నుంచి

$g = 2, f = 0, c = 8,\ g' = 0, f' = -8, c' = K$

లంబఛేదన నియమం $\Rightarrow 2gg' + 2ff' = c + c'$

$\Rightarrow 2(2)(0) + 2(0)(-8) = 8 + K \Rightarrow K = -8$

2. $x^2 + y^2 - 5x - 14y - 34 = 0,\ x^2 + y^2 + 2x + 4y + K = 0$ వృత్తాలు లంబఛేదనం చేసుకుంటే K విలువను కనుక్కోండి.

సాధన: దత్త వృత్తాల నుంచి

$g = \frac{-5}{2}, f = -7, c = -34$

$g' = 1, f' = 2, c' = K$

లంబఛేదన నియమం $\Rightarrow 2gg' + 2ff' = c + c'$

$\Rightarrow 2\left(\frac{-5}{2}\right)(1) + 2(-7)(2) = -34 + K \Rightarrow K = 1$

3. $x^2 + y^2 - 6x - 8y + 12 = 0,\ x^2 + y^2 - 4x + 6y + K = 0$ వృత్తాలు లంబంగా ఖండించుకుంటే K విలువను కనుక్కోండి.

సాధన: దత్త వృత్తాల నుంచి $\Rightarrow g = -3, f = -4, c = 12,$

$g' = -2, f' = 3, c' = K$

లంబఛేదన నియమం $\Rightarrow 2gg' + 2ff' = c + c'$

$2(-3)(-2) + 2(-4)(3) = 12 + K \Rightarrow K = -24$

4. $x^2 + y^2 - 12x - 6y + 41 = 0,\ x^2 + y^2 + 4x + 6y - 59 = 0$ వృత్తాల మధ్య కోణం కనుక్కోండి.

సాధన: దత్త వృత్తాల నుంచి

$c_1 = (6, 3) \quad r_1 = 2$

$c_2 = (-2, -3)\ r_2 = \sqrt{72}$ వృత్తాల మధ్య కోణం θ అనుకుంటే

$\cos\theta = \frac{d^2 - r_1^2 - r_2^2}{2r_1r_2}$ ఇక్కడ $d = c_1c_2 = 10$

$\therefore \cos\theta = \frac{d^2 - r_1^2 - r_2}{2r_1r_2} = \frac{100 - 4 - 72}{(2(2).6\sqrt{2}} = \frac{1}{\sqrt{2}} \Rightarrow \theta = 45^\circ$

5. $x^2 + y^2 + 10x - 2y + 22 = 0,\ x^2 + y^2 + 2x - 8y + 8 = 0$ వృత్తాల ఉమ్మడి స్పర్శరేఖ సమీకరణం కనుక్కోండి.

సాధన: దత్త వృత్తాలు $s \equiv x^2 + y^2 + 10x - 2y + 22 = 0,$

$s^1 \equiv x^2 + y^2 + 2x - 8y + 8 = 0$

వృత్తాల మూలాక్షం $s - s^1 = 0$

$8x + 6y + 14 = 0$

$\Rightarrow 4x + 3y + 7 = 0$

మరికొన్ని ప్రశ్నలు-జవాబులు



రచయిత: బి.ఈశ్వరరావు

జనరల్ స్టడీస్ — ఆంధ్రప్రదేశ్ ఆర్థిక వ్యవస్థ

అక్షరాస్యతలో విశాఖ.. లింగ నిష్పత్తిలో అల్లూరి!

రాష్ట్ర సమగ్ర చిత్రాన్ని ఆవిష్కరించే అంశాల్లో ప్రధానమైనది జనాభా. పరిపాలనా ప్రణాళికలు, సంక్షేమ పథకాల రూపకల్పన నుంచి వనరుల కేటాయింపు వరకు అన్నింటికీ జనాభానే ఆధారం. అందుకే జనాభా తీరుతెన్నులను వివరించే జనాభా లెక్కలు, అక్షరాస్యత, జనసాంద్రత, లింగనిష్పత్తి గురించి జిల్లాల వారీగా తెలుసుకోవడం ప్రభుత్వంతో పాటు ప్రజలకూ ముఖ్యమే. రాష్ట్ర ప్రస్తుత స్థితి, భవిష్యత్తు అవసరాలను స్పష్టం చేసే అంశాలైన జనాభా విస్తరణ, నాణ్యత, పెరుగుదల రేటు, ప్రాంతాలవారీ అసమానతలు, సామాజిక పరిస్థితులను ప్రతిబింబించే వివరాలపై పోటీ పరీక్షల అభ్యర్థులకు అవగాహన ఉండాలి. ఎస్సీ, ఎస్టీ జనాభా గణాంకాలనూ గుర్తుంచుకోవాలి.



ఆంధ్రప్రదేశ్ జనాభా-2011

జనాభా శాస్త్రంలో డెమోగ్రాఫిక్ డివిడెండ్ అనే పదాన్ని మొదట డేవిడ్ బ్లూమ్ రూపొందించారు. ఒక దేశ జనాభాలో యువకులు అధికంగా ఉంటే నూతన ఆవిష్కరణలు చేసి, సాహసోపేతమైన నిర్ణయాలు తీసుకొని ఆర్థిక వ్యవస్థను చైతన్యపరుస్తారు. డెమోగ్రాఫిక్ డివిడెండ్ అనేది పనిచేసే వయసు జనాభాలో పెరుగుదల ఫలితంగా ఏర్పడే ఆర్థిక ప్రయోజనం. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం డెమోగ్రాఫిక్ డివిడెండ్ దిశగా పయనిస్తోంది. ◆ 2011 జనాభా లెక్కల ప్రకారం ఆంధ్రప్రదేశ్ మొత్తం జనాభా = 4,95,77,103 ◆ పురుష జనాభా = 2,48,30,513 ◆ స్త్రీ జనాభా = 2,47,46,590 ◆ రాష్ట్రంలో మొత్తం కుటుంబాల సంఖ్య = 127.19 లక్షలు ◆ దేశ జనాభాలో రాష్ట్ర వాటా = 4.10% ◆ దేశ జనాభాలో రాష్ట్ర ర్యాంకు = 10 (మొదటి ర్యాంకు - ఉత్తర్‌ప్రదేశ్) ◆ దేశ విస్తీర్ణంలో రాష్ట్ర ర్యాంకు = 8

దశాబ్దాల వారీగా రాష్ట్ర జనాభా లెక్కలు

సంవత్సరం	1961	1971	1981	1991	2001	2011
జనాభా(కోట్లలో)	2.32	2.76	3.33	4.04	4.52	4.95

విస్తీర్ణం: ◆ ఆంధ్రప్రదేశ్‌లో విస్తీర్ణపరంగా పెద్ద జిల్లాలు: 1) ప్రకాశం (14,322 చ.కి.మీ.), 2) అల్లూరి సీతారామరాజు (12,251చ.కి.మీ.), 3) కడప(11,228 చ.కి.మీ.) ◆ విస్తీర్ణపరంగా చిన్న జిల్లాలు: 1) విశాఖపట్నణం (1,048 చ.కి.మీ.), 2) అంబేడ్కర్ కోనసీమ (2,083 చ.కి.మీ.), 3) పశ్చిమగోదావరి (2,178 చ.కి.మీ.).


జనసాంద్రత: సగటున చదరపు కిలోమీటరుకు నివసించే జనాభాను జనసాంద్రత అంటారు. ఆంధ్రప్రదేశ్ జనసాంద్రత-304 (దేశ జనసాంద్రత-382). ◆ జనసాంద్రత ఎక్కువ ఉన్న జిల్లాలు: విశాఖపట్నం (1870), గుంటూరు (856). ◆ జనసాంద్రత తక్కువ ఉన్న జిల్లాలు: అల్లూరి సీతారామరాజు (78), ప్రకాశం (160).

జనాభా వృద్ధి రేటు



పది సంవత్సరాల్లో జనాభా పెరుగుదలను శాతం రూపంలో లెక్కించడాన్ని వృద్ధి రేటు అంటారు. ✷ 2001-11 ఏపీ జనాభా వృద్ధి రేటు 9.21% (దేశ వృద్ధి రేటు 17.69%). ✷ ఆంధ్రప్రదేశ్‌లో అత్యధిక జనాభా వృద్ధి రేటు నమోదు - 1991 (21.13%) ✷ అతితక్కువ జనాభా వృద్ధి రేటు నమోదు - 2011 (9.21%) **జనాభా వృద్ధి రేటు ఎక్కువ ఉన్న జిల్లాలు:** విశాఖపట్నం (18.24%), ఎన్‌టీఆర్ (15.96%) **జనాభా వృద్ధిరేటు తక్కువ ఉన్న జిల్లాలు:** కృష్ణా (0.53%), పశ్చిమ గోదావరి (0.93%).

లింగ నిష్పత్తి: సగటున 1000 మంది పురుషులకు ఉన్న స్త్రీల సంఖ్యను లింగ నిష్పత్తి అంటారు. 2011 జనాభా లెక్కల ప్రకారం రాష్ట్ర లింగ నిష్పత్తి 997 కాగా, దేశ లింగ నిష్పత్తి 943. దేశ లింగ నిష్పత్తి కంటే ఆంధ్రప్రదేశ్ లింగ నిష్పత్తి ఎక్కువ. ✤ అతితక్కువ లింగ నిష్పత్తి నమోదు - 1991 (927/1000) ✤ అత్యధిక లింగ నిష్పత్తి నమోదు - 2011 (997/1000) ✤ లింగ నిష్పత్తి ఎక్కువ ఉన్న జిల్లాలు: అల్లూరి సీతారామరాజు (1046), మన్యం (1035). ✤ లింగ నిష్పత్తి తక్కువ ఉన్న జిల్లాలు: సత్యసాయి (975), అనంతపురం (978) ✤ 0 - 6 సంవత్సరం పిల్లల లింగ నిష్పత్తి తగ్గడం గమనార్హం. ✤ 2011 ప్రకారం 0 - 6 సంవత్సరం పిల్లల లింగ నిష్పత్తి - 944/1000 (పట్టణ పిల్లల్లో - 940/1000, గ్రామీణ పిల్లల్లో 946/1000).



పిల్లల్లో అధిక లింగ నిష్పత్తి ఉన్న జిల్లాలు: అల్లూరి సీతారామరాజు (1008/1000), తూర్పు గోదావరి (975/1000). ✤ రాష్ట్ర జనాభాలో 0-6 సంవత్సరాల వారి వాటా 10.58%. ✤ గ్రామీణ లింగ నిష్పత్తి కంటే పట్టణాల్లో అధిక లింగ నిష్పత్తి ఉంది.



అక్షరాస్యత రేటు

సంవత్సరం	మొత్తం	పురుషులు	స్త్రీలు
1981	29.9%	39.2%	20.3%
2001	62.07%	71.2%	52.7%
2011	67.35%	74.7%	59.96%

6 సంవత్సరాల వయసు నిండి చదవడం, రాయడం, చదివిన విషయాన్ని అర్థం చేసుకోవడాన్ని 'అక్షరాస్యత' అంటారు. ◆ ఆంధ్రప్రదేశ్‌లో అక్షరాస్యత ఎక్కువ ఉన్న జిల్లాలు: విశాఖపట్నం- 79.05%, కోనసీమ 75.84%. ◆ అక్షరాస్యత తక్కువ ఉన్న జిల్లాలు: అల్లూరి సీతారామరాజు - 48.34%, కర్నూలు 57.10%. ◆ పురుష అక్షరాస్యత ఎక్కువ ఉన్న జిల్లా - విశాఖపట్నం (84.81%) ◆ పురుష అక్షరాస్యత తక్కువ ఉన్న జిల్లా - అల్లూరి సీతారామరాజు (57.60%) ◆ స్త్రీ అక్షరాస్యత ఎక్కువ ఉన్న జిల్లా - విశాఖపట్నం (73.21%) ◆ స్త్రీ అక్షరాస్యత తక్కువ ఉన్న జిల్లా - అల్లూరి సీతారామరాజు (39.54%) ◆ 2011 జనాభా లెక్కల ప్రకారం పట్టణ అక్షరాస్యత - 79.17% ◆ 2011 జనాభా లెక్కల ప్రకారం గ్రామీణ అక్షరాస్యత - 62.4% ◆ అత్యధిక పట్టణ అక్షరాస్యత ఉన్న జిల్లా - పశ్చిమ గోదావరి (84.24%) ◆ అత్యధిక గ్రామీణ అక్షరాస్యత ఉన్న జిల్లా - పశ్చిమ గోదావరి (74.98%).

ఎస్సీ జనాభా: 2011 లెక్కల ప్రకారం ఏపీలో ఎస్సీ మొత్తం జనాభా - 84.6 లక్షలు. రాష్ట్ర జనాభాలో వీరి వాటా - 17.08%. ◆ అధిక ఎస్సీ జనాభా ఉన్న జిల్లాలు: ప్రకాశం, నెల్లూరు. ◆ తక్కువ ఎస్సీ జనాభా ఉన్న జిల్లా: అల్లూరి సీతారామరాజు. ◆ రాష్ట్రంలో ఎస్సీ అక్షరాస్యత రేటు - 64.4%. ◆ అత్యధిక ఎస్సీ అక్షరాస్యత రేటు ఉన్న జిల్లా - విశాఖపట్నం (78.65%) ◆ తక్కువ ఎస్సీ అక్షరాస్యత రేటు ఉన్న జిల్లా - కర్నూలు (53%) ◆ ఎస్సీ లింగ నిష్పత్తి - 1007/1000 ◆ ఎస్సీ బాలబాలికల (0 - 6 సంవత్సరాలు) లింగ నిష్పత్తి - 961/1000 ◆ ఎస్సీ బాలబాలికల లింగ నిష్పత్తి అధికంగా ఉన్న జిల్లా - విశాఖపట్నం (992/1000) ◆ ఎస్సీ బాలబాలికల లింగ నిష్పత్తి తక్కువ ఉన్న జిల్లా - నంద్యాల (940/1000).

ఎస్టీ జనాభా: 2011 ప్రకారం ఆంధ్రప్రదేశ్‌లో ఎస్టీ మొత్తం జనాభా - 27.4 లక్షలు, రాష్ట్ర జనాభాలో వీరి వాటా - 5.53%. ✷ అధిక ఎస్టీ జనాభా ఉన్న జిల్లా - అల్లూరి సీతారామరాజు ✷ తక్కువ ఎస్టీ జనాభా ఉన్న జిల్లా - కోనసీమ ✷ ఎస్టీ అక్షరాస్యత రేటు - 48.8% ✷ అత్యధిక ఎస్టీ అక్షరాస్యత రేటు ఉన్న జిల్లా - విశాఖపట్నం (76%) ✷ తక్కువ ఎస్టీ అక్షరాస్యత రేటు ఉన్న జిల్లా - పల్నాడు (43.60%) ✷ ఎస్టీ లింగ నిష్పత్తి - 1012/1000 ✷ ఎస్టీ బాలబాలికల (0 - 6 సంవత్సరాలు) లింగ నిష్పత్తి - 964/1000 ✷ ఎస్టీ బాలబాలికల లింగ నిష్పత్తి అధికంగా ఉన్న జిల్లా - అల్లూరి సీతారామరాజు (1009/1000) ✷ ఎస్టీ బాలబాలికల లింగ నిష్పత్తి తక్కువ ఉన్న జిల్లా - సత్యసాయి (881/1000).



రచయిత: పి.వి.సుబ్బిరెడ్డి


జనరల్ స్టడీస్-భౌతికశాస్త్రం — ఉష్ణం

ఎండలోకి వెళ్లినప్పుడు శరీరం వేడెక్కితే..!



వెలుగుతున్న కొవ్వొత్తిపై చెంచాను ఉంచినప్పుడు, దాని అంచును పట్టుకున్న చేతి వేళ్లకు వేడి తగులుతుంది. స్టౌ మీద పాత్రలో మరుగుతున్నప్పుడు వేడి నీరు పైకి రావడాన్ని గమనించవచ్చు. ఎలాంటి మాధ్యమం లేకుండానే సూర్య కిరణాలు తాకి భూమి వేడెక్కుతుంది. ఇదంతా శక్తి బదిలీ వల్ల జరుగుతుంది. ఒక వస్తువు నుంచి మరో వస్తువుకు వాటి ఉష్ణోగ్రతల్లోని తేడా వల్ల బదిలీ అయ్యే శక్తి రూపాన్ని ఉష్ణం అంటారు. వహనం, సంవహనం, వికిరణం తదితర పద్ధతుల్లో ఉష్ణ ప్రసారం సాగుతుంది. ఈ నేపథ్యంలో ఉష్ణోగ్రతను కొలిచే పరికరాలు, పనిచేసే సూత్రాల గురించి పోటీ పరీక్షార్థులు తెలుసుకోవాలి. వివిధ పదార్థాల విశిష్టోష్ణం విలువలు, ఉష్ణోగ్రత మాపకాల అవధులను గుర్తుంచుకోవాలి.

1. కిందివాటిలో సరైనవి గుర్తించండి.



ఎ) ఉష్ణాన్ని, ఉష్ణరాశులను కొలవడాన్ని కెలోరిమితి అంటారు.
బి) పదార్థాల ఉష్ణరాశుల విలువలు కొలిచేది - థర్మామీటర్
సి) 1 గ్రాము నీటి ఉష్ణోగ్రతను $1^\circ C$ పెంచడానికి కావాల్సిన ఉష్ణాన్ని 'కెలోరి' అంటారు.
డి) ద్రవంలో ఉన్న దోషాలను ప్రతిబింబించే అవినాశక విలువలు కనుక్కునే ప్రయోగంలో ఉష్ణం వాడతారు.
1) ఎ, బి, సి, డి 2) ఎ, సి 3) ఎ, సి, డి 4) ఎ, బి, డి

2. కిందివాటిలో సరికానిది?
ఎ) ఉష్ణానికి S.I. ప్రమాణం - జౌల్
బి) ఉష్ణం ఎల్లప్పుడూ చల్లని వస్తువు నుంచి వేడి వస్తువుకు బదిలీ అవుతుంది.
సి) 1 కెలోరి విలువ 4.186 జౌల్స్‌కి సమానం.
డి) ఉష్ణం ప్రసారం జరగాలంటే పదార్థాలు/వస్తువులు ఉష్ణ సమతాస్థితిలో ఉండాలి.
1) ఎ, బి, సి, డి 2) బి, డి 3) ఎ, సి 4) డి

3. కిందివాటిని జతపరచండి.
1) ఉష్ణ వాహకాలు — ఎ) గాలి, నీరు, మట్టి
2) అధమ ఉష్ణ వాహకాలు — బి) వజ్రం
3) ఉత్తమ ఉష్ణ వాహకం — సి) రాగి, వెండి, బంగారం
4) ఉత్తమ ఉష్ణ బంధకం — డి) వెండి
ఇ) పింగాణి
1) 1-సి, 2-ఎ, 3-డి, 4-ఇ 2) 1-సి, 2-ఎ, 3-బి, 4-ఇ
3) 1-సి, 2-ఎ, 3-బి, 4-డి 4) 1-సి, 2-ఎ, 3-డి, 4-బి

4. కిందివాటిలో ఉష్ణవహనానికి సంబంధించి సరైంది.



ఎ) ఒక వస్తువు అణువులు/కణాల స్థానచలనం లేకుండా జరిగే ఉష్ణ ప్రసార పద్ధతి.
బి) ఇది ఘన, ద్రవ, వాయు పదార్థాల్లో జరుగుతుంది.
సి) ద్రవ రూప లోహం ఉన్న పాదరసంలో ఉష్ణవహనం జరుగుతుంది.
డి) మండే స్టౌవ్‌పై ఉన్న ఖాళీ వంట పాత్ర వేడెక్కడం ఉష్ణవహనం.
1) ఎ, బి, సి, డి 2) ఎ, సి, డి 3) ఎ, బి, సి 4) ఎ, సి

5. కిందివాటిలో స్వల్ప ఉష్ణవాహకం ఏది?
ఎ) శుద్ధమైన నీరు బి) ఇనుము సి) గాలి డి) స్టీల్ ఇ) సిల్వర్
1) సి 2) ఎ, సి 3) సి, ఇ 4) ఇ

6. కింది వాక్యాల్లో సరికానిది?
ఎ) రంపపు పొట్టు అధమ ఉష్ణ వాహకం. అందుకే మంచు గడ్డపై కప్పి ఉంచుతారు.
బి) వేసవి కాలంలో ముదురు రంగు దుస్తులు మంచివి. ఇవి ఉష్ణాన్ని ఆలస్యంగా గ్రహిస్తాయి.
సి) మట్టి/పూరిల్లు లాంటివి గడ్డి/మట్టితో తయారు చేస్తారు. దీనికి కారణం అవి ఉష్ణబంధక పదార్థాలు.
డి) ఆయిల్ ట్యాంకర్లపై, లోపల అంతా ఉష్ణబంధక పదార్థాలతో కప్పుతారు.
1) ఎ, బి, సి, డి 2) ఎ, డి 3) ఎ, సి 4) బి

7. కిందివాటిలో ఉష్ణ సంవహనానికి సంబంధించి సరైనవి.
ఎ) వస్తువులో అణువులు/కణాల స్థానాంతర చలనం వల్ల ఉష్ణం ప్రసరించే పద్ధతి.
బి) ఇది అన్ని ద్రవ, వాయువుల్లో జరుగుతుంది.
సి) ఈ ప్రసారానికి కారణం అణువుల సాంద్రతల్లో తేడా.
డి) సముద్ర పవనాలు, భూపవనాలు ఏర్పడటానికి ఈ ప్రక్రియే కారణం.
1) ఎ, బి, సి, డి 2) ఎ, బి, సి 3) ఎ, సి 4) ఎ, సి, డి

8. కిందివాటిలో ఉష్ణ వికిరణ ప్రక్రియకు సంబంధించి సరికానిది?
ఎ) యానకం లేకుండా శూన్యం లోనూ జరిగే ఉష్ణ ప్రసార పద్ధతి.
బి) థర్మాస్ ఫ్లాస్క్‌లో రెండు పాత్రల మధ్యలో శూన్యం ఉంచితే ఉష్ణ వికిరణం జరుగుతుంది.
సి) విశ్వంలో ఉండే వస్తువులు (నక్షత్రాలు, గ్రహాలు) మధ్య ఈ ప్రసారం జరుగుతుంది.
డి) ఎండలోకి వెళ్లిన వ్యక్తి శరీరం వేడెక్కడం - ఉష్ణ వికిరణం.
1) ఎ, బి 2) బి, సి 3) బి 4) సి

9. కిందివాటిని జతపరచండి.
1) థర్మాస్ ఫ్లాస్క్ — ఎ) ఉష్ణ సంవహనం
2) థర్మోస్కోప్ — బి) ఏవీ జరగవు
3) ఇనుప కడ్డీ వేడెక్కడం — సి) ఉష్ణ వికిరణం
4) ఎగ్జాస్ట్‌ఫ్యాన్, వంటగది చిమ్నీలు పనిచేయడం — డి) ఉష్ణ వహనం
ఇ) ఉష్ణ సంవహనం, వికిరణం
1) 1-బి, 2-ఇ, 3-ఎ, 4-సి 2) 1-ఇ, 2-బి, 3-ఎ, 4-సి
3) 1-బి, 2-సి, 3-డి, 4-ఎ 4) 1-సి, 2-ఎ, 3-ఇ, 4-బి

10. థర్మాస్ ఫ్లాస్క్‌కు సంబంధించి సరైనవి గుర్తించండి.
ఎ) దీన్ని కనుకున్నవారు - డేవర్
బి) దీని పాత్ర లోపల సిల్వర్‌బ్రోమైడ్‌తో పూత వేస్తారు.
సి) దీన్ని శూన్య నాళికీయ ఫ్లాస్క్ అని కూడా పిలుస్తారు.
డి) దీనిలో ఉష్ణవహనం, సంవహనం, వికిరణం వంటి మూడు ప్రక్రియలు జరుగుతాయి.
1) ఎ, బి, సి, డి 2) ఎ, బి 3) ఎ, బి, సి 4) ఎ, సి, డి


11. కిందివాటిలో ఉష్ణోగ్రతకు సంబంధించనిది (సరికానిది)?
ఎ) పదార్థం వెచ్చదనం తీవ్రత/చల్లదనం తీవ్రతను ఉష్ణోగ్రత అంటారు.
బి) దీనికి S.I. ప్రమాణం - జౌల్
సి) దీన్ని కొలిచే పరికరం థర్మామీటర్ (ఉష్ణమాపకం). దీన్ని కొలిచే శాస్త్రం థర్మోమెట్రీ.
డి) మన శరీరం నుంచి వస్తువులోనికి ఉష్ణప్రసారం జరిగితే మనకి చల్లదనం అంటారు.
1) బి, సి, డి 2) బి, డి 3) డి 4) బి

12. కిందివాటిని జతపరచండి.

కొలత పద్ధతి	అవధి
1) సెంటిగ్రేడ్ మానం	ఎ) 0 - 80
2) ఫారన్ హీట్ మానం	బి) 0 - 273
3) కెల్విన్ మానం	సి) 0 - 100
4) రైమర్ మానం	డి) 32 - 212
	ఇ) 0 - 200
	ఎఫ్) 273 - 273

1) 1-సి, 2-ఎఫ్, 3-ఎ, 4-డి 2) 1-సి, 2-డి, 3-బి, 4-ఎ
3) 1-సి, 2-ఎఫ్, 3-ఇ, 4-బి 4) 1-సి, 2-బి, 3-ఎఫ్, 4-ఎ

13. కిందివాటిలో ఉష్ణోగ్రత మానంల(స్కేల్)ను సెంటిగ్రేడ్ మానాలతో జతపరచండి.
1) ఫారన్ హీట్ మానం — ఎ) $\frac{C}{100} = \frac{R}{80}$
2) కెల్విన్ మానం — బి) $\frac{C}{5} = \frac{F - 32}{9}$
3. రైమర్ మానం — సి) $K = C + 273$
డి) $\frac{C}{100} = \frac{k - 273}{273}$
ఇ) $\frac{C}{100} = \frac{C - R}{80}$



1) 1-బి, 2-డి, 3-ఇ 2) 1-బి, 2-సి, 3-ఎ
3) 1-సి, 2-డి, 3-ఇ 4) 1-డి, 2-సి, 3-ఇ

14. కిందివాటిలో సరికానిది గుర్తించండి.
ఎ) మానవ శరీర ఉష్ణోగ్రత సుమారు 310K(కెల్విన్)
బి) నీటి భాష్పీభవన స్థానం విలువ కెల్విన్‌లలో 373.15k
సి) సెంటిగ్రేడ్, ఫారన్‌హీట్ స్కేలులు - 40°వద్ద సమానం
డి) పరమశూన్య ఉష్ణోగ్రత అనేది - 273K
1) ఎ 2) సి 3) డి 4) సి, డి

15. కిందివాటిలో వాయు థర్మామీటర్లు కొలిచే ఉష్ణోగ్రత వ్యాప్తులు సరిగా గుర్తించండి.
1) హైడ్రోజన్ — ఎ) $-200^\circ C \rightarrow +30^\circ C$
2) హీలియం — బి) $-150^\circ C \rightarrow +600^\circ C$
3) నైట్రోజన్ — సి) $-200^\circ C \rightarrow +500^\circ C$
4) పెంటేన్ — డి) $-270^\circ C \rightarrow +1600^\circ C$
1) 1-డి, 2-బి, 3-ఎ, 4-సి 2) 1-సి, 2-బి, 3-డి, 4-ఎ
3) 1-సి, 2-డి, 3-బి, 4-ఎ 4) 1-డి, 2-సి, 3-ఎ, 4-బి

16. కిందివాటిని జతపరచండి.
1) పాదరస ఉష్ణోగ్రత మాపకం — ఎ) $-10^\circ C \rightarrow 110^\circ C$
2) ప్లాటినం నిరోధక ఉష్ణమాపకం — బి) $-200^\circ C \rightarrow 1200^\circ C$
3) ఉష్ణయుగ్మం ఉష్ణోగ్రతా మాపకం — సి) $-30^\circ C \rightarrow 350^\circ C$
4) ప్రయోగశాల ఉష్ణోగ్రతా మాపకం — డి) $-200^\circ C \rightarrow 1600^\circ C$
1) 1-బి, 2-ఎ, 3-డి, 4-సి 2) 1-సి, 2-బి, 3-డి, 4-ఎ
3) 1-ఎ, 2-బి, 3-సి, 4-డి 4) 1-సి, 2-డి, 3-బి, 4-ఎ

17. కిందివాటిలో థర్మామీటర్‌లో నీరును వాడకపోవడానికి కారణం కానిది.
1) అధిక విశిష్టోష్ణం ఉండటం.
2) చాలా తక్కువ ఉష్ణోగ్రతకు వ్యాకోచించండం
3) అత్యధిక సాంద్రత ఉన్న ద్రవం
4) గాజు పాత్ర గోడలకు అంటుకోవడం

18. కిందివాటిని జతపరచండి.
1) ధ్రువ ప్రాంతాల ఉష్ణోగ్రతను కొలిచేది — ఎ) ఆల్కహాల్ థర్మామీటర్
2) రోగి శరీర ఉష్ణోగ్రతను కొలిచేది — బి) క్రయోమీటర్
3) సముద్రపు అలల ఉష్ణోగ్రతను కొలిచేది — సి) క్లినికల్ థర్మామీటర్
4) అత్యల్ప ఉష్ణోగ్రతలను కొలిచేది — డి) బాతోస్కోప్
1) 1-బి, 2-ఎ, 3-డి, 4-సి 2) 1-ఎ, 2-సి, 3-డి, 4-బి
3) 1-డి, 2-సి, 3-బి, 4-ఎ 4) 1-సి, 2-ఎ, 3-బి, 4-డి

19. కింది వాక్యాల్లో సరైన వాక్యాన్ని గుర్తించండి.
ఎ) క్రయోజెనిక్స్ అంటే తక్కువ ఉష్ణోగ్రతల ఉత్పత్తి, వాటి అనువర్తనాల అధ్యయనం
బి) ఇండియాలో 3వ తరం రాకెట్‌లో (జీఎస్ఎల్‌వీ)లో క్రయోజెనిక్ ఇంజిన్లు వాడారు.
సి) క్రయోజెనిక్ ఇంజిన్‌లలో ద్రవ హైడ్రోజన్ ($-253^\circ C$), ద్రవ ఆక్సిజన్ ($-183^\circ C$)లను నింపుతారు.
డి) స్టీఫెన్ నియమం ఆధారంగా అధిక ఉష్ణోగ్రతలను కొలిచేది పైరోమీటర్.
1) ఎ, బి, సి, డి 2) ఎ, బి, సి
3) ఎ, సి, డి 4) ఎ, బి, డి


20. ఇళ్లలోని రిఫ్రిజిరేటర్లు పనిచేయడంలో ప్రధాన సూత్రం?
1) సీబెక్ ఫలితం
2) జౌల్-థామ్సన్ ప్రభావం
3) కాంతి విద్యుత్తు ఫలితం
4) విద్యుత్తు వల్ల ఉష్ణ ఫలితం

21. కింది వాక్యాల్లో సరైనవి గుర్తించండి.
ఎ) వేడి చేస్తే పదార్థాలు వ్యాకోచిస్తాయి అనే సూత్రం ఆధారంగా థర్మామీటర్లు (ఉష్ణమాపకాలు) పనిచేస్తాయి.
బి) ఘన పదార్థం వేడి చేస్తే దాని అక్షం వెనక వ్యాకోచిస్తే దాన్ని దైర్ఘ్యవ్యాకోచం అంటారు.
సి) ఘన పదార్థం వేడి చేస్తే దాని అన్ని అక్షాల వెంబడి వ్యాకోచిస్తే, దానిని ఘనపరిమాణ వ్యాకోచం అంటారు.
డి) దైర్ఘ్య, విస్తీర్ణ, ఘన పరిమాణ వ్యాకోచ గుణకాల మధ్య సంబంధం $\alpha : \beta : \gamma = 1 : 2 : 3$
1) ఎ, బి, సి, డి 2) ఎ, బి, సి
3) ఎ, సి, డి 4) ఎ, బి, డి

సమాధానాలు

1-3, 2-2, 3-4, 4-2, 5-1, 6-4, 7-1, 8-3, 9-3, 10-3, 11-4, 12-2, 13-2, 14-3, 15-3, 16-2, 17-3, 18-2, 19-1, 20-2, 21-1.

బహుభాషత్వం.. మెదడుకు ప్రయోజనకరం



భాష.. మన భావాలను వ్యక్తీకరించడానికి ఉపయోగపడే వాహకం. మనల్ని సమాజంతో అనుసంధానం చేసే అదృశ్య సాధనం. కొందరు మరో అడుగు ముందుకేసి ఒకటి కన్నా ఎక్కువ భాషల్లో అనర్గళంగా మాట్లాడే నేర్పును సాధిస్తుంటారు. ఇలాంటి బహుళభాషా నైపుణ్యంతో మెదడుకు మేలు జరుగుతుందని తాజా పరిశోధన తేల్చింది. ఇలాంటివారి మెదడులో వార్ధక్య ప్రక్రియ నెమ్మదిస్తుందని పేర్కొంది.

వయసు మీదపడేకొద్దీ మెదడులో మార్పులు వస్తాయి. అవి ఆకస్మికంగా జరిగిపోవు. క్రమంగా చోటుచేసుకుంటాయి. జరిగిపోయిన ఘటనలను నెమరువేసుకునే సామర్థ్యం మందగించడం, ఏకాగ్రత తగ్గడం, విషయగ్రహణ సామర్థ్యంలో లోపాల రూపంలో అవి కనిపిస్తాయి. అయితే దీన్ని నెమ్మదింపచేయవచ్చా అన్నదే కీలక ప్రశ్న. విషయగ్రహణ సామర్థ్యం, జ్ఞాపకశక్తిని స్వల్పంగా మెరుగుపరచడానికి కొన్ని బ్రెయిన్ టీజర్లు లేదా పజిల్స్ వంటివాటిని సూచిస్తుంటారు. అయితే భాషా సామర్థ్యాలను మెరుగు పరచుకోవడం బాగా ఉపయోగపడుతుందని తాజా పరిశోధన తేల్చింది.

ఏమిటీ పరిశోధన?

స్పెయిన్‌లోని బాస్క్ సెంటర్ ఆన్ కాగ్నిషన్, బ్రెయిన్ అండ్ లాంగ్వేజ్ సంస్థకు చెందిన శాస్త్రవేత్తలు ఈ పరిశోధన చేశారు. 27 ఐరోపా దేశాల్లో 51 నుంచి 91 ఏళ్ల మధ్య ఉన్న 86వేల మంది ఆరోగ్యవంతులకు సంబంధించిన డేటాను విశ్లేషించిన శాస్త్రవేత్తలు ఈ మేరకు తేల్చారు. ఇందులో వెల్లడైన అంశాలివీ..

- ఒకటే భాష మాట్లాడేవారితో పోలిస్తే బహుభాషలు మాట్లాడేవారి మెదడులో వార్ధక్య సంకేతాలు సగం మేర తగ్గొచ్చు.
- బహుళ భాషలు మాట్లాడే సమాజంలో ఉండటం వల్ల విషయగ్రహణ సామర్థ్యం, మెదడు పనితీరుల్లో క్షీణత ఆలస్యం కావొచ్చు.
- మరో భాషను నేర్చుకోవడం వల్ల అల్జీమర్స్, డిమెన్షియా వంటి నాడీ క్షీణత వ్యాధుల రాకను ఆలస్యం చేయవచ్చు.
- బహుభాషత్వం వల్ల ఒత్తిడి నుంచి రక్షణ పొందొచ్చు.
- ఈ లెక్కన చూస్తే మానసిక ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి మెరుగైన సాధనంగా బహుభాషత్వం ఉపయోగపడుతుంది.
- ఒకటి కన్నా ఎక్కువ భాషలు మాటాడటాన్ని ఎంత ఎక్కువ కాలం కొనసాగిస్తే అంత ఎక్కువ లబ్ధి ఉంటుంది.
- ఏ వయసులోనైనా ఈ సూత్రాన్ని అనుసరించి ప్రయోజనాలు పొందొచ్చు. మరో భాషను నేర్చుకోవడం మొదలుపెట్టిన కొద్దికాలానికే ఈ ఫలితాలను చూడొచ్చు.

సామాజిక ప్రయోజనాలూ..

ఒకటి కన్నా ఎక్కువ భాషలు నేర్చుకోవడం వల్ల రోజువారీ జీవితం లోనూ అనేక ప్రయోజనాలు ఉంటాయని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. వయసు మీదపడేకొద్దీ మన సామాజిక బంధాలు తగ్గిపోయే అవకాశం ఉంది. ఫలితంగా ఒంటరితనంలో ఉండిపోవాల్సి రావొచ్చు. దీనివల్ల విషయగ్రహణ సామర్థ్యం, భావోద్వేగ ఆరోగ్యం క్షీణించే ప్రమాదం ఉంది.

- కమ్యూనికేషన్ నైపుణ్యాలు పెంచుకోవడం వల్ల సామాజిక సంధానత కూడా పెరుగుతుంది. భాష అనేది గొప్ప సంధానకర్త. దీనిద్వారా ఇతరులతో మమేకం కావడం సులువు. ఇతర సమాజాలు, సంస్కృతులతో సులువుగా కలిసిపోయి సామాజిక బంధాలను పెంచుకోవచ్చు.

సృజనకూ రెక్కలు

బహుళ భాషల వల్ల బలమైన కమ్యూనికేషన్ నైపుణ్యాలను పొందొచ్చు. దీనివల్ల సృజనాత్మకత పెరుగుతుంది. మెరుగైన ఏకాగ్రత వంటివి కూడా సాధ్యమవుతాయి. ఏకకాలంలో భిన్న పనులు చేసే నైపుణ్యం (మల్టీటాస్కింగ్), నిర్ణయాలు తీసుకోవడం వంటి కార్యనిర్వాహక పనుల్లో వీరు మరింత సమర్థంగా వ్యవహరించగలరు.

ఎందుకు?

బహుభాషత్వం వల్ల మెదడు నెట్‌వర్క్‌లు నిరంతరం పనిచేస్తాయి. దీనివల్ల అవి బలోపేతం కావొచ్చు. మార్చి మార్చి రెండు భాషలను ఉపయోగించడానికి మెదడు తీవ్రస్థాయిలో శ్రమించాలి. తీవ్రస్థాయి శరీరక వ్యాయామం చేసిన రీతిలో ఈ ఫలితాలు ఉంటాయి.

- ఒక భాషను నేర్చుకొని, దాన్ని చురుగ్గా వాడటం మొదలుపెట్టాక.. అప్పటివరకూ ఉపయోగించిన భాష నిద్రాణంగా ఉండిపోదు. నిజానికి ద్విభాష అనేది మెదడులోని భిన్న భాగాల మధ్య జరిగే సంక్లిష్ట చర్యల క్రమం. వీటిని మెరుగ్గా సమన్వయం చేసుకోగలిగేవారు సమర్థంగా రాణించగలరు.

సమాజమే తరగతి గది

భాషను నేర్చుకోవడానికి తరగతి గదికి వెళ్లనవసరం లేదని పరిశోధకులు చెబుతున్నారు. బహుళభాషలు మాట్లాడేవారున్న సమాజంలో నివసించడం వల్ల కూడా ప్రయోజనం ఉంటుందంటున్నారు. మాటలకు సంబంధించిన ధ్వనులను ఆలకించడానికి అలవాటుపడటం ద్వారా భాషను మెదడు గ్రహిస్తుంటుందని వివరిస్తున్నారు. భిన్న సంస్కృతులతో మమేకం కావడం వల్ల మెదడుపై మరింత సానుకూల ప్రభావం ఉంటుందని చెబుతున్నారు.

- ఈనాడు ప్రత్యేక విభాగం



ఉత్తరాఖండ్‌లోని దేహ్రాదూన్‌లో ఆదివారం నిర్వహించిన జాతీయ ఛాంపియన్‌షిప్ డాగ్ షోలో ఆకట్టుకున్న షిహ్‌త్జు జాతి శునకం

మానవరహిత గగన్‌యాన్ సహా ఏడు ప్రయోగాలు

- మార్చి నాటికి చేపట్టేందుకు ఇస్రో కసరత్తు

దిల్లీ: వచ్చే ఏడాది మార్చి నాటికి ఏడు అంతరిక్ష ప్రయోగాలు చేపట్టాలని భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) లక్ష్యంగా పెట్టుకుంది. ఇందులో ఉపగ్రహాల కోసం స్వదేశీ విద్యుత్ చోదక వ్యవస్థ, క్వాంటమ్ కీ డిస్ట్రిబ్యూషన్ పరిజ్ఞానాల పరీక్ష వంటివి కూడా ఉన్నాయి. అలాగే గగన్‌యాన్ ప్రాజెక్టు కింద తొలి మానవరహిత మిషన్‌నూ ఇస్రో చేపట్టనుంది. లక్షిత ఏడు ప్రయోగాల్లో మొదటిది వచ్చే వారం జరుగుతుంది. అందులో భాగంగా.. ఎల్‌వీఎం3 ద్వారా అమెరికాకు చెందిన ఏఎస్‌టీ స్పేస్‌మొబైల్ సంస్థకు చెందిన బ్లూబర్డ్-6 అనే కమ్యూనికేషన్ ఉపగ్రహాన్ని కక్ష్యలోకి పంపుతారు. మానవసహిత ప్రయోగాలకు అనువైన ఎల్‌వీఎం3 ద్వారా వచ్చే ఏడాది గగన్‌యాన్ మిషన్‌లో భాగంగా వ్యోమమిత్ర అనే రోబోను ప్రయోగిస్తారు. తొలిసారిగా దేశ ప్రైవేటు కంపెనీలు నిర్మించిన పీఎస్ఎల్‌వీ రాకెట్‌నూ వచ్చే ఏడాది నింగిలోకి పంపుతారు. ఇది ఓషన్‌శాట్, భారత్-మారిషస్ ఉమ్మడి ఉపగ్రహం, ధ్రువా స్పేస్‌కు చెందిన లీప్-2 శాటిలైట్‌ను కక్ష్యలోకి చేరుస్తుంది.

ఆసుపత్రిలో చేరిన రచయిత రస్కిన్ బాండ్

దేహ్రాదూన్: పద్మభూషణ్ పురస్కార గ్రహీత, 91 ఏళ్ల రస్కిన్ బాండ్‌ను ఆదివారం దేహ్రాదూన్‌లో ఆసుపత్రిలో చేర్చారు. సరిగా నడవలేని పరిస్థితి తలెత్తడంతో ఆయనకు ప్రైవేటు ఆసుపత్రిలో ఫిజియోథెరపీ చేస్తున్నారని, రెండుమూడు రోజుల్లో కోలుకునే అవకాశం ఉందని ఆయన సన్నిహితులు తెలిపారు. బాండ్ 500 పైగా కథలు, వ్యాసాలు, నవలలు రచించారు. వాటిలో బాలల కోసమే 69 రాశారు. 1992లో సాహిత్య అకాడమీ పురస్కారం పొందారు.

‘సర్పంచి పతి’పై స్పందించరేం

- 32 రాష్ట్రాలు, యూటీలకు ఎన్‌హెచ్‌ఆర్‌సీ సమన్లు
- మహిళల బదులు భర్తల పెత్తనంపై వివరణకు ఆదేశం

దిల్లీ: స్థానిక సంస్థల్లో మహిళలకు బదులు వారి భర్తలు, బంధువులు పెత్తనం చేయడంపై గతంలో ఇచ్చిన నోటీసులకు స్పందించలేదేంటని నిలదీస్తూ 32 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు జాతీయ మానవ హక్కుల కమిషన్ (ఎన్‌హెచ్‌ఆర్‌సీ) షరతులతో కూడిన సమన్లు జారీ చేసింది. 24 రాష్ట్రాలు, 8 కేంద్ర పాలిత ప్రాంతాల పంచాయతీరాజ్, పట్టణ స్థానిక సంస్థల అత్యున్నత అధికారులకు ఈ సమన్లు ఇచ్చింది. ఎన్‌హెచ్‌ఆర్‌సీ సభ్యులు ప్రియాంక్ కనూంగో ఈ నెల 12వ తేదీన ఈ సమన్లు జారీ చేసినట్లు ఆదివారం అధికారులు తెలిపారు. హరియాణా బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ మాజీ సభ్యుడు సుశీల్ వర్మ చేసిన ఫిర్యాదుపై ఈ సమన్లు ఇచ్చినట్లు వెల్లడించారు. ‘రాజ్యాంగ రక్షణలున్నా, న్యాయస్థానాలు ఆదేశాలిచ్చినా ఎన్నికైన మహిళా ప్రజాప్రతినిధులు తరచూ నామమాత్రపు పాత్రకే పరిమితమవుతున్నారు. నిజమైన అధికారాలను భర్తలు, బంధువులే అనుభవిస్తున్నారు. దీనిని ‘సర్పంచి పతి’గా వ్యవహరిస్తున్నారు’ అని ఫిర్యాదులో వర్మ వివరించారు. మానవ హక్కుల చట్టం-1993 ప్రకారం.. ఈ ఫిర్యాదును విచారణకు స్వీకరించిన కనూంగో.. చర్యల నివేదికను సమర్పించాలని సెప్టెంబరు 9వ తేదీన అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు నోటీసులు జారీ చేశారు. అయితే ఆంధ్రప్రదేశ్, బిహార్, ఒడిశా, ఉత్తరాఖండ్‌తోపాటు ఉత్తర్ ప్రదేశ్‌లోని కొన్ని నగరాల నుంచే సమాధానాలు వచ్చాయి. దీంతో మిగిలిన 32 రాష్ట్రాలు, యూటీలకు తాజాగా సమన్లు జారీ అయ్యాయి. ఈ నెల 30వ తేదీ ఉదయం 11 గంటలకల్లా సంబంధిత అధికారులు స్వయంగా హాజరు కావాలని కనూంగో ఆదేశించారు. ఒకవేళ 22వ తేదీలోగా చర్యల నివేదికను సమర్పిస్తే వ్యక్తిగతంగా హాజరు కావాల్సిన అవసరం ఉండబోదని తెలిపారు.

హసీనా వ్యాఖ్యలపై భారత హైకమిషనర్‌కు బంగ్లా నిరసన

ఢాకా: భారత్‌లో ఆశ్రయం పొందుతున్న తమ మాజీ ప్రధాని షేక్ హసీనా వ్యాఖ్యలపై బంగ్లాదేశ్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. హసీనా రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తున్నారంటూ భారత్ హైకమిషనర్ ప్రణయ్ వర్మకు నిరసన తెలిపింది. “రానున్న పార్లమెంటు ఎన్నికలను అడ్డుకొనాలనే లక్ష్యంతో, బంగ్లాదేశ్‌లో ఉగ్రవాద కార్యకలాపాల్లో పాల్గొనాలని తన మద్దతుదారులకు హసీనా పిలుపునిస్తున్నారు. ఆమె రెచ్చగొట్టే ప్రకటనలను అనుమతి ఇస్తుండటంతో ఆదివారం భారత హైకమిషనర్‌ను బంగ్లాదేశ్ పిలిపించి నిరసన తెలిపింది. ప్రత్యేక ట్రైబ్యునల్ విధించిన మరణశిక్షను ఎదుర్కొనేందుకు హసీనాను బంగ్లాదేశ్‌కు అప్పగించాలని మరోసారి కోరుతున్నాం. భారత్‌లో తలదాచుకుంటూ ‘బంగ్లా వ్యతిరేక కార్యకలాపాల’కు పాల్పడుతున్న అవామీ లీగ్ సభ్యుల గురించీ భారత హైకమిషనర్ దృష్టికి తీసుకువెళ్లాం. న్యాయాన్ని నిలబెట్టడంలో, ప్రజాస్వామ్య ప్రక్రియను కాపాడటంలో పొరుగుదేశమైన భారత్ బంగ్లాదేశ్ ప్రజలతో నిలబడుతుందని ఆశిస్తున్నాం’ ’ అని బంగ్లాదేశ్ విదేశీ వ్యవహారాల శాఖ ఓ ప్రకటనలో తెలిపింది. “బంగ్లాదేశ్‌లో ఎన్నికలు శాంతియుతంగా జరగాలని భారత్ కోరుకుంటోందని, ఈ విషయంలో పూర్తి సహకారాన్ని అందించడానికి సిద్ధంగా ఉన్నామని హైకమిషనర్ వర్మ ఓ ప్రకటనలో తెలిపారు. కాగా.. బంగ్లాదేశ్‌లో ఫిబ్రవరి 12న ఎన్నికలు జరగనున్నాయి. 2024 జులై-ఆగస్టు నిరసనలకు నాయకత్వం వహించిన విద్యార్థి నాయకులలో ఒకరైన షరీఫ్ ఉస్మాన్ హదిపై దాడి జరిగిన రెండు రోజులకు భారత్‌కు బంగ్లాదేశ్ సమన్లు జారీ చేయడం గమనార్హం.

అలా ఎన్నడూ చేయలేదు: భారత్

“బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వం తన ప్రెస్ నోట్‌లో విడుదల చేసిన వాదనలు తిరస్కరిస్తున్నాం. బంగ్లాదేశ్ స్నేహపూర్వక ప్రజల ప్రయోజనాలకు విరుద్ధంగా భారత భూభాగాన్ని ఉపయోగించుకోవడానికి ఎన్నడూ అనుమతించలేదు. అంతర్గత సమస్యలను పరిష్కరించడానికి తాత్కాలిక ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని, రానున్న ఎన్నికలను శాంతియుతంగా నిర్వహిస్తుందని ఆశిస్తున్నాం” అని భారత విదేశీ వ్యవహారాల శాఖ (ఎంఈఏ) ప్రకటనను విడుదల చేసింది.

మొగలుల పాలనలా కాంగ్రెస్ భూస్థాపితం: భాజపా

దిల్లీ: రాహుల్‌గాంధీ నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ భూస్థాపితం కావడం ఖాయమని భాజపా జోస్యం చెప్పింది. ఓటుచోరీ పేరుతో కాంగ్రెస్ ఆరోపణలు చేసిన నేపథ్యంలో భాజపా జాతీయ అధికార ప్రతినిధి సుధాంశు త్రివేది ఈ మేరకు స్పందించారు. ఆరో చక్రవర్తి ఔరంగజేబు సమయంలో మొగలుల సామ్రాజ్యానికి ఏ గతి పట్టిందో కాంగ్రెస్‌కూ అదే గతి తప్పదని చెప్పారు. మోదీ పాలనను భూస్థాపితం చేస్తామంటూ ఆదివారం కొందరు కాంగ్రెస్ కార్యకర్తలు నినాదాలు చేయడాన్ని ఆయన ఖండించారు. ‘కాంగ్రెస్ కార్యకర్తలు మోదీ మరణాన్ని కోరుకుంటున్నారు. ముస్లింలీగ్-మావోయిస్టు ఎజెండాతో పనిచేస్తోన్న కాంగ్రెస్ పార్టీ క్రమంగా అరాచకంవైపు మళ్లుతోందని ఇది చాటుతోంది. ప్రధానిని, ఆయన తల్లిని కాంగ్రెస్ అనేకసార్లు ఆడిపోసుకుంది. మోదీకి సమాధి తవ్వాలని అనుకుంటున్న ఆ పార్టీ భవిత ఏమిటనేది స్పష్టం. ది లాస్ట్ మొగల్ అనే పుస్తకంలో మొగల్ సామ్రాజ్యం గురించి ఏం రాసిఉందో రాహుల్ నేతృత్వంలోని కాంగ్రెస్‌కు అదే జరుగుతుంది’ అని చెప్పారు.

దేశానికి త్వరలో కొత్త ప్రధాని

- మరాఠీ వ్యక్తే పీఎం కావొచ్చు
- మహారాష్ట్ర మాజీ సీఎం చవాన్



ఈటీవీ భారత్: మహారాష్ట్ర మాజీ సీఎం, కాంగ్రెస్ సీనియర్ నేత పృథ్వీరాజ్ చవాన్ సంచలన వ్యాఖ్యలు చేశారు. దేశంలో త్వరలో రాజకీయ ప్రకంపనలు చోటు చేసుకుని, కేంద్రంలో నాయకత్వ మార్పు జరుగుతుందని వ్యాఖ్యానించారు. ఒక మరాఠీ వ్యక్తి దేశానికి ప్రధానమంత్రి అవుతారని జోస్యం చెప్పారు. పింప్రి చించ్వాడ్‌లో సామాజిక కార్యకర్త మానవ్ కాంబ్లే రాసిన జనగణమన పుస్తకావిష్కరణ కార్యక్రమంలో చవాన్ ఈ వ్యాఖ్యలు చేశారు. తన ఈ వాదనకు అమెరికాలో ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఎప్‌స్టీన్ ఫైల్స్ విడుదలతో సంబంధం ఉందన్నారు. ఈ ఫైల్స్ విడుదల భారత్‌లో కూడా రాజకీయ గందరగోళానికి దారితీయవచ్చని అభిప్రాయపడ్డారు. ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్న సంఘటనలు భారత రాజకీయాలపై కూడా బలమైన ప్రభావం చూపే అవకాశం ఉందని అన్నారు. “అమెరికన్ కాంగ్రెస్ నవంబరు 19న ఒక చట్టాన్ని ఆమోదించింది. డిసెంబరు 19న స్టింగ్ ఆపరేషన్‌లో పట్టుబడిన ప్రముఖుల పేర్లను ప్రకటించవచ్చు. అమెరికాలోని ఓ ఇంట్లో ఇజ్రాయెల్ గూఢచారి ఏజెంట్ రహస్య కెమెరాలను ఉపయోగించి సేకరించిన ఒక రహస్య వీడియో రికార్డింగ్‌లో చాలా మంది రాజకీయ నాయకుల ఫొటోలు, వీడియోలు ఉన్నాయి. ఈ పేర్లలో కొన్ని ఇప్పటికే సోషల్ మీడియా ద్వారా వెలుగులోకి వచ్చాయి. అయితే ఈ జాబితాలో ఎవరి పేర్లు ఉంటాయనే దాని గురించి నా వద్ద వివరణాత్మక సమాచారం లేదు. ఈ పరిణామాల పర్యవసానాలు అమెరికాకే పరిమితం కాకుండా, భారత్ సహా అనేక దేశాలలో కనిపించే అవకాశం ఉంది” అని పృథ్వీరాజ్ చవాన్ పేర్కొన్నారు.

ఇజ్రాయెల్ దాడిలో హమాస్ టాప్ కమాండర్ మృతి

జెరూసలెం: గాజాపై ఇజ్రాయెల్ చేసిన దాడుల్లో హమాస్ టాప్ కమాండర్ రయాద్ సాద్ మృతి చెందారు. ఈ విషయాన్ని హమాస్ ఆదివారం ధ్రువీకరించింది. సాద్.. తమ సైనిక తయారీ యూనిట్ కమాండరని పేర్కొంది. గాజా సిటీ శివార్లలో ఈ దాడిని ఇజ్రాయెల్ శనివారం నిర్వహించింది. 2023 అక్టోబరు 7 దాడుల సూత్రధారి సాద్ అని, గత రెండు నెలలుగా గాజాలో హమాస్‌ను పునర్నిర్మించే పనిలో అతడు ఉన్నాడని, అందుకే హతమార్చామని ఇజ్రాయెల్ సైన్యం పేర్కొంది.

మెక్సికో సుంకాలపై తగిన చర్యలు తీసుకుంటాం: భారత్

ఇంటర్నెట్‌డెస్క్: భారత్ నుంచి దిగుమతులపై ఉన్న సుంకాలను 50 శాతానికి పెంచేందుకు మెక్సికో సిద్ధమైన నేపథ్యంలో భారత్ స్పందించింది. ఇరుదేశాలకు ప్రయోజనం చేకూరే విధంగా చర్చలు జరుపుతామని పేర్కొన్నట్లు తెలుస్తోంది. ఇదే క్రమంలో తమ ఎగుమతిదారుల ప్రయోజనాలకు అనుగుణంగా తగిన చర్యలు తీసుకునే హక్కు ఉందని భారత అధికారి తెలిపినట్లు మీడియాలో కథనాలు వస్తున్నాయి. స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం లేని ఆసియా దేశాల నుంచి దిగుమతి చేసుకునే పలు వస్తువులపై సుంకాలను పెంచడానికి సంబంధించి మెక్సికో సెప్టెంబరులోనే సెనెట్‌లో ప్రతిపాదనలు ప్రవేశపెట్టింది. అప్పటి నుంచే ఆ దేశంతో భారత్ చర్చలు జరుపుతోందని ఒక అధికారి తెలిపారు. అక్కడి భారత రాయబార కార్యాలయం సెప్టెంబరు 30నే ఆర్థిక మంత్రిత్వశాఖ వద్ద ఈ విషయాన్ని లేవనెత్తిందని వెల్లడించారు. కొత్తగా ప్రతిపాదించిన సుంకాల నుంచి భారత ఎగుమతులకు ప్రత్యేక రాయితీలను కల్పించాలని కోరినట్లు పేర్కొన్నారు. ‘మెక్సికోతో భాగస్వామ్యానికి భారత్ ఎంతో విలువ ఇస్తుంది. ఇరుదేశాల్లోని వ్యాపారులు, వినియోగదారులకు ప్రయోజనం చేకూరేలా స్థిరమైన వాణిజ్యం కోసం కలిసి పనిచేసేందుకు సిద్ధంగా ఉన్నాం’ అని అన్నారు. ఇరు దేశాల మధ్య స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందానికి చర్చలు ప్రారంభించేందుకు చూస్తున్నట్లు వెల్లడించారు. ఇదిలా ఉండగా.. వాణిజ్య విభాగ ప్రత్యేక కార్యదర్శి రాజేశ్ అగర్వాల్, మెక్సికో ఆర్థిక ఉపమంత్రి లూయిస్ రోసెండో మధ్య ఉన్నత స్థాయి సమావేశం జరిగినట్లు తెలుస్తోంది. దీనిపై మరిన్ని సమావేశాలు జరగనున్నట్లు సమాచారం. ఇక, దేశీయ ఉత్పత్తులను పెంచడంలో భాగంగా చైనా, భారత్‌తో సహా పలు ఆసియా దేశాలకు చెందిన 1400 వస్తువులపై సుంకాలను 50 శాతం పెంచాలని మెక్సికో నిర్ణయించింది. ఇవి వచ్చే ఏడాది జనవరి 1 నుంచి అమల్లోకి రానున్నాయి.

రియల్ హీరో.. అహ్మద్

- సిడ్నీ ఘటనలో ఉగ్రవాదితో పోరాడి గాయాలపాలు



ఇంటర్నెట్ డెస్క్: నడి రోడ్డుపై ప్రమాదం జరిగి గాయాలతో కొట్టుమిట్టాడుతుంటే.. సాయం చేసేందుకు చాలా మంది వెనుకాడుతుంటారు. ఎక్కడ పోలీసు కేసు అవుతుందోనని భయపడతారు. అలాంటిది ఇద్దరు సాయుధ ఉగ్రవాదులు విచక్షణారహితంగా కాల్పులు జరుపుతుంటే.. సాధారణంగా ఎవరైనా తమ ప్రాణాలు కాపాడుకునేందుకే ప్రయత్నిస్తారు. కానీ సిడ్నీ ఉగ్ర కాల్పుల ఘటనలో ‘రియల్ హీరో’ అనిపించుకుంటున్న అహ్మద్ అల్ అహ్మద్ మాత్రం ప్రాణాలకు తెగించి పోరాడారు. తీవ్ర గాయాలపాలై ప్రస్తుతం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.


ఆదివారం సాయంత్రం ఆస్ట్రేలియాలోని సిడ్నీ నగరంలో ఉన్న బోండీ బీచ్‌లో యూదుల ఉత్సవంపై ఇద్దరు ఉగ్రవాదులు కాల్పులకు దిగారు. ఓ ఉగ్రవాది చెట్టు చాటు నుంచి బుల్లెట్ల వర్షం కురిపిస్తున్నాడు. అదంతా గమనించిన 43 ఏళ్ల అహ్మద్ అల్ అహ్మద్.. మెరుపు వేగంతో వెనుక నుంచి వచ్చి ఉగ్రవాదిని గట్టిగా పట్టుకున్నాడు. అతడి చేతిలోని తుపాకీని లాక్కొని తిరిగి అతడికే ఎక్కుపెట్టాడు. అది చూసిన మరో ఉగ్రవాది.. అహ్మద్ లక్ష్యంగా కాల్పులు జరిపాడు. దీంతో అతడికి తీవ్ర గాయాలయ్యాయి. అహ్మద్ కుప్పకూలిపోవడంతో.. ఉగ్రవాది అక్కడి నుంచి పారిపోయాడు. స్థానికులు, పోలీసులు అహ్మద్‌ను హుటాహుటిన ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం అతడికి చికిత్స కొనసాగుతోంది. ప్రాణాలకు తెగించి ఉగ్రవాదులతో పోరాడిన అహ్మద్‌ను స్థానిక మీడియా ‘రియల్ హీరో’గా అభివర్ణిస్తోంది. అహ్మద్ అతి సామాన్యుడు. ఓ పండ్ల దుకాణంతో కుటుంబాన్ని పోషిస్తున్నాడు. అలాంటి వ్యక్తి ఏ మాత్రం భయపడకుండా ఉగ్రవాదులతో పోరాడిన తీరుపై సామాజిక మాధ్యమాల్లో ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి.

భద్రతకు హామీ ఇస్తే నాటోలో చేరం

- భూభాగాలను మాత్రం రష్యాకివ్వం
- తేల్చి చెప్పిన ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ



బెర్లిన్: నాటో కూటమిలో తమను చేర్చుకోవాలన్న డిమాండును వెనక్కి తీసుకోవడానికి సిద్ధం అని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ పేర్కొన్నారు. అయితే ఇందుకు షరతు పెట్టారు. ఐరోపా దేశాలు, అమెరికా తమకు భద్రతా గ్యారంటీలు ఇవ్వాలని పేర్కొన్నారు. ఈ గ్యారంటీలను అమెరికా కాంగ్రెస్ కూడా ఆమోదించాలని తెలిపారు. ఉక్రెయిన్‌లో కొన్ని భూభాగాలను రష్యాకు అప్పగించాలన్న అమెరికా ప్రతిపాదనను మాత్రం జెలెన్‌స్కీ తిరస్కరించారు. ఈ విషయంలో రాజీ పడబోమని స్పష్టంచేశారు. రష్యా-ఉక్రెయిన్ యుద్ధాన్ని ఆపేందుకు అగ్రరాజ్య అధ్యక్షుడు 28 పాయింట్ల ప్రణాళికను తెరపైకి తీసుకొచ్చిన సంగతి తెలిసిందే. దీనిపైనే గత కొన్ని వారాలుగా చర్చలు జరుగుతున్నాయి. ఇందులో భాగంగానే ఆదివారం జెలెన్‌స్కీ... జర్మనీ రాజధాని బెర్లిన్‌కు చేరుకున్నారు. ఇక్కడ ఆయన అమెరికా అధ్యక్షుడు ప్రత్యేక రాయబారి స్టీవ్ విట్కాఫ్‌తో చర్చలు జరిపే అవకాశం ఉంది. జర్మనీ అధ్యక్షుడు మెర్జ్‌తోనూ భేటీ కానున్నారు.



భారీ వర్షాల కారణంగా వాషింగ్టన్‌లోని స్నో హూమిష్‌లో వరదల్లో కొట్టుకొచ్చిన గుమ్మడికాయలు

లాలూ నుంచి మోదీ దాకా మెచ్చిన సిలావ్ ఖాజా

జీఐ ట్యాగ్ పొందిన మిఠాయి



తెలుగువాళ్లకు ‘కాకినాడ కాజా’ లాగే బిహార్‌లోని నలంద జిల్లా సిలావ్ పట్టణంలో తయారయ్యే ‘సిలావ్ ఖాజా’ కూడా చాలా ప్రసిద్ధి. ఈ మిఠాయికి బెంగళూరు, ముంబయి, దిల్లీ వంటి నగరాలతో పాటు దుబాయ్, అమెరికా, లండన్‌ల నుంచి సైతం ఆన్‌లైన్ ఆర్డర్లు వస్తుంటాయి. ఇంత ఖ్యాతి ఉండబట్టే భారత ప్రభుత్వం ‘సిలావ్ ఖాజా’కు జాగ్రఫికల్ ఇండికేషన్ (జీఐ) ట్యాగ్‌ను మంజూరు చేసింది. సిలావ్‌లోని ‘శ్రీ కాళీ షా ఖాజా షాపు’నకు ఈ ట్యాగ్ మంజూరైంది. సిలావ్‌కు చెందిన పాకశాస్త్ర నిపుణుడు కాళీ షా 150 ఏళ్ల క్రితం ఈ మిఠాయిని తొలిసారిగా తయారు చేశారు. కాలక్రమేణా కాళీ షా వారసులంతా ఆయన పేరుతో దుకాణాలు పెట్టుకున్నారు. సిలావ్‌లో ప్రస్తుతం ఒకే పేరుతో 13 ఖాజా దుకాణాలు ఉన్నాయి. లాలూ ప్రసాద్ యాదవ్ రైల్వే మంత్రిగా ఉన్న సమయంలో సిలావ్ ఖాజాను రైల్వే మెనూలో చేర్పించారు. గతంలో ఒకసారి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సైతం ఈ ఖాజా రుచిని బహిరంగంగా కొనియాడారు.

ఈటీవీ భారత్ యాప్ స్టోర్ & గూగుల్ ప్లే ద్వారా డౌన్‌లోడ్ చేసుకోండి

మరో 2 వేల మెగావాట్ అవర్ బెస్ ప్రాజెక్టులు

- టెండర్లు పిలిచిన విద్యుత్ సంస్థలు
- మిగులు పునరుత్పాదక విద్యుత్ వినియోగమే లక్ష్యం
- విద్యుత్ కొనుగోలు వ్యయాన్ని తగ్గించే యత్నం

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో పీక్ డిమాండ్ సమయంలో అవసరమైన విద్యుత్ సర్దుబాటుతోపాటు గ్రిడ్ స్థిరత్వం కోసం బ్యాటరీ ఎనర్జీ స్టోరేజీ సిస్టమ్ (బెస్) ప్రాజెక్టులను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. వాటి ద్వారా భవిష్యత్తులో విద్యుత్తు కొనుగోలు వ్యయాన్ని తగ్గించాలని భావిస్తోంది. ఇందుకోసం రాష్ట్రంలో ఏడు ప్రాంతాల్లో 2,000 మెగావాట్ అవర్ (రెండు సైకిల్స్‌లో) బెస్ ప్రాజెక్టులను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. అత్యధిక ప్రాజెక్టులను రాయలసీమలో ఏర్పాటు చేయాలని ప్రతిపాదించింది. ట్రాన్స్‌కో సబ్‌స్టేషన్లు ఉన్న ప్రాంతాల్లో వాటిని ఏర్పాటు చేస్తారు. ఇందుకు గుత్తేదారు సంస్థల ఎంపిక కోసం ప్రభుత్వం టెండర్లు పిలిచింది. ఇప్పటికే 1,000 మెగావాట్ అవర్ ప్రాజెక్టుల ఏర్పాటుకు ప్రభుత్వం టెండర్లను ఖరారు చేసింది. తాజాగా పిలిచిన 2,000 మెగావాట్ అవర్లతో కలిపి.. రాష్ట్రంలో 3,000 మెగావాట్ అవర్ బెస్ స్టోరేజీ ప్రాజెక్టులు అందుబాటులోకి రానున్నాయి.

మిగులు విద్యుత్‌ను వినియోగించే లక్ష్యం

పగటి వేళల్లో పునరుత్పాదక విద్యుత్ సుమారు 1,500 మెగావాట్లు మిగులుతోంది. జెన్‌కో థర్మల్ విద్యుత్ కేంద్రాలు బ్యాక్‌డౌన్ చేసిన తర్వాత విద్యుత్ మిగులు ఉంటోంది. ఆ సమయంలో బహిరంగ మార్కెట్‌లో విక్రయించాలన్నా ఆశించిన ధర ఉండటం లేదు. దీంతో కొన్ని సందర్భాల్లో అధిక ధరకు కొన్న విద్యుత్‌ను మార్కెట్‌లో యూనిట్ 50 పైసలకే డిస్కంలు అమ్ముకోవాల్సి వస్తోంది. దీనికితోడు పీఎం సూర్యఘర్ కింద రూఫ్‌టాప్ ప్రాజెక్టుల ద్వారా రాబోయే రెండేళ్లలో సుమారు 4,000 మెగావాట్ల పునరుత్పాదక విద్యుత్ అందుబాటులోకి వస్తుంది. ఈ దృష్ట్యా పగటి వేళలో అందుబాటులో ఉన్న విద్యుత్‌ను పూర్తిగా వినియోగించుకోలేని పరిస్థితి. పీక్ వేళల్లో (ఉదయం 6 నుంచి 10 గంటల వరకు, సాయంత్రం 6 నుంచి రాత్రి 10 గంటల మధ్య) విద్యుత్ డిమాండ్ సర్దుబాటు కోసం బహిరంగ మార్కెట్‌లో యూనిట్ రూ.10 చొప్పున డిస్కంలు కొంటున్నాయి. దీనివల్ల విద్యుత్ కొనుగోలు వ్యయం పెరుగుతోంది. ఈ దృష్ట్యా పగటి వేళల్లో అదనంగా ఉన్న విద్యుత్‌ను బెస్ ద్వారా నిల్వ చేసి.. పీక్ డిమాండ్ సమయంలో వినియోగించుకోవాలన్నది ప్రభుత్వ ఆలోచన. బెస్‌ల ఏర్పాటుతో పీక్ డిమాండ్ సమయంలో యూనిట్ రూ.6కు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉందని అంచనా.

కొనుగోలు వ్యయం తగ్గించే లక్ష్యం

గత ఏడాది రియల్‌టైమ్ మార్కెట్‌లో రూ.3,000 కోట్ల విలువైన విద్యుత్‌ను డిస్కంలు కొన్నాయి. ఈ ఏడాది ఇప్పటికి బహిరంగ మార్కెట్‌లో సుమారు రూ.1,300 కోట్ల వ్యయంతో విద్యుత్‌ను కొన్నాయి. తక్కువ ధరకు విద్యుత్ అందుబాటులోకి వస్తే.. ఆ మేరకు కొనుగోలు వ్యయాన్ని ఇంకా తగ్గించుకోవాలన్నది ఆలోచన. గతంలో రూ.5.12గా ఉన్న యూనిట్ విద్యుత్ కొనుగోలు వ్యయాన్ని.. రూ.4.90కి తగ్గించాయి. దీన్ని భవిష్యత్తులో ఇంకా తగ్గించేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. దీనికి బెస్ ప్రాజెక్టులు దోహదం చేస్తాయని భావిస్తోంది.

రాష్ట్రంలో రెండో విడత ప్రతిపాదించిన బెస్ ప్రాజెక్టులు

సబ్ స్టేషన్ పరిధి	బెస్ సామర్థ్యం (మెగావాట్ అవర్)
అనంతపురం జిల్లా హిందూపురం 4000/220 కేవీ సబ్‌స్టేషన్	450
అనంతపురం జిల్లా తలారిచెరువు 400/220 కేవీ సబ్‌స్టేషన్	550
చిత్తూరు జిల్లా కలికిరి 400/220 కేవీ సబ్‌స్టేషన్	300
అనంతపురం జిల్లా పంపనూరు 220/132 కేవీ సబ్‌స్టేషన్	450
విజయనగరం జిల్లా మరడాం 400/220 కేవీ సబ్‌స్టేషన్	150
విశాఖ జిల్లా సింహాచలం 132/33 కేవీ సబ్‌స్టేషన్	50
విశాఖ జిల్లా గాజువాక 220/132 కేవీ సబ్‌స్టేషన్	50